# సాహిత్యంలో విప్లవం

## చరిత్ర, శిల్పం, స్వీయానుభవాలు

**శ్రీశ్రీ**



118755
894.827
శ్రీశ్రీ- సాహిత్య
118755

ప్రజాశక్తి బుక్‌హౌస్

# సాహిత్యంలో విప్లవం

## చరిత్ర, శిల్పం, స్వీయానుభవాలు


**శ్రీశ్రీ**


(వ్యాసాలు, ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు)


**ప్రజాశక్తి బుక్‌హౌస్**

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

ISBN 978-93-84162-04-7
97307

C-12894
894.827
118755

ప్రచురణ సంఖ్య : 1233

ప్రథమ ముద్రణ : జనవరి, 2012
ద్వితీయ ముద్రణ : మార్చి, 2014

వెల : ₹.100/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, కరీంనగర్

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్
website : www.psbh.in

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | | మా మాట | 5 |
| I. | 1. | కవిత్రయం | 6 |
| | 2. | కవిత్రయం : తిక్కన | 11 |
| | 3. | తెలుగు సాహిత్యంలో గూఢత - వేమన | 15 |
| | 4. | నూరేళ్ల సాహిత్యం | 19 |
| II. | 5. | శ్రుతులు | 27 |
| | 6. | నా తొలి రచన | 30 |
| | 7. | నా కవిత్వం : ఒకటి | 32 |
| | | రెండు | 41 |
| | 8. | బాధ కవిత్వానికి పర్యాయపదం | 45 |
| | 9. | 'మహాప్రస్థానం' కథ (నా మాట) | .48 |
| | 10. | సౌలభ్యం | .52 |
| | 11. | లేఖ | 54 |
| | 12. | వాగ్దానం | 56 |
| | 13. | పాతికేళ్ల సాహిత్యం | 58 |
| | 14. | కవితా యాత్ర | 62 |
| III. | 15. | సాహిత్యంలో విప్లవం | 63 |
| | 16. | సాహిత్యం ఎందుకు? ఎవరికి? | 67 |
| | 17. | సాహిత్యంలో పాతా కొత్తా | 71 |
| | 18. | ఈ నిర్లిప్తత తాత్కాలికం | 74 |
| | 19. | ఆధునిక సాహిత్యం | 83 |
| | 20. | సజీవ రచన | 85 |
| | 21. | సాహిత్యంలో లెనిన్ | 86 |

22. విప్లవాల యుగం ..................... 91
23. ఆధునిక కవిత ..................... 95
24. చారిత్రిక పరిణామం .................. 101

IV. ఇంటర్వ్యూలు ............... 106

25. దిగంబర కవులతో ముఖాముఖి .................. 107
26. ఆధునిక అష్టావధానం .................. 117
27. కళారూపం .................. 133
28. కళా చైతన్యం .................. 138
29. వికృత వ్యవస్థ .................. 143
30. విప్లవ యుగం .................. 153
31. సాహిత్య సమస్యలు .................. 157
32. విప్లవతత్వం .................. 160
33. విప్లవ సాధన .................. 165
34. నాస్తికత్వం .................. 169
35. మన వ్యవస్థ .................. 172
36. ఎన్నికలు .................. 176
37. ప్రాంతీయ పార్టీ .................. 177
38. అగ్ని పర్వతంతో అరగంట .................. 179
39. జరుగుబాటు- తిరుగుబాటు .................. 188
40. సామ్యవాదం నా గమ్యం .................. 190

# మా మాట

సాహిత్య శిల్పం, చరిత్ర, స్వీయానుభవాలు, సామాజిక రాజకీయాంశాలపై మహాకవి శ్రీశ్రీ వివిధ సందర్భాల్లో వెలువరించిన వ్యాసాలు, ఉపన్యాసాలు, ఇంటర్వ్యూల సంకలనం ఇది. దశల వారీగా వివిధాంశాలపై ఆయన భావాలు తెలుసుకోవడానికి ఈ చిరు సంకలనం వీలు కలిగిస్తుంది. విభాగాల విభజన కూడా ఆ ప్రకారమే జరిగింది. ఇంటర్వ్యూల విషయంలో మాత్రం ఏ ప్రత్యేక విభజన జరగలేదు. వివిధాంశాలపై నేరుగా ఆయన భావాలు తెలుసుకోవడానికిగాను ఎక్కువ ఇంటర్వ్యూలను పొందుపర్చాము. ఇందులో అభిప్రాయాలన్నింటితో అందరూ ఏకీభవించాలని లేదు.

శ్రీశ్రీ రచనల సేకరణకు వస్తే షష్ఠిపూర్తి సందర్భంగా 1970లో మొదట కె.వి. రమణారెడ్డి విశేష శ్రమతో సంపుటాలను వెలువరించారు. తర్వాత చలసాని ప్రసాద్ తదితరులు వాటిని విస్తరించడంతో పాటు ప్రధానంగా పాద పీఠికలను జత చేశారు. ఆ విధంగా శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం అనదగిన సంపదను సమకూర్చారు. వాటిని తర్వాతి కాలంలో అనేక మంది అనేక రకాలుగా వినియోగించారు. పునర్ముద్రించారు. ఈ సంకలనమూ అలా వెలువడుతున్నదే. వాటిని తొలుత ప్రచురించిన, సేకరించిన వారికి కృతజ్ఞతలు.

శ్రీశ్రీ శత జయంతి సందర్భంగా 2010లో మేము ప్రచురించిన "శ్రీశ్రీ సాహిత్యం సమకాలీనత", "శ్రీశ్రీ జయభేరి" పుస్తకాలు విస్తృతాదరణ పొందాయి. వ్లదీమర్ మయకోవస్కీ రచించిన లెనిన్ కావ్యానికి శ్రీశ్రీ అనువాదం కూడా పునర్ముద్రించాము. అదే కోవలో ఇప్పుడు వస్తున్న "సాహిత్యంలో విప్లవం" సంకలనం కూడా అక్షరాభిమానుల అభిమానం చూరగొంటుందని ఆశిస్తున్నాము.

**- ప్రజాశక్తి బుక్‌హౌస్**

# కవిత్రయం

"నమస్తే శ్రీశ్రీ! మీతో మాట్లాడ్డానికొచ్చాను. నా పేరు శ్రీశ్రీ."

"నమస్తే! నమస్తే! నాతో మాట్లాడ్డానికి పనికట్టుకొని రావాలా! నేనే వొచ్చి ఉండేవాణ్ణి!"

దానికేంలేండి, నా దగ్గరికి మీరు రావడం వంటిదే మీ దగ్గరికి నేను రావడం! సిగరెట్ కావాలా?"

"కాల్చడం కానివ్వండి, మీరు కాలుస్తూంటే నేను కాలుస్తున్నట్టే!"

"మనిద్దరి గొంతుకలూ ఒకేలాగే ఉన్నాయి."

"పోనీ నా గొంతుక మార్చనా?"

"వొద్దు వొద్దు"

"ఏదో అడగాలన్నారు? అడగండి."

"తెలుగు సాహిత్యం అంతట్లోకి ముగ్గురే మహాకవులున్నారని మిత్రుల దగ్గర మీరు చేసిన Statementని కాస్త విపులీకరించి విశదీకరిస్తారా!"

"ఔనౌను. కొంతమందికి కోపం వస్తే రావచ్చుగాని నేను తిక్కన, వేమన, గురజాడలను ముగ్గురిని మాత్రమే మహాకవులుగా అంగీకరిస్తాను. కవిత్రయం అంటే వారు ముగ్గురే! ఇంగ్లాండు వంటి దేశంలో వెయ్యి సంవత్సరాలకు ఒక్కడే ఒక్క మహాకవి ఆవిర్భవించాడు. షేక్స్‌పియర్! మన వెయ్యేళ్ళ సాహిత్య చరిత్రలో ముగ్గురు ప్రపంచ కవులు పుట్టడం విశేషం కాదూ?"

"శ్రీశ్రీ! లోపాయికారీగా అడుగుతున్నాను. నువ్వూ ఒక ప్రపంచ కవివేనా?"

"కాదు. మరో ప్రపంచ కవిని!"

"ప్రపంచంలో ఈనాడు ప్రథమ భాషగా పరిగణింపబడుతున్న ఇంగ్లీషు కన్నా తెలుక్కి నువ్వు పై చెయ్యి ఆపాదించడం ప్రమాదం కదూ?"

"మీరు మీరు అని ప్రారంభించి నువ్వు అని నకార ప్రయోగం చేస్తున్నావంటే నా మీద నీ గౌరవం ఎంత తగ్గిపోయిందో కనబడుతూనే ఉంది. ఇంగ్లీషు కన్న తెలుగు గొప్ప భాషని ఎవరన్నారు?"

"ప్రపంచంలో కల్లా గొప్ప భాషయిన ఇంగ్లీషులో ఒక్కడే మహాకవిన్నీ, ప్రపంచంలో పదోరేటు భాషయిన తెలుగులో ముగ్గురు మహాకవులూనా? ఎవరైనా వింటే నవ్విపోరూ?"

"నేను చెప్పింది వింటే నవ్విపోరు. సర్వతోముఖంగా అభివృద్ధి పొందిన ఆంగ్లభాష ఒకే మహాకవిని ప్రసవించింది. ఇప్పటికీ కవిత్వానికి కొలబద్ద షేక్స్పియరే! మరి తెలుగు మాట! ఇది గాలిలో పుట్టి అడవిలో పెరిగింది! కాని కవులను కనడంలో తెలుగు తల్లిదే World Record అమెరికాలో ఒక చదరపు మైలుకి వందమంది కోటీశ్వరులంటే తెలుగు నేలలో అడుగడుగునా ఒక కవి! వీళ్ళలో అధిక సంఖ్యాకులు క్షుద్రకవులే కావచ్చు గాక! ఇంత కవితా వ్యాసంగం ఉన్న దేశం యింకోటి లేదంటే ఒప్పుకుంటావా?"

"పారశీకదేశం అలాంటిదేనట!"

'ప్రాచీన కాలంలో. మరి ప్రస్తుతం మాట!"

"మాట వరసకి నీ మాటతో ఏకీభవించాననుకో? ఆ తర్వాత!"

"ఇంతమంది కవులను కన్న దేశంలో కనీసం ముగ్గురైనా మహాకవులు కావడంలో విడ్డూరం ఏముంది?"

"అయితే ఆ లెక్కని ముగ్గురే అన్న మాటేమిటి మూడువందలమంది మహాకవులున్నారనుకోకూడదూ?"

"అది మనం మహాకవి అనే మాటకు చెప్పుకునే అర్థం మీద ఆధారపడుతుంది."

"ఏవిటో ఆ అర్థం?"

" ఏ కవి యొక్క ఆవిర్భావం వల్ల ఈ ప్రపంచం యింకో అడుగు ముందుకు వేసిందో ఆ కవే మహాకవి "

"ఒక అడుగు వెనక్కి పెట్టించిన వాణ్ణి కూడా మహాకవిని ఎందుకనకూడదు?"

"ఓ, భేషుగ్గా అనవచ్చు. కాని అటువంటి వాళ్ళందరినీ నా జాబితానించి వడబోయడం వల్లనే ముగ్గురు మహాకవులు మిగిలారు. లేకపోతే శ్రీనాథుడు మహాకవి అని అంగీకరించడానికి నా కభ్యంతరం ఏమిటి? ఈనాడు శ్రీనాథుడంతటి వాడైన విశ్వనాథ సత్యనారాయణని నేను ఎంత గౌరవిస్తానో నీకు తెలియదా? వీలయితే యీ ప్రపంచాన్ని వెయ్యేళ్ళు వెనక్కి తీసుకుపోదామని విశ్వనాథ ప్రయత్నిస్తాడు. నా కతనెప్పుడూ నన్నయభట్టు లాగ కనపడ్డానికి కారణం ఇదే."

"ఈ ముందుకు పట్టికెళ్ళడం వెనక్కి పట్టించడం నాకేవిటో బోధపడటం లేదు శ్రీశ్రీ. కందెనమీద కూర్చున్న ఈగ చక్రాన్ని తానే నడిపిస్తున్నాననుకున్నట్లే ఈ కవిగాళ్ళు కూడా తమ కవిత్వంతో ప్రపంచాన్ని నడిపిస్తున్నామనుకుంటున్నారేమో?''

"నువ్వప్పుడప్పుడు హఠాత్తుగా వేదాంతివైపోతూ ఉంటావని నాకు తెలుసు! ఏమీ లేదనుకుంటే ఏమీలేనిదయిపోదు. ఈ ప్రపంచం ఉంది. ఇందులో కవులున్నారు. కవులనీడ ప్రపంచం మీద పడుతుంది. ప్రపంచం కవుల మీద తన ప్రేరేపణ ముద్రిస్తుంది. నువ్వు నన్ను వేళాకోళం చెయ్యడానికి తీసుకొచ్చిన ఈగా, కందెనా ఉపమానం తప్పు. కవికీ ప్రపంచానికీ ఉన్న సంబంధానికి సరియైన ఉపమానం చెప్పాలంటే అణువూ విశ్వం అంటాను నేను. అణువు తనలోనే ఈ విశ్వపు పరిణామాలన్నింటినీ అనుభవిస్తుంది. అలాగే కవి కూడా."

"అయితే నువ్వూ ఒక అణువువే! నీకు నచ్చిన ఇద్దరు కవులను పట్టుకొని వీళ్ళు తప్ప తెలుగులో మరి కవులే లేనట్టు మాట్లాడుతున్నావు."

"నాకు నచ్చినందువల్ల వీళ్ళు మహాకవులు కాలేదయ్యా శ్రీశ్రీ. మహాకవులు కావడం వల్ల వాళ్ళు నాకు నచ్చారు."

"ఇంకో భాషనించి భారతాన్ని తెనిగించిన తిక్కనా, అయిదారువందల ఆటవెలది పద్యాలు చెప్పిన వేమనా, జీవిత కాలమంతా రాసిన డైరీలూ, ఉత్తరాలూ కూడా కలిసి ముద్రించినా అరవీసెడు బరువుండని గ్రంథం చేసిన గురజాడా నీ మహాకవులు! ఆశ్చర్యంగానే ఉంది "

"అదిగో  నా కందుకే కోపం వస్తుంది.

బండెడు చెత్తను ఛంద

శ్చందంగా సంతరించి స్వారస్యం చూ

డండని రంకెలు వేస్తే

చెండాడెద నట్టివారి సిరిసిరిమువ్వా."

"సరి సరి గుణం ప్రధానం కాని రాశి కాదని నేనూ ఒప్పుకుంటానులే. వీళ్ళ గొప్పతనం ఎక్కడుందో చెప్పు."

"తిక్కన గాని, వేమనగాని, గురజాడ గాని రాసిందంతా అద్యంతం నాటకం. నాటకంలోనే కవిత్వం పరాకాష్ఠ అందుకుంటుంది.వేమన్న రాసిన ప్రతీ పద్యం ఒక నాటకం అనుకో. ఆ మాటకొస్తే వేమన్న జీవితమంతా ఒక నాటకమే. ఆటవెలది ఛందస్సు అతని నాటకరంగం. నాలుగు పాదాలలో విశ్వదాభిరామ వినురవేమ అని ఆఖర్ని అనక తప్పదు కదా. ఇక మిగిలిన వతనికి మూడే పాదాలు. ఆ మూడు పాదాలలో మూడు లోకాలక్షీ ముళ్ళు కట్టిన వేమనన్నని మహాకవిగా గుర్తించని వాళ్లు వెర్రివాళ్ళు. సాధారణంగా తన పద్యంలో వేమన్న యేంచేస్తాడో తెలుసా? Marx చెప్పిన Thesis ల Antithesis synthesis చూపిస్తాడు. చూడు మొదటి పాదంలో సంగతి చెబుతాడు. సరీగా దానికి వ్యతిరేకమైన భావాన్ని రెండో పాదంలో చెబుతాడు. ఈ రెండూ ఒకదానితో ఒకటి పోరాడుతూ వుంటే మూడో పాదంలో తానుగా సాక్షాత్కరించి సమన్వయం చేస్తాడు. ఉదాహరణకి ఉప్పుకప్పురం పద్యమే తీసుకో.

"ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు" అని మొదటి పాదంలో చెప్పి ఆ వెంటనే రెండవ పాదంలో-

"చూడ చూడ రుచుల జాడవేరు" అంటాడు.

"ఈ పరస్పర వ్యతిరేక శక్తుల సంఘర్షణలోంచి ఒక సమన్వయం, ఒక ఉపదేశం, ఒక నీతి.

"పురుషులందు పుణ్య పురుషులు వేరయా" లాంటిది మన కందిస్తాడు. నీతి పద్యాలు కవిత్వమేమిటని ఈసడించే వాళ్ళు లోతులు చూడగలిగిన వాళ్ళని నేననుకోను. ఎవడేనా

వచ్చి తగుదనమ్మా అని మనకి నీతి బోధించబోతే మనకి తల నొప్పిగా ఉంటుంది. కాని హితోపదేశం చెయ్యలేనివాడు కవి కానేరడు. లోకహితాన్ని సంపాదించడం కవి బాధ్యత. ఈ నీతిని ప్రభు సమ్మితంగా కాకుండా కాంతా సమ్మితంగా బోధించడమే కవి యొక్క ప్రత్యేకత. ప్రజలలో ఒకడై ప్రజల భాషలో పలికినవాడు వేమన. తిక్కన కూడా అంతే. సమకాలం వారి కెదురు తిరిగి వారు ససేమిరా ఒప్పుకోని నీతిని బోధించాడు. తిక్కన రాసినదంతా వాడుక భాషే అని ఈ లోకం ఎప్పుడు గుర్తిస్తుందో కదా? గిడుగు పండితుడు ఈ విశేషాన్ని మొట్ట మొదటిసారిగా గుర్తించాడు. తెలుగు వాడకపు తీరు తీయాలను తిక్కనలోనే చూడాలి. మనం మాట్లాడుకొనే భాషలో ఎన్నెన్ని రకాల రమణీయకాలున్నాయో అవన్నీ తిక్కనలో గోచరిస్తాయి. తిక్కన భారతంలోని పాత్రలంతా తెలుగు వ్యక్తులు. వాళ్ళ కష్ట సుఖాలనే మహాభారతం చేశాడు కవి. తిక్కన ఒక విధంగా, వేమన మరో విధంగా చేసిందాన్నే గురజాడ ఇంకో రకంగా చేశాడు. తిక్కన వేమనల రచన పరోక్ష నాటకం అయితే గురజాడ ప్రత్యక్షంగానే సాక్షాత్తు ఒక నాటకం రాశాడు. అతని గేయాలూ, కథలూ అన్నీ నాటకలే సుమా!

"పెరిగి విరిగితి విరిగి పెరిగితి
కష్ట సుఖముల సారమెరిగితి

అన్న గీతం ఏడు నిలువుల లోతులో జరిగిన ఒక జీవిత కాలపు నాటకం.

"దేవుడు చేసిన మనుషుల్లారా
మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి?"

అన్న కథ ఆది మధ్యాంత రహితమైన విశ్వ నాటక రంగం మీద మహాకవి గురజాడ ఆడించిన మేటి నాటకం. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ ఇంకో ఏకాంక నాటిక".

Mister శ్రీశ్రీ! నీకిష్టమైన రచనైతే అది నాటకమూ, కాకపోతే గాలి బుడగ, గురజాడ రాసిన ఉత్తరాలు కూడా నాటకాలే అనేద్దూ దీనికంతేమిటి?"

"తప్పకుండా అంటాను".

"గురజాడ ఉత్తరాల్లో కావలసినంత డ్రామా వుంది. అసలు గురజాడ యావత్ప్రపంచాన్నీ ఒక నాటకకర్త కళ్ళతో చూస్తాడు. ప్రపంచం అంతటికీ ఒక్కడే షేక్స్‌పియరున్నాడు." సంస్కృతంలో ఇద్దరే మహాకవులున్నారు. కాళిదాసూ, శూద్రుకుడూ మన తెలుగులో ముగ్గురు. తిక్కన, వేమన, గురజాడ!"

"వీళ్ళు ముగ్గురూ మహాకవులని ఒప్పుకుంటాను కాని తతిమ్మావాళ్ళు కాదంటే మాత్రం ఒప్పుకోలేను శ్రీ శ్రీ."

"ఆ సంగతి మరో మాటు మాట్లాడుకుందాం శ్రీశ్రీ"

"అంటే Thesis మాత్రమే చెప్పి Antithesis మానేద్దాం అనా?"

"ఇప్పుడు మనలో మనం వాదించుకోవడంలో ఒక సంఘర్షణ ఎలాగూ ఉండనే ఉంది కదా?"

"అయినా ఏ ప్రామాణ్యాల ప్రాతిపదిక మీద మనం ఈ చర్చ సాగించామో వాటిని అంగీకరించని వారి మాటో?"

"అటువంటి వారు మరెవ్వైనా ప్రామాణ్యాలు చూపించాలి."

"ఎందుకు చూపించాలి? ఇంత విశాల ప్రపంచంలో ఎందరో కవుల స్థానం ఉంది. వీళ్ళందరికీ విలువలు కడుతూ కూర్చోడమేనా మనం చెయ్యవలసిన పని. బహుశా అది కాలం చెయ్యవలసిన పనేమో!"

"కాలం కాలం అంటావు. కాలం అంటూ వేరే ఎక్కడ? కాలం అంటే మనమే."

"మరి తిక్కన వేమనలతో బాటు నన్నయ, శ్రీనాథులు కూడా కాలం పరీక్షకు అంటే మన అభిరుచుల సంతృప్తికి తగినవారే కదా? వారికి మహాకవులని గొప్ప విమర్శకులు కూడా గుర్తిస్తున్నారే."

"కొంతమందికి సంప్రదాయానికి నిలబెట్టాలని వుంటుంది. కొందరికి సంప్రదాయాన్ని ప్రతిఘటించక తప్పనిసరి అవుతుంది. అనాది సిద్ధంగా ఈ సంఘర్షణ జీవితంలోవలెనే సాహిత్యంలోనూ వస్తూనే ఉంది.

ఒక గొప్ప విప్లవ కవికి ఎదురుగా ఒక ఛాందస కవి కూడా ఉంటాడు. అంతేకాదు ఒక్కొక్క గొప్ప విప్లవోద్యమంగా వచ్చిన కవితా విధానం కూడా కాలక్రమాన సాంప్రదాయకమయిపోతుంది. భావకవిత్వం సరీగా అలాగే పనిచేసింది. భావికవిత్వం తెచ్చిన తిరుగుబాటు ప్రబంధ కవిత్వం మీదా! శతావధానుల మీదా! ఈనాటి యువకవుల మీద సానుభూతి ఉన్నవారు నన్నయ శ్రీనాధుల దగ్గరికి పోతారు. విప్లవం కావలసినవాళ్ళు వేమన, గురజాడల మార్గం అనుసరిస్తారు. ఇష్టమైన విషయాలను సులభంగా చెప్పేస్తారు. సులభమైన దాన్ని కూడా క్లిష్టంగా చెప్పాలనే వాళ్ళకి వీళ్ళు నచ్చరు."

"శ్రీశ్రీ ఒకటడుగుతాను చెప్పు! పాఠకుడి ప్రయత్నమేమీ లేకుండా పద్యమనేది చప్పున బోధపడిపోవడం మంచిదా? లేక ప్రవేశించిన కొద్దీ కొత్త తలుపులు తెరుచుకొనే పద్యం మంచిదా?"

"బాగా అడిగావు ఈ ప్రశ్ననే యింకో విధంగా వెయ్యాలంటే పామరుణ్ణి రంజించే రచన మంచిదా అని."

"ఔను ఏది మంచిది? ఏది గొప్పది."

"ఏక కాలంలోనే పండిత పామరులుభయులనీ రంజించేదే గొప్ప కవిత్వం. ఈ ప్రామాణ్యాన్ని చూపించి ఇప్పటికీ ఎప్పటికీ నేను తిక్కన, వేమన, గురజాడలు మహాకవులని చాటడం మానలేను."

**రేడియో ప్రసారితం : హైదరాబాదు కేంద్రం**

**ముద్రణ : తెలుగుదేశం వారపత్రిక, అక్టోబరు 25,1954**

# కవిత్రయం : తిక్కన

నా కవిత్రయం వేరు. ఆది కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ నాకు అభిమాన కవులు. ఈ ముగ్గురూ కూడా ప్రజాకవులే కావడం విశేషం. తిక్కన ప్రజాకవి గాబట్టే భారతాన్ని 'ఆంధ్రావళి మోదముం బొరయ'గా రచించాననగలిగాడు.

నన్నయగారు బ్రాహ్మణోత్కర్షతో 75% సంస్కృతం 25% తెలుగులో రాయగలిగితే, తిక్కన 75% తెలుగుపదాలు వాడి మిగతా 25% మాత్రమే అవసరాన్ని బట్టి సంస్కృత పదాలు వాడారు. తిక్కనది 'డ్రమటిక్ నెరేషన్'. ఎర్రన అతుకు కనపడకుండా ముందు నన్నయ శైలితో ప్రారంభించి కొంత దాకా కొనసాగించి, తర్వాత క్రమంగా తిక్కన శైలికి పరిణమించి ఒక చిన్న 'ఇంజనీరింగ్ ఫిట్ ' చేశాడు.

అర్జునుడికి నన్నయ ఇంద్రనందనుడనీ, శ్వేతవాహనుడనీ, సంక్రందననందనుడనీ సంస్కృత సంబోధనలు చేస్తే తిక్కన కవ్వడి, వివ్వచ్చుడు, కఱ్ఱి - అనే తెలుగుపదాలు వాడాడు. 'పద్మవ్యూహం' అంటే తిక్కన తెలుగులో 'తమ్మిమొగ్గరం' అన్నాడు. తిక్కన ప్రయోగించిన తెలుగుపదాలు చూస్తుంటే ఎట్లాంటి క్లిష్టమైన భావాన్ని కూడా తెలుగుభాషలో చెప్పడానికి పదాలు లేకపోలేదనిపిస్తుంటుంది.

చాలా కాలం క్రితం స్వర్గీయ విశ్వేశ్వరయ్యగారు కాబోలు చెప్పిన ప్రకారంగా విశాఖపట్నం సముద్రంలోకి ఓడలు వచ్చేందుకు 'డ్రెడ్జర్లు' తెప్పించి పూడిక తీయిస్తుంటే అది చూచిన రేవు కార్మిక పామరజనం 'డ్రెడ్జరు'ను తెలుగులో అందంగా 'త్రవ్వోడ', 'తవ్వోడ' అని పిలవడం ప్రారంభించారు. త్రవ్వు + ఓడ = త్రవ్వోడ, త్రవ్వేవోడ అని వ్యుత్పత్తి చెప్పుకోవచ్చు. 'డ్రెడ్జరు'కు అంతకంటే మంచి తెలుగుపదం మనకు ఈనాటికీ దొరకదు. ఇట్లాంటి అపురూపమైన ధోరణిలో తిక్కనగారు యెన్నో తెలుగు ప్రయోగాలు కూర్చారు.

నన్నయది పాటకు అనువైన సంగీతమయమైన కవిత్వమైతే, తిక్కనది మాట్లాడే కవిత్వం, సంభాషణాత్మక శైలి. కేవలం ఇంతేకాదు. తిక్కన 'సినిమాటిక్'గా కూడా రాస్తాడు. కృష్ణుడు రాయబారం వెళ్లే ముందు ద్రౌపది అతని ముందు చేసిన ప్రసంగ ఘటంలో ద్రౌపదిని తిక్కన 'క్లోజప్'లో చూపుతాడు.

కం॥ "ఇవ్వి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగము ద్రెస్సిపోయి తక్కిన యని కౌ
రవుల యెడ దీరుమాటల
యవసరమున దలపవలయు నచ్చుత వీనిన్

ఇక తిక్కనగారి కవిత్వంలో నాకు 'డయలిక్టికల్ థీరీ' కూడా కనపడుతుంటుంది. మార్క్సు తర్కభాషలో అన్నట్లుగా థీసిస్ + యాంటీ థీసిస్ = సింథసిస్ లాగా ఆధునికాంగ్ల కవి డిలాన్ థామస్ తన కవిత్వం గురించి తానే యిట్లా చెప్పుకొన్నాడు. మొదట తనకు ఏదో వొక భావం మెదిలితే, దానికి పూర్తి విరుద్ధమైన భావం సృష్టించి, ఆ రెండింటికీ యుద్ధం చేయించి, పోరాటం పెట్టి, తగవులాడించి అందులో నుండి కడకు వొక సమన్వయ భావ సమన్వితంగా కవిత్వమల్లుతానంటాడు. అట్లనే తిక్కనగారి 'హరిహరనాథ' కల్పనలో నాకు ఈ ధోరణే గోచరిస్తుంటుంది.

"శ్రీయనగౌరి నాబరగుచెల్వకుజిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి.."

అన్నపుడు హరిహర విభేదం చెప్పకుండా, చెల్వలకు అనే బహువచనం ప్రయోగించక, 'చెల్వకు' అని చెప్పి తిక్కన వొక కంపోజిట్ ఇమేజి ప్రసాదించాడు.

అట్లనే మరొకచోట

కం॥ "హరహరనాథునకు మరు
త్సరిదాకల్పిత మనోజ్ఞచరణ శిరస్సుం
దరమూర్తికి..."

అంటాడు - అంటే, విష్ణువుకు గంగ కాళ్ల వద్ద వుంటే, శివుడికి శిరస్సు మీద వుంటుంది- ఈ విరుద్ధ భావాలను తీసుకని వొకటిగా గండరించి 'చరణ శిరస్సుందర మూర్తి' - అంటాడు తిక్కన. బహుక్లిష్టమైన, మనోజ్ఞమైన వూహ.

అట్లనే -

కం॥ "త్రిభువనశుకదృఢ పంజర
విభవమహితునకు సమస్తవిష్టప నిర్మో
క భుజంగపతి కఖిలజగ
దభిన్న రూపునకు భావనాతీతునకున్."

అనే పద్యంలో కూడా రెండు విరుద్ధ కల్పనలున్నాయి. విష్ణుమూర్తేమో "త్రిభువన శుక దృఢపంజర... " అంటే మూడు లోకాలనే చిలుకను పంజరంగా గలిగినవాడు, అంటే మూడు లోకాలను తనలో ఇముడ్చుకుని రక్షించే రక్షకుడు. ఇక శివుడేమో "సమస్త విష్టపనిర్మోక భుజంగపతి.." అంటే, పాము కుబుసం వదిలినట్లుగా సమస్త లోకాల్ని వదిలివేసిన సన్యాసిరాజు

శివుడు అనే విరుద్ధ భావం వుంది. ఈ రెంటినీ డబుల్ ఎక్స్‌పోజర్‌లో లాగా కల్పి "అభిన్నరూపునకు భావనా తీతునకున్" అన్నాడు తిక్కన.

ఇకపై కందపద్యం నడకలో మరో చిత్రమైన అందం కూడా వుంది. నాలుగింట 'జ' గణం వాడినందువల్ల "భుజంగపతి కఖిల జగద భిన్నరూపునకు" అనే 'భుజంగగమనా'న్ని నడకలో సాధించగలిగాడు. అంతేకాదు, అక్కడితో పద్యభావం అయిపోయినా పాదపూరణంలో 'భావనాతీతునకున్' అనే ప్రయోగం వేసి ఎంతో ఔచిత్యాన్నీ, సౌందర్యాన్నీ తిక్కనగారు సాధించారు.

తిక్కన కందాల్లో ఎన్నో అందాలు ప్రదర్శించారు. ఈ తిక్కన కందపద్యాలే నా 'సిరిసిమువ్వా' కందపద్యాల శతక రచనకు ప్రేరణ.

ఇకపోతే తిక్కన జీవితం గురించి స్పష్టమైన చారిత్రక సమాచారమేమీ మనకు లభ్యం కాలేదు. అయినా ఆయన జీవితం గురించి నేను స్క్రీన్‌ప్లే రూపంలో స్థూలంగా కొంత వూహించాను. ఖడ్గతిక్కన, కవితిక్కన లిద్దరూన వొకటేనా కాదా అని నేను గతంలో విఖ్యాత చరిత్రకారులు కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారి నడిగినప్పుడు ఆయన ఎట్లయినా వూహించుకోవచ్చునీ, దేనికీ నిర్దుష్టమైన ఆధారాలు లేవనీ చెప్పారు.

తిక్కన భారత రచనా ప్రారంభదశను గురించి నేనిట్లా వూహిస్తున్నాను. తిక్కన వంశీకులు రాజాస్థానాల్లో కీలకమైన మంత్రి పదవుల వంటి వాటిలో వుండినవారు గనుక – ఒక విధమైన భోగభాగ్యాల మధ్య పెరిగి వుండాలి. 15–16 ఏళ్ల ప్రాయమప్పుడు వివాహమై వుండాలి. భార్య మరీ బాల్యంలో వుండబట్టి, కార్యం కానందున, 17–18 ఏళ్లకల్లా తిక్కన వేశ్యాసాంగత్యంలో వుండి వుంటాడు. (ఆ రోజుల్లో వేశా సాంగత్యం అపచారమేమీ కాదు...)

ఇట్లా వున్న దశలో మనుమసిద్ధిరాజుగారు భారతానువాదం పూర్తి చేయించాలనే తలంపుతో – నన్నయ్యగారు రాసిన వొక పద్యం తాటాకు మీద రాసి – దాన్ని చుట్టుపట్ల కవులందరికీ 'సర్క్యులేట్' చేయించి, ఆ ఫక్కీలో కవిత్వం రాసిన వారి నెవరినయినా యెన్నిక చేసి మహాభారత శేషభాగము పూర్తి చేయించాలనుకున్నాడు.

తిక్కన దగ్గరకు ఆ తాటాకు సర్క్యులేషన్ కోసం వచ్చినపుడు – వేశ్యాగృహంలో తాంబూలం నములుతూ వుయ్యాలమీద వూగుతూ వుండా – సేవకుడు ఆ తాటాకును తన చేతికిచ్చి విషయం విన్నవించుకోగా – తిక్కన ఆ తాటాకును ఎగాదిగా చూసి దాని మీద తన నోటి తమలపాకు రసం పూసి, మరే పద్యమూ రాయకుండానే తిరిగి పంపించి వేస్తాడు. రాజుగారు కోపపడి తిక్కనను పిలిపిస్తాడు.

తిక్కన వెళ్లి రాజుగారితో ఇట్లా అంటాడుః ఎవరైనా సరే నన్నయ్యగారి యెంగిలితోనే కదా భారతరచనను పూర్తి చేయగలిగేది. నేనూ అంతే. అయితే నేను తాంబూలరసం ఎంగిలితో కాస్త మెరుగుపెట్టాను గనుక. యేదో కొంత సొంత ధోరణిలో నన్నయ్యమార్గానికి మెరుగుపెట్టగలననే ధీమాతోనే నేనట్లా చేశానని సగర్వంగా చెప్పుకొంటాడు. అందుకు మనుమసిద్ధి సంతోషపడి తిక్కనను భారతానువాదానికి ఉపక్రమించమంటాడు. ఆ పిమ్మటనే తిక్కన భారత రచనకు ఉపక్రమించి వుంటాడు.

ఇక్కడ కూడా ఆరంభంలోనే వొక వివాదం వచ్చివుంటుంది. తిక్కన నియోగి, పైగా లౌకికమైన ఉద్యోగ వ్యవహారాల్లో ఉంటూ, మంత్రి పదవుల వంశంలో వుండి ఎన్నో వ్యవహార సంబంధమైన పాపకృత్యాలు చేసి వుంటాడనే మిషతో పవిత్రమైన భారతాన్ని అనువదించేందుకు తిక్కనకు అర్హత లేదనే గొడవ లేవదీసి వైదికులు ప్రతిఘటించి వుంటారు.

అప్పుడు తిక్కన వారిని సంతృప్తి పర్చేందుకు దీక్షగా యజ్ఞం చేసి వైదికులకు ఇవ్వాల్సిన సంభావనాదులు ఇచ్చి, తిక్కన సోమయాజి అన్పించుకుని మరీ భారతరచన కుపక్రమించి వుంటాడు.

సోమయాజియై తిక్కన ఒక మహానిష్టతో జీవితధ్యేయంగా దీక్షతో మహాభారతాన్ని పూర్తి చేసి వుంటాడు. వృద్ధాప్యంలోకి వచ్చినంతవరకు భారత రచనలోనే నిమగ్నుడై వుండివుంటాడు. అంతేగాని, తిక్కన ఆశువుగా పదిహేను పర్వాలూ గురునాథుడనే రాతగాడికి డిక్టేట్ చేసి వుంటాడని నమ్మశక్యం కాదు.

గిబ్బన్ 'రోమన్ ఎంపైర్' అనే ఉద్గ్రంథాన్ని ఇట్లనే తన జీవిత లక్ష్యంగా భావించి వృద్ధాప్యం దాకా పూర్తి చేశాడు. అఖరు అధ్యాయంలో, అఖరు లైనులో అఖరు పదం రాసి 'ఫుల్‌స్టాప్' పెట్టి కలం కింద పెట్టేసిన తర్వాత – గిబ్బన్ గారి మనఃప్రవృత్తి యెట్లా వుంటుందో చిత్రీకరించాలనే ధోరణిలో వొకరిద్దరు ఆంగ్లంలో నాటకాలు కూడా రాశారు. అట్లనే మహాభారతం పూర్తి చేసిన తర్వాత తిక్కనగారి మనోభావం ఎట్లుంటుందో వూహిస్తూ మనోజ్ఞమైన రేడియోనాటిక 'సంహిత సమాప్తి' వొకటి వచ్చింది.

వాచస్పతి మిత్రుడు ఉపనిషద్వ్యాఖ్యానం తన జీవిత ధ్యేయంగా పెట్టుకొని, భార్యను సైతం సాంసారికంగా నిరాదరించి, ఏకదీక్షతో పూర్తి చేసిన ఆ వ్యాఖ్యకు భామతి వ్యాఖ్యానం అనే పేరు పెట్టి ఆచంద్రార్కం భార్య పేరు నిల్పిన కథ వొకటి వుంది. అట్లనే తిక్కన, కూడా ఈ మహాభారత కావ్యాన్ని భార్యకు అఖరులో సమర్పించి, ఈ కావ్యాన్నే నీ బిడ్డగా భావించుకోమని చెప్పివుంటాడని నేనూహిస్తున్నాను.

నన్నయగారు ఏ 30–35 ఏళ్లకో తనువు చాలించివుంటే, 15 పర్వాలు పూర్తి చేసిన తిక్కనగారు ఏ 60–70 ఏళ్లకో మరణించి వుంటాడు...

(నెల్లూరు వర్ధమాన సమాజం 16.2.1969న నిర్వహించిన కవిత్రయ జయంతిలో మాట్లాడింది)

**ముద్రణ : జమీన్‌రైతు పత్రిక, 1969 ఫిబ్రవరి 21, 28 సంచికలు**

# తెలుగు సాహిత్యంలో గూఢత : వేమన

నేను చేస్తున్న ఈ ప్రసంగం ఎందరు వింటున్నారో నాకు తెలియదు గాని వింటున్న వారందరూ "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో అంతమయ్యే పద్యాలను వినే ఉంటారని నాకు బాగా తెలుసును. వాటిని రచించిన వేమనలోని గూఢత ప్రస్తుతం నేను ప్రసంగించబోతున్న విషయం. అందరూ విన్నట్టివీ, అందరికీ అందుబాటులో ఉన్న ట్టీవి, అందరికీ అర్థమయ్యేవీ అయితే ఇక వేమన పద్యాలలో ఉన్న గూఢత ఏమిటా అనే ప్రశ్న రావచ్చును. అయితే ఈ అర్థం కావడమనేది అనేక అంతస్తులలో ఉంటుంది. ఒక్కొక్కరి సంస్కారపు స్థాయిని బట్టి ఒకే పద్యం ఒక్కొక్క విధంగా అర్థం అవుతుంది. అందరికీ అర్థంకాగా ఇంకా ఎంతో మిగిలిపోయే అర్థం ఉంటుంది. మహా కవిత్వానికి! అంతేకాదు: కాలం గడిచిన కొద్దీ ఆ కవిత్వం కొత్తగా ఏర్పడ్డ పరిస్థితుల మీద వ్యాఖ్యానంగా సరిపోగలుగుతుంది.

ఉదాహరణకు: " చెప్పులోని రాయి" అన్న పద్యం ఉంది.

"చెప్పులోని రాయి చెవిలోని జోరిగ

కంటిలోని నలుసు కాలి ముల్లు

ఇంటిలోని పోరు ఇంతింత కాదయా

విశ్వదాభిరామ వినురవేమ"

మానవ జాతి యావత్తూ ఒకే కుటుంబంగా రూపొందుతున్న ఈ రోజులలో ఐక్యరాజ్య సమితి సమావేశాలలోని వాగ్యుద్ధాల మీద "ఇంటిలోని పోరు ఇంతింత కాదయా" అన్న కవి వాక్యం సముచితమైన వ్యాఖ్యానం కాదని ఎవరనగలరు?

అసలు గూఢత అనే మాటకి అర్థం కాకపోవడం అనే అర్థం ఒక్కటే అర్థం కాదు. ఎక్కడో ఏదో వుంది. ఎంత ప్రయత్నించినా ఎవరికీ అందదది. ఎలాగయినా దాన్ని తెలుసుకోవాలి. అంతేకాదు. ఆ తెలుసుకున్న దాన్ని అందరికీ తెలియజేయాలి. అదీ జిజ్ఞాస. అటువంటి జిజ్ఞాసను ప్రదర్శించేదే గూఢ కవిత్వం. "మిస్టిసిజం" అనే ఇంగ్లీషు మాటకు పర్యాయపదంగా వాడుతున్న ఈ గూఢత కేవలం అర్థం కాకపోవడంతో ఆగిపోదు. అత్యున్నత స్థాయిలో అదొక ఆధ్యాత్మిక అనుభూతి: పారవశ్యం దానికి ప్రాతిపదిక! తెలుసుకో శక్యం కానిదాన్ని తెలుసుకోవడానికి చేసే తపస్సు!

గాజు కుప్పెలోన గడగుచు దీపంబు

ఎట్టులుండు జ్ఞానమట్టులుండు

తెలిసినట్టి దేహంబులందున

విశ్వదాభిరామ! వినురవేమ!

ఎవరీ "తెలిసినట్టివారు"? ఏమిటి తెలిసినట్టివారు? తెలివికీ తెలియమికీ మధ్య స్పష్టమైన సరిహద్దు గీత ఏదైనా ఉందా?

ఈ సరిహద్దు గీతను కనిపెట్టడానికి కావించే అన్వేషణమే గూఢ కవిత్వం.

వేమన జీవితమంతా ఈ అన్వేషణలోనే గడచింది. సమస్త జీవితానుభవాలనూ చవిచూచిన తర్వాత అతనొక వేత్తగా, ద్రష్టగా, బోద్ధగా పరిణతి పొందాడు. అప్పుడతనిలో కవిత్వం అ ప్రయత్నంగా పుట్టుకొచ్చింది. అతని చుట్టూ ఎప్పుడూ అనేకమంది శిష్యులుంటూ వుండేవారని అనుకోవడం అసమంజసం కాదు. వేమన పద్యాలను వారే కంఠస్థం చేసుకొని ఉండాలి. అందులో పెద్ద శ్రమ ఏదీలేదు. ఒక్కమారు వింటే ఎన్నటికి మరిచిపోలేకుండా మనస్సుకు హత్తి పెట్టుకుపోగల శక్తి ఉన్నవి వేమన పద్యాలు. వేరే ఏ తాటాకుల మీదా ఎవరూ వాటిని రాసుకోనక్కరలేదు. లోకుల నాలుకలమీదనే వేమన తమ పద్యాలను విరచించాడు. అందువల్లనే అవి అంత శాశ్వతంగా నిలవలగలుగుతున్నాయి. ఎవరూ జ్ఞాపకం ఉంచుకోనివి ఎన్ని వందల పద్యాలయితే మాత్రం ఏ లాభం! "నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు, తళుకు బెళుకురాలు తట్టెడేల?" అని అందుకే అన్నాడు వేమన. ఒక్క నీలమేకాదు ఇంకా ఎన్నో అమూల్య మణులు అతని పద్యరత్నాలు.

వేమన్న అన్ని రకాల భేషజాలకీ విరోధి. శివపూజలైనా సరే చిత్తశుద్ధి లేకపోతే అతడంగీకరించడు. ఆడంబరం అంటే అతని కసహ్యం

"అల్పుడెప్పుడు పల్కు నాడబరము గాను

సజ్జనుండు పల్కు చల్లగాను" అంటాడు.

ఈ చల్లని పలుకు కోసమే అతను జీవించాడు. ఎందుచేతనటే "కంచు మ్రోగినట్లు కనకంబు తెగ ఆర్భాటం చేస్తారు. అని ప్రశ్నించాడు. తెలివి తక్కువవాళ్లు ఆటవెలది పద్యంతో చల్లార్చివేస్తాడు వేమన.

సాధారణంగా "మిస్టిసిజం" మీద వినవచ్చే ఒక విమర్శ ఏమిటంటే, అది పలాయనమవుతుందనీ, నైరాశ్యాన్ని ప్రబోధిస్తుందనీ, వైరాగ్యాన్ని ప్రబోధిస్తుందనీ, కాని వేమన కవిత్వంలో ఈ నైరాశ్యం ఎక్కడా కనబడదు. సరికదా నిత్యజీవితంలోని సాధారణానుభవలే అతని కావ్య వస్తువులు. పరిపూర్ణమైన ప్రాధాన్యాన్ని ఇస్తూనే జీవితానికి గుణపాఠాలు నేర్పే

గడుసుదనం గల హక్కు వేమన్నది! అతడు స్వీకరించే ఉపమానాలూ, చూపించే నిదర్శనాలూ చుట్టూ ఉన్న ప్రపంచం నుంచే పుణికి పుచ్చుకున్నాడు. 'కడవడైన నేమి ఖరము పాలు!' 'బొగ్గు పాల గడుగ బోవునా మలినంబు!' 'కుంటికుక్క కేల కుందేటి పరుగులు?' 'చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా?' ఇటువంటివి ఎన్ని వందలైనా ఎత్తి చూపించవచ్చును. ఇంకో విశేషం ఏమిటంటే ఏ వస్తువూ వేమన దృష్టిలో హీనమైనది కాదు. అన్నింటికి అతని కవిత్వంలో ప్రవేశానికి అర్హత వుంది. "చెప్పులోని రాయి! చెవిలోని జోరిగ! కంటిలోని నలుసు! కాలి ముల్లు!" అన్నింటికి! ప్రపంచాన్ని ఎంతో ప్రేమించగలిగిన వాడొక్కడే ఇంత విశాల హృదయం ప్రదర్శించగలడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమస్త సృష్టిని సమానంగా పరిగణించడం అంటే ఏమిటో ఆచరణలో చూపించాడు వేమన.

వేమన్నది మహా సాహసోపేతమైన విప్లవ తత్వం, ఆత్మని బంధించే అన్ని శృంఖలనూ తెగ త్రెంచివేసి విశ్వమంతటా నిరాఘాటంగా విహరిస్తుందతనివాణి. ఈ స్వరతంత్ర స్వతంత్రమైన మనస్తత్వం వల్లనే అతడు రాజులనీ, సంఘాన్నీ, భగవంతుణ్ణి కూడా నిలబెట్టి ప్రశ్నించగలుగుతాడు. అడ్డదిడ్డపు అసందర్భపు ఆచారాలెన్నింటి మీదనో అతని కవిత్వం గొడ్డలిపెట్టు. "ఆత్మశుద్ధిలేని ఆచారామదియేల?" "తలలు బోడులైన తలపులు బోడులా?" అని దాంభికులు నిండా కప్పుకున్న ముసుగును హఠాత్తుగా ఊడలాగి పారవేస్తాడు. బహుశా వేమన యోగి అయిన తర్వాత దిగంబరుడుగానే తిరిగి ఉండాలి! దాచి పెట్టడం, కప్పి పెట్టడం అనేవి అతనికి సుతురామా నచ్చవు. ఏ నీడా, ఏ ముసుగూ లేని పరిశుద్ధ సత్యాన్నతడు సాక్షాత్కరింప జేసుకున్నాడు. ఆ సత్యాన్ని మరుగుపరిచే అవకుంఠనం ఎంత ఖరీదైనదైనా, దాన్ని చింపేస్తే కోపం తెచ్చుకొనే భూషణాదులతో ఏ మాత్రమూ నిమిత్తంలేని ఎత్తు నుంచి జీవితాన్ని పరిశీలిస్తాడు వేమన.

తెలుగు సాహిత్యంలో వేమనకు గల స్థానం విచిత్రమైనదీ, విశిష్టమైనదీను, తతిమ్మా కవులందరిదీ ఒకదోవ! వేమనార్యుడొక్కడిదీ ఒక తోవ! అసలదో తోవ అనడానికి కూడా ఆస్కారం లేదేమో! వేమనతో కలిసి చేసే ప్రయాణం ఆది మధ్యాంతరహితం! అగమ్యగోచరం. అలాగని అతని వాక్కులో ఎక్కడా అస్పష్టతగాని, సందిగ్ధతగాని ఏమాత్రమూ లేవు. సులభంగా, సూటిగా, సూక్ష్మంగా చెప్పేస్తాడతను. ఎంతెంత కఠినమైన జటిలమైన విషయాలైనా! నిజానికి కతని పద్యాలన్నీ అప్రయత్నంగా అప్పటికప్పుడు చెప్పినవే! చెట్టు మీద పళ్ళు పండినట్లు జీవితంలోంచి పరిపక్వమై పడినవతని పద్యాలు.

ఎంత సంపన్నమైనదా జీవితం! ఎన్నెన్ని వివిధ విచిత్రానుభవాలు! అత్యున్నత శిఖరాగ్రాలూ చూశాడు. అగాథమైన లోతులూ చూశాడు వేమన! అతని మనస్సులో ఎన్ని తుఫానులు చెలరేగి ఉండాలో! శాశ్వతంగా అక్కడ ఒక క్షీరసాగర మథనం సాగిపోతూ ఉండాలి. ఒక కంఠ్లోంచి అమృతం, ఇంకో కంఠ్లోంచి హాలాహలం వెలిగ్రక్కుతూ వుండే వాడనవచ్చును. అయితే ఆ సంక్షోభం అంతా నేపథ్యంలోనే. పైకి వెలువడే పద్యం నిట్టూరుకీ, నిశ్శబ్దానికీ చేరువగా ఉంటుంది. నాలుగు పాదాల పద్యంలో ఆఖరిది "విశ్వదాభిరామ

వినురవేమ" అయితే ఇక మిగిలిన మూడు పాదాలలో ఎక్కువ హంగామా చెయ్యడానికికేమీ అవకాశం వుండదు. మొదటి పాదంలో ఒక ఊహని ప్రకటిస్తాడు. దానికి విభిన్నమైన ఊహని రెండో పాదంలో ప్రవేశపెట్టి రెండింటి చేతా హోరా హోరి పోరాడుకోనిస్తాడు. వెంటనే మూడో పాదంలో తానై జోక్యం చేసుకొని హేళనగానో, ఉపదేశంగానో, అర్థాంతరన్యాసంగానో దీని సంగతిదీ అని తీర్పు చెబుతాడు. వేమన పద్యాలలో చాలా మట్టుకు గోచరించే గతితార్కిక పద్ధతి ఇదే. ప్రతి విషయపు హృదయంలోకి సరాసరిగా ప్రవేశించి దానిలో వైరుధ్యాలను బట్టబయలు చేసి ఆఖరికి తన వ్యాఖ్యానం అందజేస్తాడు.

అదీ వేమనలోని గూఢార్థం! "అయితే ఏమిటి దీనంతటికి అర్థం?" అనే ప్రశ్నకి వేమన ఇచ్చిన జవాబు, దేశ దేశాలు తిరిగిన తర్వాత, రకరకాల మనుష్యుల్ని చూసిన తర్వాత, ప్రేమ తర్వాత వియోగం తర్వాత, నవ్వుల తర్వాత, ఏడుపుల తర్వాత, బంగారం తయారు చేసిన కాలాన్ని ఉపయోగంగానో నిరుపయోగంగానో ఖర్చు పెట్టిన తర్వాత, చెయ్యదలచిందంతా చేసి చూడవలసిందంతా చూసిన తర్వాత, లోకాన్ని క్రింద నించి మీదకి మీద నుంచీ క్రిందకీ ఊగులాడించి వొదలిపెట్టిన తర్వాత, యోగిగా, జ్ఞానిగా, తక్షణ సంబంధం పెట్టుకొన్న కవిత్వం. ఆరేళ్ళ కుర్రాడు మొదలుకొని అరవై యేళ్ళ వృద్ధుడి దాకా ఎవరెవరు ఎన్నిమార్లు చదివినా అందరికీ అన్ని అంతస్తులలో అర్థమయ్యే రహస్యం! ఎవరికీ అంతుపట్టని విషయాల మీద అందరికీ బోధపడే విధంగా చెప్పిన పరమార్థం.

**ఆకాశవాణి ప్రసారితం**

**ముద్రణ : అభ్యుదయ, మాసపత్రిక ఏప్రిల్ 1959**

# నూరేళ్ల సాహిత్యం

## 50 సంవత్సరాల తెలుగు సారసత్వం (1900-1950)

1900 వచ్చింది. మరొక శతాబ్దం గడిచి పోయింది. 20వ శతాబ్దం ఉదయించింది. విక్టోరియా మహారాణి ఇంకా రాజ్యం ఏలుతోంది. ఆమె కిరీటంలో ఒక మణిగా భారతదేశం ప్రకాశిస్తూనే ఉంది. బ్రిటిషు సామ్రాజ్యంలో సూర్యుడస్తమించడని చెప్పుకునేవారు. అంతర్జాతీయ వ్యవహారాలలో నౌకాబలానిదే పై చెయ్యిగా ఉంది. విమానాలు, ఆటంబాంబులు, సోషలిస్టు విప్లవం వీటిని గురించి ఆలోచించే వారు స్వప్నజగత్తులో ఉన్నట్టు జమ. ఇక రేడియో, టెలివిజన్ లాంటివి అంటారా అవి సిద్ధులు సాధించవలసిన మాయలు.

అప్పుడు భారతదేశం శాంతియుతమైన దేశంగా ఉంది లోపల కాకపోయినా కనీసం పైకైనా అలా కనిపిస్తోంది. అనాగరికం అయితే కావచ్చునేమో, కాని బ్రిటిషు వారి ఆధీనంలోనే వుంది పాఠశాలల్లోని పాఠ్యపుస్తకాలన్నీ "బ్రిటిషు పరిపాలన వలన లాభములు" అనే పొగడ్తలతో నిండివున్నాయి. పత్రికలలో గాంధీగారి పేరు ఎప్పుడూ పడేదికాదు. రాజకీయాలు ఒక ఆట. కవిత్వం ఒక విలాస వస్తువు.

20వ శతాబ్దారంభంలో కూడా జమీందారులే భాషాపోషకులుగా వుంటూ వచ్చారు. వారి ఆదరణ పొందేటందుకు అష్టావధానం, శతావధానం చేయడమనేది ఒక పద్ధతిగా వుండేది. సంస్కృత భాషలో వున్న ఉత్తమ గ్రంథాలన్నీ అదివరకే తెలుగులోకి తర్జుమా అయిపోయాయి ప్రబంధం ఒక రచనాపద్ధతిగా కొనసాగగల అవకాశాలు నశించిపోయాయి. ఇప్పుడు మనం చూస్తున్న సారస్వత పత్రికలు అప్పటికింకా బయలుదేరలేదు అముద్రిత గ్రంథ చింతామణి అనే ప్రచురణ మాత్రం చాలామంది సారస్వతాభిలాషులకు మంచి మేతనిచ్చింది.

ఆ రోజుల్లో మద్రాసు యూనివర్సిటీ ఒక చక్కని విద్యాపీఠంగా వుండేది. కొక్కొండ వెంకటరత్నంగారు దానికి అధిపతి. 19వ శతాబ్దంలో ప్రవేశపెట్టబడిన ఇంగ్లీషు విద్య ప్రభువులకు కావలసిన పంట పండించింది. చక్కని బానిసలు తయారయ్యారు. చదువుకున్న వారిలో నిరుద్యోగం అనేది అప్పటికి లేదు. ఇంగ్లీషు భాష వచ్చినవాడికి ఎందులోనైనా సరే ఉద్యోగం గ్యారంటీ. మధ్యతరగతి కుటుంబాలన్నింటికీ తమ మొగపిల్లలకు ఇంగ్లీషు

నేర్పించడమనేది ఒక ఆదర్శంగా ఉండేదంటే అతిశయోక్తికాదు. (స్త్రీలకు ఆధునిక విద్య నేర్పించడం ఆరంభంకాలేదు. వారు అప్పటికింకా 8వ ఏటనే పెళ్లి చేసుకుని గృహిణులుగా వుండడానికి కావలసిన శిక్షణ మాత్రమే పొందుతూ వుండేవారు.).

ప్రపంచ భాషగా అభివృద్ధి చెందిన ఇంగ్లీషు, మేధావుల మనోనేత్రాలను తెరచింది. దానివల్ల తాత్కాలికంగానే కాక భవిష్యత్తులో కూడా బ్రహ్మాండమైన అవకాశాలను చూడగల్గారు. వారి సృజనాత్మకమైన కృషి అంతా సంస్కరణ తత్వంలోనే నడిచింది. కాని, విప్లవాత్మకంగా సాగలేదు. అయినప్పటికీ ఇంగ్లీషు భాషా ప్రభావంమట్టుకు మంచికే వచ్చిందని చెప్పవచ్చు. సంఘ సంస్కరణలో కొత్త పద్ధతులు వచ్చాయి. ఆ రోజుల్లో మన తెలుగు దేశంలో అవతరించిన మహావ్యక్తి శ్రీ కందుకూరి వీరేశలింగంగారు. తెలుగు భాషలో మొట్టమొదటిసారిగా నవల రచించినవాడు ఆయనే. అంతేకాక తెలుగు కవుల చరిత్ర సంఘసంస్కరణ ఆశయంగాగల వ్యంగ్యరచనలు, ప్రహసనాలు ప్రవేశపెట్టినది ఆయనే. మూఢనమ్మకాలను వ్యతిరేకించిన మొదటివాడు. మంచి, చెడ్డలను విచారించే వివేకవంతమైన పంథాలో జీవితం నడవాలని ప్రబోధించిన ప్రథముడు. నాటక రచయితగా, ప్రతికా సంపాదకుడుగా, విద్యావేత్తగా ప్రథమ శ్రేణిలో ఉన్నవాడు. అన్నిటికంటే ఎక్కువగా మన దేశంలో సహగమనం తొలగింపబడిన తరువాత విధవా వివాహం అనే మహోత్కృష్ట సంస్కరణను ప్రవేశపెట్టి దానికోసం పోరాడిన మహావీరుడు.

కాలచక్రం మరికొంత తిరిగింది. 20వ శతాబ్దంలో రెండవ దశాబ్దం ప్రవేశించింది. అంతవరకు మన సాంఘిక నిర్మాణం ఫ్యూడల్ పద్ధతులలోనే వుండేది. జీవితం తీరికగానే సాగిపోతోంది. కాని ప్రజలలో ఏర్పడిన ఆత్మసంతృప్తిని వొదలగొట్టే సంఘటనలు జరగనారంభించాయి. ప్రపంచంలో చిచ్చు చెలరేగింది. అదే ప్రథమ ప్రపంచ యుద్ధం సంభవించిన దశాబ్దం. ఆ దశాబ్దంలోనే (1915లో) మహాకవి గురజాడ అప్పారావుగారు మరణించారు.

గురజాడ నడివయస్సులోనే మరణించారని చెప్పాలి. చనిపోయే నాటికి ఆయనకు 50 సంవత్సరాలు మాత్రమే. ఆయన మరణం ఒక్క ఆంధ్రదేశానికే కాదు, యావద్భారతదేశానికి తీరని నష్టం. నిజానికి అనాడు అంటే 1915 నవంబర్ నెలలో ప్రపంచం ఒక మహా రచయితను కోల్పోయిందనే చెప్పాలి. గురజాడ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గోథే ఇబ్సన్‌లాంటి రచయితలతో తులతూగే మేధావి. శూద్రకుని "మృచ్ఛకటికం" తరువాత వేయి సంవత్సరాలకు అలాంటి సృజనాత్మకమైన, వాస్తవిక దృష్టితో నాటకాన్ని ఇచ్చినవాడు గురజాడ. అదే "కన్యాశుల్కం".

గురజాడ భారతదేశంలోను, ప్రపంచంలోను ఉన్న ఉత్తమ నాటక రచయితలలో ఒకడేకాడు : ఆయన ఒక విప్లవ కవి కూడా. కాని ఒక దురదృష్టం ఏమిటంటే కవిగా ఆయన కివ్వవలసిన స్థానాన్ని గురించి భాషావాదులలో తీవ్రమైన వివాదం ఏర్పడడం. ఆయనకు

మహాకవి అనే బిరుదునివ్వడం తగదని కొందరు ఛాందస విమర్శకులు అనడం విచారకరమైన విషయం. ఆయన రాసిన మహాకావ్యం ఏది? అని వారిప్రశ్న. నిజమే. గురజాడ మహాకావ్యమని పిలవదగినంత పెద్ద పద్యరచన ఏదీ చేయలేదు. ఈ విమర్శకుల కొలబద్దతో చూస్తూ వారిని సంతృప్తిపరచేవి గురజాడ రచనలలో దొరకవు. ఈ ఛాందసులను సంతృప్తిపరచేవిగా లేవు కనుకనే మరికొందరు గురజాడ రచనలను ఉత్తమ రచనలుగాను, ఆయనను మహాకవిగాను పొగడుతున్నారు. ఆయన ఇంతింతలేసి గ్రంథాలు రాసిపారెయ్యకపోవచ్చు. కాని కవిత్వపు మంచి చెడ్డలను నిర్ణయించేది గ్రంథాల లావును, పైమెరుగులను బట్టి కాదుకదా : గురజాడ తన రచనా విధానంలోను, కవితా విషయంలోను కూడా విప్లవాన్ని తీసుకొచ్చాడు. కొత్త మార్గాన్నితొక్కాడు. కవిత్వపు గాంభీర్యాన్ని లోతులను చెడగొట్టే నిబంధనలతో ఆయనకు పనిలేదు. గురజాడ ఇచ్చిన సందేశంలో వుండే శక్తి., అర్థం ఇప్పుడిప్పుడు తెలుసు కోగలుగుతున్నాం. కాలం గడిచిన కొద్దీ ప్రతిభ అతిశయిల్లే కవులవర్గానికి చెందినవాడు గురజాడ.

దరిద్ర నారాయణుని చిహ్నమంటూ కొల్లాయి కట్టుకుని నిరాడంబర మూర్తియై గాంధిగారు అవతరించినప్పుడు ప్రపంచమంతా ఆయనను ఉగ్గడించింది. కవితారంగంలో గురజాడ అలాంటి నిరాడంబరతనే అవలంబించాడు. పూర్వ కవిత్వాలలో వుండే వ్యర్థ పదాడంబరపూరిత పద్ధతులకు, నియమాలకు స్వస్తిచెప్పి జానపదసాహిత్య పద్ధతులను అవలంబించి తాను చెప్పదలచుకున్న సందేశాన్ని ప్రజలకందించాడు.గురజాడ ఒక మహాప్రవక్త. ఆయన సందేశం ఇంకా చాలా విపులీకరించవలసి వుంది. కాని అయినంతవరకు చూస్తే విమర్శకాగ్రేసరులనుకునే వారికంటే ప్రజలకే అవి బాగా అర్థమవుతున్నాయి. అందులోనే గురజాడవారి గొప్పతనం వుంది. ఆయన కవిత్వాన్ని తరచి చూచినకొద్దీ ఇంతవరకు కనిపించని కొత్త విషయాలెన్నో బయటపడుతూ వుంటాయి. ఇట్టివారు కాకపోతే మహాకవులనబడే వారింకెవరో బోధపడదు.

గురజాడవారు రచించిన చిన్నకథలను గురించి, విమర్శల గురించి, లేఖలను గురించి నేను చెప్పలేదు. వాటిలో కొన్ని అముద్రిత రచనలుగానే వుండిపోయాయి. ఈ మధ్యనే అవి ప్రచురించబడుతున్నాయి. ఆ రచనలన్నీ వాటికవే సాటి. ముఖ్యంగా చిన్నకథలు ఒక ప్రత్యేకత. ఒక సత్యాన్వేషి మనస్సు ఎలా పనిచేస్తుందో ఆ రచనలు వ్యక్తపరుస్తాయి.

కందుకూరి, గురజాడలను గురించి చెప్పాను. తెలుగు సారస్వత చరిత్రలో 20వ శతాబ్దపు మూర్తిత్రయం పూర్తి అవాలంటే గిడుగు రామమూర్తి గారి పేరుకూడా చెప్పాలి. తెలుగు భాషలో ఆయన ఒక మహావిప్లవాన్ని తెచ్చాడు. అదే గ్రాంధిక భాషకు బదులు గ్రామ్యభాషను వాడటం. ఈ విప్లవాన్ని తీసుకురావడానికి ఆయన ఎన్ని పోరాటాలు జరిపాడో చెప్పలేం. ఇప్పుడు అవన్నీ చారిత్రక విషయాలైపోయాయి. ఈనాడు చూస్తే అంతా గ్రామ్య భాషాయుగంగా కనిపిస్తుంది. వార్తా పత్రికలలోను, వేదికలమీద, రేడియోప్రసారాలలోను,

సినిమాల్లోను, అన్నింటిలోనూ గ్రామ్యభాషనే వాడుతున్నారు. కాని గిడుగువారి కాలంలో అది ప్రవాహానికి ఎదురీత.

గ్రామ్య భాష కోసం ఆయన ఆంధ్రసాహిత్య పరిషత్తును ఒంటరిగా ఎదిరించి పోరాడవలసివచ్చింది. చివరకు దాని అంతు తేల్చుకున్నాడు కూడా. ఈనాడు ఆ పరిషత్తులో దానిని గురించి తలపోసేవారు లేరు. అది ఒక పాతబడిన చారిత్రక అంశమై అడుగున పడిపోయింది. గిడుగువారు తాము ప్రవేశపెట్టిన నూతనవాదం ప్రజల మనస్సులలో సుస్థిరంగా నాటుకుపోయే వరకేగాక, అది ఫలించేవరకు కూడా జీవించి చూడగలిగారు.

1910-20 మధ్యకాలంలో ప్రపంచ సంగ్రామం. రష్యను మహావిప్లవం జరిగాయి. వాటి ఫలితంగానే భారతదేశంలో జాతీయ పోరాటం తలయెత్తింది. అదే కాలంలో ప్రత్యేకాంధ్రరాష్ట్రం కోసం కూడా ఆందోళన ప్రారంభమైంది. ఆంధ్ర భాషా ఉద్యమం మంచి ఉన్నతస్థాయిలో వుంది. ఆంధ్రనాటక రంగం మీదనే కాక అఖిల భారతంగా కూడా ప్రఖ్యాతిగాంచిన కళాప్రపూర్ణుడు బళ్లారి రాఘవాచారి ఉదయించాడు. ఆదిభట్ల నారాయణదాసు తన హరికథాకాలక్షేపంతో ప్రజలను మంత్రముగ్ధులను చేస్తున్నాడు. విజ్ఞానచంద్రికా గ్రంథమండలివారు శాస్త్రీయ గ్రంథాలెన్నిటినో తెలుగులో ప్రచురించసాగారు. మొట్టమొదటి తెలుగు దినపత్రిక "ఆంధ్రపత్రిక" కాశీనాథుని నాగేశ్వరరావుగారిచే ప్రారంభించబడింది. హైదరాబాదు రాజ్యంలోని గద్వాల, వనపర్తి సంస్థానాలలో తిరుపతి వెంకటకవులు సన్మానాలను పొందుతున్నారు. వీరిలో వెంకటశాస్త్రిగారొక మహావ్యక్తి. ఆయన ఒక సంస్థలాంటివాడు. వాడుకభాషనే ఛందోబద్ధంగా పెట్టి కవిత్వం అల్లిన ఉద్దండుడు. (ఆయన ప్రతిభను గుర్తించియే అవిభక్త మద్రాసురాష్ట్రం ఆయనకు తెలుగు ఆస్థానకవి పీఠాన్నిచ్చి గౌరవించింది. వెంకటశాస్త్రిగారీమధ్యనే కాలధర్మం చెందారు.) ఆ కాలంలోనే తెలుగులో నవలలు, నాటకాలు ఎక్కువగా ముద్రించబడసాగాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగినవి వీరేశలింగంగారి శిష్యుడయిన చిలకమర్తి వారివి, పానుగంటివారివి మాత్రమే. ఈనాటికి కూడా అవే నిలిచాయి. వేదం వెంకటరాయశాస్త్రిగారి ఉత్తమ నాటకం "ప్రతాపరుద్రీయం" కూడా ఆ రోజుల్లోనే వెలువడింది. శాస్త్రిగారి భాషాసేవ మరువరానిది. ఆంధ్ర, సంస్కృత ప్రబంధాలపై ఆయన రాసిన విమర్శలు తెలుగుభాషకు ప్రత్యేకాలంకారాలు.

గురజాడ మహాకవి ప్రజాకవిత్వానికి పునాదులు వేస్తున్న రోజుల్లోనే తెలుగు కవితాకొలనులో మరొక తామర వికసించింది. శాంతినికేతనంలో కొంత కాలం నివసించి వచ్చిన యువకుడొకడు తన గొంతెత్తి నూతన గేయాలను ఆలపించసాగాడు. ఆయనే రాయప్రోలు సుబ్బారావు. 1. తెలుగులో భావకవిత్వానికి మూల పురుషుడు. కళ కళ కోసమే అనే సిద్ధాంతాన్ని లేవదీశాడు. ప్రేమతత్వాన్ని భావవాదంతో మేళవించి ఆలపించాడు. ఆయన గీతాలు భావిపౌరులైన యువకులందర్నీ మైమరపించి నిద్రపుచ్చుతాయి. వాటిలో వుండే వ్యూహాప్రతిభలు వారినాకర్షించసాగాయి. ఆ రోజుల్లోనే ఏర్పడిన సాహితీ సమితి అనే సారస్వత సమాజానికి కూడా మూల పురుషుడు రాయప్రోలే.

1920–30 సంవత్సరాల మధ్య కాలంలో సారస్వత సమాజాలు, సారస్వత పత్రికలు ఎక్కువగా బయలుదేరాయి. వాటిలో మొట్టమొదటి సాహితీసమితి. శ్రీ శివశంకరశాస్త్రి (ఇప్పుడు శివశంకరస్వామి) దానికి అధ్యక్షులు. ఈ సమితి తరపున మొదట "సాహితి" అనే పేరుతోను1, ఆ తరువాత "సఖి" అనే పేరుతోను రెండు సారస్వత పత్రికలు నడుపబడ్డాయి. ఇవి ఎంతో ఆకర్షవంతమైన, ప్రతిభావంతమైన రచనలతో వెలువడేవి. విశ్వనాథ సత్యనారాయణగారు కూడా కొంతకాలం సాహితీసమితి సభ్యులుగా వుండేవారు. ఆ రోజుల్లోనే ఆయన "గిరికుమారుని ప్రేమగీతాలు" మొదలైన రచనలు చేశారు. "సాహితి" పత్రిక అంతరించి "సఖి" అనే పత్రిక వెలువడే సమయంలో ఆయనకీ, శివశంకరశాస్త్రికి పొసగలేదు. తత్పర్యవసానంగా సత్యన్నారాయణగారు సాహితీసమితి నుండి విడిపోయి, "జయంతి" అనే మరొక ద్వైమాస పత్రికను స్వంతంగా నడపసాగారు. ఆరు చక్కని సంచికలు వెలువడిన తరువాత "జయంతి" నిలిచిపోయింది. నూతన కావ్యరచనా పండితులలో ఒకరైన విశ్వనాథ వారిప్పుడు రామాయణాన్ని రచిస్తున్నాడు. కవిత్వంలో ఛాందస పద్ధతులను వ్యతిరేకించి తెలుగు సారస్వత క్షేత్రంలో నాగలిపట్టి కొత్త సాలు వేసిన మరొక ప్రతిభాశాలి నండూరి సుబ్బారావుగారు. ఆ రోజుల్లో ఆంధ్ర సారస్వత రంగంలో గాలిదుమారం రేపిన "ఎంకి పాటలు" రచించారు.

సాహితీ సమితి సభ్యులలో చాలామంది గేయకవులయినప్పటికీ చిన్న కథలను రచించేవారు కూడా లేకపోలేదు. చింతా దీక్షితులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు ప్రభృతులున్నారు. కాని గేయకవులే ఎక్కువ పేరులో వుండేవారు. వారిలో ముఖ్యంగా ఇంద్రచాపంలాంటి మనోహరమూర్తి మన కృష్ణశాస్త్రి. ఆయన రచనలు అమితాకర్షణ శక్తికలవి. నాయని వారి రచనలలోనున్న అప్రయత్నకృతమైన ప్రతిభగాని, వేదులవారి రచనలోనున్న ధారాళతగాని కృష్ణశాస్త్రి రచనలలో కనిపించవు. అయినా కూడా కావలసిన ప్రతిఫలమిచ్చే పరిపూర్ణ శోభతో నిండి వుంటుంది ఆయన కవిత. కాని కృష్ణశాస్త్రిగారి కవిత్వం అసలు ప్రజానీకంలోకి వెళుతుందా అనేది సందేహాస్పదం. గురజాడపట్ల ఆయనకెంతో గౌరవభక్తులున్నప్పటికీ కృష్ణశాస్త్రి కవులకు కవేగాని ప్రజలకు కవికాదు.

సాహితీసమితితో పాటు యువ కవి మండలి, సారస్వతసమాజం, కవితా సమితి మొదలైన ఇతర సంఘాలు కూడా వుండేవి. కాని అవి ఏవీ కూడా సాహితీ సమితి స్థాయిని అందుకోలేకపోయాయి. 1930 ప్రాంతాలకు ఈ చిన్న చిన్న సంఘాలన్నింటినీ మింగివేసి నవ్యసాహిత్య పరిషత్తు ఉద్భవించింది. దానినొక తెలుగు సారస్వత పీఠంగా రూపొందించాలనే ఆశయంతో ప్రారంభించారు. దాదాపు ఆ స్థాయికి చేరుకొన్నట్లే కాని నిలబడలేకపోయింది.

కాశీనాథుని నాగేశ్వరరావుగారి "భారతి" పత్రిక వచ్చి ఆ రోజుల్లో నడపబడుతున్న చిన్న చిన్న సారస్వత పత్రికలనన్నింటినీ మింగివేసింది. "భారతి" ఈ నాటికి కూడా చక్కని సారస్వత మాసపత్రికగా నిలిచివుంది. దాని నడక ఇంకా మందకొడిగా వున్నా సారస్వత పత్రికలకుండవలసిన హుందాతనం, ఉదారత్వం ఉన్నాయి.

ప్రస్తుతం మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వుంటున్న పి.వి.రాజమన్నారు ఆ రోజుల్లో "కళ" అనే మరొక సారస్వత పత్రికను నడిపారు. కాని అది ఎక్కువరోజులు రాలేదు.

వీటన్నింటినీ మించి గుడిపాటి వెంకటచలంగారు స్త్రీ, పురుష సంబంధాలపై కథారచనను ప్రారంభించి పెట్టుబడిదారీ వర్గాన్ని దడదడలాడించసాగారు.

సత్యాగ్రహోద్యమంలో జైలుకి పోయివచ్చిన దేశభక్తుడు ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచించిన "మాలపల్లి" అనే నవల ప్రజా మన్ననలను పొందసాగింది.

మధ్య తరగతి ప్రజలలో సంచలనం బయలుదేరింది. సత్యాగ్రహోద్యమంల తీవ్రరూపం తీసుకుంటోంది. పరిపాలకులు హింసాకాండను అవలింబించారు. అప్పుడు "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే పాటతో ఆంధ్రదేశమంతా మారుమోగి పోయింది. దానిని రచించినవాడు గరిమెల్ల సత్యనారాయణ గారు. ప్రభుత్వం ఆయనను జైలులో పెట్టింది. ఆ పాటను నిషేధించింది. విషాదకరమైన విషయమేమంటే 25 సంవత్సరాలకుపైగా అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఆ పాటపై నిషేధం తొలగించబడలేదు. ఇంకా విషాదకరమైన సంగతేమిటంటే ఆ రచయిత నిత్యదరిద్రంతో బాధపడి ఈ మధ్యనే అసువులను కోల్పోయాడు.

దారిద్ర్యము, దురవస్థ ఇవే 1930-40 మధ్యకాలంలో మనదేశాన్ని ముఖ్యంగా ఆంధ్రదేశాన్ని గూర్చి చెప్పవలసిన మాటలు. మధ్యతరగతివారు క్రమంగా పేదవారైపోతున్నారు. నిరుద్యోగం విశ్వరూపందాల్చి తాండవమాడుతోంది. పెట్టుబడిదారీ దేశాలన్నీ ఆర్థక మాంద్యంలోపడి కొట్టులాడుతున్నాయి. ఒక్క సోవియట్ యూనియను మాత్రమే ఈ దురవస్థలు లేకుండా వుంది. ప్రణాళికాబద్ధమైన సోషలిస్టు ఆర్థిక విధానంతో ఆ దేశంలోని ప్రజలందరి జీవన ప్రమాణం నానాటికీ అభివృద్ధి చెందుతోంది.

ఈ పరిస్థితుల్లో తెలుగు రచయితలు, తమ చుట్టూ ఆవరించివున్న దారిద్ర్యాంధకారాన్నుండి బయటపడిన రష్యాలోవున్నటువంటి మంచి పరిస్థితులు కావాలని ఆశించడం సహజం కాదా? అలాంటి కోరికలు జనించుతాయనే భయంతోనే మరోవైపు నుంచి సోవియట్ యూనియన్‌పై నిందాపూరితమైన విషప్రచారం సాగింపబడింది. రష్యాను గూర్చిన సత్యం అతి జాగ్రత్తగా మరుగున పెట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. (ఉదా: అప్పుడు ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలరుగా వున్న కట్టమంచి రామలింగారెడ్డి గారు యూనివర్శిటీ లైబ్రరీలో ఉన్న రష్యాకు సంబంధించిన పుస్తకాలన్నింటినీ విద్యార్థులు చదవకుండా దాచివేశారు) రష్యాను మనకొక శత్రుదేశంగా చిత్రింపసాగారు. సరిగ్గా అప్పుడే యూరప్‌లో హిట్లర్ పెనుభూతం విజృంభిస్తోంది.

ఈ సందర్భంలోనే శ్రీశ్రీ "మహాప్రస్థానం" అనే గేయసంపుటి వివిధ పత్రికలలో వెలువడసాగింది. "ఆకలిమంటచే మలమలలాడే అనాధులందరు లేవండోయి" అని అంతర్జాతీయ కార్మికగీతం మారుమ్రోగింది.!. అదే సమయంలో "షురూ హువాహై జంగ్ హమారా" అనే భారతదేశంలో హరీంద్రుడు గర్జించాడు. "నేనొక పెనుతుఫాను" అంటూ నజ్రుల్ ఇస్లాంకవి విజృంభించాడు. ఈ యుద్ధ నినాదాలన్నీ మన తెలుగు కవుల చెవులలో ప్రతిధ్వనించాయి.

అభినవాంధ్ర కవిపండిత సమావేశం అను పేరుతో నవ్యసాహిత్య పరిషత్తు ప్రథమ సమావేశం బరంపురంలో జరిగింది. కొంపెల్ల జనార్ధనరావుగారి సంపాదకత్వం క్రింద ఒక సారస్వత త్రైమాసపత్రికను నడపడం, ఆయన అకాల మృత్యువాత బడటంతో ఆ పత్రిక అంతరించిపోవడం జరిగింది. నవ్యసాహిత్య పరిషత్తువారు ఒక సంపాదక వర్గంతో "ప్రతిభ" అనే పత్రికను ప్రచురించసాగారు.

1935-36 ప్రాంతాలలో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం నెలకొల్పబడింది. తెలుగు రచయితలలో అగ్రగామిదళం ఒకటి అభ్యుదయ రచయితల సంఘం వైపు మొగ్గింది. అప్పటికింకా నవ్యసాహిత్య పరిషత్తు నడుస్తూనే వుంది. కొద్ది సంవత్సరాలు గడిచాక ఆంధ్రదేశంలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. నవ్య సాహిత్య పరిషత్తు కార్యదర్శే వచ్చి అభ్యుదయ రచయితల సంఘ సమావేశానికి అధ్యక్షత వహించాడు.

నవ్యసాహిత్యపరిషత్తు అంతరించింది. రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఆంధ్రదేశంలో ఒక అపూర్వమైన సారస్వత సంచలనం బయలుదేరింది. 1920-30 మధ్యకాలంలో సాహితీసమితి ఎంత ప్రబలంగా వుందో అలాగే 1940 తరువాత కాలంలో అభ్యుదయ రచయితల సంఘం అత్యంత ప్రబలంగా వ్యాప్తిచెందింది. ప్రజానాట్యమండలి పేరుతో ఒక నాటక సమాజం బయలుదేరింది. సుంకర, వాసిరెడ్డిగార్లు రచించిన "ముందడుగు", "మా భూమి" నాటకాలను ప్రదర్శించుతూ ఆంధ్రదేశమంతటా ప్రఖ్యాతిగడించసాగింది. (అందులో "మా భూమి అనే నాటకాన్ని కాంగ్రెసు ప్రభుత్వం నిషేధించింది) ఆత్రేయగారి "గుమాస్తా" (ఎన్.జి.వో) నాటకం వాస్తవిక రచనలో కొత్తపంథాలను తొక్కింది. ఆరుద్ర, అనిసెట్టి, రమణారెడ్డి, సోమసుందర్ మొదలైన యువ రచయితలెందరో బయలుదేరి ఉత్తేజకరమైన రచనలు సాగించారు. జానపద సాహిత్యపద్ధతులలో కొత్త పోకడలు వచ్చాయి. ప్రజాహృదయాలలోకి నడకసాగించాయి.

నిద్రాణమై వున్న తెలంగాణమేల్కొంది. కాళోజీ, దాశరథిగార్లు గొంతెత్తి ఆ నూతన జాగృతిని ప్రతిధ్వనింపచేశారు. ఈ మధ్యనే పరమపదించిన సురవరం ప్రతాపరెడ్డిగారు తెలంగాణ ఆంధ్రసారస్వత పరిషత్తుకు మూలవిరాట్టు. దేవులపల్లి రామానుజరావు వగైరా మరికొందరు దానికి జీవం పోస్తున్నారు. తెలంగాణాల్లో రచయితల స్థానిక సంఘాలు అనేకం చురుకుగా పనిచేస్తున్నాయి.

ఇంతవరకు కరువు కాటకాలకు, అభివృద్ధినిరోధకులకు నిలయమనుకునే రాయలసీమ కూడా మేలుకుంటోంది. మహోజ్జ్వలమైన దాని చారిత్రక స్మృతులలో నూతన సంచలనం కనిపిస్తోంది.

ఆధునిక ఆంధ్రసాహిత్యం, నవలారూపంలో కాకుండా ఎక్కువగా చిన్న కథలు, గేయాల రూపంలో తన ఔన్నత్యాన్ని నిలబెట్టుకుంటోంది. గురజాడ చూపిన దారిని, ఈ రెండు రచనా పద్ధతులలోను తెలుగుకవిత పరిపూర్ణతను చేరుకుంటోంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆంధ్రప్రజలు జాగృతులయ్యేవున్నారు. స్వాతంత్ర్య దినోత్సవంనాడు మద్రాసు రేడియోలో ప్రసంగించిన తెలుగు రచయితలందరిలోను తెలుగు ప్రజలు జాగృతి ప్రతిబింబించింది. కాని మన ఆశయం ఇంకా దూరంగానే వుంది. ఎప్పటికంటే కూడా ఐక్యతను సాధించవలసిన ఆవశ్యకత ఈనాడు ఎక్కువగా ఉంది.

**(శ్రీశ్రీ వ్రాసిన ఇంగ్లీషు వ్యాసానికి శ్రీశ్రీ చేసిన అనువాదం)**

**1954 ఏప్రిల్**

**ఆంధ్రదర్శిని**

# II

# శ్రుతులు

వీణలో కవితా తంత్రి, ప్రత్యేకించి కావ్యాలు ప్రకటిస్తున్నాము. ఎంతో స్వాభావికమైన ఈ కార్యానికి  కాలమహిమ! నేడు సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చింది. కవులు గీతాలు రాస్తున్నారు. కాని ఎందుకు రాస్తున్నారో చెప్పలేకుండా ఉన్నారు. సంపాదకులు వాటిని ప్రకటిస్తున్నారు. కాని ఎందుకు ప్రకటిస్తున్నారో చెప్ప లేకుండా ఉన్నారు. పాఠకులు పాపం వాటిని చదువుతున్నారు.  కాని ఎందుకు చదువుతున్నారో చెప్పలేకుండా ఉన్నారు. యోగుల బ్రహ్మజ్ఞానం వంటిదే కవుల రసాన్వేషణం.

నువ్వెందుకు జీవిస్తున్నావు? అన్న ప్రశ్న వంటిదే నువ్వెందుకు పద్యాలు రాస్తున్నావు? అన్నది. దీనికి వ్యక్తులెందరో, జవాబులు కూడా అన్ని. Generalisations జీవితంలో వలెనే కవిత్వంలోనూ Misled చేస్తాయి. అందువల్లనే Objective Criticism నాకు నమ్మకం లేదు.

అయితే కావ్య రచనలను తూచి చెప్పడానికి ప్రామాణ్యాలేమిటి? ఏవీ లేవు. ఉన్నవన్నవి ఉన్నవనుకోవడం. Plus కీ Minus భేదం ఉన్నది. + Infinity కీ– Infinity భేదం లేదు. విమర్శనలు కొంతవరకు దారి చూపించుతాయి. అభిరుచిని తీర్చిదిద్దుతాయి. కాని కొంత దూరం పోయాక కళవళంతో మాయమైపోతాయి. ఎక్కడో చెప్పలేము. కాని తప్పకుండా మాయమై తీరుతాయి. అప్పుడు వ్యక్తిదే రాజ్యం. అంతర్లోకంలోనే అతడు జీవించాలి. తనమీదే తన కాధారం. చర్చలకిక్కడ స్థానం లేదు. రసానందం నీడలో గాలిమేడ.

అందుకే చర్చలంటే నాకు పరమ భయం. గెలవడం ఓడిపోవడం రెండు మాటలు కాని ఒక్కటే అర్థం. చర్చించి వాదం నిలబెట్టుకున్నామనీ జయించి ధ్వజం స్థాపించామనీ అనుకునే వాళ్ళందరినీ నేను చాలా అనుమానంతో చూస్తాను. వాఙ్మయాభిరుచులన్నీ కేవలం Fashions నేటి Fashions రేపటికి నిన్నటివైపోతాయి. సార్వకాలిక గుణాలు ఫలానివి అని ఎవ్వడూ చెప్పలేడు. సర్వజన రంజకత్వం మరు మరీచిక!! నువ్వు చెప్పినది నాకు నచ్చదు. నేను చెప్పినది నీకు నచ్చదు. మన ఇద్దరిలో ఎవరిది కాస్త గడుసుతనం హెచ్చో వాడు గెలుస్తాడు. ఇలాగే పార్టీలు. ఇలాగే సంఘాలు. ఇలాగే దేశాలు. రసంలోనూ ఇంతే. మతంలో ఇంతే. జీవితంలోనూ ఇంతే.

కాబట్టి నాకు ప్రత్యేక వ్యక్తుల పట్లనే గౌరవం ఉన్నది. నా హృదయం నిష్కల్మషంగా ఉంచుకోవాలని యత్నిస్తాను. ఆ హృదయం మీద ప్రతి గీతాన్నీ చేర్చుకుని చూస్తాను. ఏ మాత్రం స్పందనం తోచినా ప్రకటిస్తాను. ఇంతకంటె మరో ప్రామాణ్యం నేనంగీకరించడం నన్ను నేను మోసగించుకోవడం.

వ్యక్తులతో బాటు పద్ధతి కూడా కావాలి. కాని పద్ధతి వల్ల సైతం వ్యక్తిత్వమే ద్యోతకం కావాలి. అందువల్ల రచయిత మతం ఏదైనా నాకు పనిలేదు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి కవిత్వం నా కిష్టం. I hate his Imitators. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి కవిత్వం నా కిష్టం. I Scorn his fllowers ఒకప్పుడు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి తనం అనుకరించి రాసిన పద్యాలు నావి, ఇప్పుడు నా కసహ్యం కలిగిస్తున్నాయి. కాని అనుకరణకు శిల్పంలో స్థానం లేకపోలేదు. మరోక కవిని తలపించుతూ ఉన్నంత మాత్రం చేత ఒక పద్యం మంచిది కాకపోనక్కరలేదు. కాని స్వసత్వద్యోతకమైన ప్రత్యేకత వాఙ్మయంలో అన్నిటికన్న మిన్నగా ఉపాధేయమనీ అందువల్లనే కవికి ఉన్నత శిఖరాల మీద స్థానం దొరకుతునందనీ విస్మరించకూడదు.

మన పూర్వ కవులలో తక్కువ రకం వాళ్ళంతా అనుకర్తలే. ఇప్పటి వాళ్ళలో కూడా అనుకర్తలందరూ తక్కువ రకం వాళ్ళే అని తెలుసుకోవడం మంచిది. కవిత్వం ఒక సృష్టి అనుకొని స్థలాల నుండి అనుకోని విధాల ఇది సాక్షాత్కరిస్తుంది. జాగ్రత్త! ఇవాళ నువ్వు ఎవరూ కావు. రేపు మహాకవివి!

కవిత్వానికి మనవాళ్ళు కొన్ని చట్టాలు ఏర్పరిచారు. కొన్ని చట్రాలు కూడా. వీటి సహాయం వల్ల "కవులు కావచ్చు లెండి' అన్నారు. ఇవి ఎలాగు ఏర్పడ్డాయో ఇవి ఎందుకు పనికి రావో చెప్పనా?

ఉత్కృష్టమైన కళాకార్యాలు అన్నింటికి ఒక Symmetry ఉంటుంది. Symmetry ఉన్నవన్నీ ఉత్కృష్ట రచనలు కావు. ఈ స్వల్ప విషయమే అనేక వ్యాకరణాలకూ, అనేక చందశ్చర్యలకూ ( ఇంకా abstract గా పోతే) అనేక రసవివాదాలకూ కారణం. కుశాగ్రబుద్ధులైన విమర్శకులు మహా కావ్యాలను శ్రద్ధతో అధ్యయనించి సూత్రాలను, చట్టాలను ఏర్పరిచారు. ఈ పనిలో ఒక సుఖం ఉందని కూడా మనం అంగీకరించాలి. కాని ఈ సూత్రాలు అశాంత శిల్పిని బంధించలేవు. ఇవి ఒక కాలానికి కొక కాలానికి మ్రోడుపోతాయి. అప్పుడు శిల్పి వీటినన్నింటినీ నాశనం చేస్తాడు. వాటి శిధిలాల నుండి రచన - ఇది వరకు లోకం కని విని ఎరుగనిది - సంభూతమవుతుంది. అందువల్లనే A work of Art can never repeated . మరో తాజ్‌మహల్ కట్టడం కాని, మళ్ళీ శాకుంతలం రాయడం కాని అసంభవం.

Art for arts sake, Art for life's sake, చివరికి Art for my sake . ఇది చూసి లోకం ఏమనుకుంటుంది? ఈ Artist Johnnies శిల్పం, రసం ఆనందం అని పెద్ద కబుర్లు చెప్పి సంఘం మీద Parasitic జీవనం గడుపుతున్నారని, వీళ్ళు పడే సుఖానికి మన మెందుకు డబ్బిచ్చుకోవాలి అని. కష్టార్జితమైన డబ్బు కదా మరి?-

కాని నిజమయిన శిల్పి అనిర్వచ్యమున్నూ, అనుభవైకవేద్యమున్నూ అయిన ఆనందాన్ని పొందుతున్నాడు. మన Babbitts కూడా ఒక్కొక్కప్పుడు పంచి పెట్టగలుగుతున్నాడు. ఎంత

మర్యాదస్తులైనా సంఘం అంగీకరించిన పెద్ద కళాకారుల దగ్గర మాత్రం ఒదిగి ఉండి మిగిలిన శిల్పాల్ని పైకి కాకపోతే మనస్సులోనైనా తిట్టుకుంటూ ఉంటారు వీళ్ళల్లో చాలామంది దొంగతనంగా పది Jhonny walker సీసాలకు డబ్బు జల్లుతారు గాని ఒక సాహిత్య పత్రికకు చందా యివ్వడం వ్యర్థకృత్యమని భావిస్తారు

స్థూల దృష్టిని చూస్తే ఇది కవిత్వానికి కాలం కాదు కాబోలుననిపించుతున్నది. లోకాన్నే ఒక నిస్పృహా నిస్త్రాణా ఆవరించాయి. కవులు వడగొట్టుకొని పోతున్న ఈ కాలంలో కవిత గాలిలోనే హరించుకుపోతున్నది. పరిస్థితుల ప్రాతికూల్యం – ఇది పరిమాణ భేదంతో ఎప్పుడూ ఉంటున్నదే! – ఈ స్థితికి కారణభూతం అంటారు నిజమేమో!

ఏం రోజులివి! ఎంగిలాకు పత్రికలూ, ఏనాం పెళ్ళిళ్ళూ, కుక్క గొడుగు పార్టీలూ, దాలిగుంట బ్రతుకులూ! ఎటుచూసినా లక్కపిడత మనుష్యులూ కక్రపెండలం మనస్సులూ! పత్రికలన్నీ నీరసం, మనుష్యులందరూ గుల్లసరుకు అంతటా దగా, ఎవరిదీ రాజ్యం? కత్తిది – Cannon ది! Poison Gas ది! కళ్ళు మూసుకుంటే వెయ్యి రథచక్రాలు పోతాయి మనమీద నుండి.

ఈ అల్లకల్లోలంలో కవీ! ఎవరు వింటారు నీ పద్యాలు? 1914 జ్ఞాపకమున్నదీ? దేశ దేశాల నుండి నువు కలం వదలి కవచం ధరించి బయలుదేరావు. War to end war అనే కేకలు నిజమే అనుకున్నావు.

లోకానికి శాంతినిచ్చే రోజులు, ధర్మం స్థాపించే రోజులు, లోకానికి స్వర్ణయుగం సంపాదించడానికి కదిలిపోయావు యువ కవీ! ఇప్పుడు నువ్వెక్కడ? నీ భూతం మమ్మల్ని శపించుతున్నది. మేము మళ్ళీ వెనకటికి వచ్చాం. భయంకర కాలమేఘాల చీకటి నేడు. యువకవీ? ఎక్కడ నువ్వు? నీ అగత్యం వచ్చింది మాకు. నువ్వే దిగులుపడితే వెనకదీస్తే మాకు దారేమిటి?

నిజంగా ప్రపంచానికి కవిత్వమే కావలిస్తే ఇంతకంటే అదును లేదు. సాహసీ! నీ సందేశం కోసం విశ్వం తన చాతక వదనం తెరుచుకున్నది. నీ గానానికి మా వీణాతంత్రులు శ్రుతి సవరిస్తున్నాము. తలుపులన్నీ వివృతం చేసి ఉంచాము నువ్వు రావాలి. రావాలి. ఆరోహణావరోహణాలతో మంద్రం నుండి తారం దాకా ఉద్రేక ఝంఝ, ఉత్సాహ శంప ఉలుకెత్తించి ఉగ్రూతలూగించి జీవితాన్ని నక్షత్ర గోళాల రాగమాలా – ఆలాపనలతో హోరెత్తించుతావో, విశ్వకటాహంలో వ్రేగిపోతున్న కోటి కోటి మానవుల ఘోటు ఘోటు మని కొట్టుకునే విహ్వలత్వం, బాధలూ, విభ్రమత్వం, వ్యాధులూ, సకల మనో అవస్థలనూ Sublimate చేసి స్ఫటీకరణ చేస్తావో, నువ్వు ఎప్పుడు వస్తావో! ఎలాగ వస్తావో! నువ్వు Cyclone లాగో, Sulphuric acid లాగో గంధసింధురం లాగో గండభేరుండం లాగో రావోయ్! రావోయ్! యువకవీ! నవ కవీ!!!

**ముద్రణ: వీణ, మాసపత్రిక, మే, 1936 (తొలి సంచిక)**

# నా తొలి రచన

జ్ఞాపకం నుండి తుడుచుకు పోయిన సంగతులను జ్ఞాపకం తెచ్చుకోవాలని చేసే ప్రయత్నం నా మీద విధించుకుంటూ నా ప్రథమ రచన ఏద్రై వుంటుందా అని ఆలోచిస్తూ ఉన్నాను. మొట్ట మొదటిసారి కలం కాగితం మీద ఉంచి ఏదో రాయడమే ప్రథమ రచన కాదని నా ఉద్దేశం. దానికి వెనక ఇంకా ఏదో ఉంది. అది కవిత్వం అనండి, రసం అనండి, ఏదో ఉత్సాహం అనండి - అదేదో ఆకస్మికంగా నాలో ఒకమారు ఉప్పొంగింది. అంతవరకు నే నెరుగనివేవో నాలో తడుముకున్నానని ఇప్పుడు నాకు పొడగట్టుతున్నది. మహాసముద్రంలో హిమపర్వతంవలె మన సుప్త చైతన్యం మూడింట రెండువంతులు మట్టం కింద వుంటుందని మనస్తత్వవేత్తలు అంటారు. అందులో దాగివున్న అహంత నానావిధ లక్షణాలు ప్రదర్శిస్తుంది. స్వప్న సీమలలోనే దీని విహారం. స్వప్న జీవితాన్ని చులకన చెయ్యడం క్షమించరానిది. అలాగయితే మానవుని జీవిత ప్రమాణంలో మూడవభాగం నిద్రలోనే ఎందుకు గడిచిపోవాలి? నిద్రావస్థలో మనం యెంతో అసహ్యించుకునే స్వప్న ప్రపంచంలో ఎందుకు నిద్రాకాలం గడవాలి? అందులో అందరూ తమ బ్రతుకులో కొంతభాగం గడపక తప్పదు. కవులు అక్కడ సంచరించి సాహసించి సత్యాలను వెలికితెస్తారు. నిజమైన ప్రతిగీతం నిత్యనూతనం కావడానికి ఇదే కారణం. మొట్టమొదటిసారి నాకు పద్యం వ్రాయాలని బుద్ధి పుట్టినప్పుడు ఏదో కొత్తది కనిపెట్టినట్లే భావించాను. నేను వెతుకుతున్న గులేబకావళి నాకు దొరికిందనుకున్నాను. అతః పూర్వ సాహిత్యానికి అది అనుకరణం కాదు. తర్వాత తర్వాత సాహిత్యదృష్టి హెచ్చి, నాలాగే ప్రమాద ప్రయాణాలు చేసి అనుభవాలు సంపాదించి, విశేషాలు కనుక్కొని, మజాగా చెప్పినవారి పరిచయం పూర్వులదీ, నవ్యులదీ, కలిగిన పిమ్మట వాటికి తగినంత చేరువగా అనుకరణ చేస్తూ పోవాలని బుద్ధిపుట్టింది.

కావ్య రచనలో స్వాతంత్ర్యం, అనుకరణ, ఈ రెండూ పెనవేసుకొని ఉంటాయి. మూలస్థానంలో కవిత్వం విశుద్ధంగా ఉంటుంది. దరిమిలానే అనేక సాంకర్యాలు, శిశువు చిత్రలేఖనం ప్రారంభించినప్పుడు ఎవ్వరినీ అనుకరించడు. తర్వాత అతనికి కళలో శిక్షణ ఇవ్వదలచిన పెద్దలు అనుకరణ మప్పుతారు. ఈ కూజా, ఆ గొడుగు, ఆ ముక్కోణం, ఆ వర్తులం, పువ్వు, నవ్వు మొగం అన్ని ఆకారాలను అనుకరించడం నేర్పుతారు. దానివల్ల చిత్రకారునికి చెయ్యి తిరుగుతుంది. కాని హస్తాన్ని మస్తిష్కం పరిపాలిస్తుంది. హృదయం పరిపుష్టి చేస్తుంది.

అలాగే నేను ఏవో యతిప్రాసలు లేని పద్యాలు రాస్తుండడం చూసి మా నాన్నగారు నాకు 'సులక్షణసారం' కొనిపెట్టారు. ఛందస్సు ప్రథమపాఠం చెప్పారు. 'ఆది మధ్యావసానేషు యరతా యాంతి లాఘవం, భజసా గౌరవం యాంతి, మనౌతు  గురు లాఘవం, అనే ఫార్ములా ఆయన ముఖతా నేర్చుకున్నాను. అప్పటికి నా వయస్సు ఏడెనిమిది సంవత్సరాలకు మించి ఉండదు.

ఆ రోజుల నుండి ఎన్ని పద్యాలు రాశానో చెప్పను. అన్నీ తప్పులే. కాని ఒకసారి చేసిన తప్పు మళ్ళీ చెయ్యలేదు. అందరూ నా తప్పులు దిద్దేవారే. కొన్ని తప్పులు నాకు తప్పుగా తోచలేదు  అవి చెయ్యడానికి నాకేదో హక్కు ఉందనిపించింది. అందువల్ల నా వ్యక్తి చైతన్యం ప్రగాఢతరం అవుతున్నట్లు, నా రక్తం పరిశుభ్రమవుతున్నట్లు, నా బలం హెచ్చినట్లు స్పష్టంగా తోచింది.

ఇప్పుడిప్పుడు నా వ్యక్తి చైతన్యం సంఘ చైతన్యంగా మారుతోంది.

# నా కవిత్వం

## ఒకటి

చాలా కాలం క్రిందట - తారీఖు సరిగా గుర్తులేదు-సుమారు పదేళ్ళ క్రితం అనుకుంటాను - భీమవరంలో జరిగిన ఒక సభలో నా గీతాలు చదువుతున్నాను:

తలుపు గొళ్ళెం,
హారతి పళ్ళెం,
గుర్రపు కళ్ళెం
కాదేదీ కవిత కనర్హం!
ఔనౌను శిల్పమనర్ఘం!
ఒక మారిచటా, ఒక మారచటా....
నీ హృదయంలో నా హృదయంలో.
గంటలు, గంటలు!
గంటలు, గంటలు!
పోనీ
పోనీ
పోతే పోనీ
సతల్, సుతుల్ హితుల్
పోనీ,
రానీ
రానీ
వస్తే రానీ
కష్టాల్ నష్టాల్ కోపాల్ తాపాల్
వస్తే రానీ,
కానీ
కానీ

గానం, ధ్యానం
దారి పక్క చెట్టు కింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసిల్దాకతె
మూలగుతూ ముసురుతున్న
ఈగలతో వేగలేక

ఇలాంటివే ఏవేవో చదువుతున్నాను. వెనక నుంచి ఎవరో కుర్రాడు "ఓస్ – ఇలాంటి కవిత్వాలు నేను రాయగలను." అనడం వినబడింది. ఆ మాటలో "ఇదీ ఒక కవిత్వమేనా?" అనే ఈసడింపు ఉందేమో నాకు తెలియదు. కాని "ఇలా రాయడం చాలా సులువైన పని," అని మాత్రం సారాంశం తేల్చాడు ఆ నాటి నా వ్యాఖ్యాత. దాన్ని నాటికి నేటికి ఒక ప్రశంసగానే స్వీకరిస్తున్నాను. ఆ కుర్రాడెవరో ఇప్పటికీ నాకు తెలియదుగాని అతని యాదృచ్ఛిక విమర్శ, కవిత రచనమీద నాకున్న విశ్వాసాన్ని మరింత బలపరిచింది. ఔను, కవిత్వం చెప్పడం ఒక కష్టమైన పని కాకూడదు. కష్టమైన పనులే ఘనమైన పనులనుకొనే మనస్తత్వమే మన కష్టాలన్నింటికి కారణం. సౌలభ్యం, జీవితంలో – కవిత్వంలో సౌలభ్యం, ఇంకా సౌలభ్యం ఇదీ మనకు కావాలి.

జీవితంలో సౌలభ్యం లేనంతకాలం కవిత్వంలో సౌలభ్యం సాధించే ప్రయత్నమంతా కష్టభూయిష్టమే. జీవించడమే కష్టమైన కాలంలో కవిగా జీవించడం మరీ కష్టం. నిజానికి ఊపిరి పీల్చడం ఎంత సులభమో కవిత్వం చెప్పడం కూడా అంత సులభమే. కాని ఎంతమంది ధారాళంగా ఊపిరి పీల్చి బతకగలుగుతున్నారు. అడుగడుక్కీ ఎన్నో అభ్యంతరాలు, ఆందోళనలు, మానవుడి జీవితం కష్టపరంపరల జాబితా, దుఃఖ సమూహాల తోరణం. ఎవరైనా కవి, శాస్త్రజ్ఞుడు, రాజకీయవాది ఎక్కడైనా సౌలభ్యాన్ని సాధించాడంటే దాని వెనుక ఎంతో శ్రమ, తపన, అన్వేషణ అడిగి ఉంటాయి.

చీకటి గదిలో చిన్నమీట నొక్కగానే విద్యుద్దీపం వెలిగి గదినంతటినీ కాంతివంతం చేస్తుంది. మిక్కిలి సులువుగా కనిపించే ఈ చిన్న పనికి వెనక ఎంత మానవ ప్రయత్నం ఇమిడి ఉందో వేరే చెప్పాలా! ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. ఇటువంటివి ఎన్నైనా ఇవ్వవచ్చును. న్యూటన్ పండితుడు చెట్టు మీద నుంచి కిందకు రాలిపడ్డ పండును చూచి గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని చేశాడంటారు. కాని న్యూటన్‌కి ముందు ఎంతమంది ఆ దృశ్యాన్ని చూడలేదు? ఏకాగ్రతలో ఒక ముఖ్యమైన సమస్యకు పరిష్కారాన్ని అన్వేషిస్తున్న న్యూటన్ పండితుడికి ఈ దృశ్యం సరియైన మార్గాన్ని సూచించింది అంతే.

సునాయాసంగా నేలనుంచి లేచిపోయి గాలిలో ప్రయాణం చేసే విమానాన్ని చూసి ఈనాడు మనం ఆశ్చర్యపడకపోవచ్చును. ఏభై ఏళ్ళ కిందట ఎవరైనా ఆకాశంలో విహరించడానికి అవకాశం ఉందంటే అతణ్ణి చూసి అందరూ నవ్వేవారే అని అనుకోవచ్చును. గణాలు లేకుండా పద్యాలు రాయడానికి వీలుంది అంటే ఇది వరక కొంతమంది ఎగతాళి చెయ్యలేదూ? కాని గణాలు లేని పద్యాలకు కూడా కొన్ని నియమాలు లేకపోలేదు ఈ )యమాలు గణబద్ధచ్ఛందస్సులకు చెందిన నియమాలు కావు. ఒక్కొక్కప్పుడివి వెనకటి )యమాలకు కేవలం వ్యతిరేకంగా కూడా ఉండవచ్చును. వెనకటి కొలబద్దలను తెచ్చి వీటిని )లువ కట్టడానికి ప్రయత్నించకూడదు. వెనకటి జలాంతర్గమి అనుసరించే నియమాలతో )మానం కట్టుబడే ధర్మాలను కొలవకూడదనే నే ననేది.

జీవితంలోనూ కవిత్వంలోనూ సంప్రదాయ వాదానికి, విప్లవ వాదానికీ మధ్య ఎడతెగని పోరాటం ఎప్పుడూ సాగిపోతూనే ఉంటుంది. నిన్నటి విప్లవవాది నేటి సంప్రదాయవాదిగా ఘనీభవించడం కూడా మనం చూస్తూ ఉన్నదే. యతిప్రాసలు వదిలిపెట్టవచ్చు గాని గణాలు కూడా వదిలిపెట్టడమే! అమ్మో! అనే సాహిత్య సంస్కర్త – వితంతువుకి పునర్వివాహం చెయ్యవచ్చు గాని ఆడది అసలే పెళ్ళి మానేస్తే ఎలాగ అయ్యో! అనే సంఘసంస్కర్త వంటివాడే! ఇటువంటివారే కొన్ని కొన్ని నియమాలు ఉపదేశిస్తూ ఉంటారు. వీరి ఉపదేశాల కోసం వాడుకభాష ఉద్యమం వేచుకొని ఉంటే కాదూ!

ఛందస్సుకీ, వ్యాకరణానికీ, అలంకారాలకీ, అన్నింటికి అవతల స్వచ్ఛమూ స్వచ్ఛందమూ, నీరసమూ నిరూపమూ అయిన కవిత్వ పదార్థం ఒకటి ఉంది. ప్రతి కవీ దాన్ని అందుకోవడానికే ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నానికి స్వాతంత్ర్యాభిముఖంగా జీవితం చేసే ప్రయాణానికి భేదమేమీ లేదు. సంపూర్ణ స్వాతంత్ర్యం ఎలాగయితే ఒక ఆదర్శప్రాయంగానే ఉండి యెన్నటికీ అందుకోరానిదో అలాగే అచ్చ కవిత్వం కూడా ఎంతవాడికి అందరానిదే. కవిత్వమూ, స్వాతంత్ర్యమూ ఎవ్వరికి ఎప్పటికీ అందని అందాలే అయినప్పటికి వాటిని సాధించాలనే ప్రయత్నంలోనే, ఆ ప్రయత్నంలోని ఆవేగంలోనే, ఆ వేగంలోని అశాంతిలోనే, అశాంతిలోని ఆనందంలోనే ఉంది.

వేళకాని వేళలలో
లేనిపోని వాంఛలలో
దారికాని దారులలో
కానరాని కాంక్షలతో
దేని కొరకు దేని కొరకు

దేవులాడుతావ్
ఆకటితో అలసటతో
ప్రాకులాడుతావ్
దేని కొరకు దేని కొరకు
దేవులాడుతావ్
శ్రీనివాసరావ్
అనినేనొకమారన్నాను.

ఇప్పుడు నేను చదివిన గీత భావం Free Vers కాదు దీనికి ఛందస్సు ఉంది. యతిప్రాసలున్నాయి. అక్కడక్కడ Vers Libre నియమాలు వేరు. దీనికి రెండు ఉదాహరణలు ఇస్తాను. ఒకటి "కవితా ఓ కవితా!" అనే నా రచన నుంచి

కవితా ఓ కవితా
నా యువకాశల నవపేశల
సుమగీతావరణంలో
నిను నే నొక సుముహూర్తంలో
అతి సుందర సుస్యందనమందున
దూరంగా విను వీధుల్లో విహరించే
అందని అందానివిగా భావించిన రోజుల్లో
నీకై బ్రదుకే ఒక తపమై
వెదుకాడే నిమిషాలందు నిషాలందున
ఎటునే చూచిన మటుమాయపు నటనలలో
నీ రూపం కనరానందున
నా గుహలో కుటిలో చీకటిలో
ఒక్కడనై క్రుక్కిన రోజులు లేవా!
యువకాశల
నవపేశల............
నిమిషాలందు నిషాలందున...... . ....

గుహలో, కుటిలో, చీకటిలో అనుప్రాసలూ, సజాతీయ శబ్దాలూ, పడిగల నడకా.

అగ్ని సరస్సున వికసించిన వజ్రం
ఎగిరే లోహశ్యేనం
ఫిరంగిలో జ్వరంధ్వనించే మృదంగ నాదం
ఇంకా నేనేం విన్నానా?

అన్ని కొన్ని దృశ్యాల, రూప చిత్రాల జాబితా, దీనిని Catalogue Poertry అని ఒకాయన అన్నాడు. ఆ మాట కొత్తది కాదు. Eliot, Auden మొదలైన కవులు ఈ Evocative పద్ధతిని అవలంబించారు. వేదాలనాటి నుంచి నేటిదాకా Evocation అనేది కవిత్వపు ముఖ్య లక్షణాలలో ఒకటి.

అనాఘ్రాతం పుష్పం కీసలయమలూనంకరరుహై రనావిద్ధం రత్నం.
"ఇయం గేహే లక్ష్మీ రియమమృతవర్తిన్నయనమో:
ఘనసోపాంసులవ్
తలిరుల శయ్యలన్
సలిల ధారల
చందనచారు చర్చలన్."
'మరుదీశద్విపదాన శోభ శిఖి ధూమ్యారోచి కీనాశకాసర దేహప్రభ
'ఇది మనోహర కాంతికింపైన బింబంబు
బింబంబు కాదిది బెడుగుకెంపు
కెంపుకాదిది తేటి యొంపనిమంకెన'.

ఇక్కడ మనస్సు నాకర్షించేది ఛందస్సు కాదు. వరుసగా ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చే Images ఒకా mood నొక మానసికావస్థను ఒక ను సృష్టిస్తాయి. సినిమా ప్రపంచంలో Pudovkin Eisensteinలు కనిపెట్టిన montage techniqueకి ప్రాతిపదిక ఇదే. ఉత్తర రామచరిత్రలో సీతాదేవి చిత్రపట సందర్శనం. అనిరుద్ధ చరిత్రలో ఉషకు చిత్రలేఖ నానా రాజకుమారుల చిత్రపటాలు చూపించడం మనం ఎరగనివి కాదు.

Poetry is evocation అయితే ఒక్క Evoction మాత్రమే కాదు. కాని ఒక జాబితా ఇవ్వడం అనాదినుంచీ కవులు అవలంభించిన ఒక ముఖ్యపద్ధతి.

ఛందస్సు నుంచి స్వాతంత్ర్యాన్ని కోరడంలో కవి రసావిష్కరణకు కావలసిన కొన్ని మూల ద్రవ్యాలను సంతరించుకుంటాడు. ఈ మూలద్రవ్యాలు ఉన్నంతకాలం కవిత్వానికి ఛందోరాహిత్యం ఒక లోపం కాదు.

వచనం నడుస్తుంది. కవిత్వం పరిగెడుతుంది. వచనం చేత పరిగెత్తించి దాన్ని కవిత్వం చెయ్యవచ్చును. అప్పుడు వచనంలోవలె, లేదా గణితశాస్త్రంలో వలె అన్ని మెట్ల మీదా అడుగు వెయ్యనక్కరలేదు. ఒకానొక కాలానికీ, స్థలానికీ సంబంధించిన దృశ్యం నుంచి వెంటనే ఇంకొక స్థలకాలాల దృశ్యానికి గంతువేసి ఒప్పించుతుంది కవిత్వం. T.S. Eliot రాసిన Waste Landలో ఇందుకు చాలా సందర్భాలున్నాయి.

ప్రతీమాటకీ, ఒక కొలతా, ఒక బరువూ ఉంటాయి. రెండు మాటలను సరియైన, ఉద్దిష్టమైన అర్థం వచ్చేటట్లు కలపడం చాలా కష్టం. కొన్ని మాటలను ఒక వాక్యం చెయ్యడం, వాటితో ఒక పద్యం, కొన్ని పద్యాలతో ఒక ఆశ్వాసం, కొన్ని ఆశ్వాసాలతో ఒక కావ్యం.

కాని ఒక కావ్యం యొక్క ప్రశస్తి దాని పరిమాణం మీద ఆధారపడదు. వెయ్యి పద్యాల చెత్తకంటే ఒక పనివాడితనంతో కూడిన భావగీతం గొప్పది. A long poem is a contradiciton in terms అని Edgar Allan Poe ఇందుకే అన్నాడనుకుంటాను. Lyric గొప్పదా? Epic గొప్పదా? అనే వివాదంలోని కిప్పుడు నేను ప్రవేశించను. కానిదీర్ఘతతో నిమిత్తం లేకుండానే ఒక మహాకావ్యం ఇచ్చిన ఆనందాన్ని ఇవ్వగల చిన్న గీతం రాయవచ్చునంటాను. పరమాణువులకీ బ్రహ్మాండానికి ఆకారంలో ఏమీ భేదం ఉంది!

కవిత్వం పరిగెడుతుందన్నాను. ఈ వేగాన్ని సాధించే ఒక ఉపాయం ఛందస్సు. ఛందస్సు సహాయం లేకుండా కూడా ఈ వేగాన్ని తీసుకురావచ్చు. ఉత్తమమైన Prose Poems అన్నింటిలో ఈ గుణం కనబడుతుంది. అను ప్రాసలవల్లను, ఒక మాటగాని, కొన్ని మాటలను గాని పునశ్చరణ చెయ్యడం వల్లను, యమకంవల్లను, వ్యాకరూపాన్ని మార్చడం వల్లను వచనగీతంలో ఈ గుణాన్ని సాధించవచ్చును. ఇందుకుగాను కవికి మాటల యొక్క కొలత, బరువు, ఒరువు texture బాగా తెలియాలి. మాటలో నుంచి ఎంత అర్థం పిండడానికి వీలుందో అంతా పిండుకోగలగాలి. వాటిని ఏ రకంగా అమర్చితే ఎక్కువ effect తీసుకు రావచ్చునో తెలిసి ఉండాలి. అందుకే ఒక భాషలోని కవిత్వాన్ని ఇంకో భాషలోనికి తర్జుమా చెయ్యడం కష్టం. Charmed magic casements opening on the foam of perilous seas by fairy lands forlorn అనే కిట్స్ పద్య పాదాలకు ప్రతి పదార్థం చెప్పుకోగలంగాని మళ్ళీ ఇంకో భాషలోకి మార్చలేము.

నేను ఉదాహరించదలిచిన రెండో వచన గీత భాగం "వ్యతాసం" అనే నా రచన నుంచి.

మాకు గోడలు లేవు.

గోడలు పగలగొట్టడమే మా పని.

ఇది కవిత్వంగా అంగీకరించమని అడగడం సాహసంగా కనబడవచ్చును. యతిప్రాసలూ, గణాలూ లేకపోతే మానిపోయె, కనీసం ఇందాకా నువ్వు చెప్పిన యమకం, అను ప్రాసాల్లాంటివేనా లేవు. దీన్ని కవిత్వం అనగలమా అని చాలామంది ఎదుర్కోవచ్చును. నేను కూడా లాలిత్యం, మాధుర్యం మొదలైన కవిత్రా ద్రవ్యాలను గురించి కలలుకనే రోజులలో ఈ నగ్నపద్యాల సముదాయాన్ని కవిత్వం అనకపోయి ఉండేవాడిని. ఇటువంటిది కవిత్వం కాజాలదనే వాళ్ళు అలా యెందుకంటారో నేను ఊహించుకోగలను. కాని నా దృష్టి నుంచి ఇది ఎందుకు కవిత్వం అనుకోవాలో గ్రహించండి అని అట్టివారిని అడగవలసి ఉంది.

బైబిలులోని అన్ని గీతాలలోకి చిన్నది ఒకటి.

Jesus wept అనేది. దీన్ని నేను కవిత్వంగా అంగీకరించడం మానలేను. కిందటి యుద్ధంలో Battle of stalingrad అనే వార్తా శీర్షికను వరుసగా ఎన్నో రోజులు పత్రికలో చదివి ఉంటాను. అన్నిసార్లూ నాకు ఈ మూడు మాటలు ఎంతో ఉద్వేగాన్ని కలిగించాయి Willam saroyan తన నాటకం ఒక దానిలో ఒక కవిని ప్రవేశపెడతాడు. అతడు వ్రాసేవి అన్నీ ఏకపద మహాకావ్యాలు. సముద్రం అంటాడు. అదే ఒక కావ్యం. ఆకాశం ఇంకో కావ్యం, చుంచు వృక్షం ఇత్యాది. ఇందులో కొంత వేళాకోళం లేకపోలేదు. అయితే ఇందలి పరిహాసాన్ని కాస్తా వడబోసి చూస్తే చాలా నిగ్గు నిజమైనది తేలకపోదు.

నా గేయాలను చాలామంది వచన గీతాలనుకొని పొరపడ్డారు. కాబట్టి వచనగీతం గురించి ఇంత విపులంగా ముచ్చటిస్తున్నాను. ఇందు విషయమై చెప్పవలసింది ఇంకా ఉన్నది. ఇతరులలో నుంచి కూడా ఎన్నో ఉదాహరణలు ఇవ్వాలి. క్లుప్తంగా మాత్రం చెప్పి ఈ విషయం ముగిస్తాను.

Walt whitman గీతానికి Ezra pound వచన గీతానికి చాలా తేడాలున్నాయని ఒక విమర్శకుడన్నాడు. అలాగే నారాయణబాబు వచన గీతానికి పఠాభి వచన గీతానికి భేదం ఉంది. ప్రతి వచన గీతాన్ని దేన్ని దానికి విశ్లేషించి సమాలోచించాలి. చాలా వచన గీతాలు good poetry కాక bad prose మాత్రమే. కంద పద్యాన్ని కుంటించితే వచనగీతం కాదు. ఛందోగమనం రైలు బండి నడకయితే వచన గమనం విమాన విహారం వంటిది.

జంతు పరిణామ నిశ్రేణిలో సరీసృపానికి, పక్షికి నడుమ Archaeopteryx అనే ప్రాచీన పక్షి ఒకటి ఉండేది. దీనిని సరీసృప లక్షణాలు కొన్ని, పక్షి లక్షణాలు కొన్ని అలాగే ఛందో గీతానికి వచన గీతానికి మధ్యస్థంగా నిలిచేవి కొన్ని, ఉదాహరణలకు.

ఎగిరించకు లోహ విహంగాలను
పలికించకు మౌనమృదంగాలను ఉండనీ
మస్తిష్క కులాయంలో,
మనో వల్మీకంలోః

ఇందులో మొదటి రెండు పాదాలూ సమాన ధైర్యం, ఒకే నడక కలిగినవి. ఆఖరి రెండు విషమపాదాల మధ్యని "ఉండనీ" అనే మాట రెండింటినీ వేరు చూస్తోంది.

దువ్వూరి రామిరెడ్డి గారి నైవేద్యం సంపుటిలో కాబోలు ఒక Prose poem ఉంది. అడవి బాపిరాజుగారు కురుక్షేత్ర యుద్ధం అని Polyphonic లో రాశారు. శిష్టా ఉమామహేశ తన విష్ణుధనువులో ఈ Prose విరివిరిగా ఉపయోగించాడు. ముద్దుకృష్ణ జ్వాలలో కొంత Free Verse రాశాడు. అతని "త్రిశతి" ఇప్పటికీ ప్రకటితం కాలేదు గాని అందులో Prose Poem కి చాలా ఉదాహరణలున్నాయి.

ఇదంతా 1930 -35 మధ్యన. అది నా కవితాయాత్రలో ప్రధానఘట్టమే కాని...ప్రథమ ఘట్టం కాదు. ఎందువల్లనంటే అప్పటికి చాలా సంవత్సరాల క్రితం నుంచి నేను పద్యాలు రాస్తున్నాను. 1920 నుంచి 1930 దాకా సాహితీ సమితి సాహిత్య రంగాన్ని పరిపాలించింది. ఆ రోజులలోనే నేనూ, పురిపండా, కాళూరి నరసింగరావు, నారాయణబాబు మొదలైనవాళ్ళం కవితా వ్యాసంగం చేసేవాళ్ళం. కాళూరి నరిసింగరావు దీర్ఘమైన గీతమాలికలూ, ద్విపదమాలికలూ రాసేవాడు. వాటికి వెంకట పార్వతీశ్వరకవులది ఒరవడి. వృత్తాలలో కాళూరిది అందెవేసిన చెయ్యి. ప్రబంధాలూ, రాయప్రోలు, అబ్బూరివారల రచనలూ కాళూరి వృత్తాలకు ప్రోద్బలం. అతని పద్యం ఒకటి.

ఈ విపినాంతరాస్ఫుట సితేతర గర్భ నవీనభావ
భాగ్యావరణమ్ములై తిరుగులాడెడి నీడల నీలిమేడలన్
నా విరహైక వేదనల నాటకరంగములంచు వ్రాలెడిన్
దేవ వధూకటాక్ష మృదు దీధితులీ నునుంసోగ వెన్నెలల్.

కవితా సమితిగా గుమిగూడి మేముందరమూ విశాఖపట్టణం జిల్లా నుంచి కొంత సాహిత్యం యెగుమతి చేసేవాళ్ళం. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు మా అధ్యక్షుడు. పూడిపెద్ది రమణయ్యగారిని కవిగా కథకునిగా గౌరవించేవాళ్ళం. ఆచంట సాంఖ్యాయన శర్మ, సెట్టి లక్ష్మీ నరిసింహం మున్నగు వయో వృద్ధులంతా మా సమితి సభ్యులు. పురిపండా, వడ్డాది సీతారామాంజనేయులు, నేనూ కలిసి ఒక రోజు కవితా సమితి స్థాపించాం. పురిపండా దానికి అఖిలంధ్రఖ్యాతి తీసుకొచ్చాడు. అతని సంఘటనశక్తి అమోఘం. కవితా సమితి తొలినుంచి అతని భుజస్కంధాలమీదనే సాగింది.

1928లో నేను మొట్టమొదటిసారి మద్రాసులో కొంపెల్ల జనార్ధనరావును కలుసుకున్నాను. ఆయేడే నా "ప్రభవ" ఖండకావ్య సంపుటి ప్రకటితం. ఆంధ్ర సాహిత్య పత్రిక దీన్ని అనుకూలంగా విమర్శించింది. భారతిలో జనార్ధనరావు తలచుకుంటే దాన్ని అధఃపాతాళానికి అణగద్రొక్క గలిగి ఉండును. ఇందులో "సార్థకత కంటె సమానతత్పరత ఎక్కువగా గోచరించుచున్నది" అని వదలి పెట్టివేశాడు.

ప్రభవ నుంచి ఒక sample-

అలఘుధ్వాంత వితాన సంభరితరోదోంతర్మహా గహ్వర
స్థలియంభో నిధియయ్యె సంతతజల స్రావాతి రేకంబునన్
విలయాంభోదరఘోష......

పూర్తి చెయ్యనక్కరలేదు. జనార్థనరావు విమర్శ సరియైనదే అని స్పష్టమే ఇద్దరమూ విశ్వనాథ సత్యనారాయణ భక్తులం. కాని ఇద్దరికీ సొంత గొంతుక వెదుక్కునే తహతహ అపరిమితం. అప్పటి మా రచనలన్నీ Second rate poetry అని మాకు బాగా తెలుసును. ఈపద్యంలో విశ్వనాథ Influence ఇంకో కృష్ణశాస్త్రిది. ఇంకో దానిలో ఇద్దరిదీ, ఈ విధంగా ప్రతి గీతాన్ని మమ్మల్ని మేము మోసగించుకోకుండా తీవ్రంగా విమర్శించుకొనేవాళ్లం మా చర్చలలో మల్లవరపు విశ్వేశ్వరరావు కూడా చేరేవాడు. అతడు కృష్ణశాస్త్రి అనుయాయి. ముఖ్యంగా గేయచ్ఛందస్సులు అతని పొలం.

1928 నుంచి 30 వరకు చెన్నపట్నం క్రైస్తవ కళాశాలలో నేను బి.ఏ., చదువుతున్నాను. ఆ రోజులలోనే ఆధునిక కవులనేకులతో నా పరిచయం. '29 లో కాళూరి బి.ఎల్. కు చెన్నపట్నం వచ్చాడు. ట్రిప్లికేన్ బీచి మా సంకేతస్థానం. తెలుగులో భావకవిత్వం, ఇంగ్లీషులో షెల్లీ, కీట్స్ ఇత్యాదుల కవిత్వం. కృష్ణశాస్త్రి, వేదుల మా అభిమాన కవులు. హృదయేశ్వరి మా ఉద్గ్రంథం, తెలుగు కవిత్వంలో స్వర్ణయుగం ప్రవేశించిందని భారతిలో ఎవరో రాసిన విమర్శలతో మేము ఏకీభవించాము.

Shelly, Tagore, రాయప్రోలు, కృష్ణశాస్త్రి అదీ వరస! రాయప్రోలు పక్కన అబ్బూరి, కృష్ణశాస్త్రి ప్రక్కన వేదుల, నండూరి ఎంకిపాటలు, విశ్వనాథ -నాయని! వీరూ మా కవులు. బసవరాజునీ కవి కొండలనీ కవులనడం కరుణించి. గురజాడ కవిగా మా దృష్టిలోనే లేడు. మనుచరిత్ర చదివితే మహాభారతం యెందుకూ?

1929లో నేను "సుప్తాస్థికలు" రాశాను. దానితో నాలో ఒక ఘట్టం పూర్తి అయింది. ఇంకో ఘట్టం ఇంకా ప్రారంభం కాలేదు.

**రేడియో ప్రసారితం**

**ముద్రణ :ఆంధ్రశిల్పి, మాసపత్రిక, జనవరి -ఫిబ్రవరి 1947**

# రెండు

క్రిందటిసారి మాట్లాడి వదలిపెట్టిన చోటి నుండి ప్రస్తుతపు నా ప్రసంగాన్ని ప్రారంభించడానికి ముందు...

సరే ఈ వాక్యాన్ని పూర్తి చెయ్యడం ఎందుకు. ఎలాగూ శ్రోతలు నేను చెప్పబోయేదాన్ని వినబోతున్నారు కదా...

ఒక వాక్యాన్ని పూర్తి చెయ్యకుండా ఇంకో వాక్యాన్ని ప్రారంభించకూడదా. నిజమే! కాని ఒక్కొక్కప్పుడు వాక్యం పూర్తికాకముందే వక్తవ్యం పూర్తి అయిపోతుంది. అటువంటప్పుడు వ్యాకరణ మర్యాదను పాటించడానికి వ్యర్థ పదాలను వాడవలసి వస్తుంది. మన మర్యాదలు చాలావరకు ఇలాంటివే, ఓహోః మీరా? బాగున్నారా? ఉద్యోగం? పిల్లలు? ఇందులో ఒక్కటి మనస్ఫూర్తిగా పలికేది కాదు. అయినప్పటికి ఎదటివాణ్ని సంతోషపెట్టడానికి ఈ మాటలు అనితీరాలి. ఎదటివాడు కనుచాటుకాగానే పీడ వదిలింది అనుకున్నా సరే.

వాక్యం లాగే పద్యం. పద్యానికి కూడా కొన్ని మర్యాదలున్నాయి. వాటిని సంతృప్తి పరచుకుంటూ కవి నిశ్చితంగా బతకవచ్చును. నేనెరిగిన ఒకాయన కవిత్వం అంటే చెవి కోసుకుంటాడు. అంటే – అదే, కవిత్వం అంటే ఆయనకు చాలా అభిమానం. చక్కని గొంతుకతో సాఫీగా పద్యాలు చదువుతూ ఉంటే ఆయన ఒళ్ళంతా కళ్ళు చేసుకొని – చూస్తూ – కాదు, వింటూ ఉంటాడు. ఎక్కడైనా యతిపోయినా, ప్రాసజారినా, వ్యాకరణపు సీల ఊడినా – హఠాత్తుగా తేలు కుట్టినప్పటికన్నా ఎంతో బాధపడతాడు. ఇవన్నీ పద్యం యొక్క భావ్యాస్వరూపం అని ఆయనకి నచ్చచెప్పడానికి నేను చాలా ప్రయత్నించాను. గొప్ప కవులు తాము చెప్పినదానికంటే చెప్పకుండా వదిలిపెట్టినచోట్ల అమూల్యమైన నిధులు దాస్తూ ఉంటారన్నారు. ఆయన ఒప్పుకుంటేనా? నేను చెప్పేది "కేవలం రజ్జుసర్పభ్రాంతిరా అబ్బాయీ!" అనేస్తాడు. (నాకంటే ఆయన నాలుగయిదేళ్లు పెద్ద – అదీ వొచ్చిన ఇబ్బంది). 'తాతగారూ! సర్పరజ్జు భ్రాంతికి కూడా అవకాశం అందులోనే ఇమిడి ఉంది సుమండీ' అని నాకు అనాలని అనిపిస్తూ ఉంటుంది.

ఇంతకూ కవిత్వం గురించి ఇదమిద్ధమని ఎవ్వరూ చెప్పలేరు. కవిత్వం ఒక జబ్బు. అది పడ్డవాడికే దాని సంగతి తెలుస్తుంది. అదయినా పూర్తిగా కాదు. ఆ జబ్బు పడి దానితోనే

కొందరు మరణిస్తారు. అటువంటి వారిని స్మరించి నా తలను నమ్రంగా వంచుకోవడం తప్ప ఇంకో అభినయం ఏది చేసినా అంతకన్న అపచారం మరోటి ఉండబోదు.

కన్యాశుల్కంలో ఒక చోట కొంతమంది అజ్ఞానులు (లోకం దృష్టిలో) సారాకోట్లో కూర్చుండి శాస్త్ర చర్చ సాగిస్తారు. సృష్ట్యాదినుంచి మానవుణ్ణి కలవరపరచిన సమస్యలనే వాళ్ళూ చర్చిస్తారు. ఒకడు అడుగుతాడు. "ఆకాశం ముందా? బూమిఁముందా?" అని, మనవాళ్ళయ్య అనే ఒక సాతాని, "గణితశాస్త్రంలో ఆకాశంబన శూన్యంబు అనగా ఏమీ లేదన్నమాట" అని జవాబిస్తాడు. వీరేశ అనే జంగానికి కోపం వస్తుంది. "ఏటీలేదా గుడ్డోళ్ళకి ఏటీలేదు" అంటూ "ఉన్నది" అనే భావానికి కొన్ని ఉపనిషత్తులు చూపిస్తాడు. కొంతసేపు ఈ అస్తినాస్తి విచికిత్స సాగుతుంది. మనవాళ్ళయ్యకి తాత్కాలికంగా వాగ్బంధం అవుతుంది. విజయసూచకంగా "గురూజీ"కి కోపం వస్తుందని దుకాణదారు యుద్ధ విరామసంధి చేయిస్తాడు. చర్చ మళ్ళీ సాగిపోతుంది. ఈసారి సాక్షాత్తూ శివ విష్ణువులే చర్చనీయ విషయాలవుతారు. "ఎందుకు పోట్లాట భాయీ! నీ శివుడూ నిజమే. ఇదిగో ఈ సీసాలో వెలుగుతున్నాడు" అనే వాక్యాలతో మళ్ళీ రాజీ కుదర్చబడుతుంది.

అధ్యాత్మిక జిజ్ఞాసలో వలె రసస్వరూప వివేచనలో కూడా ఇలాగే సిద్ధాంత పూర్వపక్షాలూ, కరుణ వ్యతికరణ సమీకరణలూ తప్పవు. ఈ చర్చ అనంతమే కాదు. ఆనాద్యనంతం కూడా. ఎవరి మట్టుకువారు ఈ చర్చలో పాల్గొని ఎవరిశక్తి సాధ్యమైనది వారు సమర్పిస్తూ ఉంటారు.

నేను సైతం

ప్రపంచాగ్నికి,

సమిధ నొక్కటి ఆహుతిచ్చాను.

నేనుసైతం

విశ్వసృష్టికిఅశ్రు వొక్కటి ధారపోశాను.

నేను సైతం భువన ఘోషకు

వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను.

నా మట్టుకు కవిత్వం ఒక ఎడతెగని అన్వేషణ. నా జీవితం కూడా అంతే. కవిత్వంలో జీవితాన్నీ కవిత్వాన్నీ వెదుక్కుంటూ ఉంటాను. ఒక్కొక్కసారి ఏదో కనిపెట్టినట్లు సంతృప్తి కలుగుతుంది. కాని అది తాత్కాలికం మాత్రమే. ఆ సంతృప్తిని దాచుకుని నేను ఆగిపోలేదు. అది నాది కానేకాదని నా నమ్మకం. దాన్ని అందరి సమక్షంలో వదిలిపెట్టి మళ్లీ నా గవేషణ మార్గం అందుకుంటాను. ఒక్కొక్కప్పుడు నా పరిశీలన ఫలితాలు నాకిచ్చినంత ఆనందాన్ని నలుగురికి ఇవ్వకపోవచ్చును. అయినా ఆ ఫలితాలను అందరియెదుటా ఉంచవలసిందే. ఈ సందర్భంలో నేనొక సంగతి స్పష్టం చెయ్యాలి.

అది కవిత్వం కానివ్వండి, గణితశాస్త్రం కానివ్వండి, చిత్రలేఖనం కానివ్వండి, వైద్యశాస్త్రం కానివ్వండి - వీటన్నింటిలో రెండేసి రకాలుంటాయి. Pure and Applied అనేది Pure Art, Applied Art, Pure Science ఈ విధంగా.

ఇది ఇంకా స్పష్టం చెయ్యాలంటే - కవిత్వం ఉంది. దీనిలో Pure Poetry శుద్ధ కవిత్వం, కేవలం కవిత్వం, అకల్మష కవిత్వం, కవిత్వం తప్ప మరేదీ కాని, మరి దేనితోనూ కలుషితం కాని కవిత్వం ఒకటి. Applied Poetry ఇంకొకటి - అనగా ఉపమోగ్య కవిత్వం, వ్యవహార కవిత్వం.

తాను తప్ప మరేదీకాని కవిత్వం బ్రహ్మపదార్థం వంటిది. అది కవుల అన్వేషణకు లక్ష్యం. అది ఎన్నడూ ఎక్కడా దొరకకపోయినా దాన్ని వెదకడాన్ని మానడానికి వీలులేదు. ఈ అన్వేషణ మార్గంలో కవిని నిరాశ ఎదుర్కోవచ్చు. అయినా యాత్ర సాగవలసిందే.

పోనీ పోనీ
పోతే పోనీ
సతుల్ హితుల్ సుతుల్ పోనీ
పోతే పోనీ
రానీ రానీ
వస్తే రానీ
కష్టాల్ నష్టాల్ కోపాల్ తాపాల్
శాపాల్ రానీ
వస్తే రానీ
తిట్లూ రాట్లూ పాట్లూ రానీ
రానీ రానీ
కానీ కానీ గానం ధ్యానం
హాసం లాసం
కానీ కానీ
కళారవీ, పవీ, కవీ.

కాని ఈ పరిశోధనలాయంలో పనిచేసే కవిమీద నేనొక షరతు విధించక మానలేను. నీ ఫలితాలు నీ ఒక్కడివీ కాదు. వాటికి సాంఘిక ప్రయోజనం ఉంది. వాటిని ఉపయోగించుకొనే హక్కు సంఘానిది. సంఘం చేతిలో అది APPlied Poetry అవుతుంది. వెనకటి APPlied అంతా నీ అనంతర పరిశోధనలకు ముడిసరుకు, కవిత్వాన్ని నీ సొంత ఉపయోగాలకు వాడుకంటే కవిత్వానికి నువ్వుద్రోహం చేస్తున్నావన్న మాట.

ఇది సామాన్య మానవుని యుగం. కాని, సామాన్య మానవుడంత అసామాన్య మానవుడెవడూ లేడు. సామాన్య మానవుడంటే ఎవరు? నువ్వూ, నేనూ, వాడూ, వీడూ ఒక ప్రత్యేక మానవుడు కూడా. ఈ ప్రత్యేకత్వం చాలా అమూల్యమైనది. దీన్ని గుర్తించుకోవడం పెంపొందించుకోవడం ఇదే జీవితానికి సార్థకత.

కవి ఒక ప్రత్యేక మానవుడు. అతనికొక విశిష్టత ఉంది. ఒక వ్యక్తిత్వం ఉంది. అది తనది తప్ప మరెవ్వరిదీ కానిది. అతడు దానిని గుర్తించుకోవాలి. అదొక వింత గొంతు. అది మరెవ్వరి గొంతు వంటిదీ కాదు. చీకటిలోనూ అతనిదే అని పోల్చుకోదగినది. అందుకే ఇద్దరూ సీస పద్యమే రాసినా ఇది తిక్కన పద్యం.

ఇది శ్రీనాథుని పద్యం అని మనం పోల్చుకోగలం. ఆయా పద్యాలమీద తిక్కన శ్రీనాథాదులు తమ తమ సంతకాలను స్పష్టంగా చెక్కినట్లుగా మనకు సంస్ఫుటం అవుతాయి. వాటికీ, వాటి క్షుద్రప్రతిబింబాలకీ ఎంత భేదమైనా ఉంటుంది. విజ్ఞులైన విమర్శకులు సునాయాసంగా ఈ విభేదాన్ని పోల్చుకోగలరు. ప్రతి కవి రాసిన పద్యానికీ, అందులోనే ఒక ఆంతరంగిక సాక్ష్యం ఉంటుంది. కవి విమర్శకుణ్ణి మోసగించలేడు.

నా కవితాయాత్ర ఇలా సొంత గొంతుకను వెదుక్కునే ప్రయత్నమే అని చెప్పవచ్చును. అయితే నే నొప్పుకుంటూన్న ఈ నిజాన్ని రెండుగా విశ్లేషించి ఒక భాగం Techniqueకి సంబంధించినదీ, ఇంకోభాగం Contentకి చెందినదీ అని వెల్లడిస్తేనే తప్ప దీని విషయమై సవిస్తరంగా వివరించడానికి వీలుపడదు. బహుశా నన్నెదుర్కొన్న సాంకేతిక సమస్యలు Technical Problems సామాన్య పాఠకుల ఉత్కంఠను రేకెత్తించకపోవచ్చును. కాని ప్రతి కవికి తాను చెబుతూన్న విషయం Matterతో పాటు చెప్పే విధానం (Manner) కూడా ఉంటుంది. చాలామందికి ఈ విధానం మీద అట్టే నిఘా ఉండదు. జనసామాన్యం మాట అలా వుండగా పూర్వకవులను గతానుగతికంగా అనుకరించే సామాన్య కవులలో కూడా ఇట్టి దృష్టి మృగ్యమే, మిగిలిన అలవాట్ల లాగే పద్యాలు రాయడం కూడా ఒక అలవాటుగా వీళ్ళకి పరిణమిస్తుంది. పద్యరచన అంటే కేవలం చందోనిబంధనలను శిరసావహించడం కాదు.

విషయానికి సంబంధించిన వివేచన సాగించడంలో కవిత్వం అంటే ఏమిటి? అనే ప్రశ్న వేసుకుంటాము. విధానం గురించి ఆలోచించేటప్పుడు కవిత్వం అంటే ఎట్లు? అనే ప్రశ్న బయలుదేరుతుంది. కాని, విమర్శన సౌలభ్యం కోసం మాత్రమే ఈ విభజన చెయ్యడం తప్ప విషయాన్నీ విధానాన్నీ ఒకదాని నుండి ఒకటి వేరు చెయ్యలేము.

**రేడియో ప్రసారితం**

**ముద్రణ : ఆంధ్ర శిల్పి మాసపత్రిక మార్చి - ఏప్రిల్ 1947**

# బాధ కవిత్వానికి పర్యాయపదం

చక్కని పద్యాలు రాసి నీకు వినిపించాడే చవితినాడు, ఆ కుర్రాడు చాలా బాధపడుతున్నాడని వినీ వినగానే నాకేదో వేదనా, అణులేశం అవేశం, ఆ మట్టునే ఆగ్రహం వచ్చి, అటువంటి వాళ్ళ అవస్థల మీద ఖర్చు పెట్టడానికి నా దగ్గర కన్నీళ్ళు లేవన్నాను.

బాధ పడటం చేతకాని వాళ్ళు పద్యాలు రాస్తే, బాధపడడం భరించలేనివాళ్ళు పద్యాలు చదివితే, పద్యాలు – అందులోకి యతి ప్రాసల్లేని అర్థంలేని పద్యాలు రాసి బాధపడడం, అర్థంలేని బాధపడడం, యతిప్రాసల్లేని బాధపడడం అన్నాన్నేను.

ఆ కుర్రాడు నా దగ్గరికి వచ్చిన మాట నిజమే. పద్యాలు చదివిన మాట నిజమే. నేనతణ్ణి పొమ్మన్నమాటా నిజమే. నేనతణ్ణి యెందుకు పొమ్మన్నానో చెప్పడానికి ఈ కథ.

కథా అన్నాను? సంఘటనల్లేని సంచలనంలేని, కర్త, కర్మ క్రియల్లేని కథనాన్ని కథనడం ఎట్లా? ఇప్పుడే చెబుతున్నానిందులో ఒక పూరిల్లు గాని, పచ్చ కర్పూరంగాని, చివరికొక సిగరెట్టు కాని తగలెట్టేటప్పుడు బయల్దేరే పొగలో కనిపించే కదలిక పాటిది కూడా ఈ రాతలో మీకు కనబడదు. జరగనట్టు కనిపించే జరగడం ఇందులో చూపించాలని ఎందుకో ప్రయత్నం.

నీ తరువాతి తరం యువకవి నీ దగ్గరికీ వచ్చినప్పుడు నిర్దాక్షిణ్యంగా పొమ్మన్నావు. అతని పాటలోని బాధ నీ కళ్ళ వెనక నీళ్ళలో ఈదుతోందని నీకు బాగా తెలుసు. అయినా పొమ్మన్నావు, ఉప్పెనగా ఉద్గమించబోతున్న కన్నీళ్ళను ఆటకాయించి.

'అపాయానికి ఇటూ దారి' అని ఎక్కడైనా ఎవరైనా ఒక హెచ్చరికను ప్రతిష్ఠిస్తే ఎంత బాగుండును. అప్పుడు మనం అంతమందిమీ అటు వెళ్ళడం మానేద్దుము.

మానేస్తామా? ఏమో అబ్బా? నా మట్టుకు నేను అపాయాలని అన్వేషించడంలోనే ఆనందం పోగు చేసుకుంటాను. ఇంకా యెందరో ఉన్నారు. ఇలాంటి వాళ్ళు అపాయం స్వభావాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటారు వాళ్ళు. నిషేధాలు విధిస్తూ నిలబడే పోలీసుల బలం నిరుపయోగం వీళ్ళ విషయంలో.

అపాయం బోర్డు కట్టి అటు వెళ్ళకుండా ప్రజల్ని శాసనాల ద్వారా అరికట్టి అపాయానికి ఇవతలి వేపు క్షేమాన్ని వెదజల్లడానికి ప్రభుత్వాలన్నీ కృషి చేస్తూనే ఉంటాయి. కాని ఏం లాభం? అవతల ఏముందో చూడడానికి మానవుడిలో కూతూహలం ఉన్నంత కాలం బోర్డు చేసే హెచ్చరిక నిశ్శక్తం. నిర్వీర్యం.

సుమతీ శతకం స్తవనీయమే సెన్సారు బోర్డు అభిలాషణీయమే. శాసనసభ అవశ్యం గౌరవనీయమే. అయితేనేం! అపాయానికి గల ఆకర్షణని నేను కొనియాడడం మానలేదు.

ఈ కుర్రాడున్నాడే వీడు అపాయాల స్వభావం కనిపెట్టాలని ఉబలాటం ఉన్నవాడు. ఆ పద్యాలు చదివినప్పుడే తెలిసింది. నాకా సంగతి. పద్యాలుగా అవి బాగాలనే ఉన్నాయి. కాని అవి బతకవని నాకు తెలుసు. ఎందుకో చెప్పనా?

ఒకసారి నేను చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో చిక్కుకున్నాను. ఎవరిదో అరచెయ్యి, దానిమీద ఒక గుండుసూది అంటీ అంటినట్లు నిలబెట్టి ఉంది. దానిమీద నేను ఒంటికాలి మీద నిలుచున్నాను. అంతవరకు బాగానే వుంది. అటువంటి సర్కాసు ఫీట్లు నేను సునాయాసంగా సాగించగలను. ఇక దిగిపోవాలనుకుంటున్న సమయానికి నా నెత్తిమీద గ్రంథాలయాల దండయాత్ర ప్రారంభమైంది. ఎంత బరువుందో యిప్పుడు జ్ఞాపకం లేదు. కాని, ప్రపంచ కవుల రచనల సంపూర్ణ సంపుటం నా తలమీద వచ్చి వాలింది. దాని మీద నానా భాషల నిఘంటవులు, ఉగాది సంచికలు ఒత్తుతున్నాయి. ఇంకా ఇంకా మీదిమీదికి పోను పోనూ అనంతంగా అనేక గ్రంథాలు, షేక్స్పియరు సమస్త రచనల మేలు ముద్రణం వ్యాఖ్యాన గ్రంథాలతో సహా నోస్ డైవ్ చేసినప్పుడు నా మెదడులో అణువు బ్రద్దలైనట్టయింది. ఆకాశం వైపు పెరిగిపోతున్న గ్రంథాల భారం నన్ను క్రుంగదీస్తోంది. అంతసేపూ ఒంటికాలుతో గుండుసూది మీద నిలబడే ఉన్నాను. గుండుసూదిని కదలకుండా నిలబెట్టగలిగిన వాడి చాకచక్యానికి తీసిపోగూడదని పౌరుషానికి నిలుచున్నాను బాధ భరిస్తూ. కాలైనా మార్చుకోవడానికి వీల్లేదు. నా నెత్తిమీద ఎన్ని పుస్తకాలున్నాయో స్పష్టంగా తెలియదు. వాతావరణంలోని వివిధ పరిణామాలను చర్మంతో పీలుస్తూ గ్రంథాల పేర్లు పోలుస్తున్నాను. మధ్య మధ్యన ఎక్కాల పుస్తకాలూ, అచ్చు తప్పులతో నిండి అణాకి, అర్థణాకి అమ్ముడుపోతున్న చవకబారు పుస్తకాలూ గ్రుచ్చుకుంటున్నాయి. అమూల్యమైన తాటాకు గ్రంథాలతో తంజావూరు లైబ్రరీ నా నెత్తిమీద పడింది. తామ్ర శాసనాలూ శిలశాసనాలూ తగులుతున్నాయి. నా రక్తనాళాలలోని నెత్తురు వాటి ఒత్తిడిని అనుభవిస్తోంది.

నా మీద గ్రంథాలూ – నా కింద గుండుసూదీ! ఏ తెలియరాని గణిత శాస్త్ర సూత్రం వల్లనో అవి నిలబడి నన్ను నిలబెట్టాయి.

అరచెయ్యి అభయహస్తం. పడిపోతానని భయం లేదు గాని పాడడానికేమీ తోచలేదు. పాడాలనే బాధ మాత్రం పొడుస్తోంది. ఏది పాడినా ఈ పుస్తకాల సారమే. జీవితానుభవమే కావ్య వస్తువు కావాలని నా కప్పటికింకా తెలియదు.

ఈ ఇరుకు పరిస్థితిలో చిక్కుకొని ఏదో పాటపాడాను. ఆ పాట చాలామందిని ఆకర్షించింది కూడా. అరచేతి కిరుపక్కలా ఉన్న అగాథపు లోయల్లో తండోపతండాలుగా క్రిక్కిరిసిపోయిన ప్రేక్షకజనం అయిదు నిమిషాల ఇరవై సెకండ్లసేపు కరతాళ ధ్వనులు చేసి నా పాటని అభినందించారు.

ఆ పాటకు ముగ్ధుడైపోయాడు ఈ కుర్రాడు. దానికి అందమైన అనుకరణలు తయారు చేశాడు. అదీ నా కోపం అతణ్ణి పొమ్మన్నాను

నువ్వు స్వయంగా అపాయాల్లోకి వెళ్ళు. ఎరువు తెచ్చుకొన్న అభిప్రాయాల్ని తగలబెట్టడానికి వీలుగా ఒక అగ్గిపెట్టె నీతో తీసుకు వెళ్ళటం మరచిపోకు. గుండు సూది మీద ఒంటికాలితో నిలబడడం గొప్పమాటే. కాని అదే అంత గొప్ప కాదు. ఇంకో కవి - ఎంత గొప్పవాడైనా నువ్వు వాడివి కావాలని ప్రయత్నించకు. ఇన్నాళ్ళు నువ్వు అర్ధానుస్వారంలాగ, ముద్రాసురుడిలాగ బతికేవు. పేపరు వెయిట్‌లాగ, రబ్బర్ స్టాంపు లాగ బతికేవు. వెళ్ళు జీవితంలోకి.

రెండో రకం పద్యంలో కూడా బాధ వుంటుంది. కాని అది బతికే బాధకాదు. బతికించే బాధకానే కాదు.

**ముద్రణ: ఆంధ్రపత్రిక, వారపత్రిక, 8-1-1954**

# 'మహాప్రస్థానం' కథ (నా మాట)

**లం**డన్ నగరంలో వెలువడుతున్న "విదేశాంధ్ర ప్రచురణల" నిమిత్తం నా "మహాప్రస్థానం" గీతాలను టేప్‌రికార్డ్ చేసి, నా కంఠధ్వని ఉన్న Cassette తో బాటు, సొంత దస్తూరీలో అన్ని గీతాలను Facsimile రూపంలో విడుదల చేసే సందర్భంలో ముందుమాటగా ఏదైనా చెప్పమని ప్రచురణ కర్త హోదాలో మిత్రుడు డా॥జి.కృష్ణమూర్తి నన్నడిగారు. అప్పుడు చలంగారి యోగ్యతాపత్రాన్నే చదివివేద్దామనుకున్నాను. కానీ "మీ అభిప్రాయాలే వినిపించా"లన్నారు మిత్రులు. "సరే" అన్నాన్నేను.

ఈ ప్రచురణలో చలంగారి రచన లేకపోవడం ఒక లోపమని నేను భావించలేదు. ఎక్కడైనా దాని విశిష్టమైన విలువ దానికుండనే ఉంది. అయితే అదే ముఖ్యమైనదని అనుకునే వాళ్లు కూడా ఉన్నారు. "ప్రగతి" వారపత్రికలో నేను నిర్వహించిన "ప్రజ" (ప్రశ్నలు : జవాబులు) అనే శీర్షికలో పిచ్చిరెడ్డి అనే ఎం.ఏ.విద్యార్థి, "యోగ్యతాపత్రం చదివితే మహాప్రస్థానం గీతాలు మరి చదువనక్కరలేదని నేనంటాను. దీనికి మీరేమంటారు ?" అని ప్రశ్నించాడు. అందుకు నా జవాబు, "మీరు సార్థక నామధేయులంటాను" అని.

చలంగారిచేత పని కట్టుకుని ప్రశంసా వాక్యాలు వ్రాయించినవారు జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి. ఆ రోజుల్లో రుక్కాయి నాకు, అతని మాటల్లోనే "అనధికార పబ్లిసిటీ ఆఫీసరు"గా పనిచేసేవాడు. నా గీతాలన్నీ ఎక్కడెక్కడ అచ్చయినదీ ఒక నోటు బుక్కులో రాసుకునేవాడు. చాలామట్టుకు అతని కవి కంఠస్థం. ఒక మారతను మా ఇంటికొచ్చి, అప్పటికి అసంపూర్ణంగా ఉన్న "జగన్నాథుని రథచక్రాలు" చూశాడు. మహాప్రస్థానం గీతాలన్నింటిలోనూ ఏకబిగిన రాయనిది ఇదొక్కటే. "కవితా! ఓ కవితా!" వంటి సుదీర్ఘగీతాన్ని కూడా ఒకే ఊపులో రాశాను. "వస్తున్నా యెస్తున్నాయ్"కి పేరడీగా "వెళ్లిపోయాయ్ వెళ్లిపోయాయ్" అంటూ జరుక్కు ఆశ్వాసాంతం రాసి "భారతి"లో అచ్చువేయించాడు. దానితో నాకు తొందరపుట్టి "రథచక్రాలు" పూర్తి చేశాను. మరుసటి నెల "భారతి"లో అది వెలువడింది.

1940ల లోనే "మహాప్రస్థానం" ప్రెస్ కాపీ సిద్ధం చేశాను. జనార్ధనరావు మరణవార్త వినగానే ఈ పుస్తకం అతనికే అంకితం అనుకున్నాను. ఆ రోజే (1938లో ఒక రోజు) "తల

వంచుకు వెళ్లిపోయావా నేస్తం" అంటూ అంకిత గీతం సిద్ధం చేశాను తర్వాత 1950 నాటికి గాని ఈ గ్రంథం ముద్రణ కాలేదు. "నళినీ కుమార్" అనే మిత్రుడు చేసిన ధన సహాయంతో మొదటి ముద్రణ వెలుగు చూసింది. అది నా నలభయ్యో ఏట పారిస్‌లో అచ్చయింది.

ఆ తర్వాత "మహాప్రస్థానం" ముద్రణలు విశాలాంధ్ర ప్రచురణల ద్వారా రమారమి ఇరవై సార్లు జరిగాయి. అందుచేత ఇప్పుడు కొత్తగా ఈ లండన్ ముద్రణ ఎందుకని నేననుకున్నాను. దీనికి శ్రీ పురిపండావారు చెప్పిన కారణం ఇది. "మహాప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం." ఆయనింకా ఇలా అన్నారు. "నాకు తెలిసినంతవరకు మరే భారతీయ భాషలోనూ 'కవితా! ఓ కవితా' అంత గొప్ప గీతం రాలేద"ని. ఈ ప్రచురణకు మరో ముఖ్య కారణం ఉంది. ఇది నా సొంత దస్తూరీ. సొంత గొంతుక. కవితా ప్రకాశనంలో ఏ భాషలోనూ, ఎప్పుడూ ఎక్కడా కనీవినీ ఎరగని కొత్త పద్ధతి ఇది.

ఒక మారు గోరాశాస్త్రి నాతో, "శ్రీశ్రీ నువ్వేమిటన్నా అనుకో, నా ఉద్దేశం మాత్రం ఇది. ఈనాడు ఇండియాలోని రచయితలందరికన్నా నేనే గొప్పవాణ్ని అన్నాడు. "నా ఉద్దేశం కూడా అదే" అన్నాన్నేను.

"మహాప్రస్థానం" గీతాలన్నీ 30లలో రాశాను. ("నిజంగానే", గర్జించు రష్యా"41లో, "నీడలు" 47లో రాశాను.) 30 నుంచి 40 దాకా సాగిన దశాబ్దాన్ని చరిత్రకారులు Hungry thirties అంటారు. అప్పుడే అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం ప్రపంచమంతటా వ్యాపించింది. (ఒక్క సామ్యవాద రష్యాలో తప్ప.) ఆ దశాబ్దంలోనే రెండు ప్రపంచ యుద్ధానికి రిహార్సల్సుగా స్పెయిన్ అంతర్యుద్ధం సాగింది. ఆడెన్, స్పెండర్, డేలూయిస్ డిలాన్ థామస్, జార్జి బార్కర్ మొదలైనవారు గొప్ప రచనలు చేసింది ఆ కాలంలోనే. ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో అప్పుడే ఇంగ్లాండు నుంచి వెలువడింది. ఇన్నిన్ని ప్రవాహాల మధ్య నా మహాప్రస్థాన గీతాలు కూడా ప్రవహించాయి.

ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను "సామాజిక వాస్తవికత" అంటారనీ, దీనికి వెనుకదన్నుగా "మార్క్సిజం" అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, మహాప్రస్థానం గీతాలలోని మార్క్సిస్టుపార్టీ, సామాజిక స్పృహ యాదృచ్ఛికాలు కావని తెలుస్తోంది.

ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో "నేను సైతం ప్రపంచాగ్నికి" ఇత్యాది గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంథిక శైలికీ, గణబద్ధచ్ఛందస్సులకీ గుడ్‌బై కొట్టేశాను. ఇదే గురజాడ అడుగుజాడ. అంతవరకు సుమారు వెయ్యేళ్లు అవ్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండి దారి నుండి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రథాలూ, పల్లకీలూ, గుర్రబళ్లూ వెళ్లేదారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్లూ తిరిగే ఆధునిక యుగానికి

తెలుగు కవిత్వాన్ని మళ్లించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను.

ఇది టెక్నిక్‌కు సంబంధించింది. గ్రాంథికంలో రాసే వృత్తాలు రథాల్లాంటివి. పల్లకీల్లాంటివి. గురజాడ వాడుక భాషలో రాయమన్నాడు. మాత్రాచ్ఛందస్సులను వాడమన్నాడు. నేనందుకే ఉత్సాహంతో ఉద్రేకంతో ఉద్యమించాను. ఇక విషయంలోకి వస్తే అందమైన అబద్ధాలలోకన్నా, నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనీయమవుతుందని విశ్వసించాను. దీనితో మహాప్రస్థాన గీతాలలో సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టడం జరిగింది.

దీని తర్వాతిమెట్లు సామ్యవాద వాస్తవికత దీన్నింకా మనం అందుకోలేదు. అందుకోకుండా పెట్టుబడిదారీ గుంటనక్కలు పెద్దపెద్ద కుట్రలే చేస్తున్నాయి. అందుకు మద్ధతుగా సాహిత్యంలో క్లాసిజం నిలబడింది.

Classicism గురించి Herbert Read ఇలా అన్నాడు : "Classicism, let it be said without further preface. represents for us now, and has always represented. the forces of oppression. Classicism is the intellectual Counterpart of political tyranny. It was so in the ancient world and in the medieyal empires, it was renewed to express the dictaterships of the Renaissance and has ever been the official creed of the Capitalism."

క్లాసిసిజంతో బాటు జాతీయ దురహంకారం కూడా అభ్యుదయ నిరోధకమైనదే. దీనికి అంతర్జాతీయ దృక్పథమే విరుగుడు. "చీనాలో రిక్షావాలా, చెక్ దేశపు గని పనిమనిషీ" అంటూ నేనీ అంతర్జాతీయ తత్వాన్నే ఆహ్వానించాను. బదుగు దేశాల వారు నా ఇల్లు, నా దేశం అనుకుంటే అందులో అసమంజసం ఏమీ లేదు. కాని ఈ భావాలు మరీ ప్రకోపించి వెర్రితలలు వేస్తేనే ప్రమాదం. అప్పుడు నా ఇల్లు, నా దేశం అంటే పొరుగింటిని కొల్లగొట్టడమూ, ఇతర దేశాలను దోచుకోవడమూ జరుగుతాయి. సునిశితమైన అంతర్జాతీయ దృష్టితో ఈ దోపిడీని దుయ్యబట్టి తిప్పికొట్టడం కంటే మరో మహత్తర కర్తవ్యం మంచి కవిత్వానికుండ బోదని నేనంటాను.

"మహాప్రస్థానం"లో నేను చేసిందంతా సామాజిక రుగ్మతను నిదానించడం మాత్రమే.

"ఇదీ మన ప్రపంచం. ఇలా ఉన్నారు ఇచ్చటిప్రజలు" అన్నాన్నేను. ఇది సరైన రోగ నిదానమే కాని ఇంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెదకాలి. పైపై పూతలతో ఈ జబ్బులు కుదరవు. కావలసింది శస్త్రచికిత్స. దాన్నే "విప్లవం" అంటున్నారు.

"మహాప్రస్థానం"లో అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలూ ఉన్నాయి. విప్లవ సాహిత్యం లేదు. "విప్లవ సాహిత్యం" అంటే ఏమిటి? సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణ కుద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే.

ఇదీ నామాట. ఇక నా లండన్ ప్రచురణకర్త అయిన కృష్ణమూర్తిగారికి కృతజ్ఞతలు తెలుపుతూ,

**ఉంటాను,**

**లండన్, 15-12-80**

(ఉన్నపళంగా ఒకమాట చెప్పుకోవచ్చు. ప్రాచీనతత్వం ఇప్పుడూ అ మాటకొస్తే ఎప్పుడూ పీడకశక్తులకే ప్రాతినిధ్యం వహించింది. రాజకీయ నిరంకుశత్వానికి సైదోడే సాహిత్య ప్రాచీనతత్వం. ఆదిమ ప్రపంచంలోనూ, మధ్యయుగ సామ్రాజ్యాల్లోనూ అంతే జరిగింది. రినైజాన్సు నిరంకుశత్వాన్ని వెల్లడించడానికి ఇది మళ్లీ ప్రాణం పోసుకుంది. ఇది ఎప్పుడూ కూడా పెట్టుబడిదారీ విధానపు అధికారతత్వమే.)

**హెర్బర్టురీడ్ ఇంగ్లీషులో రాసి దానికి తెలుగు అనువాదం.**

118755

# సౌలభ్యం

కష్టంగా రాయడమంత సులభమైన పని లేనట్టే సులభం రాయడమంత కష్టమైన పని కూడా లేదు. ఆడంబరంగా జీవించడం సులభం. నిరాడంబరంగా బతకడం కష్టం. జీవితంలోనూ, సాహిత్యంలోనూ సౌలభ్యమే సాధించతగ్గ ఆశయం.

.....శతాంగ ప్రష్ఠ సర్వద్విష జ్యేష్ఠుండప్పుడు నిష్ఠురప్రదర బంహిష్ఠద్యుతి శ్రేష్ఠతన్ అంటే ఆ ముక్కలకు అర్థం బోధపడని కారణం వల్లనే జనం చప్పట్లు కొడతారు. "అనూరుడు దయించెను" అంటే, అంతేనా అంటారు.

అరవ ఫిల్ములు తెలుగుదేశంలో విరివిగా వ్యాపించడానికి కారణం అవి జనానికి బోధపడని భాషలో ఉండడమే. అందులో యేదో ఉండి ఉంటుందనే గుడ్డి నమ్మకం, వున్నదేదో తెలిసిపోయిన తర్వాత యేమీలేదనే ఈ సడింపుగా మారిపోతుంది.

ఎవరికీ బోధపడకుండా రాస్తానని యెవడూ అనలేడు. నీ యెటువంటి రచననైనా అర్థం చేసుకోగలిగినవాడు ఇంకొకడు ఉండనే ఉంటాడు. నిరవధికమైన కాలంలో, విపులమైన పృథ్వీలో యెప్పుడో, యెక్కడో – భవభూతి చెప్పినట్లే కాదు, నువ్వు రాస్తున్న సమయంలోనే, నీ దేశంలోనే వుంటాడు.

వందల కొద్ది సంవత్సరాల కిందటి శాసనాల భాషనే అవగాహన చేసుకొని అర్థం పిండగలిగినవారుండగా, ఈనాటి సజీవభాషలో రాసిన కావ్యాన్ని "ఏమిటో, నాకు బోధపడలే"దనడమా?"

"ఎఱ్ఱశాలువ కప్పుకొని మా యింటికొచ్చిందొక రివాల్వర్" అన్న వాక్యంలో అర్థం కాని మాట యేముంది? "ఒచ్చింది" అనే ప్రయోగం ఒక రకం మనిషికీ, "రివాల్వర్" అనేమాట ఇంకో అభిరుచి గల వ్యక్తికి సరిపడకపోవచ్చును. ఈ మాటలలో చెప్పిన అభిప్రాయం మరికొందరికి అసందర్భంగా కనబడవచ్చును. అందుకే యే కావ్యం గురించి అయినా ఇది బాగులేదనడం సాహసం. అది నాకు నచ్చలేదనడం సమంజసం.

నవ్య కవిత్వానికి నియమాలు లేవనుకోవడం పొరపాటు. నవీనులు వొక తరహా నియమాలను నిరాకరించి వాటిని బదులు తాము తీసుకురాదలచుకున్న ఇంకొక పద్ధతిని ప్రవేశపెట్టదలుస్తున్నారు.

బ్రిటీష్ పరిపాలన కెదురుగా స్వరాజ్యోద్యమం, ధనస్వామ్య వ్యవస్థకు ధిక్కృతిగా సామ్యవాద పద్ధతీ, కమ్యూనిజానికి ఛాలెంజిగా అనార్కిజం నిలబడ్డ ఈ జీవితమే కావ్యరచనా విధానాలను కూడా శాసిస్తుంది.

వర్ణ సాంకర్యాన్ని అంగీకరిస్తున్న ఈ రోజులలో రససాంకర్యం కూడా ఆదరణీయమే. రెండు సంస్కృత సమాసాలకు మధ్యనొక తెలుగుమాట కొందరికి ఇబ్బంది కలిగించినట్టే, రెండు తెలుగు మాటల తర్వాత వొక అన్యదేశ్యం havoc కలిగిస్తుందనుకోవచ్చు.

కాని భావంలో బలం ఉంటే ఇప్పుడు కనిపిస్తున్న ఈ యెగుడు దిగుడులు సద్దుకుపోతాయి - ప్రేమ ఉంటే వర్ణాంతర వివాహం విజయం పొందినట్టు.

**ముద్రణ : ఆనందవాణి, వారపత్రిక, 30-9-1945**

# లేఖ

అర్యా!

"మరో ప్రపంచం" గేయ రచనలో కృష్ణశాస్త్రి ప్రచ్ఛన్న హస్తం గురించిన వాస్తవాన్ని మీ పాఠకులకు తెలియజెయ్యవలసి వుంది. నా గేయాన్ని 'సరిదిద్ది' కృష్ణశాస్త్రిగారు ప్రచురించిన సంగతి బోయి భీమన్నగారికే కాదు. ఇంకా చాలా మందికి తెలుసు.

ఇందుకు సంబంధించిన గాథ యేమిటంటే – కృష్ణశాస్త్రి గారు బ్రహ్మసమాజ సభల కోసం రాసిన కొన్ని ప్రార్థన కీర్తనలతో బాటు నా (జీసస్ శిలువా, బుద్ధుని చలువా ఇత్యాదులు) ఒక చిన్న పుస్తకం ప్రచురించారు. అన్నీ తమవే అయినట్లు రచయితగా తమ పేరు వేసుకున్నారు. ఇందుకు ఆగ్రహం చెందిన చింతా దీక్షితులు, మల్లవరపు విశ్వేశ్వరరావు మొదలగువారు కృష్ణశాస్త్రిగారి అనుచిత చర్యను తీవ్రంగా ఖండిస్తూ కృష్ణాపత్రికకు ఒక ఉత్తరం రాశారు. పాత కృష్ణాపత్రికలు తిరిగేస్తే ఈ ఉత్తరం దొరుకుతుంది.

మతం మసిపూసిన తన వెర్షన్‌ని కృష్ణశాస్త్రిగారు తన మేనకోడళ్ళయిన సీత, అనసూయల చేత అక్కడక్కడ పాడిస్తూ ఉండేవారు. హిజ్ మాష్టర్స్ వాయిస్ వారు దీన్ని రికార్డు చేస్తామన్నారు. అందుకు నా అనుమతి అవసరమయింది. అరవిందభక్తుడు శ్రీ తిరుపతి అనుమతి పత్రం కోసం నా దగ్గరకు వచ్చాడు. నేను రాసి యిచ్చిన గేయ పాఠాన్ని ఒక్క అక్షరమైన మార్చకుండా పాడాలనీ, లిరిక్ రచయితగా రికార్డుమీద నా పేరు ఉండాలనీ షరతులు విధించి అనుమతి పత్రం ఇచ్చాను. ఆ విధంగా కలకత్తాలో రికార్డు అయింది పాట. నా కోసం తీసుకు వచ్చిన ఒక రికార్డును సీత, అనసూయలు నాకు బహుకరించారు. గొప్ప మార్షల్ మ్యూజిక్ తో ఉత్తేజకరంగా ఉంది ఆపాట. అయితే ఆ రికార్డు మాత్రం ఇప్పుడెక్కడా దొరకదు.

మతం, ఏ మతమయినా సరే, మతం అంటే అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నాకసహ్యమే.

"మరో ప్రపంచం" గీతాన్ని అనేకులు అనేక విధాల వాడుకున్నారు.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో-

స్వతంత్ర భారత్, స్వతంత్ర భారత్

స్వతంత్రభారత్ పిలిచింది

అని మార్చి కమ్యూనిస్టు పార్టీ గాయకులు తమ సభల్లో పాడుతూ ఉండేవారు. ఇది నాకు ఇష్టంలేని మార్పే అయినా నేనేమీ అభ్యంతరం చెప్పలేదు.

కమ్యూనిస్టుల వెర్షనూ, కృష్ణశాస్త్రి వెర్షనూ ఇప్పుడెవ్వరూ పట్టించుకోరు.

**శ్రీశ్రీ**

**మద్రాసు**

**ముద్రణ : ప్రజాతంత్ర, వారపత్రిక11- 7-1976**

# వాగ్దానం

తౌతాజీ అనే పేరు కలిగిన తాపీ ధర్మారావు మొదలుకొని తాతా అని నేను పిలిచే నా మనవడి వరకూ ఉన్న ఆంధ్ర ప్రజలందరికీ నా నమస్కారాలు. నా మాటలతో పద్యాలు రాశాను. పేరడీలు చేశాను. కాని మీకందరికీ కృతజ్ఞతలు చెప్పాలి. అనే సరికి నాకు మాటల దరిద్రం ఏర్పడింది. ఎలా కృతజ్ఞతలు తెలియ చేసుకోవాలో తెలియడంలేదు. నేనేదో సమాధానం చెప్పాలనుకొన్నా.

నాకు విశిష్ట సభ్యత్వం యిచ్చేముందు సాహిత్య అకాడమీకి వెళ్ళాను. అక్కడ విశ్వనాథ సత్యనారాయణగారు, గోపాలరెడ్డిగారు ఉన్నారు. విశ్వనాథ సత్యనారాయణగారు నన్ను లాక్కొచ్చి, "శ్రీశ్రీ నాకు పద్మభూషణ్ బిరుదు వచ్చిన సంగతి నీకు తెలుసునా" అన్నారు జనాంతికంగా.

శ్రీశ్రీ : ఆ తెలుసునే.

విశ్వనాథ : అయితే నన్నెందుకు కంగ్రాచ్యులేట్ చెయ్యవు?

శ్రీశ్రీ : భారతరత్న వచ్చేక కంగ్రాచ్యులేట్ చేద్దామనుకున్నా.

విశ్వనాథ : అది నీ కోసం ఉంచారు కదయ్యా!

అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయింది.

భారతరత్న అనే బిరుదు కన్నా విశాఖరత్న అంటేనే నాకు చాలా సంతోషంగా వుంటుంది.

బెజవాడ గోపాలరెడ్డిగారు అన్నారు – "ఈ శ్రీశ్రీకి అరవై ఏళ్లే వున్నాయి. ఈ విశిష్ట సభ్యత్వం అరవై ఏళ్ల వాడికి యిస్తే చాలా చిన్నవాడికిచ్చినట్లవుతుంది. ఇంకో అయిదేళ్లు ఆగేక ఎందుకు యివ్వరాదని వచ్చింది. ఈ విశిష్ట సభ్యత్వం పొందిన అందరిలోనూ చిన్నవాడు శ్రీశ్రీ". అరవైఏళ్ల చిన్నవాడిగా నేనిది పుచ్చుకున్నా నాకన్నా చిన్నతనంలో ఆయన ప్రజామంత్రి అయ్యారు. ఆయన మంత్రి అయ్యాకే పెళ్లి అయ్యింది. ఆ పెళ్లికి మేము పద్యాలు కూడా రాశాం. అది వేరే సంగతి. నిజంగా చరిత్రలోనే ప్రసిద్ధం. అక్కడ చెప్పిన దానికి ఒక అపచారం చెప్పాలి.

ఫిడెల్ కాస్ట్రో క్యూబా అధినేత. కొంతమంది అనుకున్నట్లు ఇది తలలు లెక్కపెట్టడంవల్ల వచ్చింది కాదు. తలలుబద్దలు కొట్టడం వలన వచ్చిన అధికారం అది.

నేను దేనినీ కావాలని అనను. ఎవరైనా ఇస్తానంటే వద్దనను. సాధారణంగా నేను దేనికీ వద్దు అనను. నెగెటివ్‌గా అనను. నాలో రెండు 'ఎస్'లున్నాయి. ఎస్ అనే వాణ్ణేకాని నో అనేవాణ్ణి కాదు. అది నా దౌర్బల్యం.

ఫ్రెంచి సాహిత్య అకాడమీ గొప్పది. దానిలో సభ్యత్వం రావడం గొప్ప సంగతి. దానిలో జీన్ కోక్టోకు 65వ ఏట సభ్యత్వం ఇచ్చారు. అతను ఏమన్నాడంటే నేను శరీరం, కాని అశరీరవాణిగా తిరుగుతున్నాను. నాకు ఒక కులాయం (కుటీరం) ఇచ్చిన ఫ్రెంచి అకాడమీని అభినందిస్తున్నాను. జీన్‌కోక్టో తన చిరునామా కేరాఫ్ ఫ్రెంచి అకాడమీ అన్నాడు. కాని నా కులాయం చెప్పాలంటే శ్రీశ్రీ కేరాఫ్ పిచ్చాసుపత్రి. విశాఖపట్నం అంటే ఉత్తరం వస్తుంది.

ఈ సన్మానం జరక్కముందు మూడు నెల్ల కిందట కోపెన్‌హాగన్ నుంచి నా పద్యాన్ని డేనిష్‌భాషలోకి ట్రాన్స్‌లేట్ చేసుకున్నందుకు నాకు డెన్మార్కు నుంచి యిరవై అయిదు రూపాయల చెక్కు వచ్చింది స్టేట్ బ్యాంకు మీద 25 రూపాయలకు చెక్కు రాసి, నాకో ఉత్తరం రాసి రిజిస్టర్ లెటర్ శ్రీశ్రీ, కేరాఫ్ సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ అని పంపారు. ఢిల్లీ వారు సాహిత్య అకాడమీ హైదరాబాద్‌కి పంపారు. అక్కడి నుండి మద్రాసు సాహిత్య అకాడమీకి వచ్చింది. అక్కడ నుంచి మా ఇంటికి వచ్చేసరికి నెల్లాళ్లు అయింది.

నాకు డేనిష్ భాషరాదు. ఏ పద్యం ట్రాన్స్‌లేట్ చేశారో తెలీదు. కాని భక్తి కలుగు కూడు పట్టెడయిన చాలు' అన్నట్లు మొత్తం మీద వారు పంపింది 25 రూపాయలు అయినా అది తెలుగు సాహిత్య అకాడమీ వారు నాకు చేసిన సన్మానం కంటే గొప్పదని భావిస్తున్నా. మీ అందరికీ కోపం రాకపోతే ఈ సన్మానం కంటే కూడా గొప్పదని భావిస్తున్నా.

ఆరుద్ర చెప్పాడు కాంస్య విగ్రహం గురించి. కొంత మంది కావాలని పట్టుబడతారు. నేను వద్దనను. మనందరి కన్నా పెద్దవాడయిన గురజాడ కంచువిగ్రహం విశాఖలోనూ, విజయనగరంలోనూ స్థాపించాలి. దానికి ఏవో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని అవి ఏ కారణాల చేతనో ఆగిపోతున్నాయి అన్నారు గురజాడ కంచువిగ్రహం స్థాపించకపోతే నాది స్థాపించినా స్థాపించకపోయినా ఒకటే, నాకు అనవసరం.

వెల్చేరు నారాయణరావు గారన్నారు. 'ఎంతకాలం శ్రీశ్రీ రాస్తూ కూర్చుంటాడు, ఇతని మార్గం కంటిన్యూ చేసే కవులు కావాలి' అని. చాలా మంది నాకు ఉత్తరాలలోనూ పద్యాలలోనూ ప్రశ్నలు రాస్తున్నారు. ఏమిటి నువ్వు చల్లారిపోయానా అని. మొన్న హైదరాబాద్‌లో చెప్పాను. ఐ కంటిన్యూ టు రైట్ యాజ్ లాంగ్ యాజ్ ఐ లివ్ ఎటువంటి కవిత్వం రాస్తానన్నది ఇప్పుడు చెప్పలేను. మనస్సులో కొన్ని ఉద్దేశాలున్నాయి.

ఓ దోసెడు సానుభూతి, పిడికెడు తీరుబాటూ కావాలని ఎప్పుడూ నేనడుగుతాను. నేను తప్పక రాస్తాను. కనీసం ఒక వంద గేయాలయినా, పద్యాలయినా రాస్తాను. ఒక్కొక్క పద్యం దాని రూపం అదే ధరిస్తుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే విశాఖపట్నం లోయర్ మిడిల్ క్లాస్, లోయర్ క్లాస్ భాషలో, యాసలో వాళ్ల కష్టసుఖాలు ప్రతిబింబించే పద్యాలు రాయాలను కొంటున్నాను ఈ నాలుగు ముక్కలు విన్నందుకు మీకు నా కృతజ్ఞతలు. థాంక్స్ . షుక్రియా ..

**(విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో 1.2.1970 సాయంత్రం జరిగిన సన్మానసభలో మాట్లాడింది)**

**టేప్ రికార్డింగ్ ఆధారంగా**

# పాతికేళ్ల సాహిత్యం

1947 ఒక కొండ గుర్తు. ఆ ఏడు మనకి స్వాతంత్ర్యం వచ్చిందంటారు (చరిత్రకారులు). బ్రిటిష్‌వాళ్లు దీన్ని "ప్రదానం" చేశామంటారు. కాంగ్రెసు వాళ్లు దీన్ని అహింసతో, సత్యాగ్రహంతో సాధించామంటారు. నేను మాత్రం మనకింకా 'స్వ'రాజ్యం రాలేదంటాను.

మనం తెలుగువాళ్లం. 1947లో ముక్కోటి ఆంధ్రులం. ఇప్పుడు నాలుగు కోట్లదాకా పెరిగాం. మనదేశం ఫ్రాన్సుకన్నా పెద్దది. (మన భాష మాత్రం ఫ్రెంచి కన్నా గొప్పదికాదు). ఒకప్పుడు తెలుగుభాష దక్షిణాపథం అంతటికి రాజభాషగా వుండేది. ("దేశభాషలందు తెలుగులెస్స"). మనం గడిచిన వెయ్యేళ్లలో ప్రపంచానికి కనీసం ముగ్గురు మహాకవులను ప్రసాదించాం. (తిక్కన, వేమన, గురజాడ).

ఇప్పుడు మనం 20వ శతాబ్దంలో వున్నాం. ఈ శతాబ్దం నాది : (తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు :) నేను 1910లో పుట్టేను (తోకచుక్కలాగ). మూడుమార్లు మృత్యువుతో పోరాడిగెలిచాను. 1918లో మొదటి గీతం రాశాను. (గణ యతి ప్రాసలంటే ఏమిటో తెలియకుండా :). 1920లో మొదటి నవల (వీరసింహ విజయసింహులు) రాసి పారేశాను. 1925లో మొదటి నవల (పరిణయ రహస్యం) అచ్చయింది. దాని ప్రతులు ఇప్పుడు లేవు. విశాఖపట్టణం హిందూ రీడింగురూము లైబ్రరీలో వుండేది.

1928లో మొదటి ఖండకావ్యసంపుటి (ప్రభవ) మా నాన్నగారిచ్చిన డబ్బుతో రాజమండ్రి సరస్వతీ పవర్‌ప్రెస్‌లో అచ్చువేయించాను. దీని ముద్రణ వ్యవహారమంతా మిత్రుడు పురిపండా చూసుకోవడమే గాక, కృష్ణశాస్త్రి కృష్ణపక్షాన్ని శివశంకరశాస్త్రి లోకానికి పరిచయం చేసినట్లు, నా తొలి కవితను తన ఉపోద్ఘాతంతో లోకంమీదికి వదిలేడు.

1930లో నేను 63 రోజులు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డాను. జీవితం మృత్యువుతో ఎలా పోరాడుతుందో స్వయంగా తెలుసుకున్నాను. ("ఇక లాభంలేదని" నన్ను మంచంమీదనుంచి కిందకు దించెయ్యడం నాకు బాగా జ్ఞాపకం). ఇది నా రెండవ మృత్యువు. 1955లో మెంటల్ క్లినిక్‌లో ఉండడం మూడవది. మొదటిసారి నేను పుట్టిన తొలినెలల్లోనే చచ్చిపోవలసింది. మా బంధువొకాయన చుట్ట చురకలతో నాటువైద్యం చేసి నన్ను బతికించాడు. దీనికి గుర్తుగా నా నుదుటిమీదా, మెడ వెనకా, తలా, చేతిమణికట్ల మీదా మచ్చలున్నాయి.

1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నాను. అప్పటి నుంచీ తెలుగు సాహిత్యం చరిత్ర శ్రీశ్రీ స్వీయ చరిత్ర. ఈ శతాబ్దపు తొలిపాదంలో జమీందారీ కవిత్వం మీద భావకవిత్వం తిరుగుబాటు చేసింది. చిన్నప్పటినుంచీ తిరుగుబాటు మనస్తత్వం గల నేను భావ  కవిత్వాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించాను. (నాకు బాగా జ్ఞాపకం. ఆ రోజుల్లో మా బంధువొకాయన నా కవితాశక్తిని తెగ మెచ్చుకుంటూ, నేనొక సలక్షణమైన మహాప్రబంధం రాస్తే బాగుంటుందని సిఫార్సు చేశాడు. ఆ సిఫార్సును నేను బుట్టదాఖలా చేశాను).

1925 నుంచి 50 దాకా సాగిన రెండో పాతికేళ్లలో భావకవిత్వం మీద యువకవుల తిరుగుబాటు సాగింది. ఈ పాతికేళ్లలోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడం, మనకి స్వరాజ్యం రావడం జరిగాయి. స్వరాజ్యం వచ్చిన కొత్తరోజుల్లో – "భావకవిత్వం : ఒక శవపరీక్ష" అనే వ్యాసం రాద్దామని నేను చాలా ఉబలాటపడ్డాను. వ్యాసం అయితే రాయలేదుగాని భావకవిత్వం మాత్రం సాహిత్యరంగం నుంచి నిష్క్రమించిందన్న యథార్థాన్ని రుజువుచెయ్యవలసిన అవసరం లేకపోయింది.

అలా నిష్క్రమించిన భావకవిత్వం స్థానాన్ని అభ్యుదయకవిత్వం ఆక్రమించింది. ఆక్రమించి ఈ కొత్త కవిత్వం ఏమిటి సాధించింది? ఈ ప్రశ్నకి నాకన్నా, నా కవితా సోదరుడు సోమసుందర్ చక్కని, సమగ్రమైన జవాబివ్వగలడు. నేనిక్కడ చెప్పదలిచింది ఒకే ఒక్క విషయం మాత్రం. అభ్యుదయోద్యమం తెలుగు సాహిత్యంలో గ్రాంధికభాషకు శాశ్వతంగా ఉద్వాసన చెప్పింది. నవలల్లో, నాటకాల్లో, పత్రికా సంపాదకీయాల్లో, రేడియో ప్రసంగాల్లో సర్వత్రా వ్యావహారిక భాష విజయపతాకం ఎగురవేసింది. కవిత్వంలో గణబద్ధ ఛందస్సుల ఫ్యూడలిజం నడ్డి విరగ్గొట్టి  మాత్రాబద్ధ ఛందస్సుగల ప్రజాస్వామ్యాన్ని స్థాపించింది.

ఆ రోజుల్లో నేను –

నేను "సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి....
ఆహుతిచ్చాను"

అంటూ సింగిల్‌పన్నా కవిత్వాలు రాస్తూవుంటే అబ్బూరి రామకృష్ణారావు గారు హాస్యానికొక వచనగీతం ఉదాహరించేవారు.

"కాళీ పే
కేజీ పె
ట్టిలు అ
మ్మబడును"

ఇదో కర్రల అడితీ వద్ద బల్లమీద స్థలం చాలకపోవడం వల్ల నిలువుగా వ్రాసిన ప్రకటన. దీన్ని "కాళీ పేకేజీ పెట్టెలు అమ్మబడును" అని చదవుకోవాలి. తెలుగులో వచన గీతానికి ఈ విధంగా హుషారిచ్చిన వారు శ్రీ అబ్బూరి రామకృష్ణారావు గారు. (నా కవిత్వాన్ని ఎంత వేళాకోళం చేసేవారో నాకంత ప్రోత్సాహం కూడా ఇచ్చే వారు) చాలాకాలం కిందట నేను వ్రాసిన "పొలాలన్నీ హలాలదున్నీ" అనే గేయాన్ని మెచ్చుకుంటూ అభ్యుదయ రచయితల లండన్ మానిఫెస్టో సారాంశం అంతా ఇందులో దించేశావోయ్ అన్నారు. ఇది నా మనస్సులో పదిలంగా దాచుకున్న పొగడ్తలలో ఒకటి :"

"ఇంకోటి ఇక్కడే చెప్పాలని వుంది. ఈ సింగిల్ పన్నా గేయాలు రాసే రోజుల్లోనే ఒకసారి అడివి బాపిరాజుగారు భీమవరంలో ఒక కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. అందులో నేను కవితాపఠనం చేస్తూవుంటే వెనకనుంచి ఒక పదివన్నెండేండ్ల కుర్రాడు, "ఓస్ ఇదే కవిత్వం అంటే ఇలాంటిది నేనూ రాసెయ్యగలను" అనడం వినిపించింది. ఆ వయస్సు కుర్రాడిచేత అలా అనిపించగల కవిత్వం వ్రాసినందుకు ఇప్పటికీ నేను గర్విస్తున్నాను.

పికాసో చిత్రాన్ని చూసిన ఒక అమెరికన్ కోటీశ్వరుడు. "ఓస్, ఇలాంటి చిత్రాన్ని నా పదేళ్ల కొడుకు కూడా గీకెయ్యగలడు." అన్నాడట. పక్కనే ఉన్న ఇంకో కోటీశ్వరుడు – "చిత్రలేఖనం అంటే ఏమిటో తెలిసినవారు పికాసో చిత్రాన్ని మాత్రం లక్షల ఖరీదుకి కొంటాడని మరిచిపోకు బ్రదర్" అన్నాడట !

మొన్న ఈ మధ్యనే, హైదరాబాద్ వీరశైవ హాస్టల్లో విప్లవ రచయితల సంఘం ద్వితీయ వార్షికోత్సవం జరిగినప్పుడు శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు నాకు మరో యోగ్యతాపత్రం ప్రసాదించారు. "You are waging a heroiec battle" అన్నారు. సాహిత్య అకాడమిలో సభ్యత్వంకన్నా మిన్నగా దీన్ని ఎన్నుకుంటాను.

అన్నట్టు విరసం దాకా ఇంకా రాలేదు కదూ, అరసం తొలిరోజుల్లోనే ఉన్నాం కదూ : ఆ రోజుల్లో – స్వరాజ్యం వచ్చిన కొత్త దినాల్లో నెహ్రూగారి చమ్కీ ఉపన్యాసాల మధ్య భారతదేశంలో సామ్యవాద భానూదయం అయిపోతున్నట్టుగానే అందరమూ భ్రమపడ్డాం. నెహ్రూ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా తెలంగాణా ఉద్యమాన్ని అణగద్రొక్కినా కాంగ్రెసు మీదా, గాంధీగారి మీదా ప్రజల్లో వున్న భక్తి ఏ మాత్రమూ చెక్కుచెదరలేదు. కాంగ్రెసు ద్వారా సామ్యవాదం సిద్ధిస్తుందని ఇంకా నమ్ముతున్న అమాయకులు ఇప్పటికీ ఉండడమూ, అందులో అభ్యుదయ రచయితలు అగ్రేసరులుగా నిలబడడమూ ఈనాడు చరిత్ర మన మీద ప్లే చేస్తున్న ప్రాక్టికల్ జోక్స్‌లో ముఖ్యమైనది. 25 సంవత్సరాల కాంగ్రెస్ వారి పాలన తర్వాత కూడా సాహిత్యంలో సమ్రాట్టులూ, సార్వభౌములూ, చక్రవర్తులూ ఉట్టికట్టుకుని ఊరేగుతున్నారంటే భూస్వామ్య వ్యవస్థ పునాదులింకా చెక్కుచెదరకుండా నిలిచే ఉన్నాయన్నమాట. ఈ పునాదులను పెళ్ళగించడం కోసమే వి.ర.సం. ఆవిర్భవించింది. నిస్పందేహంగా తన చారిత్రక కర్తవ్యం నిర్వహిస్తుంది.

75 శాతం నిరక్షరాస్యుల మీదా 25 శాతం అక్షరాస్యులూ, 90 శాతం దరిద్రులమీద 10 శాతం ధనవంతులూ పరిపాలన సాగిస్తున్న వ్యవస్థ మనది. ఇదే ప్రజాస్వామ్యం అనుకోవడమంత సిగ్గుచేటు ఇంకోటి ఉండదు. ఈ వ్యవస్థను మార్చాలని ఉద్ఘోషించడం కన్నా ఇంకో ఉత్కృష్టధర్మం ఏ సాహిత్యపరుడికైనా ఎలా వుంటుందో నేనూహించలేను. మరి ఈ వ్యవస్థకి రకరకాలుగా కొమ్ముకాచే రాతగాళ్ళంతా నా దృష్టిలో ప్రజాద్రోహులే.

ఈ వ్యాసంలో ఇక మీదట ఏం వ్రాసినా విప్లవ సాహిత్యం మీదనే వ్రాయవలసి వుంటుంది. వి.ర.సం. గ్రంథాలను నిషేధిస్తూ, వి.ర.సం. రచయితలను నిర్బంధిస్తూ విప్లవ సాహిత్యాన్ని ప్రదర్శించే వీరయ్యలమీద కూడా దాడిచేస్తూ ఈ ప్రభుత్వం ఎలా సామ్యవాదాన్ని స్థాపించగలదో నాకర్థంగాదు. ఒకటి మాత్రం నిశ్చయం, యువతరం బేషరతుగా విప్లవాన్ని ఆహ్వానిస్తోంది. ఆ తరానికి మన పాలకవర్గం దూరమై ఆకాశహర్మ్యాల్లో నివసిస్తోంది. యువతరం విజృంభించడం, దాని ఫలితంగా పాలకవర్గం పతనం కావడం త్వరలోనే తప్పనిసరి అని చెప్పడానికి ఏ మీనమేషాలను గణించనక్కరలేదు.

1970లో నా షష్టిపూర్తి జరిగింది. అప్పుడే తెలుగు సాహిత్యం ఒక పెద్ద మలుపు తీసుకుంది. ఆ ఏడే విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. దానికి నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్న వారందరికీ నా ధన్యవాదాలు.

ఇండియాకు రాష్ట్రపతి కావడం కన్నా, వి.ర.సం. అధ్యక్షుణ్ణి కావడమే నాకు మహదానందకరం. తెలుగు కవితా రంగంలోనూ, కథానికా రంగంలోనూ విప్లవ రచయితల జేగీయమానంగా ముందుకు పోతున్నారు. ఇతర క్షేత్రాల్లో కూడా ఎన్నిక చెయ్యదగ్గ విజయాలు సాధించడానికి ఎంతోకాలం పట్టదు.

**("యువభారతి" వారి సమీక్షా వ్యాస సంకలనం 'మహతి' - 1972 నుండి)**

# కవితా యాత్ర

కవిత్వంలో స్వరూప భేదాలనుబట్టి కొందరు తత్వభేదాలను కూడా ఆపాదించి కవిత్వాన్ని వివాదాస్పద వస్తువుగా చేస్తున్నారు. కవిత్వం పద్యరూపంలో ఆవిర్భవించగా నేను ఆ పద్యరూపాన్ని మార్చివేశానని నాపై ఒక అపవాదు కూడా వుంది. పద్యం స్వరూపం మారింది. పద్యం నన్నయనాడు ఒక మాదిరిగా ఉంటే యీనాడు మరో రూపంలో భాసిల్లుతున్నది. ఈ స్వరూప భేదాలు బాహ్యభేదాలు మాత్రమే. నాటికీ నేటికీ కవిత్వ ప్రయోజనంగానీ కవిత్వాంతస్సుగానీ ఒక్కటే.

తెలుగుజాతి సిసలైన రసిక జాతి. తెలుగువాడు పద్యం చదివే తీరును ప్రపంచం నేర్చుకోవలసి వుంది.

కవిత్వానికి స్వరూపం, భావం రెండు ప్రధాన అంశాలు. కవిత్వాన్ని ప్యూర్ పొయట్రీ అనీ, అప్లయిడ్ పొయట్రీ అనీ రెండుగా విభజిస్తున్నాను. కవి కావ్య నిర్మాణానికి ముందు పొందే అనుభూతులు, చేసే పరిశోధనలు, ఆర్జించే విజ్ఞానం మొదలైన పూర్వరంగమంతా ప్యూర్ పొయట్రీ. కవిత్వం రాసిన పిమ్మట దాన్ని ప్రజలకు అందించడమే అప్లయిడ్ పొయట్రీ.

**(ఆలంపురంలో 11.1.1953న జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏడవ మహాసభలోని ఉపన్యాసం)**

**ముద్రణ : ఆంధ్రజ్యోతి, వారపత్రిక, 31.12.1982**

# III

# సాహిత్యంలో విప్లవం

ఈ తృతీయ ఆంధ్ర అభ్యుదయ రచయితల సమావేశాన్ని ప్రారంభించవలసిన బాధ్యత నా మీద పడుతుందని నేననుకోలేదు. ముల్క్‌రాజ్ ఆనంద్ హిరేన్ ముఖర్జీ మహాశయులలో ఎవరో ఒకరు తప్పకుండా ఈ సభకు వస్తారని, సాహిత్యానికి సంబంధించిన అనేక సమస్యల మీద తమ అమూలాభిప్రాయాలను వివరిస్తారని నేను ఆశించాను. ఏమయితేనేం, అది తటస్థ పడిందికాదు. అయితే ఈ ఆశాభంగం నా ఒక్కడిదే కాక సభాసదులందరిదని నా దృఢ విశ్వాసం. కారణాంతరాల చేత, నేను వహించవలసి వచ్చిన ఈ కార్యభారాన్ని నాకున్న యత్కించిత్ శక్తిసామర్థ్యాలతో నిర్వహించదానికి మీ యెదుట నిల్చున్నాను.

సభా ప్రారంభానికైతే నమ్మతించాను గాని తీరా ఈ పనికి పూనుకొనేసరికి యెక్కడ ప్రారంభించాలో పాలుపోకుండా ఉన్నది. జీవితానికైనా, ఆద్యంతాలనే హద్దులు లేవు. ఏవేనా ఉన్నాయంటే అవి మనం నిర్మించుకొన్నవే. మనం నిర్మించుకొన్న వాటిని మనం మార్చుకోవచ్చును కూడా. ఒక దాని ఆరంభం ఇంకోదాని అంతం. ప్రత్యక్షమైన ఉదాహరణ చెప్పాలంటే ఈ రోజుతో 1945 ముగిసిపోయింది. రేపే ఒక కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. నా ఈ ప్రసంగం ఒక గడిచిపోయిన సంవత్సరానికి స్వస్తి వాచకం. ఒక రానున్న సంవత్సరానికి స్వాగత వచనం కాగలదనుకుంటున్నాను.

1945 అంచున కూర్చుండి గతించి పోయినవన్నీ తలచుకుంటూ చింతిస్తే లాభం లేదు. ఇక్ష్వాకుల నాడో, బౌద్ధుల కాలంలోనో, కృష్ణదేవరాయల హయాంలోనో, మన తాతలు నేతులు తాగినట్టు స్మరించుకోనక్కరలేదు. భవిష్యత్తులో విశ్వాసంలేని వారు గతంలో విశ్రాంతి తీసుకుంటారు. వెనుకటికంటే యిప్పుడు మానవజాతి ముందంజ వేసిందనీ, ఇక మీద ఇతోధిక వేగంతో పురోగమిస్తుందనీ నమ్ముతున్న వారిలో నేనొకణ్ణి. ఇదే అభ్యుదయ రచయితల విశ్వాసాల్లో ఒకటని కూడా నేననుకుంటున్నాను. ఇందుకు వ్యతిరేకమైన నమ్మకాలే ప్రజలలో విరివిగా వ్యాపించి ఉన్నట్లు కూడా నాకు తెలుసు. ఈ విషయంలో అభ్యుదయ రచయితలు అల్ప సంఖ్యాకులే. కాని ఒక ఊహ యొక్క పటిష్ఠత సంఖ్యాబాహుళ్యం మీద ఆధారపడదు.

దీన్నిబట్టి గతాన్ని విస్మరించవలసిందని నేనుకోరుతున్నట్లు ఎవరైనా భావిస్తే పొరపాటు. చరిత్ర సమస్తమూ భూతకాలానికి సంబంధించినది. చారిత్రక దృష్టి

అలవరచుకొనకపోతే ఎన్నో అనర్థాలు వాటిల్లి తీరుతాయి. తప్పకుండా చరిత్రను శాస్త్ర దృష్టితో పఠించవలసిందే. కాని వెనక్కి తిప్పటానికి వీలులేని కాలాన్ని పునస్థాపించ గల్గుతామనుకోవటం వెర్రితనం.

చరిత్ర విషయంలో ఇలాంటి అభిప్రాయాలు కలిగిన నాకు, సాహిత్యంపట్ల తద్భిన్నమైన భావాలు ఉండజాలవు. అన్ని విధాలా వెనుకటికంటే ఇప్పుడు సాహిత్య క్షేత్రం సస్యశ్యామలంగా ఉన్నదని కళ్లు మూసుకోని వారందరికి కనబడుతూనే ఉంది. ఇవన్నీ పుబ్బలోపుట్టి మఖలో మాడిపోయే కలుపు మొక్కలే అని కొందరు తమ్ము తాము ఓదార్చుకోవచ్చును. నా మట్టుకు మాత్రం ఇంత సర్వతోముఖమైన సాహిత్య విజృంభణం ఇది వరకెన్నడూ జరగలేదని తోస్తూంది.

ఇంత మాత్రానికి గర్వించి ఇంతటితో సంతృప్తి పొందకపోవడమే భవిష్యత్తు కెంతయినా శుభ సూచకం.

ఈనాటి రచనలు మెచ్చుకుంటున్నానంటే, ప్రాచీన గ్రంథాలు నిస్సారమైనవని తిట్టి పోస్తున్నాననుకోకూడదు. వెనుకటి గ్రంథాలను చదవని వాడెవ్వడూ ఈనాడు సరసమైన సాహిత్యరచన చేయలేడు. గత చరిత్రను ప్రస్తుత ప్రయోజనం కోసమూ, భావి అభివృద్ధి నిమిత్తమూ ఏ విధంగా పఠించక తప్పదో అదే విధంగా పూర్వసాహిత్యాన్ని సవిమర్శకంగా, సాకల్యంగా చదవకపోతే సారస్వత సృష్టికి అవకాశమే ఉండదు. ఇది వరకు వెయ్యబడిన గట్టిపునాదుల మీదనే ఈనాటి సాహిత్య సౌధం నిర్మించబడుతున్నది. సారస్వత పరిణామాన్ని శ్రద్ధగా గమనిస్తున్న వారెవ్వరూ దీనిని కాదనలేరు.

అభ్యుదయ రచయితలు సాహిత్యంలో ఒక తిరుగుబాట తెచ్చిన మాట నిజం. ఈ విప్లవం దేనిమీద? దేని మీద అయినప్పటికీ, ప్రాచీన సాహిత్యం మీద మాత్రం కాదు. ఎందువల్లనంటే ఈనాడు సరికొత్త రచనలుగా చలామణి అవుతున్న వెన్నో పూర్వ సారస్వతంలో గోచరిస్తాయి. కాలక్రమాన అనాదరణకు పాల్పడ్డ ఎన్నో రచనా విధానాలను నేటి కవులు స్వీకరిస్తున్నారు. వీరు తెచ్చిన విప్లవం రసావిష్కరణకూ, రసాస్వాదనకీ సంబంధించనది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథం మీద వీరు తిరుగుబడుతున్నారు. నేటి రచయితలకు ప్రజలే ప్రామాణ్యము. కొన్ని కారణాలవల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను మళ్లీ సారస్వతోన్ముఖంగా తిప్పటానికి నేటి రచయితలు పాటుపడుతున్నారు. ప్రజలలో సాహిత్య జిజ్ఞాస పెంపొందటం మీదనే తమ శ్రేయస్సు కూడా ఆధారపడి వుందని వీరు గుర్తిన్నారు. ప్రజలకు సాహిత్యాన్ని అందనివ్వకుండా చేస్తున్న శక్తులను తమ విరోధులుగా పరిగణించి, వాటితో పోరాడుతున్నారు. ఈ పోరాటంలో అగ్రగాములు అభ్యుదయ రచయితలు. ఈనాడు ప్రజలలో సాహిత్య చైతన్యం ఇదివరకటికన్నా చాలా ఎక్కువైందంటే ఇందుకు అభ్యుదయ రచయితల కృషి చాలమటుకు కారణమని చెప్పక తప్పదు.

కాని యిందువల్ల ప్రజా సాహిత్యవాదుల మీద రెండు గట్టి ఆరోపణలు పడుతున్నాయి. రెండూ సమంజసమైనవే కాబట్టి వాటికి సమాధానం చెప్పవలసి వుంటుంది. వాటిలో మొదటిది తాత్కాలిక సమస్యల పరిష్కారానికి సాహిత్యాన్ని ఒక సాధనం చేసుకొంటే ఆచంద్రతారార్కంగా

నిలవగల రచనలు వెలువడగలవా అనేది. రెండవ ఆక్షేపణ అనన్యపరతంత్రమై సర్వతోముఖంగా విజృంభించవలసిన సారస్వతం, సంకుచిత ప్రయోజనాలను సాధించడంలో నిమగ్నమైతే అదేదో రాజకీయ పక్షం తరపున ప్రచారం సాగించడం మాత్రమే అవుతుందిగాని రసవత్కావ్య సృష్టి అనిపించుకొంటుందా అనేది.

ఇప్పుడు రెండవ దానికి మొట్టమొదట సమాధానం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఔను నిజమే. కొన్ని రాజకీయ కక్షలు అభ్యుదయ రచయితల భావాలను తీసుకొని ప్రచారం సాగించడమూ, కొన్ని రాజకీయ పక్షాల ఆశయాలవల్ల ఉత్తేజితులై రచయితలు కావ్యాలను నిర్మించడమూ, రెండూ జరుగుతున్నాయి. ఇందుకు ఒక్కటే కారణం. రచయితనూ, రాజకీయవాదినీ ఇద్దరినీ జీవితమే ఉద్బోధిస్తుంది. జీవితంలో ఒక దానినొకటి ప్రతిఘటించే రెండు భిన్న వర్గాలు ఉన్నంతకాలం, అభిమానాల విభజన కూడా అస్వాభావికం కాజాలదు. ఈ వర్గ భేదాలవల్ల ప్రవర్తిల్లే సాంఘిక దురన్యాయాలను ప్రతిఘటిస్తూ కొందరు, సమర్థిస్తూ కొందరు ఉంటారు. ఈ సమర్థిస్తున్న వారిలో కొందరి కవి దురన్యాయాలుగా కనబడకపోవచ్చునని కూడా ఒప్పుకోవచ్చును. ఏమైనా ఇటువంటి రెండు వర్గాలున్న మాట ప్రత్యక్ష సత్యం. చిత్తశుద్ధిగల ప్రతి రచయితా ఎప్పుడో ఒకప్పుడు బాహాటంగా తన కభిమానం ఉన్న వర్గం తరపున చేరుకుంటాడు. అపుడతని రచనలలో అతని అభిమానాలు ప్రతిఫలించక తప్పదు. తాటస్థ్యమనేది జీవితానికి విరుద్ధం. గబ్బిలపు బ్రతుకుగా కొందరు అటూ ఇటూ ఊగిసలాడితే ఆడవచ్చును. కాని తమ ప్రయోజనాలు, వర్గ ప్రయోజనాలు ఏకీభవించినప్పుడు నిజమైన రంగు తేలిపోతుంది. రచనలకు రాజకీయాలకు ఉన్న సంబంధం ఇదే. ప్రచారం నిమిత్తం కాకపోతే రచయిత తన రాతలనెందుకు బయటపెట్టాలో నాకు తెలియదు. ఏదో ఒక భావాన్ని ప్రచారం చేయకుండా శూన్యంలో వెలువడ్డ కావ్యాన్ని నేనింకా చూడవలసి ఉన్నది. చింతామణి నాటకంలో శ్రీకృష్ణుడు ప్రత్యక్షమైతే, 'ముందడుగు' నాటకంలో ఎఱ్ఱజెండా సాక్షాత్కరిస్తుంది.

ఈ ప్రచారం తగాయిదా గురించి ఇంకా కొంత చెప్పవలసి వుంది. స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు బ్రిటన్‌లోని రచయితలు ఒక ప్రశ్నావళికి జవాబిచ్చారు. చట్ట సమ్మతంగా ఏర్పడ్డ రిపబ్లికన్ ప్రభుత్వం మీద జనరల్ ఫ్రాంకో లేవదీసిన తిరుగుబాటు గురించి తమ తమ అభిప్రాయాలను ఈ రచయితలు తెలియజేశారు. రచయితల వర్గాభిమానాలకు సరిగ్గా ఆ అభిప్రాయాలు సరిపోయాయి. రాల్ఫ్‌ఫాక్స్ వంటి వీరుడు తన అభిప్రాయాల కోసం స్పెయిన్ యుద్ధంలో ఆహుతి అయిపోయాడు. రాయ్ కాంప్‌బెల్ అనే కవి మాత్రం చిరకాలానుగతంగా వస్తున్న ప్రభువు. బానిస సంబంధమే తనకిష్టమన్నాడు. ఫ్రాంకో గెలిచి పరిపాలన సాగిస్తున్నప్పటికీ రాయ్ కాంప్‌బెల్ అభిప్రాయం గొప్పదని గానీ రాల్ఫ్‌ఫాక్స్ వ్యర్థంగా మరణించాడని గాని అనలేము గదా! స్పెయిన్ అంతర్యుద్ధంవల్ల ప్రేరేపించబడి ఎన్నో ఉదాత్త కావ్యాలు ఆంగ్లంలో వెలువడ్డాయి.

కేవలం సాహితీ దృష్టిని చూచినా సంతృప్తి కలిగించగలిగిన కావ్యాలివి. ఒక సంఘటన తన్ను తీవ్రంగా కలచినప్పుడే కవి కావ్యం వ్రాస్తాడు. అది ప్రజలలో నైతిక జిజ్ఞాస రేకెత్తిస్తుంది. ఈ నీతిని సూటిగా కవి ఉపదేశించనక్కరలేదు.

తాను ఏ సాంఘిక దురన్యాయాలను నిర్మూలించాలని ఆవేదన పడుతున్నాడో, వాటి నిర్మూలనకే ఒక రాజకీయ పక్షం కూడా ప్రచారం సాగిస్తే, కవి తన శిల్పాన్ని తప్పకుండా ఆ పక్షానికి అంకితం చేసి తీరుతాడు. అది లోపల నుంచి పుట్టుకవచ్చే ప్రేరేపణగాని, బలవంతంగా విధించిన నిర్బంధం కాదు. అప్పటి మట్టుకు అధికారంలో వున్న వారిని రంజింపచేయడానికి స్తోత్రపాఠాలు వల్లిస్తూ, ఆయా సమయాలకు అనుకూలంగా తమ అభిప్రాయాలను సవరించుకునే రచయితలను గురించి ఈ మాట అనలేముగదా!

ఇది ప్రచారం, ఇది శుద్ధ శిల్పం అని ఏ రచననూ వేరుపరచలేము మనకు నచ్చని భావాలైతే ఏవగించుకుంటాము. నచ్చితే మరీ మరీ చదువుతాము. రెండు విధాలా ఆ రచన మన మీద తన ప్రభావం ప్రసరింపచేస్తూనే ఉంది. ఒకటి ప్రతికూల ప్రచారమూ, ఇంకొకటి అనుకూల ప్రచారం.

ఇక అభ్యుదయ రచయితల మీద రెండవ ఆక్షేపణ, వారి కావ్యాలకు శాశ్వతత్వం ఉండదనేది. కాలం చెప్పవలసిన తీర్పును ఈ ఆక్షేపకులే చెప్పి వేస్తున్నారు. తాత్కాలిక సమస్యల మీద రచనలు సాగిస్తే, ఆ సమస్యలు తీరిపోయిన పిమ్మట ఆ రచనలు నిలువవంటారు. తాత్కాలికం కాకుండా సర్వకాలికమైన సమస్యలుగాని విషయాలుగాని ఏవో ఉంటాయనుకునే పొరపాటే, ఈ ఆక్షేపణకు మూలం. ఉత్తమ వస్తు స్వీకరణం, ఉత్తమ నాయక సంవరణం, ఇటువంటి పెద్దపెద్ద మాటల అడుగున ఈ పొరపాటే పని చేస్తూ వుంది. ప్రత్యంశమూ స్వీకార్యమే. ప్రతి సమస్యా తాత్కాలికమే. ఈనాడు కాలేజి విద్యార్థులు చదువుతారని షేక్సియరు తన నాటకాలు రాయలేదు. తన కాలంలో, తన కండ్ల ఎదుటగల ప్రేక్షకులనే ఉద్దేశించి రాశాడు. చిరస్థాయిత సిద్ధించిందేమో! నేటి సమస్యలను సహేతుకంగా చర్చించి, సక్రమంగా పరిష్కరించుకోగలిగితే, అది నేటి రచయితలకు ధన్యత. శాశ్వతత్వాన్ని ప్రసాదించే గుణాలను వెదుక్కుంటూ, తక్షణ జీవితాన్ని ఎదుర్కోవడం వీరు మానలేరు.

తెలుగునాట మూడేండ్లలో అభ్యుదయ రచయితలు ఒక విశిష్టమైన స్థానం సంపాదించగలిగారు. వీరి ఉద్యమం యువకులను ఆకర్షిస్తుంది. వృద్ధులను కలవరపరుస్తుంది. అందుకే దీనియందు నా కాదరం. వృద్ధులు, యువకులు అని నేను ఉపయోగించిన మాటలను వయస్సుపట్ల అన్వయించుకోరాదని నా మనవి.

ఆంధ్ర జీవితంలో ఉత్సాహం, కార్యదీక్ష – ఈ రెండూ వెల్లివిరిసే సన్నివేశాలు అరుదు. అభ్యుదయ రచయితలు ఈ రెంటినీ సమర్థంగా జోడిస్తున్నారు. ఇదే వీరి దినదినాభివృద్ధికి కారణమని నేననుకుంటున్నాను.

(ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మూడో మహాసభను 1945 డిసెంబరు 31న రాజమండ్రిలో ప్రారంభిస్తూ చేసిన ఉపన్యాసం – దేవులపల్లి కృష్ణశాస్త్రి సభాధ్యక్షులు)

**ముద్రణ : తెలుగుతల్లి, మాసపత్రిక మార్చి, 1946**

# సాహిత్యం ఎందుకు? ఎవరికి?

సామాజిక జీవితం లేకపోతే సాహిత్యం అనేదే సాధ్యం కాదు. ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే సాహిత్యం ఎందుకు? అనే రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది. ఎందుకంటే సమాజాభివృద్ధికనీ, ఎవరికంటే ప్రజలకీ అని

కాని ఈ సమస్యలింత సులభంగా సూక్ష్మంగా పరిష్కారం అయిపోగలిగినవి కావు. అభివృద్ధి అంటే ఏమటి? ప్రజలంటే ఎవరు? అనే ప్రశ్నలు మళ్లీ బయలుదేరుతాయి. వాటికి జవాబిచ్చే ప్రయత్నంలో మరికొన్ని కొత్త ప్రశ్నలెదురవుతాయి.

ఇప్పుడు రాస్తున్న రచనలన్నీ అభివృద్ధికే దారితీస్తున్నాయా? ఈ రాస్తున్నవన్నీ ప్రజల అందుబాటులోకి వస్తున్నాయా? అసలీ సాహిత్యం పట్ల ప్రజలేమాత్రం సుముఖంగా ఉన్నారు? దాదాపు నూటికి 90 పాళ్ళు నిరక్షరాస్యులుగా దరిద్రులుగా ఉంటూన్న ప్రజలకు మీ పాటలూ, పద్యాలూ, కథలూ, కబుర్లూ చెవికెక్కుతున్నాయనే నమ్ముతున్నారా? అటువంటి అవకాశం లేనప్పుడు ఇక మీ సాహిత్యం ఎందుకు?

సాహిత్యంలో ఏ మాత్రం సంబంధం ఉన్నవారైనా ఈ ప్రశ్నలను గురించి తీవ్రంగా ఆలోచించక తప్పదు.

ప్రజాసామాన్యానికి సాహిత్యం అందుబాటులో లేదన్న యదార్థాన్ని గుర్తించక తప్పదు. స్వతహాగా దాన్ని అందుకోడానికి వారు అనర్హులు కారని కూడా గుర్తించాలి. కొన్ని ప్రతిబంధకాలు అడ్డుపడి ప్రజలు సాహిత్యానికి నాడు దూరమైపోయారు. ఆ ప్రతిబంధకాలను తొలగిస్తే సాహిత్యానికి ప్రజల ఆదరం దొరుకుతుంది. ఎక్కడ సాహిత్య సభలు జరిగినా ప్రజలు తండోపతండాలుగా వస్తూ ఉండడమే వారిలో ఉన్న తీవ్రకాంక్షకు నిదర్శనం. అట్టి కాంక్షను సంతృప్తిపరచకపోతే ఆ లోపం రచయితలదే అవుతుంది.

నిజానికి లోకాన్ని నిరాకరించి ఏ రచయితా కావ్యం అల్లలేదు. లోకాతీతమైన విషయాలు రాస్తున్నానని యెవడైనా అనుకుంటే అంతకంటే ఆత్మవంచన ఇంకొకటి ఉండబోదు. రచయితలకు ఆత్మవిశ్వాసం ఉండవలసిందే. కాని ఆ దృఢ విశ్వాసం ఇతరులపట్ల అలసభావంగా పరిణమించకూడదు. 'నేను చాలా గొప్పవాణ్ణి కాని నన్నెవ్వరూ గుర్తించకుండా ఉన్నారనుకోవడం తప్పు. గొప్పతనంలో ఉన్న గొప్పతనం గుర్తించబడడంలోనే ఉంటుంది.

అందుకే పేరు ప్రఖ్యాతులు వచ్చిన ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక విశేషం ఉంటుంది, ఉండి తీరుతుంది. అలాగే ఒక విశేషం ఉన్నప్పుడు దాన్ని గుర్తించగలిగినవారు కూడా ఉంటారు.

ప్రజాసామాన్యానికి మొత్తం మీద ఉండే ఒకానొక ఇంగితజ్ఞానమే నాయకత్వానికి తూకం వేస్తుంది. జీవితంలోని అన్ని శాఖలకూ – కళ, సాహిత్యం, పరిపాలన, నీతి – అన్నిటికీ ఈ సమిష్టి జ్ఞానమే నికషోపలం. కాబట్టి, దేని ప్రాశస్త్యాన్నైనా, నిర్ణయించవలసిన వారు ప్రజలే.

అటువంటి ప్రజలు ఈనాడు అంధకారంలో, అజ్ఞానంలో, దారిద్ర్యంలో అలమటిస్తున్నారు. వీరినిట్టి స్థితిలో ఉంచడం కొందరికి లాభదాయకం. కాబట్టి స్వప్రయోజనం కోసమని ప్రజాభివృద్ధిని వీరు నిరోధించక తప్పడంలేదు. ప్రజలలో జ్ఞానం వృద్ధి అవుతున్నకొద్దీ ఇటువంటి వారికి ఆటకట్టు అయి తీరుతుంది. ప్రజలు అజ్ఞానంలో మగ్గుతూ ఉండడం ఎవరికైనా లాభకరం కావచ్చును కాని రచయితలకు మాత్రం కాదు. ప్రజాసామాన్యం నికృష్టస్థితిలో ఉంటే రచయిత కూడా ఆ స్థితిని దాటలేడు. నిజమైన వికాసాన్నీ, ప్రబోధాన్నీ ఇచ్చే శక్తి సాహిత్యానికే ఉన్నప్పుడు దానిని రచయిత ప్రజాయత్తం చేయకుండా ఉండలేడు. గాయకుని సంగీతం, చిత్రకారుని బొమ్మలూ, నటుని అభినయం, సాహిత్యపరుల రచనలూ ఎందుకంటే ప్రజలను ఉత్తేజపరచడానికే. ఇది అన్ని కాలాల్లోనూ జరుగుతున్న పని. ఈనాడు ముఖ్యంగా జరగవలసిన పని.

సాహిత్యానికి ప్రజలు దూరమైపోయినట్లే ప్రజలకు సాహిత్యపరులు కూడా దూరమైపోతున్నారు. ప్రజలను కలవరపరిచే సమస్యలతో నిమిత్తంలేకుండా వీరందరూ ఎవరి ప్రాకారాలలో వారు జీవిస్తున్నారు. ఇందువల్ల ప్రజలకూ రచయితలకూ పెద్ద అఖాతం ఏర్పడింది. ప్రజల సమస్యలే తన సమస్యలని రచయిత గ్రహించలేకుండా ఉన్నాడు. ఎవరికీ బోధపడని రాతలురాస్తున్నాడని రచయితపట్ల ప్రజలు ఔదాసీన్యం వహించడం తటస్థిస్తోంది. ఈ విధంగా ఇరువురి మధ్యనూ ఏర్పడ్డ అఖాతం నానాటికి మరింత హెచ్చిపోకుండా చేయాలంటే రచయితలే ముందుగా ప్రజలవైపు చెయ్యి జాచవలసి వుంటుంది. నేను ప్రజలకంటే అధికుణ్ణనిగాని, అతీతుణ్ణనిగాని, రచనలు వారి కోసం రాయడంలేదనిగాని అనుకొని ప్రయోజనం లేదు. సమాజంతో సంబంధం వదలుకొని సమాజం తన్ను ఆదరించలేదని బాధపడే రచయితను చూచి జాలిపడడంతప్ప మరేమీ చెయ్యలేము.

నేటి ధనస్వామ్య వ్యవస్థలో సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే ప్రశ్నలకు చటుక్కున స్ఫురించే జవాబులు కూడా లేకపోలేదు. రచయితలలోనున్న ఎన్నో కల్మషాలను పట్టి చూపించే జవాబులవి. ఈ వ్యవస్థను ఎందుకు మార్చవలసి ఉందో చూపించడానికి ఈ జవాబులూ, వీటి వెనక ఉన్న మనస్తత్వమూ ఉపకరిస్తాయి.

సాహిత్యం ఎందుకు? డబ్బుకోసం. సాహిత్యం ఎవరికి? ధనమున్న వారికి. ఇవీ ప్రస్తుత వ్యవస్థలో స్ఫురించే జవాబులు.

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభమైన సరికి ధనస్వామ్య వ్యవస్థ పారమ్యం పొందింది. స్వచ్ఛంద వ్యాపారం అనే సూత్రం నిరాఘాటంగా రాజ్యం చేసింది. దీని ఫలితంగా ఆఫీసు కుర్రాళ్లు కోటీశ్వరులయ్యారు. తిరుగుబోతులు సామ్రాజ్య నిర్మాతలయ్యారు. వారి జీవితాలు స్వయం సహాయానికి ఉదాహరణలయ్యాయి. అట్టి పనులను ముందుతరాల వారికి ఆదర్శప్రాయులుగా చూపించడం జరిగింది. 'నేను జీవితం ప్రారంభించినప్పుడు జేబులో మూడు షిల్లింగులు లేవు. ఇప్పుడు నేను మూడు కోట్ల పౌన్లను కేవలం దానధర్మాలకింద వినియోగించగలుగుతున్నాను' అని ఒక కోటీశ్వరుడంటే స్వచ్ఛంద వ్యాపారానికి జై అనక తప్పింది కాదు లోకానికి. కొత్తకొత్త యంత్రాలు, రైళ్లు, స్టీమర్లు, తపాలాలు, తంతి, నిస్తంత్రి వార్తలు, కాలాన్నీ, దూరాన్నీ జయించడం – ధనస్వామ్య వ్యవస్థకు అసాధ్యమన్నదే లేదన్నట్లు కనబడింది. నిర్మాణ దృష్ట్యా ధనస్వామ్యం ప్రపంచమంతటా ఒక బలిష్టమైన వల అల్లివేసింది. అడుగున ప్రారంభించడం, ఒక్కొక్క మెట్టుగా ఎక్కడం, శిఖరం అందుకోవడం! జీవితం ఈ సింపుల్ ఫార్ములా కి రెడ్యూస్ అయిపోయినట్లు తోచింది.

కాని ఈ శతాబ్దంలో యాభై సంవత్సరాలైనా పూర్తి కాకుండానే రెండు ప్రపంచ మహాయుద్ధాలు ఒక దాని కన్నా ప్రచండంగా ఇంకొకటి చెలరేగాయి. గత శతాబ్దంలో హెచ్చరికలు చేసిన వారి జోస్యాలు ఫలించడం మొదలుపెట్టాయి. స్వేచ్ఛా వ్యాపారం స్పర్థలకీ, అనర్థాలకీ, యుద్ధాలకీ దారి తీస్తుందనీ, ధనస్వామ్యవ్యవస్థలో గర్భితంగా ఉన్న పరస్పర వైరుధ్యాలే దాని పతనానికి కారణమవుతాయనీ, తర్వాత అంతకన్నా న్యాయబద్ధమైన, సామ్యసిద్ధమైన వ్యవస్థ ఏర్పడుతుందనీ చేసిన జోస్యం ఫలోన్ముఖానికి వస్తోంది.

ప్రపంచం ధనస్వామ్య వ్యవస్థలోంచి సామ్యవాద వ్యవస్థలోకి రెండు మహామారణ హోమాల ఫలితంగా మారిపోతున్న ఈ సంధియుగంలో మనం జీవిస్తున్నాము. ఈ దృక్పథాన్ని అలవరచుకోకుండా ఇంకా పాత బాటలలోనే పాత పాటలతోనే కాలం గడుపుతూన్న రచయితలున్నారు. వారు ఆరాధిస్తున్న ఆదర్శాలు బహిరంగంగా పరువు పోగొట్టు కొంటున్నప్పటికీ ఇంకా వాటినే పట్టుకొని ప్రాకులాడుతున్నారు. అయినా వీరి విషయమై మనం ఎక్కువగా బెంగ పెట్టుకోనక్కరలేదు. ఒక కొత్త శక్తి, కొత్త చైతన్యం, కొత్త పట్టుదల ప్రపంచ ప్రజలలో వ్యాపించింది. అభ్యున్నతికి దారి తీసే శక్తి అది. ఇది వరకు ఆ శక్తి కొక గొంతుక లేకపోయింది. ఇన్ని యుగాలుగా అణచిపెట్టబడిన ఈ శక్తి ఇప్పుడు విజృంభిస్తోంది. బలప్రయోగంవల్లగాని, మాయోపాయాలవల్లగాని ఎవ్వరూ దీనిని అరికట్టలేరు.

ఈ శక్తిని ఉద్దీపింపజేసే రచనలు సాగించడమే సాహిత్యపరుల కర్తవ్యం. అందువల్ల ప్రజల పురోగమనానికి రచయితలు తోడ్పడిన వారౌతారు. లేనప్పుడు రచయితలే వెనకబడి ప్రజలలో నుంచే సాహిత్యవీరులు బయల్దేరుతారు. రచనల ప్రాశస్త్యానికి కొలతబద్దలు మారిపోతున్నాయి. ఈనాడు నలుగురు మిత్రుల మధ్య కూర్చొని పద్యం చదవడానికి బదులు నాలుగు వేల జనాభా ముందు మైక్‌లోకి తన సందేశం విసురుతున్నాడు కవి. రచయితకూ, పాఠకునికీ మధ్య వచ్చిన పెద్ద మార్పు ఇది. ఈ మైక్రోఫోన్ ముందు ఒకటిన్నర చరణాలు

చదివి వేల కొలది ప్రజలను ఉద్రూతలూగించవచ్చును. సంఘ చైతన్యానికి ప్రాతినిధ్యం వహించిన రచయితకు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. మన ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా యంత్రయుగము మనకు సంప్రాప్తించింది. మనలో మనం కొట్లాడుకొని ఈ యంత్రాలకు బానిసలమై వీటికే బలి అయిపోవడమా, లేక మన మందరం ఒకే కుటుంబం అనుకొని ఒక సమాధానానికి వచ్చి ఈ యంత్రమునే మన బానిసలను చేసుకొని జీవితాన్ని ఇంకా వైభవంగా సౌఖ్యవంతంగా అనుభవించడమా అనే ప్రశ్నకు రెండు జవాబులుంటాయని నేననుకోను.

(ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మూడో మహాసభలో (31.12.1945 నుంచి 2.1.1946) 'సాహిత్యం ఎవరికి? ఎందుకు? అనే అంశంపై జరిగిన సాహిత్య చర్చలో అధ్యక్షోపన్యాసం)

**ముద్రణ : తెలుగుతల్లి, మాసపత్రిక, మార్చి 1946**

# సాహిత్యంలో పాతా కొత్తా

తెలంగాణా రచయితలు తమ రచనలలో తెలంగాణాను సమగ్రంగా చిత్రించాలి. తెలంగాణాలో మాట్లాడే తెలుగుభాషకు కొన్ని ప్రత్యకతలు. కొంత వైశిష్ట్యము ఉన్నవి. తెలంగాణాలోని నుడికారాలను తెలుసుకోవాలని సర్కారు, రాయలసీమ ఆంధ్రులు కోరుతున్నారు. కనుక ఇక్కడి రచయితలు ఇచటి ప్రజల దైనందిన జీవితభాషనే వ్యక్తీకరించాలి. ఆ భాషను ఇతర ప్రాంతాల ఆంధ్రులు పరిహసిస్తారనే భయంతో ఇక్కడి రచయితలు వెనుదీయరాదు. ఆ మాటకొస్తే ఆంధ్రదేశంలో జిల్లా జిల్లాకు భాషలో భేదాలుంటాయి ప్రతి జిల్లా భాషలోను కొంత సొంపు ఉంటుంది.

రచయిత కాగితంపై కలంపెట్టి రాస్తున్నాడంటే అతనిపై పెద్ద సాంఘిక బాధ్యత ఉన్నదని తెలుసుకోవాలి. ఈ బాధ్యతను వారు నిర్లక్ష్యం చేయరాదు ఒక్కొక్కప్పుడు రాజకీయాలు సాహిత్యంపై ప్రభావం పడవేస్తూ ఉంటాయి. అంతమాత్రం చేత రాజకీయాలలోని కాలుష్యానికీ, విద్వేషాలకి సాహిత్యం కూడా భాగస్వామి అని ఆరోపించడానికి వీలులేదు. రచయితలు కూడా సామాన్య మానవులే. గనుక వారికి కొన్ని అభిప్రాయాలు, కొన్ని ఆశయాలు ఉండడం సహజం. అయితే అట్టి అభిప్రాయాలు, ఆశయాలు వారి రచనలను కలుషితం చేసేంత వరకు ఎన్నడూ రావు మానవసమాజ శ్రేయస్సు, మానవసేవ మొదలగు అత్యున్నతాశయాలచే ప్రభావితులై మాత్రమే రచయితలు ఉత్తమమైన రచనలు చేయగలుగుతారు.

సారస్వత సంస్థలు రాజకీయ పార్టీలతోను, "ఇజా"లతోను ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండరాదనే అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తాను. అయితే కొన్ని కొన్ని సందర్భాలలో కొందరు కవులు, రచయితలు కొన్ని రాజకీయ సంస్థలకుగాని లేక రాజకీయ వేత్తలకుగాని ప్రచారం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది ఇందుకు కారణం ఆయా రచయితల తత్వం ఆ రాజకీయ సిద్ధాంతాలతో ఏకీభవించడమే. దీనివల్ల రచయిత యొక్క ఆత్మ కలుషితమై పోయిందనడం సబబుకాదు. ఏమైనప్పటికీ రచయితలు స్వతంత్రంగా ఆలోచించి రచన చేయడమే ఉత్తమమైన మార్గం.

ఈనాటి తెలుగు రచనలు యిలా ఉంటున్నాయేమిటి? అని చాలా మంది అంటూ వుంటారు. ఇందుకు నా సమాధానం ఏమంటే ఆధునిక జీవిత పరిస్థితులు, నవీన భావాలు ఈనాటి రచయితలపై ప్రభావాన్ని చేస్తున్నవి. అనేక పరిసరముల ప్రభావాల మధ్య నేటి రచయిత నివసిస్తున్నాడు. అసలు నిజం చెప్పాలంటే రచయితకు సంబంధాలు ఎంత ఎక్కువగా ఉంటే అతని రచనలు అంత ఉత్తమంగా ఉంటాయి. ఈ విషయంలో తెలంగాణా రచయితలు ఇతర భాషా రచయితలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం నాకెంతో సంతోషంగా ఉంది.

సాహిత్యకంగా వాదోపవాదాలు ఉండకూడదనీ, అంతా ఒకే రాజమార్గంలో నడవాలనీ అనడం సమంజసంకాదు. రచనలు వైవిధ్యంగా ఉండాలని కోరుతున్నప్పుడు సాహిత్యం అంతా ఒకే తీరుగా ఎలా ఉంటుంది? అందుచేత వైవిధ్యం ఉండడం, వాటిపై వాదోపవాదాలు జరుగుతూ ఉండడం పరిపాటి అయిన సంగతేకాని అనభిలషణీయంకాదు. విమర్శ, ప్రతివిమర్శ అంటూ లేనిదే సమన్వయం అంటూ ఉండదు. అయితే అవి అన్నీ ఆరోగ్యదాయకంగా ఉండాలనిగాని అసహ్యకరంగా తయారుకాకూడదు. రచయిత అయినవాడు సకల విషయాలను సాంగోపాంగంగా పరిశీలించి సత్యాన్ని అన్వేషించాలి.

ఇక భాషా విషయం. భారదేశంలోని విశ్వ విద్యాలయాలు, ముఖ్యంగా మన ఆంధ్ర విశ్వవిద్యాలయం జడతాబంధంలో చిక్కుకొని చేతనారహితమై ఉంది. ఈ విశ్వవిద్యాలయాలు గతాన్ని భద్రపరిచే ప్రదర్శనాలయాలుగా ఉన్నాయేగాని భాషాపరిణామాలకు అనుగుణమైన విద్యాసౌకర్యాలను కలిగించేవిగా లేవు. వ్యావహారిక భాషను యావదాంధ్ర దేశం ఉపయోగిస్తున్నప్పటికీ ఆంధ్ర విశ్వవిద్యాలయం అనబడే విద్యాసంస్థ ఛాందసమైన పూర్వపు కట్టుబాట్లను తొలగించుకొని ముందుకు రావడంలేదు. ఆధునిక రచనలలో ఛందస్సు, భాషా సూత్రాలు బొత్తిగా లేవనుకోవడం పొరపాటు. ఏ విధమైన సూత్రాలు లేని భాష అంటూ ఎక్కడా ఉండదు. వాస్తవం చెప్పాలంటే భాష, సారస్వతం, పరిణామమనే సార్వజనిక సూత్రానికి లోబడి ఉంటాయి. భాషాభివృద్ధి అనే మహా ప్రవాహానికి ఫుల్‌స్టాపులు ఉండవు. మన అనుభవాన్ని బట్టి భాష పరిణామం చెందుతూ ఉండాలి. కాబట్టే కొత్త రీతులను శాస్త్రీయమైన గతి తార్కిక దృష్టితో పరిశీలన చేయవలసిందిగా నేను అనేకమార్లు మనవి చేసి ఉన్నాను. భాషా వికాసానికి ఇది అత్యంతావశ్యకమైనది.

కవిత్వం, పాత, కొత్త రీతుల మధ్య విద్వేషపూరితమైన వాదోపవాదాలు, అసభ్యకరమైన విమర్శలు ప్రతి విమర్శలు జరగడం సాహిత్యానికి గౌరవప్రదమైన విషయంకాదు. పాత, కొత్తలు రెండూ రెండు పద్ధతులు. వీటి రెంటికినీ మూలం, లక్ష్యం మాత్రం ఒక్కటే. తరచు ఇతివృత్తమే సాహిత్య స్వరూపాన్ని నిర్ణయిస్తుందని నా విశ్వాసం. ఎంకిపాటలను మరొకరీతిగా రాయడానికి వీలవుతుందని నేననుకోను. ఒక వేళ రాయగలిగినా ఆ అందం, ఆ సొగసు రావు. ఏ రచనా రీతిలోనైనా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చు. ఒక రచన ఉత్తమ సాహిత్యంగా స్థిరంగా నిలిచిపోవాలంటే దాని రీతి ఏదైనా, స్వరూపమేమైనా, ఆత్మీయమైన హృదయ పరివేదన అందులో ప్రస్ఫుటమై ఉండాలి.

(హైదరాబాద్‌లోని 12, 13 డిసెంబరు 1945న జరిగిన తెలంగాణా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సాహిత్య గోష్టిలో అధ్యక్షోపన్యాసం)

**ముద్రణ : విశాలాంధ్ర, దినపత్రిక (సంక్షిప్తం) 20.12.1953**

**మంజీర, మాసపత్రిక (పూర్తిపాఠం) జనవరి 1954**

# ఈ నిర్లిప్తత తాత్కాలికం

సభాసదులకు నమస్కారం. చాలా కాలానికి మనమంతా సమావేశమవుతున్నాము. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే మన మొదటి మహాసభ. మనకి ప్రత్యేక రాష్ట్రం. అసమగ్రంగానైనా ఆకృతి ధరించింది కాబట్టి తెలుగువారిని కలవరపరుస్తున్న సమస్యలెన్నిటికో పరిష్కారం చేయబడుతుందనుకున్నాము. ముఖ్యంగా రచయితల పరిస్థితులు బాగుపడతాయను కున్నాము. కాని మనం ఆశిస్తున్నదొకటైతే యధార్థం ఇంకొకలాగ కనపడుతోంది. ఎటు తిరిగినా ఏదో నిస్త్రాణా, ఏదో నిస్పృహ! ఫౌల్ చేసి గోల్‌చేసి గెలిచిన ప్రతీపశక్తులు పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్నాయి. అయిదారేళ్లకు పూర్వం అభ్యుదయ రచయితల సభల్లో పువ్వుల దండల్ని వేయించుకొని, పెళ్లికొడుకుల్ని చేయించుకొని జయజయధ్వానాల మధ్యన ఊరేగిన మిత్రులు కొందరీనాడు క్షుద్రప్రయోజనాల మరుమరీచకల వెంటపడి ఉద్యమ విచ్ఛిత్తికీ దారి తీస్తున్నారు. సరైన నేతృత్వం లోపించడం వల్ల యువకుల తరంలో కూడా ప్రమాదభరితమైన ఒకానొక నిరుత్సాహ నిరాశా ధోరణి తలయెత్తుతూన్న సూచనలు కనబడుతున్నాయి. ఇటువంటి సంకీర్ణ, సంక్లిష్ట వాతావరణంలో ఈనాడు మనం సమావేశమవుతున్నాము.

కాని ఒకటి మాత్రం నేను గట్టిగా చెప్పగలను. ఇప్పుడు గోచరిస్తూన్న ఈ నిర్లిప్తత కేవలం తాత్కాలికం మాత్రమే. పురోగమన శీలమైనది కాలం. పశ్చాద్దృక్కుల ప్రగల్భ ఘోషలకు లక్ష్యపెట్టక మానవమహోదయం దిక్కుగా క్రాంతి రథం కదలిపోతుంది. తొలి నుంచీ తెలుగుజాతి ప్రగతి మార్గంలో అగ్రేసరంగానే నిలిచింది. అవాంతరాలకు జడిసి ఆగిపోవడంగాని అనర్థాలకు లొంగి అలిసి పోవడంగాని, గతంలో జరుగలేదు. ఆ గతంలో జరుగుబోదు. సుస్థిరమూ, సుస్పష్టమూ అయిన విశ్వాసమే ఇక్కడ మనందరినీ ఏకత్రపరచిందని ఘంటా కంఠంగా హెచ్చరిస్తున్నాను.

స్వతంత్ర భారతదేశంలో, విశేషించి – స్వతంత్రాంధ్రదేశంలో ఏం చేయాలో తోచక తెలుగు మనిషి దిక్కులు చూస్తూ ఎంతోకాలంగా నిలబడిపోడు. ఇది నా అచంచల విశ్వాసం. ఇందులో రాజకీయాలు మిళితమై వున్నాయని పసిగట్టేవాళ్ళతో వాదించి ప్రయోజనం లేదని తెలుసును. మనది నూటికి నూరుపాళ్లు సాహిత్య సంస్థ అని, ఇందులో ఏ రాజకీయ పక్షానికీ

పెత్తనం ఉండబోదని మన ప్రణాళిక నిష్కర్షగా స్పష్టం చేసింది. కొన్ని ప్రధాన సూత్రాలకు కట్టుబడి, కొన్ని ప్రత్యేక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని మనం పని చేస్తాం. అందుకు కొందరు హర్షిస్తారు. మరి కొందరు అపహసిస్తారు. వీరి ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఈ సూత్రాల నవలంబించడంలోనూ, ఈ లక్ష్యాలను సాధించడంలోనూ మన నిజాయితీని నిలబెట్టుకోవాలి. అది పద్యం కానీండి, కథ కానీండి, నాటకం కానీండి, నవల కానీండి, మరే సృజనాత్మక, విమర్శనాత్మక రచన అయినా కానీండి – మనల్ని ఎటువైపు తీసుకు వెళుతోంది? ఎక్కడికి చేరుస్తుంది అన్నదే గీటురాయి.

సాంఘిక ప్రయోజనం – అదీ అభ్యుదయ రచయితల లక్ష్యం. ఇది ఈనాడు మనం కొత్తగా ప్రవచించడంలేదు. అనాది నుండి ఉత్తమ సాహిత్యంలో అనుస్యూతంగా కనబడుతున్న లక్ష్యణమే ఇది. తిక్కన మహాభారతం రచించినా, వేమన ఆటవెలది పద్యాలు చెప్పినా, నిన్నగాక మొన్న గురజాడ కన్యాశుల్కం నాటకం రాసినా వారందరూ అర్థించింది ఈ ప్రయోజనమే. సంఘానికి విరోధిననో, సంఘం నుంచి ప్రవాసిననో గోలపెట్టే రచయితలు కూడా కొందరు లేకపోలేదు. కాని వాళ్ళు నిత్య జీవితంలోకి కాస్త తొంగి చూస్తేచాలు, సంఘం చేకూర్చగల సదుపాయాలన్నింటిని వారు చక్కగా వదుక్కోవడం కనపడుతుంది. కొండొకచోట, సంఘానికి తామిచ్చిన దాని కంటే, చాలా రెట్లు అధికంగానే సంఘం నుంచి సంపాదించుకున్న వాళ్ళూ ఉన్నారు. అయినా వాళ్ళు మహాబాధలు పడుతున్నట్లు ఫోజులు పెడతారు. అది చూసి కొంతమందైనా ఔను కాబోలని జాలిపడక తప్పదు కదా!

మరికొందరున్నారు. వీళ్ళకైతే సంఘం గురించి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. వీరి దృష్టిలో నేటి సంఘం బగ్గం పాడైపోతోంది. కుర్రాళ్లు చెడిపోతున్నారు. ఆ యొక్క దిలీప మహారాజు కాలంలో అని వీరి పురాణం ఆరంభమవుతుంది. ఎన్నికలూ, ఎలక్ట్రిక్ దీపాలూ లేని కాలం, ఏనుగుచేత పూలదండను పంపించి కాబోయే రాజుని కనుక్కునే కాలం, (ఏం? అదీ ఒక రకం ఎలక్షనే!) భార్యలని జూదంలో ఓడిపోవడానికి, బజారులో అమ్ముకోవడానికి అనుమతించేకాలం, (సత్యకాలమంటే మరేమిటి?) ప్రపంచమంతా ఏడు ద్వీపాలు, ఏడు సముద్రాలు అని నమ్మే కాలం. కాలమే ఒక గడియారమై దాని 'కీ' వీళ్ల చేతిలో ఉంటే ఎన్ని యుగాలు మనల్ని వెనక్కు తీసుకు వెళ్లగలరో! అన్నట్టు, వీళ్ల దృష్టిలో మనం ఏది వెనకనుకుంటే అదే ముందు! వీరు కోరేది కూడా అభ్యుదయమే! అభ్యుదయ పరంపరాభివృద్ధి అనేగా మన ప్రతి ప్రబంధమూ ప్రారంభమయ్యేది? ఈ మాదిరి అభ్యుదయం కోసం శాసనాలు చేయాలనే కుతూహలంగల పరిపాలకులు కొందరు మనకు తటస్థపడుతున్నారు. పండితమ్మన్యులు కొంత మంది వారికి బాసటా తయారవుతున్నారు. వీరు నిర్బంధంగా మన విద్యార్థులనందరిని బహు భాషాకోవిదులుగా చేసేస్తున్నారు. ఒక

పదిహేనేళ్లు ఓపిక పట్టండి. మాతృభాష తెలుగు, పితృ భాష హిందీ, పితామహభాష సంస్కృతం, సోదరీ భాష కన్నడం – ఇలాగ ఒక పెద్ద అవిభక్త కుటుంబం ఆవిర్భవిస్తుంది. ఆహా! ప్రజాస్వామ్యం!! ఓహో మనోహర స్వప్నం!

హిమాలయెత్తుంగమైన ఈ ఆదర్శ శిఖరం మాట అటుంచి మనం ఆశించే అభ్యుదయం ఎలాంటిదో ఆలోచించుదాం. మనం కోరేది అందరికీ తిండి, అందరికీ వసతి, అందరికీ పని! ఇకనేం? ఇలాంటి అభిప్రాయాలు ప్రకటించడమంటే ప్రమాదకరమైన రాజకీయ ధోరణిలో పడిపోవడమన్న మాటే! మీ పాటలేవో, పద్యాలేవో మీరు రాసుకోకుండా రచనలోకి రాజకీయాలు తెస్తారేమిటని విసురు! కాని రామాయణాలు రాసే వాళ్ళకైతే మాత్రం రాజకీయాలు లేవనుకోవడం పొరపాటు. జీవితంలో మార్పు కావాలనే వారు కొందరు. అది అనవసరమేకాక అనర్థదాయకం అనే వారు కొందరు. ఈ పరస్పర విరుద్ధ భావాల సంఘర్షణలో జీవితం పురోగమిస్తుంది. అది సాహిత్యంలో కూడా ప్రతిఫలిస్తుంది. ఆ సంఘర్షణని చిత్రిస్తూ, అలా పురోగమనానికి దారి తీసే సాహిత్యాన్ని సృష్టించడమే అభ్యుదయ రచయితల ధ్యేయం. తండ్రి, తాత లార్జించిన ఆస్తివల్లగాని, పది మంది చేత చాకిరీ చేయిస్తూ వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం యివ్వకుండా కూడబెట్టిన డబ్బువల్లగాని సుఖంగా బతుకు వెళ్ళబుచ్చుతున్న వారికి, వారి ప్రయోజనాలకి రకరకాలుగా రక్షణలు కలిగించే రచనలు చేసే వారికి ఇప్పుడున్న పరిస్థితులు మారడమంటే యిష్టముండదు. ఇలా కాకుండా ఇంకో విధమైన జీవిత విధానం ఉందనీ, అందులో ఒక వ్యక్తి, యింకొక వ్యక్తిని దోచుకోవలసిన అగత్యం విలుప్తమవుతుందనీ, అందరూ ఆనందమయ జీవితం గడిపే అటువంటి విధానంలోనే మానవత్వం విశాలంగా వికసిస్తుందనీ విశ్వసించే వాళ్ళూ, అట్టి విశ్వాసానికి తమ రచనల్లో దోహదమిచ్చే వాళ్ళూ ఆ మార్పుని ఆహ్వానిస్తారు. అలాంటి మరో ప్రపంచం వైపు మహాప్రస్థానం సాగించడమే అభ్యుదయ రచయితల లక్ష్యం.

పారిశ్రామిక యుగంలో మనం యిప్పుడిప్పుడే ప్రవేశిస్తున్నాము. బుల్‌డోజర్లను ఉపయోగించడమంటే పవిత్రమైన భూమాత గుండెల్ని చీల్చడమే అని అపోహపడే మనస్తత్వం ఇంకా మనలో కొంతమందిని వదిలిపెట్టడం లేదు. “మనుష్యుడు ఎగరడమే భగవంతుని ఉద్దేశ్యమైతే మనం రెక్కలతోనే పుట్టి ఉండేవాళ్ళం” అన్నాడట వెనుకటి కెవరో పెద్ద మనిషి విమానాలు కనిపెట్టే ప్రయత్నాలను వెక్కిరిస్తూ! విమానాల దాకా ఎందుకు? భగవంతుడిచ్చిన కాళ్లనుపయోగించకుండా సైకిళ్ల మీద వెళ్లే వారి మీద శాపనార్థాలు కురిపించే ముసలమ్మలు కూడా ఉన్నారు. ఈ మధ్య నేను ఆకాశాలను జయించడం అనే ఫిలింను చూశాను. అందులో గంటకు పాతికవేల మైళ్ల వేగంతో కుజగోళం వైపు ప్రయాణం చేసే గగన నౌకకు నాయకత్వం వహించిన వ్యక్తి మధ్యదారిలో తన మనోధైర్యం కోల్పోయి, జేబులోంచి బైబిల్ తీస్తూ “నిక్షేపంగా బతకమని దేవుడు మనకు భూగోళాన్ని ప్రసాదించినా, కుజగోళం మీద కాలుపెట్టడం పాపం, భగవంతుని పట్లనే అపచారం” అని తిరుగు ప్రయాణానికి మరల తిప్పబోతాడు. అప్పటికప్పుడే

నౌకలోని టెలివిజన్ తెరమీదకు కుజగోళం కనపడుతూ ఉంటుంది. అయినా నాయకుడు బేజారెత్తిపోతాడు. తరువాత కథ తెరమీదనే చూడండని సవినయంగా మనవి చేస్తూ ఇక్కడ నేను చెప్పబోయేదేమిటంటే మానవవృద్ధి ముందుకు తీసుకుపోయే శక్తులతో పాటు, వెనక్కి దిగలాగే శక్తులు కూడా ఉన్నాయనీ, ఇవి లేవని కళ్ళు మూసుకోవడం పనికిరాదనీ, వీటి స్వభావాన్ని గుర్తించి అడుగడుగునా వాటిని ప్రతిఘటించి తీరవలసిందే అని!

పారిశ్రామిక విప్లవం వల్ల మానవుని మనఃప్రవృత్తిలో ఒక పెద్దమార్పు వచ్చింది. ప్రకృతి శక్తులకు మానవుడొక బానిస అనే దురభిప్రాయం పరాస్తం కావడమే ఈ మార్పు. ఆటం, హైడ్రోజన్ బాంబుల ఉదాహరణ చూపించి ఆధునిక విజ్ఞానం మానవ వినాశనానికే దారి తీస్తుందనుకోవడం పొరపాటు. ఏ మానవ మేధస్సు ఈ శక్తులను విడుదల చేసిందో, అదే వీటిని అదుపులోకి తీసుకువస్తుంది. ఇతోధికంగా జీవితాన్ని సుఖవంతం చేయడానికే ఈ శక్తుల్ని ఉపయోగిస్తుంది. శాస్త్రీయ విజ్ఞానం మానవునిలో స్వాతంత్ర్యభావాలు వికసించడానికి తోడ్పడుతుంది. ఈ స్వాతంత్ర్యం సమగ్ర రూపం ధరించినప్పుడు ఎదుటి వాడి స్వాతంత్ర్యాన్ని అపహరించడం అనే వ్యాపారానికి తావుండనే ఉండదు. స్వాతంత్ర్యం అవిభాజ్యం!

అందుచేత ఈ ఆధునిక విజ్ఞానమంతా తెలుగువారి కందుబాటులోకి వచ్చేటట్టు మనమందరం కృషి చేయాలి. సాహిత్యము అంటే కేవలం కథలూ, కవిత్వాలూ మాత్రమే కాదు. ఈనాడు మెకానికల్ ఇంజనీరింగుకి కాని, ఫొటోగ్రాఫీకి కాని ప్రత్యేకించబడ్డ పత్రికలు లేని మన సంస్కృతి దారిద్ర్యానికేమనుకోవాలి? యంత్ర సహాయం వల్ల బొమ్మలు తీసే ఫొటోగ్రఫీ ఎందువల్ల కళ అనిపించుకుంటున్నదో తెలిసిన వాళ్లెంతమంది? నేటి విజ్ఞానమంతా చేపట్టాలంటే ఏ మారుమూల సంస్కృత పదాలో – అవైనా గురికి బారెడు దూరం సరిపోయేవి గాలించి పారిభాషిక పదాలు సరఫరా చేసేదాకా మన కుర్రాళ్లు చేతులు కట్టుకొని కూర్చోవలసిందేనా? ఇప్పటికే నాగరిక ప్రపంచం ఎదుట ఎన్నో విషయాలలో వెనుక పడిపోయిన మనం ఇంకా ఎన్నాళ్లు నికృష్టంగా కాలం గడపాలి? యూరోపియన్ భాషలన్నింటిలో శాస్త్రీయపదాలు ఇంచుమించుగా ఒక్కలాగే ఉంటాయి. ఆ పద్ధతిన తెలుగు భాషలోకి ఆ పదజాలాన్నంతా యధాతథంగా ఎంత పెందరాళే తెచ్చుకుంటే అంత మంచిది. అంతేగాని కర్బనద్వ్యామ్ల జనిదము, ధనవిద్యుదావేశ అయస్కాంత తీగ అంటూ అర్థం పర్థంలేని వంకరటింకర దవడ నొప్పి మాటలకోసం ఆగిపోవలసిన అగత్యంలేదు. అన్యదేశ్యాలను దిగుమతి చేసుకోవడంవల్ల తెలుగు భాషలోని శుచీ శుభ్రతా మైలపడిపోతాయనే మడికట్టుకున్న వాళ్లని చూసి మనం జాలిపడాలి. ఇక్ష్వాకుల నాడు విధించిన నియమాలతో ఇప్పుడు భాషను నేర్చుకోవాలనే వారి చాదస్తం వల్లనే నేటి విద్యార్థులలో విషయపరిజ్ఞానం మృగ్యమైపోతోంది. విద్యార్థుల సంగతి అలా వుంచండి. అన్ని చదువులూ చదివి, బియ్యేలూ, ఎమ్మేలూ పాసై సర్వీస్ కమీషన్ పరీక్షలకు కూర్చున్న వాళ్లు కూడా నెహ్రూ అంటే అదోరకం వింత జంతువనీ,

రాజేంద్ర ప్రసాద్ అంటే అడయార్‌లో ఒక భవనమనీ – సరిగ్గా ఇవే ప్రశ్నలూ, ఇవే జవాబులూ అని గాదు – అసందర్భంలోనూ అజ్ఞానంలోనూ ఇందుకెంత మాత్రమూ తీసిపోని అవకతవకలు రాయడం మనకి తెలియనిది కాదు. "పనసపండు తెచ్చి పళ్లెంలో పెడితే తినలేని బ్రాహ్మణుడు దిక్కుదిక్కులు చూశాడని" మనకు పొడుపు కథ ఉంది. మన విశ్వవిద్యాలయాలూ, జాతీయ ప్రభుత్వాలూ ఈ పొడుపు కథ గురించి జాగ్రత్తగా ఆలోచించగలవని ఆశిస్తున్నాను.

సాధారణంగా ఏ ఉద్యమానికైనా ముఖ్య సూత్రాలన్నీ అంగీకార యోగ్యంగానే కనపడతాయి. ఈ మధ్య వంద మందికి పైగా రచయితలు సంతకం చేసిన దస్తావేజు చూస్తే అందులోని ఉన్నతాశయాలకు అభ్యంతరం చెప్పవలసిన అవసరమే కనపడదు. ఎటొచ్చీ ఈ ఆశయాలు ఆచరణలోనికి రావలసి వచ్చినప్పుడే తబ్బిబ్బులూ, తడబాటులూ, తికమకలూ వచ్చిపడతాయి. అందుకనే ఇటీవల నేను అఖిల భారతదేశపు పి.ఇ.ఎన్. (పెన్) క్లబ్బులో నా సభ్యత్వానికి రాజీనామా యిస్తూ అందుకు ఒకే ఒక కారణాన్ని పేర్కొన్నాను. "మానవ మాత్రుడినైన నాకు మహోన్నతాలైన మీ ఉత్తమాదర్శాలను అందుకోవటం కష్టంగా ఉందని, "సత్యం వధ, ధర్మం చర" అంటే కాదనేవాళ్లెవరు? వచ్చిన చిక్కల్లా ఆ సత్యం అనేదేమిటో, ఆ ధర్మం అనేదేమిటో విశదీకరించడంలోనే వుంది. ఎన్నడూ ఆదర్శాలను గురించే మాట్లాడేవాళ్లని ఎప్పుడూ మనము అనుమానించవలసే ఉంటుంది. అందుకనే అభ్యుదయవాదులకు కూడా కొన్ని ఆశయాలున్నప్పటికీ వాటినిక్కడ సవిస్తరంగా వల్లించడం మానేస్తూ ఆచరణ రూపంలోనికి వాటి ననువదించగల సాధనాల కోసం మనమందరమూ కలిసి అన్వేషించవలసిన ఆగత్యానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాను. ప్రతి రచయితా అమూల్యంగా ఎంచుకునే వ్యక్తిత్వానికిది ఎంత మాత్రమూ భంగకరం కాదు. విడివిడిగా ఏ ఒక్కడూ చేయలేని పనులు సాహిత్యానికి సంబంధించినవి ఎన్నైనా ఉన్నవి. కలసికట్టుగా పని చేయడంవల్ల వీటిని మనం సాధించగలం. ఎవడికి తోచినట్టు వాడు రాసుకోకుండా ఈ సంఘాలెందుకు, సమాజాలెందుకు, ఉద్యమాలెందుకు అనుకునే వారికి జవాబుగా మన కార్యక్రమాన్ని బహుముఖాలుగా రూపొందించవలసి వుంది.

మన కార్యక్రమంలో మొట్టమొదటిదీ. ముఖ్యంగా పేర్కొనవలసినదీ రచయితల ఆర్థిక పరిస్థితిని బాగుచెయ్యడం. చంద్రునిలోని అమృతాన్ని మాత్రమే సేవిస్తూ ఏ రచయిత కూడా ఎంతో కాలం జీవించలేడు. అందరిలాగే అతడు కూడా అన్నవస్త్రాల ఆగత్యం ఉన్నవాడు. ఈ విషయాల్లో నేటి ప్రభుత్వాలు అవలంబిస్తున్న పద్ధతులు కనుతుడుపుగానే పరిణమిస్తున్నాయి. రాజకీయ బాధితులకు భూములు కట్టబెట్టినట్టుగా అనుగ్రహ పాత్రులైన ఏ కొద్ది మందికో అంగవస్త్రాలను (అన్నవస్త్రాలనుకాదు) సమర్పించడంతో ఆగిపోతున్నారు. మన ప్రభువులు. మనలో కొందరు గిరీశాలు 'మా నేస్తం హైదరాబాద్ నవాబు వద్ద వెయ్యి సిక్కా రూపాయల ఉద్యోగం సంపాదించలేకపోతామా" అని అడియాసలు పెట్టుకోవచ్చు. సమష్టిపరమైన సమస్యను వ్యక్తిగతంగా పరిష్కరించాలని చూసే ప్రయత్నాలు నేడు పెచ్చుపెరిగిపోతున్నవి. అందువల్లనే

ఏ ఒక్కడికో పొడిగేదెలాంటి పదిలమైన ఉద్యోగమూ, పది మంది పస్తులతో మాడిపోవడమూ ప్రత్యక్షంగా కనపడుతోంది. అభ్యుదయ రచయితల సంఘం ఈ పరిస్థితులన్నింటినీ నిశితంగా పరిశీలించి తరుణోపాయాలను కనిపెట్టగలుగుతుందని నా ఆశ. నిరక్షరాస్యత పూర్తిగా నిర్మూలించబడ్డ పాశ్చాత్య దేశాల దాకా పోనక్కరలేకుండానే మన పొరుగున ఉన్న తమిళ రచయితలను చూసి మనం నేర్చుకోవలసిన గుణపాఠాలు చాలా వున్నాయని చెప్ప సాహసించినందుకు నన్ను క్షమించండి. ఇప్పుడున్న కాపీరైటు చట్టం ఎంతో అసమగ్రమే అయినప్పటికీ దాని ద్వారా తమకు సంక్రమిస్తున్న హక్కులు మన రచయితలలో ఎంత మంది వినియోగించగలుగుతున్నారు? పాతిక ముప్ఫయి సంవత్సరాలకి పూర్వం కంటే ఈనాడు రచయితగా జీవించడానికి ఎన్నో మార్గాలు తెరుచుకొని ఉన్నాయి. చీపురుకట్టలు పట్టుకోవడం ఆత్మగౌరవానికి భంగం అనుకోకుండా రచయితలు ఈ మార్గాలను శుభ్రం చేసి రహదారులుగా మార్చుకోవలసి ఉంది.

ఈ మార్గాలకు ఒక ఉదాహరణగా రేడియోను పేర్కొంటున్నాను. అభ్యుదయ రచయితల సంఘం ఏదో రాజకీయ పక్షానికి అమ్ముడు పోయిందని నిందారోపణలు చేసేవారిని నా మాటలు కాస్త జాగ్రత్తగా మననం చేసుకోవలసిందని అభ్యర్థిస్తున్నాను. మన రేడియో నూటికీ నూరుపాళ్లు ప్రభుత్వం జారీ చేసే తాఖీదులను అమలు పరిచే సంస్థ. కనీసం విశ్వవిద్యాలయాలకు ఉంటున్నదనుకున్న పాటి స్వపరిపాలనాధికారం కూడా రేడియోకి లేదు. స్వాతంత్ర్యవాయువులు పీల్చడానికి అలవాటు పడ్డ మనిషి మన రేడియో స్టేషన్లలో ఏ హోదాలో ప్రవేశించినా ఉక్కిరిబిక్కిరియైపోతాడు. అడుగడుగునా అక్కడ భయమో, రాజసమో ఎదురుపడతాయి. మన రాజ్యాంగం గ్యారంటీ చేస్తున్న వాక్స్వాతంత్ర్యం రేడియోకి సంబంధించినంతమట్టుకు శశవిషాణ ప్రాయమని చెప్పడానికి విచారిస్తున్నాను. సెన్సారు విధానం కూడదని నేనడంలేదు. వేలకొలది గృహాలలోకి సరాసరిగా ప్రవేశించి, లక్షలకొలది ప్రజానీకం చెవులలోకి సూటిగా ప్రసరించే రేడియో మీద అజమాయిషీ నిస్సందేహంగా అవసరమే. కాని సృజనాత్మక రచన మీద రేడియో ఒక గుత్త వ్యాపారం. పావుగంట పాటకీ, పావుగంట నాటికకూ యిచ్చే ప్రతిఫలంలో భేదం ఉంది. రేడియోలో ఉన్నంత ఎర్రటేపు ప్రభుత్వ సంస్థలలో ఇంకెక్కడా చూడబోమనుకుంటాను. ఇనుపచట్రం అనే మాట ఇక్కడ సార్థకం. ఈ మధ్య కొన్ని పత్రికలకీ, రేడియోలకీ జరిగిన వివాదం అందరికీ తెలుసుననుకుంటాను. దాని మంచి చెడ్డల మాట ఎలా వున్నా తొలి నుంచి తుది దాకా రేడియో అధికారులవలంబించిన మౌనవ్రతం మాత్రం క్షంతవ్యంగా కనపడదు. "కుక్కలు అరుచుకుంటూనే వుంటాయి. బిడారం సాగిపోతుంది" అని సర్‌శామ్యూల్ హోర్ అనుకుంటాను, ఆనాటి మన దేశభక్తుల్ని గురించి అన్నమాటలిక్కడ జ్ఞాపకం వస్తున్నాయి. అధికార గర్వం అంటే అదే! ఆనాటిది నిరంకుశ ప్రభుత్వం పోనీ అనుకుంటే ఈనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వంలో కూడా అదే దృక్పథం ప్రతిఫలించడం ఆశ్చర్యకరమే.

ప్రజాభిప్రాయాన్నింత తృణప్రాయంగా చూసే ప్రభుత్వ సంస్థలతో ఎలా వ్యవహరించాలన్నది చాలా క్లిష్టమైన సమస్య. దీనిని గురించి మనమంతా కలిసి జాగ్రత్తగా ఆలోచించాలి. గిడుగు రామమూర్తి పండితుని వంటి దిగ్గంతిని బాసటగా పెట్టుకొని ఒక నవ్య సాహిత్య పరిషత్తు మన విశ్వవిద్యాలయాల చేత వాడుక భాషను గుర్తించేటట్లు చేయలేకపోయిందంటే అందుకు కారణం వ్యావహారిక భాషోద్యమంలోని బలహీనత కాదనీ, పకడ్బందీగా అందుకు కారణం వ్యావహారిక భాషోద్యమంలోని బలహీనత కాదనీ, పకడ్బందీగా తయారైన ఈ ఇనుపచట్రపు బలాధిక్యమే అనీ చెప్పవలసి ఉంది. కాబట్టి ఇప్పుడు మన ఇంకొక కర్తవ్యం విశ్వవిద్యాలయాలలో జీవద్భాష అయిన వ్యావహారికాంధ్రానికి సముచిత స్థానం సంపాదించడానికి నిరంతరాందోళన సాగించడం. ఇది వరకటి కంటే యిప్పుడిది ఎక్కువ చిక్కులతో కూడుకున్న పని. అయినా మనం సర్వశక్తులనూ సంఘటితం చేసుకొని వాడుక భాష ప్రాధాన్యాన్ని విశ్వవిద్యాలయాలలో ప్రతిష్ఠించాలి వ్యావహారిక భాషావాదం ప్రజల ఉద్యమం. నేడు కాకపోయినా రేపైనా ఇది జయించి తీరుతుంది గ్రాంథిక భాష పరిమిత ప్రయోజనం కలదనీ, వాడుక భాష అపరిమిత ప్రయోజనం కలదనీ సిద్ధాంతీకరించిన గిడుగు పండితుని ప్రధాన సూత్రాల నింతవరకెవ్వరూ పరాస్తం చేయలేదు అయితే వాడుక భాష నెలాగ బోధించాలో తెలియక, సరైన పాఠ్యగ్రంథాలు లేక వాడుకలో క్రమక్రమంగా భాష పొందుతూ వచ్చే మార్పులను వివరించి, విశదీకరించే వ్యాకరణాలు లేక నేటికిన్నీ ప్రాథమిక పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాల దాకా అంతటా పాతకాలపు భాషాబోధనా పద్ధతులనే అంటిపెట్టుకుని ప్రాకులాడటం తప్పనిసరి అయింది పత్రికలలో, సినిమాలలో, రేడియోలలో ఈనాడు మొత్తం తెలుగుదేశంలో నూటికి తొంబయి పాళ్ళు వాడుకభాష వ్యాపించి ఉన్నప్పటికీ అధికార వర్గాలు మాత్రం ఈ యధార్థాన్ని గుర్తించకపోవడం శోచనీయం. అరసున్నాలకోసం విద్యార్థుల కాలమంతా వ్యర్థం చేస్తే విషయ పరిజ్ఞానం నిండుసున్నా అయిపోతుంది. కొమ్ములు తిరిగిన పండితులు రాసిన గ్రాంధిక భాషలో కూడా గిడుగు మహనీయుడు తప్పులు పట్టి ఆ భాషలో ఉన్న కృతకత్వాన్ని బయటపెట్టిన సంగతి మనకు తెలియనిదికాదు. అనాడు గట్టిగా నోరెత్తడానికి సాహసించలేక పోయిన వారు ఈనాడు తీసుకొచ్చి అభాసభూయిష్టమైన ఈ భాషను పునరుద్ధరించాలని చూస్తున్నారు. గతం కూడా వీరికిగల వర్తమానపు అవసరాలను గుర్తించనివ్వదు నిగళాలవంటి నియమాలకి నివాళి పట్టడం బానిస ప్రవృత్తికి ప్రధాన లక్షణం. భాషా విషయంలో ఇటువంటి పట్టింపులతో కరడుకట్టి పోతున్న మన విశ్వవిద్యాలయాలు ఏ మార్పునూ అంగీకరించలేని ఏకశిలా నగరాలుగా తయారవుతున్నాయి.

ఈ పరిస్థితులను సరిదిద్దడానికి అభ్యుదయ రచయితల సంఘం పూనుకోవాలంటే సమగ్రమైన నిఘంటువూ, సంపూర్ణమైన వ్యాకరణమూ, సలక్షణమైన ఛందశ్శాస్త్రమూ నిర్మించడానికి తన శక్తులన్నిటినీ కేంద్రీకరించాలి. ఇందుకుగాను దేశమంతటా భాష కోసం

కృషి చేస్తున్న పండితులనందరినీ కూడగట్టుకోవాలి. కనీసం అభ్యుదయ రచయితల సంఘపు ఆరవ మహాసభ జరిగేనాటికి బ్రౌన్ నిఘంటువును సరైన సంపాదకత్వం కింద వెలువరించగలిగితే కొంతలో కొంత కృతకృత్యులమయినట్లు సంతోషించవచ్చును. స్వర్గీయ మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారి "నుడికడలి" అనే అచ్చ తెలుగు నిఘంటువును కూడా వెలుగులోకి తీసుకురావడానికి మన సంఘం పూనుకోవాలి. అలాగే వ్యాకరణ నిర్మాణం కూడా! నా ఉద్దేశంలో ఇది నాగార్జునసాగర నిర్మాణం కన్నా కూడా కష్టమైన పని! "తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది" అని చాలా కాలం క్రిందట చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి గారన్నారు. ఇవి విద్యుద్దీపాల రోజులని మనం రుజువు చేయాలి. ఇక ఛందశ్శాస్త్రం సంగతి! ఛందస్సులతో నిమిత్తంలేనట్టు కనిపించే వచన గీతాల సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రవచించిన నేను ఛందోమార్గాలను గురించి మాట్లాడటం కొంత విడ్డూరంగానే కనపడవచ్చును. కానీ గణబద్ధమైన దొక్కటే ఛందస్సుకాదు. నియమిత స్థలాలలో యతి ప్రాసలను నిలబెట్టినంత మాత్రం చేత పద్యం ప్రాణవంతం కాదు. ఛందోరహస్యాలు గణయతిప్రాసలకు మాత్రమే పరిమితమైనవికావు. అంతేగాదు, తెలుగు ప్రతిభ గణబద్ధ ఛందస్సులలోకంటే మాత్రాబద్ధఛందస్సులలోనే ప్రస్ఫుటంగా ప్రభావిస్తుంది. వాడుక భాషకీ మాత్రాఛందస్సులకీ ఒక అవినాభావ సంబంధం ఉంది. సాహిత్య లోకంలో దీనిని మొట్టమొదటిసారిగా ముత్యాలసరాలనే పేరిట మహాకవి గురజాడ మనకు గుర్తు తెచ్చాడు. అయితే అప్పటికింకా కవిత్వానికి వాహనంగా గ్రాంథిక భాష ప్రాముఖ్యం వహించడం చేత గురజాడ గేయాలలో చాలా చోట్ల గ్రాంథిక రూపాలు కనపడుతూ వుంటాయి. ఒక కొత్త భూకండాన్ని కనిపెట్టడానికి బయలుదేరిన సాహస యాత్రికుడు గురజాడ! కన్యాశుల్కం మొదటి ముద్రణప్రతిలో కొన్ని కృతక వ్యావహారిక రూపాలున్నవన్న సంగతి మనం మరచిపోకూడదు. వాటినన్నిటినీ తరువాత తరువాత సవరించి వ్యావహారిక భాషకు వాల్మీకి అయినాడాయన. పండితులను సంతృప్తి పరచడానికి సుభద్రా పరిణయం వంటి ప్రబంధం రచించడానికి బదులు మాత్రాఛందస్సుల మీదనే ఆయన మరికొంత కృషి సాగించి ఉంటే మనకింకా ఎన్ని అమూల్య మణులు లభించి ఉండేవో?

రస ప్రపంచంలో గురజాడ ధ్రువతార అయితే వీరేశలింగం ఒక విజ్ఞాన సర్వస్వం. దురాచారాల గాఢాంధకారంలో నిద్రపోతున్న జాతిని మేల్కొలిపి విజ్ఞానపు వెలుగులు ప్రసరించిన మహనీయుడు. ఆంధ్రుల అభ్యుదయోద్యమానికి మూల పురుషుడు. ప్రతికూల శక్తుల ఝంఝా ప్రభంజనానికి చెక్కుచెదరకుండా నిలబడి శాఖోపశాఖలుగా విస్తరించిన వటవృక్షం. తెలుగులో మొట్టమొదటి వాస్తవిక నాటకం గురజాడ రచిస్తే మొట్టమొదటి వాస్తవిక నవలను వీరేశలింగం రచించాడు. తన కథలలో, కవిత్వంలో గురజాడ భావ విప్లవం తీసుకు వస్తే వీరేశలింగం తన జీవితంలోనే దాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించాడు. విభిన్న భావాల సంఘర్షణలో తాటస్థ్యానికి విరుగుడు శాస్త్రీయ విజ్ఞానమేనని ఇద్దరూ తమ రచనల ద్వారా ప్రచారం చేశారు.

గిడుగు గురజాడ, వీరేశలింగం! వీరు జల్లిపోయిన విజ్ఞాన బీజాలు యిప్పుడిప్పుడే ఫలవంతమవుతున్నాయి. అయినా అసలు వీరు పుట్టనేలేదన్నట్లుగానో, వీరు సలిపిన పరిశ్రమ అంతా విఫలమైయి పోయినట్లుగానో, ఏ శక్తుల మీద వీరు తిరుగుబాటు చేశారో వాటిని ఊత కర్రలుగా చేసుకొని వెనక్కి పోవాలని యీ యిరవయ్యో శతాబ్దపు 55వ సంవత్సరంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభ్యుదయ రచయితలమైన మనం గిడుగు సాంప్రదాయాలలో, గురజాడ కావ్యవాహినులలో, వీరేశలింగం విప్లవధోరణులలో ప్రాణవాయువులు పీల్చుకుంటున్న మనం, నిస్సందేహంగా ఆంధ్ర సాహిత్య పరిణామంలో అగ్రశ్రేణిని పయనిస్తున్న మనం, మళ్ళీ మనల్ని పాతరాతి యుగానికి పట్టుకుపోయే ప్రయత్నాలను సహిస్తామా అని ప్రశ్నిస్తూ జవాబుకోసం ఆగకుండానే (అది ఎలాగుంటుందో నాకు ఎలాగూ తెలుసు కాబట్టి) ఇంతటితో నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

(ఆంధ్ర అభ్యుదయ రచయితల ఐదవ మహాసభ 1955 జులై 30, 31 తేదీల్లో విజయవాడలోని షెహెన్‌షా మహల్లో జరిగింది. సభాధ్యక్ష స్థానం నుంచి చదివిన ఉపన్యాస పాఠం ఇది. ఈ సభలోనే శ్రీశ్రీ సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు.)

**ముద్రణ : అభ్యుదయ, మాసపత్రిక, జులై 1955**

# ఆధునిక సాహిత్యం

ఆధునికం అంటే తక్షణం కందుకూరి, గురజాడ ప్రత్యక్షంగా కనిపిస్తారు. దృగ్గోచరమవుతారు. ఆధునిక అంటే బ్రతికివున్న అని, ప్రాచీన అంటే చచ్చిపోయిన అని ప్రమాదకరంగా కొందరు అర్థం చేసుకుంటున్నారు. అట్లా అర్థం చేసుకోరాదు.

కవులలో వయస్సు తరగతులు వున్నాయి. 90 సంవత్సరాల వయస్సుగల వృద్ధ కవుల్లో బాల్యపు చిలిపితనం గోచరిస్తుంది. షష్టిపూర్తి వయస్సుగల విశ్వనాథ, తల్లావఝ్ఝల మంచి హుందాతనం ప్రదర్శిస్తున్నారు.

ఆధునిక ఆంధ్ర సాహిత్యం గురించి మాట్లాడమంటే అది సాధ్యమా? సాహిత్యం అంటేనే మహాసముద్రం. సముద్రం ఈదడం ఎంత కష్టమో సాహిత్యం గురించి ప్రసంగించటం అంత కష్టమే.

సాహిత్యంలో చెడ్డా మంచీ రెండూ వుంటాయి. మన విజ్ఞానాన్నిబట్టి విభజించుకోవాలి.

రచయితల శక్తి సామర్థ్యాలను కొలిచేది సాహిత్య ప్రామాణాన్ని బట్టే. కాని, ఒక్క గురజాడను కొలవడం మహాకష్టం. ఆరుద్ర అన్నట్లు, గురజాడను మన కవిత్వంతో కొలవడం జ్వరాన్ని అడుగుబద్ధతో కొలవడమే. జ్వరాన్ని కొలవాలంటే ప్రత్యేక యంత్రం, గురజాడ ప్రతిభను కొలవాలంటే ప్రత్యేక యంత్రం కావలసివుంటాయి. గురజాడ సామర్థ్యాన్ని కొలిచే యంత్రం పుట్టలేదేమో!

పరిణామ సిద్ధాంతానికి డార్విన్ మూలపురుషుడు. ఆనాటి తాటాకులపై గంటంతో రాసిన కవిత్వం యొక్క పరిణామ దశ ఈనాడు కాగితాలపై పెన్‌తో రాయడం. ఆనాటి రథం యొక్క పరిణామం ఈనాటి మోటారుకారు. ఆనాటి గుర్రంయొక్క పరిణామం ఈనాటి ఇంజన్. అట్లాగే ఆనాటి నన్నయ్య ఉత్పలమాల యొక్క పరిణామమే నేటి గేయం అని చెప్ప సాహసిస్తున్నాను.

పద్యాల్లో రెండు రకాల రీతులు వున్నాయి. పద్యరీతులు, వచనరీతులు. గురజాడ కవిత్వం వచన రీతిలో వుంటుంది. రాయప్రోలు కవిత్వం పద్యరీతుల్లో వుంటుంది. గురజాడ జనుల హృదయంలో స్పందన చేసే కవిత్వం రాశారు. ఇక నేను ప్రజల భాషకు మరీ దగ్గరగా పోవాలని ప్రయత్నిస్తాను.

నన్నయ పద్యాల్లో సంగీత రీతి వుంటే తిక్కన కవిత్వంలో ఛందోవచనం వుంటుంది.

నా పద్యాలు నిరాడంబరంగా వుండాలని అభిలషిస్తాను. ఇలాంటి పద్యాలు మేము రాయలేమా అని ఎవరైనా అంటే నాకు మహా ఆనందం. సాహిత్యంలో మహా కష్టసాధ్యమైన పని ఏది అంటే సులభంగా రాయడమే. సినిమాల ద్వారా ప్రజలకు దగ్గరగా వుండే బాక్సాఫీస్ హిట్ కోసం కృషి చేయక తప్పదు కదా.

మనం నవలా రచనలలో వెనుకబడి వున్నాం. అన్ని దేశాల వారూ ప్రజల సమగ్ర జీవితాన్ని చిత్రించే వందల పేజీల నవలలు రాస్తూ వుంటే మన వారు పట్టుమని పది పేజీలు రాయలేకపోతున్నారు. మన కృషి పెంపొందాలి.

విశ్వనాథ మహాప్రతిభావంతులే. వారు ప్రజల దగ్గరకు రాలేకపోతున్నారు. ప్రాచీన కాలపు మంచిని చూడడం వారికి అలవాటు. వారు మంచి వారు కనుక చెడ్డను చూడలేకపోతున్నారు.

చైనా రచయితలు సమాజంలోని ప్రతివర్గంలోనూ ప్రవేశించి, వారి స్థితిగతులను, మంచిచెడ్డలను అధ్యయనం చేసి రాస్తామని చెప్పారు.

నాటక రచయిత రంగస్థలం పైనే ఉద్భవిస్తాడని అబ్బూరి చెప్పిన విషయం అక్షరాలా వాస్తవం. నాటకరంగం ఒరవడి గురజాడదే.

యాంత్రిక నాగరికత యొక్క సౌలభ్యంలో కళారూపాలు మారుతున్నాయి. రేడియో నాటికలు రంగంలోనికి వచ్చాయి. చెవికి మాత్రమే వినిపించేటట్లు కంటికి పని తగలకుండా వుండేలా రాసే నేర్పరితనం సాధించాలి.

ప్రతివాడు అభ్యుదయాన్ని కోరి రాస్తాడు. అభివృద్ధి నిరోధకంగా వుండాలని ఎవరూ రాయరు. అది అభివృద్ధికరమా? అభివృద్ధి నిరోధకమాఅని ఆచరణలో తేలవలసిందే.

ఈనాడు రంగంలో వున్నది సహజీవనమా సర్వనాశనమా? అనేదే సమస్య. విధ్వంసపు పోటీయా? ముందుకు తీసుకుపోయే సహకారమా? అని ఆచరణలో తేలవలసిందే.

మనలో వన్యమృగాల పరస్పర హింసా సిద్ధాంతం పనికిరాదు. చీమల, తేనెటీగల సహకార సిద్ధాంతం, విధానం కావాలి. అదే మహా ఉత్తమం.

సహకార విధానానికి దారి తీసే, ముందుకు తీసుకుపోయే విధానమే అభ్యుదయ విధానం. తద్వ్యతిరేకమైనది అభివృద్ధి నిరోధకం.

(విశాలాంధ్ర సంస్కృతీ సభల (రాజమండ్రి) రెండో రోజున 'అధునిక సాహిత్యం'పై జరిగిన చర్చలో మాట్లాడింది.)

**ముద్రణ : విశాలాంధ్ర, దినపత్రిక, 14.2.1956**

# సజీవ రచన

భాషని, భావాన్ని వేరు చేసి చర్చించడానికి అంగీకరించాయి. కాబట్టి మొదట భాషా ప్రయోగం గురించి నేను రెండు ముక్కలు చెబుతాను. భాషంటే కొన్ని మాటలకు ఇంతవరకు సాహిత్యరంగంలో ప్రవేశార్హత లేకపోయింది. ఏ మాటనీ ఈ విధముగా వెలివేయటానికి వీలులేదు. అందరు మనుష్యులకూ జీవించే హక్కు ఎలా ఉందో, అన్ని మాటలకి సాహిత్యంలో ప్రవేశించడానికి అలాగే హక్కు ఉంది. ఈ సత్యాన్ని గుర్తుంచుకొని రీతినీ, ఔచిత్యాన్ని పాటిస్తూ పద ప్రయోగం చేయవలసి ఉంటుందని నా ఉద్దేశ్యము. రెండోది భావము విషయం ఇన్నాళ్లుగా మనం అతిలోక అమానుష ఆధ్యాత్మిక విషయాల గురించే ఆలోచిస్తూ నిత్యజీవితాన్నీ, సామాన్య మానవునీ మర్చిపోయామేమోనని నా అనుమానం. నిత్యజీవితంలో బయల్దేరే సమస్యలూ, సామాన్య మానవుని పురోభివృద్ధికి తోడ్పడే భావాలూ ఇక మీద సాహిత్యములో ప్రాధాన్యము వహించాలి.

మానవ చరిత్రలో ఇది వరకెన్నడూ కనీవినీ యెరుగని సదవకాశాలు ఈనాడు మనకు లభ్యమైనాయి. ముద్రణా యంత్రం, సినీమా, రేడియో ఇవన్నీ అసంఖ్యాకులైన ప్రజా బాహుళ్యానికి సరస రచనలు అందజేయగల అవకాశాలు. అయినా ఆయుధాలు ఎన్ని ఉన్నా దాన్ని ఉపయోగించవలసిన వాడు మానవుడే కాబట్టి ముందుగా అతని బాహ్య ప్రపంచంలో మార్పులకి అనుగుణంగా తన రచనా విధానాలనూ, మనః ప్రవృత్తులనూ మార్చుకోగలగాలి ఆయుధం స్వయంగా మంచిదీకాదు, చెడ్డదీకాదు. శస్త్రవైద్యునిచేతిలో వ్రణఖండన ద్వారా ఆరోగ్యాన్ని ఇవ్వ గలిగిన కత్తి హంతకుని చేతిలో ప్రాణహరణకి ఉపయోగిస్తుంది. నేడు మనకి లభ్యపడిన యంత్రాలు మంచికీ, చెడ్డకీ కూడా ఉపయోగించవచ్చును. ఈ మంచిచెడ్డల నిర్ణయం భవిష్యత్తుకీ వదిలిపెట్టడం భావ్యం కాదు. ఎప్పటికప్పుడే వీటిని మనం నిర్ణయించుకుంటూ ఉండాలి. ఈ పదసద్వివేచనకి ఒకే ఒక్క ప్రామాణ్యం నేను గుర్తిస్తాను. అదేమిటంటే సాహిత్యం ప్రజాసామాన్యానికెంత చేరువగా రాగలిగిందీ అని. ఈ దృష్టిని చూస్తే మనకున్న అవకాశాలకీ, మనం ఇంతవరకు సృష్టించగలిగిన సాహిత్యానికి హస్తిమశకాంతరం కన్పిస్తోంది. అనగా ఈనాడు సజీవ రచన వెలువడలేదని కాదు. రావలసినంత సమృద్ధిగా రాలేదనే నా ఆవేదన.

(సర్వధారి సంవత్సరం (1959) ఉగాదినాడు రేడియో వాళ్ళు ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం, చర్చలో శ్రీశ్రీ మాట్లాడిన భాగం. దీనికి బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షులు)

**ముద్రణ : వాణి, పక్షపత్రిక, 7.2.1959**

# సాహిత్యంలో లెనిన్

ఒకప్పుడు అనగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోనూ, ఆ తర్వాత సంవత్సరాల లోనూ ఈ ఇరవయ్యో శతాబ్దాన్ని అమెరికన్ శతాబ్దం అని అభివర్ణించే వారు. పిడుక్కీ అమెరికా, బియ్యానికీ అమెరికా, అన్నిటికీ అమెరికా! సాక్షాత్తూ అమెరికా అమరలోకమే అని నా చిన్నతనంలో ఎక్కడో చదివినట్లు జ్ఞాపకం! జర్మనీ పొంగు చల్లారింది. డాయిష్లాండ్ (జర్మనీ) ఊబర్ అల్స్ (అన్నింటికి పైది) కాలేకపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం మీద సూర్యుడస్తమించడం ప్రారంభించాడు. జపాన్ ఉదయ సూర్యుడుదయిస్తూనే ఉన్నాడు. కాని రష్యన్ విప్లవపు నిజమైన ఎర్ర సూర్యుడు అప్పుడే లేచాడు. యూరప్‌ను హడలగొట్టే భూతం లాగా కాక మానవజాతి సమస్తాన్నీ వెలిగించే కాంతిగోళం లాగ! అందుకే నేనంటున్నాను ఇది లెనిన్ శతాబ్దం అని! (ఇంకా ఈ శతాబ్దం ముగియడానికి 30 ఏళ్ళున్నా, ముందు కాలపు చరిత్రకారుల తీర్పును ఇప్పుడే పసికడుతూ!) పిడుగులాగ విరుచుకు పడ్డ లెనిన్ ధాటి ప్రపంచ పర్యాప్తమైనది. ఎన్నెన్ని సంవత్సరాలకైనా ఇంకా ఇంకా లెనిన్ భావాలు మానవజాతిని ప్రభావితం చేస్తూనే ఉంటాయి.

ఈ లెనిన్ భావాలే ఈనాటి తెలుగు కవిత్వాన్నీ, నాటకాన్నీ ప్రభావితం చేస్తున్నాయని నేనంటే ఆర్భాటం అనిపించవచ్చు. నాది పాక్షిక దృక్పథం అనవచ్చు. ఇతర ప్రోద్బలాలన్నింటినీ (అమెరికన్ ప్రభావంతో సహా) నిరాకరించానని నన్ను నిందించవచ్చు. సెక్సు, నేరం, హింస మొదలైన మనోవికారాలతో కూడిన అమెరికన్ విషవాయువుల విషయం త్వరలోనే ఎత్తుకుంటాను. ఇప్పటిమట్టుకు నేను విస్పష్టంగా చెప్పవలసిన దొక్కటే. ఔను నాది పాక్షిక దృష్టి. నేను సామ్యవాదోద్యమానికి నిబద్ధుణ్ణి! అనిబద్ధ రచనలన్నీ బాధ్యతారహిత రచనలనే నా ఉద్దేశం. ఆఖరికి తిరోగమన కవులు సహా భూతకాల వైభవానికి నిబద్ధులే! ఒకాయన నిద్రలో గుర్రు పెడుతున్నట్టుండే నిర్నిద్ర ధారావేగంతో రామాయణాన్ని చంపూకావ్యంగా తిరగరాస్తాడు. వర్ణాశ్రమ ధర్మాలని గుండెకు హత్తుకుంటాడు. ఏదో ఒక క్షుద్ర దేవతను పట్టుకొని భక్తిపారవశ్యంతో పద్యాలు రాస్తాడు. పైగా తనకి జ్ఞానపీఠ్ బహుమతి ఇవ్వకుండా చేస్తున్న వారిని చెడతిడతాడు (ఈ బహుమతి కేవలం ఐహికమే కాని ఆముష్మికం కాదన్న విషయంతో ఆయనకి నిమిత్తంలేదు).

పోతే ఇప్పుడు, ఏది కవిత్వం? ఏది నాటకం? ఈ రెండింటిలో ఏ ఒక దానితో, లేదా రెండింటితో లెనిన్ కేమిటి సంబంధం? చెప్పుకోదగ్గ కవిత్వమేదైనా అతగాడు రాశాడా? కనీసం ఒక ఏకాంక నాటికైనా రాశాడా? సాంప్రదాయక సాహిత్య విమర్శకుడు సదుపాయంగా ఇలాంటి ప్రశ్నలు వేసి, సాహిత్యాన్ని "పరిరక్షించానని" భావించుకుంటాడు. లెనిన్ ఎవడు? కేవలం ఒక రాజకీయవాది! కావ్యాలూ, నాటకాలూ "అమూల్యమైన" కళా విశేషాలు. (ధనస్వామ్యం వాటి మూల్యాన్ని నిర్ణయిస్తూ ఉంటుందిలెండి. కళలు సంబంధాన్ని బట్టి ఉంటాయి) ఆహా! పాలకవర్గం. పీడితవర్గం. వర్గాల సంఘర్షణ. సరిగ్గా ఈ గతితర్కం మీదనే కార్ల్‌మార్క్సు తన భావికాలపు స్వర్గభవనానికి స్పష్టమైన రేఖాచిత్రం గీశాడు. అయితే మార్క్సు స్వప్నశీలి! ఏదో పిచ్చి ఆలోచనలు చేసేవాడు! ఆ స్వప్నాన్నే వాస్తవం చేశాడు లెనిన్. (ఈనాటికీ కొంతమందికి కమ్యూనిస్టు మానిఫెస్టో కరాళదుస్స్వప్నమే!) మయకోవస్కీ చెప్పినట్లు మార్క్సు–

"అదనపు విలువను దొంగిలిస్తున్న

కన్నపు దొంగల్ని కన్నంలోనే పట్టుకున్నాడు"

లెనిన్ అదనపు విలువ సృష్టిస్తున్న వారికి అధికారం హస్తగతం చేశాడు. ఆ సుముహూర్తంలోనే ఒక నూతన ప్రపంచం ఆవిర్భవించింది.

"మరో ప్రపంచం మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది"

అని పాడేడొక తెలుగు కవి. ఎవడోకాదు. ఇప్పుడు మీ యెదుట నిలుచున్నవాడే. ఈ మరో ప్రపంచం పిలిచిన క్షణంలోనే ఆధునికాంధ్ర కవిత్వం జన్మించింది. ఎలాంటి సందేహమూ లేకుండా ఈ గీతానికి కర్తృత్వం వ్లాడిమిర్ ఇల్యిచ్ లెనిన్‌కు అందజేస్తున్నాడు. (అప్పటికింకా నేను అమెరికన్ జర్నలిస్టు జాన్‌రీడ్ రాసిన "ప్రపంచాన్ని కుదిపివేసిన పది రోజులు" అనే గ్రంధాన్ని చదవక పోయినా)

శ్రామికజన విప్లవానికి మంత్రసానితనం వహించి లెనిన్ సామ్యవాదమనే నగ్నమైన ఎఱ్ఱ నెత్తుటి కందు" జన్మించడానికి తోడ్పడ్డ సమయంలో పుట్టిన బిడ్డను పురిటిలోనే గొంతు నులిమి చంపడానికి ప్రపంచంలోని అభివృద్ధి నిరోధకులంతా శ్రీమాన్ విన్‌స్టన్ చర్చిల్ అండ్ కంపెనీ నాయకత్వం కింద గూడుపురాణి చేశారు. కాని ఆ ఆటలేవీ సాగలేదు. ఎంచేత? "రష్యా జోలికి పోవద్దు" అని గర్జించింది యావత్ ప్రపంచ కార్మికవర్గం "అన్ని అధికారాలూ సోవియట్లకే" అని ఆజ్ఞాపించాడు లెనిన్. బైబిల్ అంటుంది "ప్రపంచమా! జన్మించు అన్నాడు భగవంతుడు. ప్రపంచం జన్మించింది" అని! బైబిల్‌ను భగవద్గీతగా నమ్మేవాళ్ళు ఇదే సువార్తగా అంగీకరించుకోవచ్చు! కాని, నిరీశ్వరవాదినైన నేను మాత్రం వాస్తవానికి దగ్గరలో ఉన్నానని భావిస్తూ "సామ్యవాదమా జన్మించు! అని లెనిన్ అనగానే సామ్యవాదం జన్మించింది" అని నమ్ముతున్నాను

ఈ లెనినిస్ట్ సింక్రోట్రాన్ (ఎలక్ట్రాన్‌ల వేగం హెచ్చించే యంత్రం) నా భాషలోనే అత్యుత్తమ సృజనాత్మక రచనలకి ఉత్తేజం ఇస్తోంది. మన దేశంలోని తతిమ్మా జాతీయ భాషలన్నింటిలో ఏం జరుగుతోందో చెప్పగల అర్హత నాకు లేదు గాని, అన్ని భాషల్లోనూ కొంచెం అటూ ఇటూగా కవిత్వం నూరు డిగ్రీల కొలతకు చేరుకుంటున్నట్లు నా చర్మంతో గ్రహిస్తున్నాను. చారిత్రకంగా తెలుగులో అభ్యుదయ సాహిత్యోద్యమం 1930-40 మధ్యని ప్రారంభమయింది. ఈ దశాబ్దంలోనే నా "మహాప్రస్థానం" గీతాలలో అనేకం రూపొందాయి. సాహిత్యరంగంలో లండన్‌లోని ఇండియన్ అభ్యుదయ రచయితల ప్రణాళికా, రాజకీయరంగంలో ఆర్థిక మాంద్యమూ, తత్ఫలితమైన సామాజిక అశాంతీ సూటిగా నా రచనలెన్నిటికో ప్రోద్బలం ఇచ్చాయి. ఆ తర్వాత తెలంగాణా అగ్నిపర్వతం బద్దలయింది. అప్పుడు "త్వమేవాహం" అంటూ గొంతూ చించుకొన్నాడు ఆరుద్ర. (మొదట్లో ఆ కావ్యానికతడు పెట్టిన పేరు "తెలంగాణా" అంతస్సుకీ, ఆకృతికీ సమన్వయం కుదిరిన కావ్యం "త్వమేవాహం". అంతస్సు ఆనాటి అశాంతి, ఆకృతి ఆరుద్రకి మాత్రమే సాధ్యమైన ఛందస్సర్కస్!)

జానపద కళారూపాలు విప్లవాత్మను సంతరించుకొని రంగంలోనికి దిగేయి. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర మహోద్యమానికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. ప్రజాబాహుళ్యం అందుకు బాసటగా నిలిచింది. అదే సమయంలో ఆంధ్ర ప్రజా నాట్యమండలి అభ్యుదయ రచయితల సంపూర్ణ సహకారంతో "ముందడుగు", "మా భూమి" వంటి రక్తానికి విద్యుచ్ఛక్తినిచ్చే నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించింది. ఆంధ్రా, తెలంగాణా ఉద్యమాల నుంచి ఊపిరి పీల్చుకుంటూ, వాటికే ఊపిరి పోసిన ఈ నాటకాలు నాటక ప్రదర్శన ప్రక్రియను సమూలంగా మార్చివేశాయి. నిజంగా అదో ప్రజానాట్యవేదిక! కల్పిత సన్నివేశాలులేవు. కృత్రిమ నటనా పద్ధతి లేదు. అది పసరు పచ్చిక బ్రతుకు. ఇక్కడది. ఇవాళది. (ఇక్కడో చిన్న తమాషా చెప్పనా? ఈ నాటక ప్రదర్శనాలని ఉమ్మడి మద్రాసు మంత్రి చూసి కళ్లెంట నీళ్లు పెట్టుకున్నాడు. మర్నాడు కమ్యూనిస్టు పార్టీని నిషేధించాడు)

కీ.శే. డాక్టర్ రాజారావు ప్రజా నాట్యమండలికి ప్రచండ ప్రచాలకుడు. అతడో మనిషికాదు యంత్రం. మహానటుడు. ప్రాచ్య పాశ్చాత్య నాటక పద్ధతులన్నీ క్షుణ్ణంగా ఆకళించుకున్నవాడు. సాధికారంగా నాటకరంగాన్ని శాసించగలిగినవాడు. తాను చేపట్టిన అన్నింటికీ తన హృదయమూ మనస్సూ అంకితం చేసినవాడు. అతని మరణంతో మరణించింది ప్రజానాట్యమండలి. కాని నేనింకా ఆశావాదినే. టాపు లేపేస్తూ చిందులు వేసిన నటునికన్నా రంగస్థలం గొప్పది. మళ్లీ త్వరలోనే పుంజుకుంటుంది నాటకరంగం. ఇందుకీనాడు కనిపించే సూచనలు కోకొల్లలు.

క్రమక్రమంగా, నిమ్మళంగా కనిపించకుండా శిథిలమైపోయింది అభ్యుదయ సాహిత్యోద్యమం. అదే సమయంలో అమెరికన్ విషధూమాలు సర్వత్రా పైచేయి సంపాదించాయి. సెక్సు, నేరం, హింస మొదలైన సంగతుల కంకితమైన చవక పుస్తకాలు బైలుదేరి గ్రంథ విక్రయశాలల మీద దురాక్రమణ చేశాయి. హాలీవుడ్ నుంచి వచ్చే ఫిలింలకి మన పవిత్ర సెన్సారులు "ఏ" సర్టిఫికేట్లిచ్చారు. జాతీయ సినిమా (శిల్పచిత్రాలని తీసే నేరం ఎప్పుడూ చెయ్యనిది) ఎంగిలిమెతుకుల మీద బతుకుతూ అవినీతి మీద బలిసింది. సెక్సు, డిటెక్టివ్ నవలలకి గిరాకీ హెచ్చింది. అంతర్జాతీయ అభివృద్ధి నిరోధకత్వానికి అది అడ్డులేని రహదారి. అమెరికావాడి విప్లవ వ్యతిరేక ఎగుమతి గెలుస్తున్నట్టే ఉంది. ఏం? ఘనాలో ఎన్‌క్రుమా (ఆఫ్రికన్ లెనిన్ అనిపించుకున్నవాడు) పదభ్రష్టుడయ్యాడు. ఇండోనేషియా డాలర్ డెమోక్రసీకి సురక్షితమైంది. దక్షిణ అమెరికా (క్యూబా మినహా) ఒ.ఎ.ఎస్. గాళ్ల, సి.ఐ.ఎ.గాళ్ల గుప్పిట్లో ఇమిడింది. ఔనండీ అయ్యా! భూగోళపు పోలీసోడు అంకుల్‌శామ్ గొప్పగా వ్యాపారం చేస్తున్నాడు. యథాస్థితిని కాపాడుతున్నాడు. అందుకవసరమైన వెధవలందర్నీ పోగుచేస్తున్నాడు.

లెనిన్ గొంతు చించుకొని అరిచిన పెట్టుబడిదారీ విధానం అస్తవ్యస్తాలెక్కడ? మార్క్సిజానికి కాలదోషం పట్టిందా, మన మధ్యతరగతి మేధావులు చెప్పినట్లు? ప్రపంచ కార్మికులారా ఏకంకండి అన్న నినాదం ఏమయింది? ఎన్నాళ్ళుగానో మనం వింటూన్న వర్గరహిత సమాజం ఇప్పుడెక్కడుంది? ఇది మాత్రం విస్పష్టం. లెనిన్ దేవుడి సాయం లేకుండా అన్నాడు. ఇవాళ కాకపోతే రేపైనా నా మాట నిజం అని. పెట్టుబడిదారీ విధానపు అస్తవ్యస్తాలు పైపైకి పొక్కుతూనే ఉన్నాయి. భూగోళం సర్వత్రా ధనవంతులు ధనవంతులవుతున్నారు. దరిద్రం పెరిగిపోతోంది. ఫలితంగా అమెరికా మామయ్య భయంతో వణికిపోతున్నాడు. కార్ల్‌మార్క్సు భగవంతుణ్ణి సంహరించాడు. కాబట్టి రత్నాలొకవైపూ నత్తగుల్లలొకవైపూ చేరుకుంటున్నాయి. కాలదోషం పట్టింది మార్క్సిజానికి కాదు మధ్యతరగతి మేధావులకే. భగవంతుడూ, మధ్యతరగతులూ ఒకసారే అంతరించిపోతారు.

మరేం సందేహం లేదు. లెనిన్ ఎప్పుడూ భగవంతుడి మీద ఆధారపడలేదు. మనిషిని నమ్మేడతను. మనిషిలో అంతర్గతమైన మంచితనాన్ని నమ్మేడతను. సామాజిక మానవుని సృజనాత్మక శక్తిని నమ్మేడతను. పాతరాతియుగపు మానవుడు తలపైకెత్తి నక్షత్రాలని చూస్తే, ఫ్రెంచి శిల్పి రోడిన్ తనలోకి చూస్తూ పుణ్యపాపాలను సమీక్షిస్తే, మానవుణ్నే తలపోశాడు లెనిన్! సంపన్న సమాజం లెనిన్ ధ్యేయంకాదు. ఎవడిష్టం వాడిదనే సమాజం కూడా కాదు. లెనిన్ తన యావజ్జీవితం మనిషి శరీరవాంఛలకీ, మానసిక స్వాతంత్ర్యానికి కావలసిన కారుణిక సంఘం కోసం కృషి చేశాడు. దీన్ని సాధించడానికి ఏ దేవుడి ఆశీర్వాదాలూ అతడు కోరలేదు. ఈ వ్యవహారాల్లోకి నువ్వు రావొద్దురా అని ఆ దేవుణ్ణి బహిష్కరించాడు.

అందుకే ఈనాటి అతి నవీన కవులంతా ఈ నిరీశ్వరవాదాన్ని తమదిగా స్వీకరించారు. లెనిన్ జెండా పట్టుకున్నారు. మార్క్సు సందేశం అందుకున్నారు. "మనిషిని మనిషి పీడించడం పనికిరాదు!" అన్నదే వాళ్ళ పాటలకి పల్లవి. నిన్న వాళ్ళలో కొందరు దిగంబరకవులు, తిరగబడు కవులు, సంఘర్షణ కవులు. ఇవాళ ఈ 1970 నుంచి ఈ అందరూ ముక్తకంఠంతో ఇలా ఘోషిస్తున్నారు.

"జెహోవా మర్గయా! జిందాబాద్ లెనిన్"

('లెనిన్-భారతీయ సాహిత్యం' అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ 8.9.70న నిర్వహించిన సెమినార్‌లో 'లెనిన్-ఆధునిక తెలుగు కవిత్వం, నాటకంలో కొత్త ధోరణులు' అనే శీర్షికతో చదివిన ఇంగ్లీషు వ్యాసం ఇది. ఇది శ్రీశ్రీ చేసిన అనువాదమే.)

**ముద్రణ : సృజన, మాసపత్రిక, ఫిబ్రవరి 1971**

# విప్లవాల యుగం

కలాన్ని ఆయుధంగా ధరించిన సహయోధులకు నా విప్లవ జోహార్లు. కామ్రేడ్స్! మూడవసారి మన విరసం వార్షికసభ జరుపుకుంటోంది. ఇది మూడో అక్టోబరు. ఇది విప్లవాల మాసం. కొత్త కేలెండర్ ప్రకారం ఒక నెల తప్పించి నవంబరు 7వ తారీఖున రష్యా జాతీయ దినం జరుపుకొంటున్నా అక్టోబరు విప్లవమనే ఇప్పటికీ దాని పేరు. చైనా విప్లవం కూడా అక్టోబరు నెలలోనే జయించింది. అటువంటి నెలలో మొదటిసారి 1970లో మనం ఖమ్మంలో సమావేశమైనాము. నాటి నుంచి నేటి వరకు మనది అప్ హిల్ టాస్క్, కొండమీదికెక్కే ప్రయత్నం. అయితే పర్వతారోహణ చేస్తామని బయల్దేరిన కొందరిలాగ మనం దిగజారిపోలేదు. ఉయ్ ఆర్ ఆన్ ది అసడెంట్ నౌ. ప్రపంచం మొత్తం మీద అన్ని విప్లవశక్తుల్లాగే మనం కూడా ఉన్నత శిఖరాల నధిరోహించే ఉద్యమం నడిపిస్తున్నాము. ఎంత మేకపోతు గాంభీర్యం చూపిస్తున్నా, మన శత్రువులు ఓడిపోతున్నారు. మనం గెలుస్తున్నాము. ఇది వాళ్లకి తెలుసు, మనకీ తెలుసు. సిద్ధాంతరీత్యా మనల్ని ఓడించడం మాట అటుంచి మనతో పోరాడడానికైనా శక్తిలేని వాళ్లు విరసం చీలిపోయిందన్న విష ప్రచారానికి పాల్పడుతున్నారు. 1970 నాటి కంటే విరసం ఈనాడు మరింత పటిష్టంగా పని చేస్తున్నదనేది కళ్ళు మూసుకుపోయిన వాళ్ళకు కూడా కనిపించే సత్యం.

ఢంకాని జోకొట్టాలని, అలల్ని అరికట్టాలనీ, గాలిని ఉరితియ్యాలనీ ఇదివరకెన్నో ప్రయత్నాలు జరిగాయి. ఇక ముందు కూడా జరుగుతాయి. కాని అవి ఎన్నడూ ఫలించలేదు. ఇకముందు కూడా ఫలించబోవు. విరసానిది వచ్చే కాలం, విరసం విరోధులది పోయేకాలం. విరసం రేపటి సంగతులను ఇవాళే ఆలోచించే సంస్థ. ఇది భవిష్యత్తుని తీర్చిదిద్దే బాట. గ్రహచారం మీద ఆధారపడేది కాదు. ఇది మార్క్సిస్టు దర్శనానికి నిబద్ధమై, గతితార్కిక భౌతికవాదపు వెలుతురులో సామాజిక పరిణామాన్ని సందర్శిస్తుంది. అందుకే రెండు రెళ్ళు నాలుగనేది ఎక్కడైనా ఎప్పుడైనా ఎంత సత్యమో, యావత్ప్రపంచమూ సామ్యవాద మానవుడి శాసనం కిందకి వస్తుందనేది కూడా అంతే సత్యం.

అయితే సూర్యుడిలాంటి ఈ సత్యానికి మబ్బు లాంటిది మతం. అందుకనే మతాన్ని మనుష్యుల పాలిటి నల్లమందుగా అభివర్ణించాడు మార్క్సు. అనాది నుంచీ ఈ మతాలు మనిషికీ మనిషికీ మధ్య మాయగోడలు నిర్మించాయే తప్ప మనుష్యులందర్నీ ఏ మతమూ ఒక్కటిగా చేయలేకపోయింది. అలా చేసే శక్తి ఏ మతానికీ లేదు. పైగా మనిషి మీద మనిషి కుండవలసిన విశ్వాసాన్ని లేకుండా చేస్తుంది మతం. దేవుడనే హేతువాద దూరమైన భావాన్ని ఆరాధిస్తూ శాస్త్రీయ విజ్ఞానానికి పోటీగా మూఢ విశ్వాసాలను నిలబెడుతుంది. విప్లవ

రచయితలు మొట్టమొదట పోరాడవలసింది ఈ మూఢ విశ్వాసాలతోనే. నన్నడిగితే ప్రతి గ్రామంలోనూ ఒక్కొక్క విరసం శాఖ కన్నా ఒక్కొక్క నిరీశ్వరాశ్రమం ఉంటే చాలనుకుంటాను. దానికి తోడు ఒక్కొక్క విప్లవ సాహిత్య వీరయ్య కూడా ఉంటే మరీ మంచిదంటాను. దినవార మాసపత్రికలు దేశం నిండా అల్లుకుపోయి బూజుపట్టిన బూర్జువా భావాలను ప్రచారం చేస్తున్నా వీరయ్యలు పంచిపెట్టే వెయ్యి కరపత్రాలు చాలు వీటికి విరుగుడుగా పని చేయడానికి.

ఎక్కడో చదివాన్నేను పెట్టుబడిదారీ విధానానికి చెత్త సాహిత్యం చాలా అవసరమని! అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల మాట అటుండగా ఇప్పుడిప్పుడే ఓనమాలు నేర్చుకుంటున్న మన దేశంలోని భాషా పత్రికల్ని చూడండి. వీటిలో రాసేవాళ్లంతా పత్రికా స్వాతంత్ర్యానికీ, వ్యక్తి స్వాతంత్ర్యానికీ నివాళులెత్తే వాళ్లే. విప్లవ రచయితలంతా సంఘవిద్రోహులనో, చైనా ఏజెంట్లనో సహేతుకంగా రుజువు చేసే వాళ్లే. పత్రిక యజమాని విదిలించే ఎంగిలి మెతుకులకు బతుకునే తాకట్టు పెట్టి బస్తాల కొద్దీ చెత్త సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తున్న వాళ్లే. రాశి ఫలితాలతో, సినిమా పేజీలతో, కథలతో, కార్టూన్‌లతో, సీరియల్ నవలలతో కుళ్ళు కంపు కొట్టే ఈ చెత్త సాహిత్యం మధ్య కనిపించే వ్యాపార ప్రకటనలు పత్రికాధిపతి పాలిట పాడిబర్రెలు. ఇక దినపత్రికలు సంగతి చెప్పనవసరమే లేదు. సంపాదకీయాలతో సహా కలుపుకొని రీడింగ్ మేటరంతా ఒక ఎత్తయితే ఈ పత్రికా ప్రకటనలు అందుకు రెండింతలు. ఈ ప్రకటనలే పత్రికలను బ్రతికించే ప్రాణ వాయువులు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇది తప్పనిసరి. ప్రావదాలో ప్రకటనలు లేకపోవడానికి విశాలాంధ్ర అవి తప్ప మరేవీ ప్రముఖంగా కనిపించకపోవడానికి మనం జీవిస్తున్న ధనస్వామ్య విధానమే కారణం. ఒక్క వాణిజ్య ప్రకటన కూడా లేకుండా విశాలాంధ్ర పత్రిక వెలువడిననాడు నిజంగా ఆ పత్రిక కమ్యూనిజం కోసం పోరాడుతున్నదని అంగీకరిస్తాను. కాని ఈనాటి వాస్తవం ఏమిటంటే బూర్జువా సాహిత్యమూ, పత్రికలూ ఒక మహాసముద్రం. అందులో చెదురుమదురు ద్వీపాల్లాంటివి విప్లవ పత్రికలూ, విప్లవ సాహిత్యమూ. కాని ఈ ద్వీపాలను చుట్టూ వున్న సముద్రం ముంచెత్తలేదు. ఒకప్పుడు సోవియట్ యూనియన్ కూడా ధనస్వామ్య విధాన సముద్రం చుట్టుముట్టిన ఒకే ఒక సామ్యవాద ద్వీపంగా ఉండేది. స్టాలిన్‌కి, ట్రాట్స్కీకీ పెద్ద పేచీ ఇక్కడే వచ్చింది. ప్రపంచ అంతటా విప్లవం రగుల్తూ ఉంటేనే తప్ప మన సామ్యవాద ద్వీపం వర్థిల్లలేదన్నాడు ట్రాట్స్కీ. ఒక దేశంలో సామ్యవాదం నిర్మిస్తే అది ప్రపంచమంతటికీ ఆదర్శప్రాయమవుతుందన్నాడు స్టాలిన్. అలాగే తన దేశంలో సామ్యవాద నిర్మాణానికి అడ్డువచ్చే శక్తులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా నిర్మూలించాడు. ఈ మహోద్యమంలో కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చుగాక. అయినా మార్క్సిస్టు మహోపాధ్యాయుడుగా స్టాలిన్ అజరామరుడయ్యాడు.

ప్రపంచం అంతటా సామ్యవాద విప్లవం ఒక పరిపక్వ దశకు చేరుకుంటోంది. అందుకే మన దేశంతో సహా ఆచరణ మాట ఎలా వున్నా అరుపుల్లో సామ్యవాదం ఆకాశానికే చిల్లులు పెడుతోంది. ఈనాడు విప్లవం ప్రపంచ వాస్తవికత. విప్లవ ప్రతీఘాత శక్తులు వాటికి కంచుకోటగా వర్ణించదగ్గ అమెరికాలో కూడా దెబ్బకాచుకునే స్థితిలో పడ్డాయి. ఒక ఎత్తుగడ మాత్రంగానే కావచ్చుగాక నిక్సన్ లాంటి అఖండ శక్తి సంపన్నుడు దూతను పంపి ఆహ్వానం సంపాదించుకొని చైనాను సందర్శించవలసివచ్చింది. ఈనాడు ప్రపంచం అంతటికీ విప్లవ కేంద్రం, పీడిత ప్రజల ఆశాజ్యోతి పెకింగ్ నగరమే. మానవుడు నవసమాజం అనే గమ్యం

చేరడానికింకా చాలా కాలం పట్టవచ్చును. కాని అందుకు సరి అయిన మార్గం చూపిస్తున్నది చైనా దేశమే అనడానికి సందేహం లేదు. ఎన్నో అపవాదులకు పాల్పడి, అభాండాలకు లోనైన చీనా సాంస్కృతిక విప్లవం తన ప్రజలకే కాక ప్రపంచ మానవులందరికీ ప్రయాణ దిక్సూచి కాగలుగుతోంది. పనికట్టుకొని దుష్ప్రచారం సాగించే వాళ్లు ఎన్నడూ ఉంటారు. కాని నిష్పక్షపాత పరిశీలకుల వాఙ్మూలం ఒక్కటే మనకు పరిగణనీయం. పనికిమాలిన చెత్తనంతా పరమ పవిత్రంగా భావించే వాళ్లకి చైనా సాంస్కృతిక విప్లవం అర్థం కావడం కష్టమే. అయినా మనం దాన్ని అధ్యయనం చెయ్యక తప్పదు. అర్థం చేసుకోక తప్పదు.

ఈ సమస్త చరాచర సృష్టిలోనూ అత్యంత సౌందర్యవంతమయినదీ, అత్యంత నిస్సహాయమైనదీ ఏదంటే అప్పుడు పుట్టిన మనుష్య శిశువంటాను నేను. ఈ శిశువు బాధ్యత ఒక్క తల్లిదండ్రులది మాత్రమే కాదు. సమాజం యావత్తూ దీని బాధ్యత వహించవలసి ఉంటుంది. అలా జరగనప్పుడు ఎన్నో వైపరీత్యాలు సంభవిస్తాయి. శునశ్శేపుణ్ణి వాళ్ల తండ్రి యజ్ఞపశువుగా లక్షగోవుల ఖరీదుకి అమ్మేశాడట బిచ్చానికి పనికొస్తుందని పుట్టిన శిశువుకి కళ్లు పొడిచెయ్యడమో, కాళ్లు విరిచెయ్యడమో ఈనాటికీ జరుగుతున్న పనే! గురజాడ అప్పారావుగారు తన కన్యాశుల్కం పీఠికలో పుట్టబోయే ఆడపిల్లలకు పెళ్ళి సంబంధం బేరమాడి శుల్కధనం నిర్ణయించుకునే అమానుషత్వం విజయనగరం మహారాజుగారు తీయించిన లెక్కలలో బైటపడిందని రాశారు ఇవాళ కూడా మన పిల్లలు మన సమాజానికి యజ్ఞపశువులుగా అమ్ముడుపోతున్నారు. వాళ్ళ కళ్ళు పొడిచెయ్యకపోయినా శాస్త్ర జ్ఞానానికి అంధుల్ని చేసే విద్యావిధానాన్నే మనం అనుసరిస్తున్నాం. గర్భస్థ శిశువులకు కాకపోతేనేంగాక ఇప్పుడు జరుగు తున్నవి చాలామటుకు వివాహాలుకావు ఇన్ని అనాచారాలన్నింటినీ మనం సంస్కృతి పేరిటా, సంప్రదాయం పేరిటా నెత్తిని వేసుకుని ఊరేగుతున్నాం వీటిన్నింటినీ దూదిపింజలుగా ఎగర గొట్టే సాంస్కృతిక విప్లవ ఝంఝు అవగాహన చేస్తూ కలం పట్టడమే మన ఆవశ్య కర్తవ్యం.

పోనీ మన సాహిత్య అనాధమీలలో, కాదు అగాధమీలలో,కాదు అకాడమీలలో చూద్దామా అంటే అక్కడ కరడు కట్టిన మతవాదులూ, మితవాదులూ, కాకుంటే కేవల అవకాశవాదులూ బైరాయించారు. వీళ్లు నాచన సోముని నయగారాన్ని, మనుచరిత్ర మాధుర్యాలనీ నెమరువేసుకుంటూ తన్మయులవుతూ ఉంటారు. ఇంతకీ పశువుల రాజ్యం కదా మనది. జోడెద్దుల నుంచి ఆవూ పేడా, కాదు ఆవూలేగా దాకా మనం అభ్యుదయం సాధించాం ఇది మనుష్యుల రాజ్యంగా మారడానికి ఇంకా ఎన్ని మన్వంతరాలు కావాలో నా ఆలోచన కందలేదు.

మిత్రులారా! కిందటి విరసం సభల తర్వాత మనదేశంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. (ఇప్పటికీ దేశమంతటా తాండవిస్తున్న కరువు రాక్షసి కరాళనృత్యాన్ని ఇప్పటిమటుకు అలా ఉండనిద్దాం) ఏవిటీ రెండు సంఘటనలూ? ఒకటి స్వాతంత్ర్యపు వెండి పండుగ రెండోది తెలంగాణా సాయుధ పోరాటపు రజతోత్సవం, రెండింటి మీదా విప్లవ రచయితల సంఘం ఒక్కటే సక్రమమైన అవగాహనకు వచ్చి సరైన అంచనా తేల్చింది. మనకు వచ్చిందంటున్న స్వాతంత్ర్యం తెల్లదోపిడీదారు నల్లదోపిడీదారుకి బదలాయించిన అధికారమే తప్పపాటుపడే ప్రజాసామాన్యానికి ఒరగబెట్టిందేమీ లేదు మన ఆర్థిక వ్యవస్థ 75 గుత్త పెట్టుబడిదారుల గుప్పిటలో చిక్కుపడింది ఆనాటి అమెరికన్ డాలర్‌గాని, ఈనాటి రష్యన్ రూబుల్‌గాని మన పీడిత ప్రజల పరిస్థితిని మెరుగు పరచలేదు మనకేవో కొన్ని భారీ

పరిశ్రమ లున్నాయని సంబర పడుతున్నామే తప్ప అన్నింటికన్నా భారీ ఎత్తున సాగుతున్నది అవినీతి మాత్రమే. అవినీతీ, లాభాపేక్షా అన్నదమ్ములనడానికి సందేహం లేదు. మన ఆర్థిక వ్యవస్థలో లాభాపేక్షనంగీకరించి సంతకాలం అవినీతి భారాన్ని కూడా మోయవలసిందే. మనది స్వాతంత్ర్యం కాదు, స్వాహాతంత్రం అంటున్న విప్లవకవితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

రెండోది తెలంగాణా సాయుధ సమరం. దీన్ని మన ఘనత వహించిన ప్రభుత్వం గుర్తించనేలేదు. పైగా రెండు వేల మంది కమ్యూనిస్టుల్ని ఊచకోత కోయించిన ప్రకాశం పంతులు గారి శతజయింతిని వైభవంగా జరుపుకుంది. బ్రిటిష్ వారి గుండు దెబ్బలకు గుండె చూపించిన వీరుడంటూ కాంగ్రెస్ వారాయన్ని మెచ్చుకుంటే నా అభ్యంతరం లేదు. విశాలాంధ్ర వాళ్ళెందుకీ భజనలో పాల్గొనాలని నేనడుగుతున్నాను. మద్రాసు నగరం కోసం మొండి పట్టుపట్టి పొట్టి శ్రీరాములుగారి ప్రాణాన్ని బలిపెట్టిన కిరాతకుడుగా ప్రకాశం గారిని నేను గర్హిస్తున్నాను. తెలంగాణా రైతాంగ పోరాటమే నెహ్రూ పండితుడిచేత ఆవడిలో సామ్యవాద మంత్రోచ్చారణ చేయించింది. అసంపూర్తిగా ఉండిపోయిన ఆనాటి సమరం ఇంకా సాగుతోనే ఉన్నదనేది విప్లవ రచయితల అవగాహన. అలా దేశమంతటా సాగిస్తున్నవారే ఆనాటి పోరాట సంప్రదాయాలకు ఈనాటి వారసులు. ఈ వారసత్వం మాదంటే మాదంటూ చిందులు తొక్కడానికి అన్నదమ్ములు పంచుకునే ఆస్తి హక్కు కాదు. ప్రాణాలనే ఆహుతిగా సమర్పించి సంపాదించుకునే జన్మహక్కు. ఈ విప్లవ పోరాటానికి సంబంధించిన సమగ్ర చరిత్ర ఇంకా రాయవలసే ఉంది. ఆనాటి సాహిత్యమంతా సమీకరించవలసే ఉంది.

నాగిరెడ్డి, నాగభూషణ పట్నాయక్ చారుమజుందార్ చంద్ర పుల్లారెడ్డి, క్రూరులూ, కఠోరులూకాదు. కాలేరు. వీరిలో కనీసం నాగిరెడ్డి వారిని నేను స్వయంగా ఎరుగుదును. అతనిది వెన్నలాంటి హృదయం. హింసంటే విపరీతమైన ద్వేషం. కాని కుళ్లిపోతున్న కురుపు మీద వైద్యుడు జరిపే శస్త్ర ప్రయోగాన్ని హింసని ఎవ్వరూ అనలేరు. అదే హింసయితే దాన్నే ఈనాటి నికార్సయిన విప్లవకారులు ఆరాధిస్తున్నారు. ఆరాధించి అంకితమవుతున్నారు. అంకితమై ఆహుతి అవుతున్నారు. అలాంటి హింసనే విప్లవ రచయితలు తమ సమస్తరచనల్లో విశ్లేషించి చూపెడుతున్నారు. విశేషించి గ్లోరిపై చేస్తున్నారు. చేస్తున్నందుకు గర్విస్తున్నారు.

అందుచేతనే అరసం మిత్రులు చాస్తున్నామంటున్న స్నేహహస్తాన్ని అందుకోవడానికి మనకొకే ఒక అభ్యంతరం ఉంది. అభ్యుదయ రచయితలారా! మీరు చాస్తున్న చెయ్యి కాంగ్రెస్‌తో కరచాలనం చేసిచేసి రక్తసిక్తమయింది. షేక్‌హాండ్ చెయ్యడమే కాదు కాంగ్రెస్‌వాళ్లతో మీరు పీటముడి వేసుకొని కూచున్నారు. గాంధీగారు అస్పృశ్యతకూడదని గగ్గోలు పెట్టినా కాంగ్రెస్ పాలకులంతా మాకు అస్పృశ్యులే. వాళ్ళని అంటుకున్నంత కాలం మీరూ అంటరానివాళ్లే. కాబట్టి మీతో కరచాలనం చెయ్యలేం. ఏమైనా మనదారులు చీలిపోయాయి. మీదారి మాది కాదు. మాదారికి మీరు రారు. సరే అంతా సక్రమంగా జరిగితే వచ్చేయేడు విరసం సభల్లో కలుద్దాం. అందాకా గుడ్‌బై. విప్లవం వర్థిల్లాలి. విరసం వర్థిల్లాలి. అమరవీరులకు జోహార్.

(గుంటూరులో 15.10.1972న జరిగిన విరసం మూడో మహాసభలో అధ్యక్షోపన్యాసం)

**ముద్రణ : విరసం మూడో మహాసభల (1972) ప్రత్యేక సంచిక, ఏప్రిల్ 1973**

# ఆధునిక కవిత

ఇప్పుడు నాకు జరిపించిన సన్మానానికే నా కృతజ్ఞత తెలియజేసుకుంటున్నాను. ఈ అభినందనకి ప్రత్యుత్తరంగా నాలుగు మాటలు చెప్పవలసి వుంది. కాబట్టి చెప్పడానికి ఏదో ఒక విషయం అవసరం కాబట్టి, దేన్ని గురించి చెబుదామా అని అనుకుంటే, సరే కవిని కాబట్టి కవిత్వం గురించే చెప్దాం అని నాకనిపించింది.

ఈవేళ మధ్యాహ్నం ఒక ప్రశ్నావళి జరిపారు. అందులో వారు వేసిన అనేకమైన ప్రశ్నల్లో ఒకటేమిటంటే కవిత్వం గురించి మీ నిర్వచనం ఏమిటి అని. ప్రపంచంలో ఎంత మంది కవులున్నారో అన్ని నిర్వచనాలున్నాయి. కవులు చేసిన నిర్వచనాలే కాకుండా ఎంత మంది విమర్శకులున్నారో అంత మందీ అన్ని రకాలుగా "The best words in the best order" "Emotion recollected in tranquility" ఒకటేమిటి అనేక రకాలుగా నిర్వచనాలు చేశారు. ఈవేళ నా జవాబుల్లో నాకు అల్లసాని పెద్దన్నగారి నిర్వచనం చాలా బాగా నచ్చింది. రాతి రేయుంబవల్ మరపురాని హుయల్ అని చెప్పి. ఏదైతే జ్ఞాపకముంటుందో అది కవిత్వం. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రులుగారు కూడా ఒక ఉపన్యాసంలో నేను కవిత్వం గురించి ఒక అరగంటసేపు మాట్లాడతానని అన్నవారు సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా ఏకబిగిన మాట్లాడారు. ఎన్నో విషయాలు అందులో స్పృశించారు. చెప్పొచ్చేదేమిటంటే కవిత్వానికి అవధులు లేవు. ఎల్లలు లేవు. ప్రపంచమంతా కవితా వస్తువే. ఆయన ఒక నిర్వచనం చేశారు. మరచిపోయేది చెత్తా, జ్ఞాపకముండేది కవిత్వము అని చెప్పి వారే రాశారు. లోకుల రచనలే తాటాకులుగా, ఇప్పుడు వేమన కవిత్వం ప్రజల మాటల్లో కూడా ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు అని దొర్లుతుంటుంది. ఆ విధంగా నిత్యం నవనవంగా చెలామణిలో వుండేదే కవిత్వం అని చెళ్లపిళ్ల వెంకట శ్రాస్తుల వారు అన్న మాటతో, ఇచ్చిన నిర్వచనంతో నేనేకీభవిస్తున్నాను.

అదే సందర్భంలో వారు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రులు గారి అంటే వారి గురువుగారి మీద ఒక ఛలోక్తి విసిరారు (నిజానికి చెళ్లపిళ్ల వారు ఆయన దగ్గర ఆర్నెల్లో ఎంతో సంస్కృతం నేర్చుకున్నారు కూడా. అయినా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది).

"కవిత్రయం అంటే నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రెగడ ముగ్గురూ కలిసి ఇంచుమించు మూడు శతాబ్దాలపాటు రాసినటువంటి మహాభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలూ మా గురువు గారు ఒక్క చేతి మీదుగా రాశారు. గురువుగారు కదా అని చెప్పి నేను ఆది పర్వం

నుండి స్వర్గారోహణ పర్వం దాకా వారు వ్రాసిన పద్యాలన్నీ చదివాను. అయితే ఒక్క పద్యం కూడా జ్ఞాపకం లేదు. అంటే పద్దెనిమిది పర్వాలూ ఎగిరిపోయాయి" అన్నారాయన.

ఈ విధంగాను కవిత్వం గురించి చెప్పాలి అంటే సర్వసమస్త ప్రపంచం కూడాను కవితావస్తువే అని నేనన్నానే దానికి ఒక ఉదాహరణ కూడా నాకు జ్ఞాపకమొస్తున్నది. విలియమ్ సారోయిన్ అమెరికన్ షార్ట్‌స్టోరీ రైటర్ అని మీకు తెలుసును. అతను తాను చిన్న కథలు ఎలాగ వ్రాస్తాడో ఇలా వివరించాడు. "ఏదో చిన్న కథల ఉపోద్ఘాతంలోనో, ముందుమాట లోనో సాధారణంగా నేనేం చేస్తుంటానంటే ఒక శీర్షిక పెడతాను. The latest position in Modern American Poetry అని చెప్పి ఒక శీర్షిక. ఆ శీర్షిక పెట్టేసరికి నాకేవో ఎప్పుడైనా ఒక థాట్, ఎన్నెన్నో అమెరికన్ పొయిట్రీకి ఈ కథకి ఏ సంబంధమూ వుండదు. కానీ, మోడరన్ అమెరికన్ పొయిట్రీ అని శీర్షిక రాసిన తర్వాత మోడరన్ అమెరికన్ పొయిట్రీ అనే శీర్షికను తీసి అవతల పారేసి ఈ కథకు సంబంధించిన పేరొకటి పెట్టి ఏదో ఒక పత్రిక్కి పంపిస్తూ వుంటాను." ఇట్లాగా తను కథలు రాయడానికి పొయిట్రీ ఒక ఇన్‌స్పిరేషన్‌గా ఉపయోగించిందని చెప్పి అతనన్నాడు.

ఇక మన తెలుగు కవిత్వమే తీసుకున్నామంటే నన్నయభట్టు గారిని ఆదికవి అని అనుకుంటే సుమారు వెయ్యి సంవత్సరాల వయసు కలిగినటువంటి కవిత్వం మనది. బెంగాలీ, హిందీ, గుజరాతీ తదితర అనేకమైనటువంటి ప్రాంతీయ భాషలన్నిటి కన్నా కూడా ప్రాచీనమైనది. బహుశ మన కవిత్వం కంటే ప్రాచీన తరమైనటువంటిది తమిళ కవిత్వం అని చెప్పుకోవచ్చును. అంత సాహిత్య చరిత్ర కలిగినటువంటి. సుసంపన్నమైనటువంటి కవిత్వం మనది. కానీ నేనింకా వెనక్కిపోయి ఏమంటానంటే నన్నయ్యభట్టుగారు "గాసట బీసటే చదివి" దాన్నంతటినీ కూడా సంస్కరించి ఆయన కవిత్వం రాశారని, ఆ కారణంచేత అతన్ని ఆదికవి అని అంటారుగానీ, అంత పకడ్బందీగా ఆయన పద్యాలు అవీ రాశాడంటే అంతకుముందు ఎంతో మంచి కవిత్వం వుండి వుండాలి. అదంతా కాలగర్భంలో కలిసిపోయి వుండొచ్చు.

ఇవేమీ కాకుండా ఇంకొక విషయం కూడా నేను చెప్పదలుచుకున్నాను. మనము చదువుకుంటున్న కవిత్వం అక్షరాస్యుల కవిత్వం. హాన్స్ కవిత్వం. ఉన్న వారి కవిత్వం. సైడ్ బై సైడ్ ఉన్న వారి కవిత్వంతోపాటు లేని వారి కవిత్వం కూడా వున్నది. అది ఈ ఉన్న వారి కవిత్వం కంటే కూడా ప్రాచీనమైనది. నన్నయ్యభట్టు కంటే పూర్వం నదుల్లో పడవలు నడుపుకునేవారు. పొలాల్లో పంటలు పండించేవారు. కొండల్లో రాళ్లు కొట్టేవారు. ఈ పాటకజనం అందరు కూడాను కవిత్వం రాశారు. అది జానపద సంప్రదాయకం. ఈ జానపద సంప్రదాయకం నిన్న మొన్నటి దాకా కూడాను చాలా అనాఘ్రాత వాఙ్మయం అని మల్లంపల్లి సోమశేఖరశర్మ చెప్పారు. ఆ విధంగా దానికి ఆదరణ లేకపోయింది. కానీ అది అవ్యాహతంగా వస్తూనే ఉన్నది. ఈనాడు మనకు కావలసింది ఆ జానపద రూపాలు, ఆ ఛందస్సు ఆ బాణీలు.

నిన్న మొన్నటిదాకా అనగా గురజాడ అప్పారావుగారు ముత్యాల సరాలు రాసేదాకా కూడాను కవిత్వం ధర్మంలాగా నాలుగు పాదాల మీద నడుస్తూ వుండేది. ఈ నాలుగు చతుష్పాత్తు కవిత్వం. చంపకమాల తీసుకోండి. ఉత్పలమాల తీసుకోండి లేదా శార్దూలం, మత్తేభం, ఇవన్నీ కూడాను నాలుగు చక్రాల రథాల్లాంటివన్నీ. ఆ రథాల స్పీడు ఈ కవిత్వంలో ఉంది అని అంటూవుండేవారు. నిన్న మొన్నటివరకు హార్స్‌పవర్ చాలా గొప్ప స్పీడ్ అన్నమాట. ఏదో స్టీవన్‌సన్ రైలింజన్ కనిపెట్టిన తర్వాత ఈ రైలింజన్ యొక్కస్పీడు గంటకి 130 కిలోమీటర్లంటే అది చాలా గొప్ప స్పీడనుకున్నాం. అదంతా పోయి ఈనాడు విమానాల స్పీడొచ్చింది. రాకెట్ల స్పీడొచ్చింది. ఈ స్పీడేమి కనబడదు. ఆకాశం మీద విమానం వెళుతూ వుంటే అది చీమనడక నడుస్తూ వున్నట్లే వుంటుంది. కానీ అందులో వున్న వారికి ముఖ్యంగా ఏదైనా మబ్బులు అవీయివీ వస్తే ఎంత స్పీడుతో వెళుతున్నదో తెలుస్తుంది. నిన్న ఉపన్యాసంలో అది కూడా చెప్పాను. చిన్న జోక్. మద్రాసు మీనంబాకం ఏరోడ్రామ్‌కి ఇద్దరు పల్లెటూరి వాళ్లు విమానాశ్రయాన్ని చూడ్డానికి వెళ్లారు. అక్కడ పెద్ద తిమింగళం లాంటి జట్ విమానం వుంది. ఆ కొస నుంచి ఈ కొస దాకా పెద్ద విమానం. వారిద్దరూ చూసి అందులో ఒకడేమన్నాడంటే అయ్యో యింత పెద్ద విమానం వుండాదే దీనికి పెయింట్ వెయ్యాలంటే ఎంత పెయింట్ పడుతుంది. ఎంతసేపు ఎంత కాలం వృథా చేయవలసి వస్తుంది ఎట్లా వాళ్లు దీన్ని తట్టుకోగలుగుతారు" అని చిన్నదైపోతుంది చూడు, అప్పుడు రంగు వేసేస్తారు అని అన్నాడట. ఆ విధంగాను ఈనాటి నాలుగు చక్రాల స్పీడు నుంచి రాకెట్‌స్పీడు దాకా కవిత్వం అభివృద్ధి చెందింది. నిన్న మొన్నటిదాకా ఈ రథాలు, గుర్రపుబళ్లు, లేకపోతే మోటారుకార్ల స్పీడులో వచ్చిన ఆ బాణీలో, ఆ బాటలో నడుస్తున్న కవిత్వాన్ని ఇది కాదురా నాయనా! ఈ దారికాదు, వేరే దారి వున్నాది. ఇది జానపద ఛందస్సు. మాత్రా ఛందస్సు. వ్యావహారిక భాష ఇదంతా కూడాను... ఈ దారి మళ్ళించినవారు గురజాడ అప్పారావుగారు. ఆ గురజాడ అప్పారావుగారు మామూలుగా తెలుగు కవిత్వం లేదా సంప్రదాయ కవిత్వం యావత్తూ ఏ దారెంట పోతున్నదో అది కాదు, ఈనాడు ఈ ఇరవయ్యో శతాబ్దానికి కావలసినటువంటి కవిత్వం. ఇదీ అని చెప్పి ఆయన చిన్న సందు చూపిస్తే ఆ సందునే నాలాంటివాడు గజ్జెల మల్లారెడ్డి వంటి వాళ్ళు మరింత వెడల్పు చేసినారు. దీన్ని మరింత పెద్ద విశాలమైనటువంటి రహదారిగా మేము తయారు చేస్తున్నాం. ఇది ఈనాడు అడుగుజాడ గురజాడది, అదే భావికిబాట అని నేనన్నానే. ఆ మలుపుని, కవిత్వ గమనాన్ని ఒక మలుపుకు తిప్పిన వాడు గురజాడ అప్పారావు. అందుకోసం ఉదయం ప్రశ్నావళిలో కూడా ఆధునిక కవిత్వానికి ఆద్యులెవరూ అంటే నిస్సందేహంగా గురజాడ అప్పారావుగారేనని నేను చెప్పాను. అదే నా యొక్క నిశ్చితాభిప్రాయం కూడాను. గురజాడ అప్పారావు గారు వాడుక భాషలో రాసిన తర్వాత భావకవిత్వం విజృంభించింది. రాయప్రోలు సుబ్బారావుగారు, అబ్బూరి రామకృష్ణారావు గారు, కృష్ణశాస్త్రి, వేదులో ఒకరేమిటి నాయని సుబ్బారావుగారు... ఇలా హేమాహేమీల్లాంటి వాళ్ళందరూ కూడాను గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులుగారి వ్యావహారికభాషకు కట్టుబడ్డవారే. వచనం రాస్తే వాడుకభాష రాసేవారు. కానీ కవిత్వాని

కొచ్చేసరికి ఆ గణబద్ధఛందస్సు, ఆ గ్రాంధిక భాష తప్పనిసరి అయ్యింది. ఇట్లాగా భావకవిత్వం తెలుగు సాహిత్యాన్నంతటినీ కూడాను ఉర్రూతలూగిస్తున్న రోజుల్లో గురజాడ అప్పారావుగారి ప్రభావం ఇతరేతర కవుల మీద ప్రసరించకపోలేదు. చింతాదీక్షితులు గారిని ఒక ఉదాహరణగా చెప్పవచ్చును. అంతకంటే ముఖ్యంగాను బసవరాజు అప్పారావు గారిని చెప్పవచ్చును. వీరిద్దరికంటే మంచికవి కవి కొండల వెంకట రావుగారు. కాలకంఠుని నాగసర్పంకుబుస మూడ్చి పడగబుస్సంది, పడగమూసింది. నాదస్వర మూదేది ఎవరోయి రాగమొలికించేది ఎవరోయి, కారునల్లని కాళరాత్రి. ఆయన శివరాత్రి ప్రభ ఒకటేమిటి చాలా. అశ్వాల్డు కూల్డ్రే గారు కూడా ఆయన్ని ఆంధ్రవర్డ్స్‌వర్త్ అని చెప్పి అభివర్ణించారు. కవికొండల వెంకటరావుగారు నా దృష్టిలో భావకవులకంటే కూడా గొప్పని భావిస్తున్నాను. సరే అదే సమయంలో పాటకజనం యొక్క భాషనే. ఉపయోగించి నండూరి సుబ్బారావుగారు ఎంకిపాటలు రాశారు. పాటలైతే పాటకజనం యొక్క భాషలోనే ఉన్నాయిగానీ, అవి పాటకజనుల యొక్క భావకవిత్వం అని చెప్పి నేను ఎంకి పాటల్ని అభినందించక తప్పదు.

ఇట్లాగా జరుగుతూ వుంటే 1930 నుంచి 40 మధ్య హంగ్రీ తర్టీస్ అని చెప్పి అంటారే ఆ 30 నుంచి 40 పది సంవత్సరాల ఆ దశాబ్దం చాలా ప్రపంచ పర్యాప్తమైనటువంటి ఆర్థికసంక్షోభంలో మునిగున్నటువంటిది. అప్పుడే నేను కూడా ప్రారంభదశలో భావకవిత్వం రాస్తున్న వాణ్ణి ఇది కాదు దారి. అసలీ గ్రాంధికభాషనే వదిలిపెట్టేయాలి. గురజాడ అప్పారావుగారు చూపించిన బాటలో నడవాలని చెప్పి ఈ మలుపుని అందుకోవడానికి కారణం ఏమిటంటే అనాటి అబ్జెక్టివ్ కండిషన్స్. 20వ శతాబ్దపు నాల్గవ దశాబ్దంలోని ఆర్థిక సంక్షోభం ఒక కారణం. ఆ దశాబ్దంలో ప్రపంచాన్ని ఉర్రూతలూగించినటువంటి స్పానిష్ సివిల్‌వార్ – మీకందరికి జ్ఞాపకమే వుంటుంది. మొత్తం మేధావులందరూ కూడాను లెఫ్టిస్టులుగాను రైటిస్టులుగాను విడిపోయారు. విడిపోయి స్పెయిన్ అంతర్యుద్ధంలో ఈ రిపబ్లికన్ పార్టీని – స్పానిష్ కమ్యూనిస్టులను సమర్థించిన రచయితలున్నారు. ఖండించినటువంటి వాళ్లు వున్నారు. రాల్ఫ్ ఫాక్స్ అనగా, క్రిస్టఫర్ కాడ్‌వెల్. స్టీఫెన్‌స్పెండర్, వీరందరు కూడాను ఇంటర్నేషనల్ ఆర్మీలో చేరి స్పెయిన్ అంతర్యుద్ధంలో పాల్గొన్నారు. ఆ సందర్భంలో మన జవహర్‌లాల్ నెహ్రూగారు కూడా స్పెయిన్‌కి వెళ్లారు. దారిలో ముస్సోలినీ ఆహ్వానం పంపించాడట ఒకసారి మా ఇటలీకి కూడా వచ్చి తమ దర్శనభాగ్యం ఇప్పించండంటే నథింగ్ డూయింగ్ అని చెప్పి నెహ్రూ ఏమో ముస్సోలినీ యొక్క ఆహ్వానాన్ని అంగీకరించలేదు. ఆ దశాబ్దం దందహ్యమానంగా ప్రపంచం మండిపోతున్నటువంటి దశాబ్దం. చాలా వరకు మహాప్రస్థానం గీతాలన్నీ కూడాను ఆ దశాబ్దంలో రాసినవే. వాటికి ప్రేరేపణ ఈ అబ్జెక్టివ్ కండిషన్స్ అని నేను చెప్పానే ఏ రచయితా ఒక భారతదేశంలోనే కాకుండా మొత్తం ప్రపంచం అంతటిలోను వచ్చినటువంటి ఈ ఉల్లోల కల్లోలాల ప్రభావంలో పడకుండా ఉండలేదు. అభ్యుదయ కవిత్వం ఒక్క దెబ్బతో భావకవిత్వాన్నంతటినీ కూడా తుడిచి పెట్టేసింది. అనాటి యువకులందరూను అభ్యుదయ కవులుగా మారితీరారు. అంతే కాకుండా అంతకు ముందు భావకవిత్వం రాస్తున్నటువంటి కృష్ణశాస్త్రి కూడా ఆయన అభ్యుదయ రచయితల సంఘం

ఒక వార్షికోత్సవానికి అధ్యక్షత వహించడం కూడా జరిగింది. అట్లాగే ఈ కవిత్వం పరిణామం చెందుతూ వచ్చింది. ఆ తర్వాత 1970లో అభ్యుదయ కవిత్వం కొంచెం కొడిగట్టిన దీపంలాగా చమురు చాలకో, ఉద్రేకం చాలకో ఏదో విధంగా విశ్రమిస్తున్న సమయంలో శ్రీకాకుళోద్యమం ప్రేరేపణవల్ల విప్లవ కవిత్వం వచ్చింది. స్థూలంగా ఇది ఈనాటి వరకు ఈ ఆధునిక కాలపు కవిత్వం యొక్క స్కెచ్. నేను విపులంగా చెప్పలేదని నాకు తెలుసు.

స్కెచ్చీగా మాట్లాడినా కూడా 1970లో తోకచుక్క వచ్చినటువంటి సంవత్సరం. ముత్యాలసరం -గురజాడ అప్పారావుగారు ముత్యాలసరం రాసినదగ్గర నుంచీ నేటి వరకు కవిత్వం ఎన్ని పరిణామాలు పొందిందో స్థూలంగా మాత్రమే మీముందు ప్రవేశపెట్టాను. ఇంకా విపులంగా మాట్లాడడానికి కాలాతీతమవుతోన్నది. కానీ ఒక్క విషయం మాత్రం నేను చెప్పదలచుకున్నాను. ఈనాటి కవిత్వం నిండా ఉత్త స్లోగన్లే తప్ప కవిత్వం లేదు. స్లోగన్లు కవిత్వమెలా అవుతాయి? ఇటువంటి ఒక విమర్శ వున్నది కానీ దేర్ ఆర్ స్లోగన్స్ అండ్ స్లోగన్స్.

వర్కర్స్ ఆఫ్ ది వరల్డ్ యునైట్ అన్న స్లోగన్స్‌తో ఒక విప్లవమే తీసుకొచ్చారు. రష్యాలో కార్మికులు. అట్లాగే బార్సిలూనా యుద్ధంలో లాపాషనారా ముందు కదుగువేయనియ్యం అని స్పానిష్ వీరులు పోరాటం సాగించారు. కాబట్టి స్లోగన్స్ కవిత్వం కాకపోలేదు. ఎటొచ్చీ కవిత్వానికి వుత్త ఈ మాటలే కాకుండా ఆ మాటల మీద కవికి ఒక కంట్రోల్ కూడా వుండాలి. అంటే ఏమన్నమాట, ఒక కవికే కాదు ఒక ఆర్టిస్టన్న వాడికి ఒక మీడియం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అని ఉంటుంది. కవికైతే మాటలు, చిత్రకారుడికైతే గీతలు, మ్యుజీషియనుకైతే స్వరాలు, శిల్పికయితే శిలలో లేకపోతే మార్బుల్స్- ఇట్లాగా ఆ మీడియం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ మీద కంట్రోల్ వుండాలి. అందుకే పికాసో అంత గొప్పవాడు ఏమన్నాడంటే నేను ప్రాబబ్లీ అయామ్ నాట్‌ఎన్ ఆర్టిస్ట్ - నేను ఆర్టిస్టునికాను. పెయింటర్నికాను, అయామ్ ఏ డ్రాఫ్ట్స్‌మెన్. నా గీత మీద అధికారం నాకుంది అని చెప్పి ఆయన చెప్పాడు. ఈ మీడియం (ముడిసరుకు అందాం పోనీ దీనిని) ఆ ముడిసరుకు మీద కంట్రోల్ వుండాలి. కవికైతే మాటల మీద కంట్రోల్ వుండాలి. ఆ మాటలు కవిని పట్టుకు పోకూడదు. శ్రీనాథుడికిన్నీ, పోతననకిన్నీ భేదం చెబితే పోతన గారు గొప్పకవి. అందుట్లో ఏమీ సందేహం లేదు. కానీ మనకేమనిపిస్తుందంటే పోతన గారిని మాటలు లాక్కుపోతున్నాయేమో.

మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబువోవునే యిట్లాగా ఆయనను గనక చూస్తే ఎట్లాగ వెళ్లిపోతున్నదో మనకు తెలియదు. సంసార జీమూత సంఘంబు విచ్చునే చక్రిదాస్య ప్రభంజనము లేక అలా ఇలా అన్నాడంటేను మాటలు పోతనగారిని నడిపిస్తున్న యేమోననిపిస్తుంది. దానికి యిప్పుడు చెప్పినవి ఉదాహరణలు. కానీ శ్రీనాథుడికి మాటల మీద కంట్రోల్ ఎలా వుంది అని చెప్పడానికి నాకు సాధారణంగా పద్యమొకటి జ్ఞాపక మొస్తూంటుంది ఆయనది.

శివరాత్రి మహాత్యమన్నది చాలా మందికి తెలియదు. ఆంధ్ర సారస్వతపరిషత్తు పత్రికవాళ్ళు ఒక శిథిలమైపోయినటువంటి గ్రంథాన్ని పునరుద్ధరించి అచ్చువేశారు. అది నన్నెంతో ఇన్‌స్పైర్ చేసింది. నిజంగా ఆంధ్ర సారస్వతి పరిషత్తు వాళ్ళు చేసినటువంటి సత్కార్యాల్లో శ్రీనాధుని యొక్క శివరాత్రి మహత్యం బయటపెట్టడం ఒకటని కూడా నేనెక్కడో ఎప్పుడో రాశాను. అందులో అద్భుతమైన ఒక పద్యం. ఆ పద్యంలో ఆయనకు మాటల మీద ఎంత కంట్రోల్ వుంటుందో మీరే చూడొచ్చు. "నిష్ఠాసంపదనర్ఘ్య పాణులగుచున్ విప్రుల్ ప్రశంసింప, మంజిష్ఠారాగమ మండలంబున నధిష్ఠింపన్" నిలింపాధిభూకాష్ఠా మధ్యమంబున తోచెన్‌శతాంగా భ్రష్ఠ సర్పద్విషజ్యేష్ఠుం డప్పుడు నిష్ఠురప్రసర బంహిష్ఠద్యుతి శ్రేష్ఠతన్"" ఈ షక్రిందఠ ప్రాసవిపెట్టి ఆ ప్రాసస్థానంలో నాలుగు చోట్ల అదొస్తేచాలు. కాని ఎన్ని చోట్ల దాన్నిమెలికలు తిప్పించాడు. మరొకసారి కూడా చదువుతాను. నిష్ఠాసంపద నర్ఘ్య పాణులగుచున్ విప్రుల్ ప్రశంసింప మంజిష్ఠారాగమ మండలంబున నధిష్ఠింపన్ నిలింపాధిభూక అంటే ఏమిటి తూర్పు దిక్కు నిలింపాధి భూకాష్ఠా మధ్యమునందు దోచెను. శతాంగభ్రష్ఠ సర్పద్విషజ్యేష్ఠుండప్పుడు గరుత్మంతుని యొక్క అన్న అసురుడు సర్పద్విష అంటే సర్పసుతులుడు గరుత్మంతుడు. వాడి కన్నా మొదటివాడు జ్యేష్ఠుడు. నిలింపాధి భూకాష్ఠా మధ్యమునందు దోచెను శతాంగభ్రష్ఠ సర్పద్విషజ్యేష్ఠుండప్పుడు నిష్ఠురప్రసర బంహిష్ఠన్ ద్యుతి జేష్టతవ్ అని చెప్పి. ఈ పద్యంలో నాకు ఏం కనబడుతుందంటే ఒక ఆర్టిస్టు యొక్క కంట్రోల్ ఓవర్ హిజ్ మీడియం. ఇది కూడా కవిత్వానికి చాలా అవసరం అని అనుకుంటున్నాను.

మాట్లాడవలసిన వారు, నేను వారు మాట్లాడగా వినడానికి కుతూహలంగా వున్నాను కాబట్టి ఇంతటితో విరమిస్తున్నాను.

(హైదరాబాద్ ఎ.జి. ఆఫీసు సాహిత్య సంస్థ రంజని 2.6.1980 న ఏర్పాటు చేసిన అభినందన చందనం కార్యక్రమంలో మాట్లాడింది)

**ముద్రణ : రంజని, శ్రీ శ్రీ ప్రత్యేక సంచిక, 1983**

# చారిత్రక పరిణామం

ఇది ఒక ఇన్‌ఫార్మల్ గేదరింగ్ కాబట్టి ఏవిధమైనటువంటి ప్రీ మెడిటేషన్... అదే ... నేను వచ్చేటప్పుడు, ఫలానా విధంగా మాట్లాడాలని అనుకుని రాలేదు... మీరందరూ ఎదురుగా ఉన్నారు. మీలోంచే నేనొక ఇన్‌స్పిరేషన్ తీసుకుని మాట్లాడతాను... మట్టిలోంచీ... మట్టి అంటే భూమి. ఆ భూమాతలోంచీ.. గ్రీకు పురాణాల్లో ఆంటీనియన్ అని చెప్పి ఒక జయింట్ ఉన్నాడు. హెర్క్యూలియస్ చేసినటువంటి అనేక ఘనకార్యాల్లో ఒకటి ఆ ఆంటీనియన్ అనే రాక్షసుడ్ని సంహరించడం. ఈ ఆంటీనియన్ అనేటటువంటి రాక్షసుడికి ఉన్న శక్తంతా ఎక్కడుందీ అంటే, వాడు భూమినొక్కసారి ముట్టుకునేసరికి వాడి బలం రెండింతలైపోతూ ఉంటుంది. ఆ సంగతి తెలీనివాళ్ళు ఎంతో పెద్ద ఎత్తున పోరాటం చేసి... డౌన్ ఎండ్ ఔట్ అయిపోయారు. హెర్క్యూలియస్ ఏం చేసేడంటే వాడికి భూమికి సంబంధం లేకుండా ఆకాశంలో విడిచిపెట్టి అక్కడ సంహరించాడు వాడ్ని. కాబట్టి భూమితో మనం సంబంధం పెట్టుకున్నంత కాలం మనకి బలం వస్తుంది. కవికి కూడా అంతే. కవికి కూడా ఆ ప్రజలతో, ఆ భూమితో నిత్యసంబంధం ఉండాలి.

ఇక్కడ చాలా మంది డాక్టర్లున్నారనుకుంటాను. డాక్టర్ల మీద ఒక జోక్ ఉంది... (నవ్వులు)... ఇది నా జోక్ కూడా కాదు. కృష్ణశాస్త్రిగారిది. జోక్స్ అంటే నిజానికి హర్ట్ కాకూడదు. న్యాయంగా జోక్స్‌ను తీసుకోవలసిన విధంగా తీసుకోవాలి. కాబట్టి ఐ వుడ్ జస్ట్ లైక్ టు రీటెల్ ఎ జోక్. ఆయన ఏమన్నారంటే, "ఏవండి ఈ మధ్య మీరు వైద్యం మానేసి కవిత్వం మొదలెట్టారట నిజమేనా?" అని ఒక డాక్టర్నడిగితే "అవునండి నిజమే. వైద్యం మానేశాను కవిత్వం రాస్తున్నానండి" అన్నాడట. ఆయన "సరే ఏదైతేనేం మనుషుల్ని చంపడానికి" అన్నాడట.. (నవ్వులు)... బహుశా మేం కవిత్వంతో మనుషుల్ని చంపుతున్నామేమో నాకు తెలీదు.

సెప్టెంబరు నుంచీ ఫిబ్రవరి దాకా నేను లండన్‌లో ఉన్నాను. ఇటీజ్ వన్ ఆఫ్ ది మోస్ట్ ఎడ్వాన్స్‌డ్ నేషన్స్. అంతే కాకుండాను థాచర్ గవర్నమెంటు అంటే, ఈనాడు కన్సర్వేటిజమ్‌కి పట్టుగొమ్మ. ఆవిడకి ఎంత పట్టుదల అంటే బాబీ శాండ్స్ చచ్చిపోయినా సరే, "వాడు కన్విక్టెడ్ క్రిమినల్, వాడికి పొలిటికల్ స్టేటస్ ఎలా ఇస్తాం మేం" అంది. అంటే... న్యూస్ వీక్‌లో 'లెటర్స్ టు ది ఎడిటర్'లో ఓ చిన్న ఉత్తరం వచ్చింది. అందులో 'అతను ప్రాయోపవేశం చేసి నిరశన వ్రతంలో ప్రాణత్యాగం చేశాడే, కన్విక్టెడ్ క్రిమినల్ ఎవరూ కూడానూ తన యొక్క ఆశయాల కోసం అని చెప్పి ప్రాణత్యాగం చెయ్యడానికి

సిద్ధపడదు. వాళ్ళకి పొలిటికల్ స్టేటస్ ఇవ్వడం మంచిదేమో'నని చెప్పి రాశాడు. అయినా కూడా ఆవిడ మాత్రం ససేమిరా నేనొప్పుకోను అంది. ఎందుచేతంటే స్టేటస్కో అంటే వాళ్ళకంత ఇదుందన్నమాట. ఇది, ఇలా శాశ్వతంగా ఉంటుందన్చెప్పి వాళ్ళకొక భ్రమ. కన్సర్వేటివ్స్ గాని, రియాక్షనరీస్ గాని వాళ్ళకెప్పుడూ కూడానూ ఈ పరిణామం మీద నమ్మకం ఉండదు. మేం ఇక్కడికి పరిపాలించడానికి వచ్చాం ఇలా కంటిన్యుయస్‌గా జరిగిపోతూ ఉంటాయ్ అనుకుంటారు. కాని కాలం, చరిత్ర ఇవి నిత్య పరిణామశీలమైననటువంటివి. ఆ కాలాన్ని మనం ఆపలేం. చరిత్ర గమనాన్ని ఆపలేం. అనుక్షణం మనలో మార్పొస్తున్నది. మనం మారుతున్నాం. ఈ మార్పుని ఇవల్యూషన్ అని మనం అంటే, పెద్ద మార్పు రివల్యూషన్‌గా వస్తోంది. ఆ రివల్యూషన్ అనేది ప్రతిరోజూ వచ్చేదికాదు. కానీ ఎప్పుడో ఒకప్పుడు వచ్చి తీరుతుంది. అది మార్క్సిస్టుగా నేను నేర్చుకున్నటువంటి చారిత్రక సత్యం. ఎవరు ఎన్ని ఇది చేసినా, రావలసిన మార్పు వచ్చి తీరుతుంది. ఏ కాన్యూట్ కూడాను ఆ కెరటాల్ని ఆగమంటే ఆగేవికావు. ఇది చారిత్రక పరిణామం.

నేను మొన్న లండన్‌లో రీగన్ అరి ఇనాగరేషన్ టి.వి.లో చూశాను. ఆయన ఎంతో సెల్ఫ్‌కాన్ఫిడెన్స్‌తో ప్రసంగం చేశాడు. అమ్మో ఈయన చాలా గట్టివాడురా, కొన్ని కొన్ని గట్టి నమ్మకాలున్నవాడు అని అప్పుడే అనిపించింది నాకు. ఆయన గట్టి నమ్మకానికి వెనకదన్ను ఏమిటి అంటే విన్‌స్టన్ చర్చిల్ గారి భావజాలం. ఆయన స్పీచ్‌లో నాలుగైదుసార్లు చర్చిల్‌ని చాలా కాన్ఫిడెంట్‌గా కోట్ చేస్తాడు. విన్‌స్టన్ చర్చిల్ భావాల బోలుతనం, అవి ఎంత గుల్లగా ఉంటాయో అని నాకనిపించింది. మీకు తెలుసును. మన స్వరాజ్యోద్యమం తీవ్రంగా జరుగుతూంటే "దట్ హాఫ్ నేకెడ్ ఫకీర్ ఎసెండింగ్ ది స్టెయిర్‌కేస్ ఆఫ్ ది వైస్‌రీగల్ పేలస్" అంటూ గాంధీని ఎప్పుడూ కూడా నీచంగా మాట్లాడినటువంటి వాడు విన్‌స్టన్ చర్చిల్. అంతే కాకుండా ఇండియాకు స్వరాజ్యం ఇవ్వాలంటే ఏమన్నాడంటే "ఐషల్ నాట్ బికమ్ ది ఫస్ట్ మినిస్టర్ ఆఫ్ హిస్ మెజస్టిస్ గవర్నమెంట్ టు ప్రిసైడ్ ఓవర్ ది లిక్విడేషన్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" అని ఆయన కాన్ఫిడెంట్‌గా చెప్పిన నాలుగైదు సంవత్సరాల్లోనే బ్రిటిష్ ఎంపైర్ అంతా కూడాను విచ్ఛిన్నమై పోవడం ఆయన కళ్ళతోనే ఆయన చూశాడు. ఇది, ఎదుట స్పష్టంగా జరుగుతున్నటువంటి ఒక చారిత్రక సంఘటన.

చర్చిల్‌గారంత గొప్పవాడు కాకపోయినా, భారతీయుల్లో మంచి కన్సర్వేటివ్, విజ్ఞానవంతుడు, దాదాపు గాంధీగారికి కుడి భుజం అనుకునే రాజగోపాలాచారిగారు అంటే నాకు చాలా అసహ్యం. ఎంచేతా అంటే దట్ వైదిక్ బ్రాహ్మిన్ ఫాక్స్ అని చెప్పి జాన్ గంథర్ కూడా 'ఇన్‌సైడ్ ఏసియా' లో రాశాడు. రాజగోపాలాచారిగారు చాలా గొప్పవాడంటారు. ఎంచేతా? ఆయన రియాక్షనరీ ఆర్చ్ కన్సరేటివ్. అతని భావాలన్నీ కూడాను అభివృద్ధి నిరోధకమైనటువంటివి. ఆయన మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటూ... అప్పుడింకా మనకి స్వరాజ్యం రాలేదు. సర్ సామ్యూల్ హూర్ అనే ఆయన సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా ఉండేవాడు. ఆ రోజుల్లో మన బులుసు సాంబమూర్తిగారు స్పీకర్‌గా ఉండేటప్పుడు ఆయన

లండన్ వెళతానంటే, వెళ్ళేవరకు అన్ని ఏర్పాట్లు చేసి తీరా ఆయన వెళ్లే సమయానికి ఏదో సొట్టకాలు అడ్డుపెట్టాడు. సాంబమూర్తిగారి ప్రయాణం ఆగిపోయింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అందరూ ఏకగ్రీవంగా మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని వేరు చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని చెప్పి తీర్మానించారు. ఆ తీర్మానాన్ని సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కి పంపాలి. రాజాజీ రికమెండ్ చేయాలి. ఓ దానిదేముంది. అది అందరూ ఒప్పుకున్నారు కదా నేనూ ఒప్పుకుంటాను" అని చెప్పి సీక్రెట్ రిపోర్టులో ఏమని రాశాడంటే "ఆంధ్రరాష్ట్రాన్ని గాని విభజిస్తే మద్రాసు నగరంలో రక్తపాతం జరుగుతుంది" అని.. అందుకని ఆనాడే రావాల్సినటువంటి ఆంధ్ర రాష్ట్రం మనకు రాలేదు. వీళ్లు ఇటువంటి పనుల వల్ల ఈ మార్పుని కొంచెం ఆలస్యంగా వచ్చేట్టు చెయ్యగలరేమో తప్ప రాకుండా మాత్రం చెయ్యలేరు. ఈ రీగన్‌గానీ, థాచర్‌గానీ, ఇతర కన్సర్వేటివ్ గవర్నమెంట్స్‌గానీ, వీళ్లందరూ కూడానూ రాబోయే మార్పుని ఏమైనా కొంచెం, ఒక ఏడాది, నాలుగేళ్లు, ఈవెన్ టెన్ ఇయర్స్ కూడాను పోస్ట్‌పోన్ చేస్తే చేస్తారుగాని, రావలసిన మార్పు వచ్చి తీరుతుంది. అది పరిణామక్రమం. క్రమంలో, మానవజాతి యొక్క అభివృద్ధిలో అది జరిగి తీరుతుంది. ఈ విశ్వాసం ఒకటి నాకు, నా కవిత్వానికి బలమిస్తున్నదని నాకు బోధపడుతోంది.

నా కవిత్వం అని నేను అంటున్నానుగానీ, ఇది ఇరవయ్యవ శతాబ్దపు కవిత్వం. మిగిలిన శతాబ్దాలు చాలా స్లో టెంపోలో నడిచాయి. ఈనాడు గంటకు ముప్పైవేల మైళ్ల స్పీడ్‌లో వెళ్తున్నటువంటి రాకెట్స్ ఉన్నటువంటి కాలంలో మనం ఉన్నాం. ఈ కాలంలో ఎటువంటి కవిత్వం రావాలి? ఆ రోజుల్లో పెద్ద మంచి స్పీడ్ ఉన్నదీ అంటే గుర్రం. గుర్రబళ్ళున్నాయంటే, అవి... హార్స్‌పవర్ అని కూడా మనం అనడానికి అదే కారణం అనుకుంటాను. ఆ రోజుల్లో పద్యాలు కూడానూ రథాల్లా ఉండేవన్నమాట. రథానికి నాలుగు చక్రాలుంటాయ్. మన ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం ఇవి. మన వృత్తాలన్నీ కూడానూ మాంఛి మెజిస్టిక్‌గా, ప్రొసీడ్ అవుతున్నటువంటి రథాల్లా నడుస్తూంటాయి. అందుకే విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం గురించి నేనొకప్పుడు కామెంట్ చేస్తూ, "ఇవి మహాబలిపురం రాతిగోపురాలు'' అని చెప్పి అన్నాను. కానీ, ఇప్పుడు స్పీడ్ ఎక్కువైపోయి, మనం మాత్రాచ్ఛందస్సుల్లోకి వచ్చాం. ఇది వరకు ఛందస్సులన్నీ కూడానూ గణబద్ధపు ఛందస్సులు. ఈ గణబద్ధపు ఛందస్సుల్లోంచి మాత్రాబద్ధ ఛందస్సులోకి, వాడుక భాషలోకి వెళ్ళాం. ఈ గణబద్ధపు ఛందస్సులో భాషేమో గ్రాంథిక భాష ఉంటుంది. ఆ భాష, ఆ పద్యాలూ ఆనాటి ఫ్యూడల్ వ్యవస్థకి సరిపోయినాయి. కానీ ఈనాడు గురజాడ అప్పారావుగారు వచ్చిన తర్వాత – ఇరవైయ్యవ శతాబ్దపు మహాకవి అని గురజాడ అప్పారావుగారిని నేను ఎందుకంటున్నానంటే, ఆ గణబద్ధ ఛందస్సుల, గ్రాంథిక భాషాయుతమైనటువంటి భూస్వామ్య వ్యవస్థ నుంచీ ఈనాటి ప్రజాస్వామ్య వ్యవస్థకీ, మాత్రాబద్ధ ఛందస్సులకీ, వాడుక భాషలోకిన్నీ దారి మళ్ళించినవాడు మన గురజాడ అప్పారావుగారు. నేను చేసినదేవిటంటేను, ఆయన ఒక చిన్న సందుని చూపిస్తే ఆ సందుని మరింత వెడల్పు చెయ్యగలిగాను.

'మహాప్రస్థానం'లో నేను చేసిన పని అదే. 'మహాప్రస్థానం'లో నేనన్నీ మాత్రా ఛందస్సులే తీసుకున్నాను. అంతకు ముందంతా నేనూ ఇటువంటి వృత్తాలు ఎన్నో రాశాను. గీత పద్యాలు రాశాను. చంపకమాలలు, ఉత్పలమాలలు, శార్దూలాలూ ఇటువంటి వృత్తాలు ఎన్నో రాశాను. అవి అయిపోయిన తర్వాత ఈ 'మహాప్రస్థానం' స్థితికి వచ్చేసరికి "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అని ముత్యాల సరాల్లో ఒక వేరియేషన్. భాషేమోను వాడుక భాష. కాబట్టి ఈనాడు ఈ ఇరవయ్యవ శతాబ్దపు కవిత్వం వాడుక భాషలోనే ఉండాలి. మాత్రాబద్ధ ఛందస్సులోనే ఉండాలి. కానీ వచన గీతం ఉన్నది. 'వచన గీతంలో ఏం టెంపో వున్నది' అని మనం అనుకుంటాం. కాని వచన గీతంలో నిజమైన పొయిట్రీ వుంటే అది రాకెట్ స్పీడులో పోయినట్టుంటుంది. విమానంలో ప్రయాణం చేస్తుంటే, విమానం నడుస్తున్నట్టే వుండదు. కాని మనం విమానంలో ఎంత స్పీడులో వెళుతుంటామో వచన గీతంలో కూడా అంతే. గ్రాంథిక భాష స్పీడు వేరు, మాత్రాఛందస్సుల స్పీడు వేరు, రచన గీతంలో స్పీడు వేరని చెప్పడం కోసమే ఇదంతా.

ఈనాడు ఇంకొక విషయం కూడా మనం చూస్తున్నాం. విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఇన్నాళ్లూ మనం రాస్తున్నది శిష్టవ్యావహారిక భాష. మడి కట్టుకున్నటువంటి వాళ్ళ భాష. కానీ దీనిని మించినటువంటి పాటకపు జనుల, శ్రామిక జనుల భాషొకటుంది. దాన్ని ఆదరించే వాళ్ళు లేరు. ఒక విధంగా చూస్తే నన్నయ్యభట్టు గారికంటే కూడా ప్రాచీనమైనటువంటి కవిత్వం మన జానపద కవిత్వం. నన్నయ్యభట్టుగారు పుట్టక ముందు కొన్ని వందల సంవత్సరాల కిందట కూడా కొండల్లో రాళ్లూ అవీ కొట్టుకునే వాళ్లూ పాడుకున్నారు. పడవలు నడిపేటటువంటి, ఆ నదిలో చేపల్ని పట్టుకుని జీవితం గడిపేటటు వంటి వాళ్ళ పాటలున్నాయి. ఇంట్లో ఆడవాళ్ళు-వాళ్ళకి చదువు, సంధ్య రాకపోవచ్చును. కాని వాళ్ళ సంతోషం, వాళ్ల పెళ్ళిళ్ళు, లేదా వాళ్ళ నోములు, వాళ్ళు పాడుకునేటటువంటి పాటలు నిజమైనటువంటి ప్రజాసాహిత్యం అన్ని చెప్పి నేను అనుకుంటాను. ఈనాడు విప్లవ రచయితల సంఘం రచయితలు, కవులు అంటున్నదేమిటంటే "ఆ మడి కట్టుకున్న గ్రాంధిక భాషావాదం సరే. మధ్యరకంగా ఉండేటటువంటి ఈ భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం కూడా శిష్ట వ్యావహారిక భాషలోనే ఉంది" అని. ఈ రెండూ కాకుండానూ లేటెస్ట్ ట్రెండ్ ఇన్ తెలుగు పొయిట్రీ ఏమిటి అంటే ఈ శ్రామిక జనుల యొక్క జానపద రీతిలో పాటలు రాసి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తే, గ్రామాల్లో ఇప్పుడు గద్దర్ పాటలుగానీ, వంగపండు ప్రసాద్ పాటలుగానీ ఉర్రూతలూగిస్తున్నాయి. వాళ్ళు తీసుకున్న ఫార్మ్ ఏమోను ఫోక్‌లోర్ ఫార్మ్, కంటెంట్ మాత్రం రివల్యూషనరీ కంటెంట్. ఆ విధంగానూ ఇరవయ్యవ శతాబ్దపు ఆఖరి భాగంలో (ఇంకో పందొమ్మిది ఏళ్ళల్లో అసలీ శతాబ్దమే పూర్తయిపోతుంది) పరిణామ క్రమం అది. ఇంకొక్క విషయం కూడా చెప్పి, ఈ ఉపన్యాసం ముగించి, నా పొయెమ్ తీసుకుని చదువుతాను.

మావో ఒక సూత్రీకరణ చేశాడు. ఏమిటంటే ఈనాడు, ఈ ప్రపంచంలోనే మూడు ప్రపంచాలున్నాయని, మూడు ప్రపంచాల థియరీ అని మనం అనుకోవచ్చును. ఏమిటీ

అంటే సూపర్ పవర్స్ యు.ఎస్.ఏ., యు.ఎస్.ఎస్.ఆర్. వాళ్ళది మొదటి ప్రపంచం. ఆ తరువాత ఎఫ్లుయెంట్ కంట్రీస్, సంపన్న దేశాలు - ఇంగ్లండ్ అనగా, ఫ్రాన్స్ అనగా, కెనడా అనగా, ఆస్ట్రేలియా అనగా, జపాన్ అనగా, వెస్ట్ జర్మనీ అనగా - ఇటువంటివన్నీ కూడానూ ఎఫ్లుయెంట్ కంట్రీస్ ఇది రెండో ప్రపంచం. దరిద్రగొట్టు దేశాలన్నికలిసి మూడో ప్రపంచం. ఆఫ్రికా, సౌత్ ఈస్ట్ ఏసియా, సౌత్ ఏసియా ఇవన్నీ కూడానూ బడుగు దేశాలు. ఇది మూడో ప్రపంచం. ఈ మూడో ప్రపంచానికి చైనా నాయకత్వం వహించాలని చెప్పి మావో అన్నాడు. దీన్ని నేను, మన తెలుగు సాహిత్యానికి అన్వయిస్తూ.. ఈ సూపర్ పవర్స్ యొక్క భాష విశ్వనాథ సత్యనారాయణగారి భాష అన్నమాట. సంపన్న దేశాలు అనగా భావకవిత్వమూ, అభ్యుదయ కవిత్వమూను. అంటే ఏమిటి? వాళ్ళు శిష్ట వ్యావహారిక భాష ఉపయోగించారు. పోతే, ఇక మూడో ప్రపంచం అనేది ఉన్నదే అదే బడుగు దేశాలు. వాళ్ళ భాష పాటకజనుల భాష. శ్రామిక జనుల భాష. జానపద రూపాలు.

**ముద్రణ : ఉదయం దినపత్రిక, 15.6.1988**

# IV

# ఇంటర్వ్యూలు

# దిగంబర కవులతో ముఖాముఖి

ప్రశ్న: కవిగా మీరు ఏనాడో చనిపోయారని సాహిత్యాభిమానులు అనుకుంటున్నారు. నిజమేనా ?

శ్రీశ్రీ: జవాబు చెప్పడం కష్టం. చెళ్లపిళ్ల జీవితాంతం రాశాడు. 'కవిగా చనిపోవడమంటే' మనమిచ్చే అర్థాన్నిబట్టి వుంటుంది. మొన్న (31 అక్టోబర్ 1969) కవి సమ్మేళనంలో ఒక గేయం విని చాలా మంది చప్పట్లు కొట్టారు. దీన్ని బట్టి కవిగా బతికున్నాని చెప్పలేను. స్విన్‌బర్న్ గురించి మీకు తెలుసు. అతని గొప్ప కవిత్వమంతా 25 సంవత్సరాల్లోపుగానే వచ్చింది. తర్వాత స్విన్‌బర్న్ చచ్చిపోయినట్టే లెక్క

ప్ర: మహాకవిగా సినీ ప్రపంచానికి అమ్ముడుపోకుండా ప్రజల మధ్య జీవించి విప్లవ చైతన్యాన్ని కలిగించలేరా ?

శ్రీశ్రీ: సినీ ప్రపంచానికి అమ్ముడు పోవడమన్న మాట నే నొప్పుకోను. ఎవరూ ఏ ఉద్యోగానికీ అమ్ముడుపోలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్నదే అది.

అమ్ముడుపోవడం, కొనుక్కోవడం అన్నది సినిమాలకే పరిమితం కాదు. సినీ ప్రపంచంలో కవిగాడు చేసేది ఏం లేదు. ఒక కథని దొంగిలించమంటే దొంగిలిస్తాం. కన్యాశుల్కంలో పాపం గిరీశం అమాయకంగా అంటాడు వకాల్తీలో ఇంత మోసం వుందని నాకు తెలీదని, ఈ వృత్తి వదిలేయాలని సౌజన్యారావు కూడా అనుకుంటాడు. కాని సౌజన్యారావు తర్వాత ఆ పని వదిలి వుండడు. సినిమాను తిట్టి ప్రయోజనం లేదు. దాన్ని ఆయుధంగా వాడుకోవాలి. వాడుకున్న వాళ్ళున్నారు. ఈనాడు సత్యజిత్‌రాయ్ సాధిస్తున్నాడన్న రియలిజం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత సినిమా ఒక అర్ట్‌ఫామ్‌గా డెవలప్ అయింది. రష్యాలో సినిమాలో ఒక కల్లోలం వంటిది వచ్చింది. సినిమాను ఒక ఆయుధంగా వాళ్ళు గుర్తించారు. ఇతర కళలన్నింటికంటే సినిమా విలక్షణమైనది. పుడోవ్‌కిన్‌కి ఆచార్య పీఠం వుంది. రచయితల్లో ట్రేడ్ యూనియనిజం వుండాలి. ఇంకోవిషయం ఒక్క కవిగా ప్రయోజనం వుండదు. డైరెక్టరుగారూ, ప్రొడ్యూసర్‌గా కూడా ఉంటే మంచిది.

సదాశివరావు, సముద్రాల డైరెక్టర్లుగా ఫెయిలయ్యారు. నిర్మాతలు కాలేదు. రచయిత తెలుగు సినిమాలో టరమ్స్ డిక్టేట్ చేసే స్థితిలో లేడు. స్టార్ సిస్టం ఈజ్ ఏన్ ఈవిల్. పెట్టుబడిదారీ విధానం తోకలాంటిది. ప్రొడ్యూసర్లు లోకోద్ధరణ కోసం ఏం చెయ్యడం లేదు. లాభార్జనే వాళ్ళ ఉద్దేశం. పెద్ద డిస్ట్రిబ్యూటరుని పట్టుకోవాలంటే పెద్ద స్టార్ కావాలి. ఇటాలియన్‌లో ఎవరిదో ఐడియా తీసుకుంటే అది గుర్తిస్తారు. తెలుగులో కథలకి కథలే మారిపోతాయి. సౌజన్యారావు చెప్పినట్టే ఈ ఊబిలోంచి బయటపడాలనే అనుకుంటున్నాను. లేకపోతే కెరటాలు ఆగిన తర్వాతే స్నానం చేస్తానన్నట్టుగా వుంటుంది.

ప్ర: గురజాడ పాత కొత్తల మేలుకలయికను మీరు అంగీకరించి పాతతో రాజీపడి నవీన అభ్యుదయ తత్వాన్ని బలహీన పరిచారని దిగంబర కవులు ఆరోపిస్తున్నారు? మీరేమంటారు?

శ్రీశ్రీ: పాత కొత్తల మేలు కలయిక కాన్సెప్ట్ నాకిష్టం లేదు. ఐయామ్ ఆల్వేస్ ఫర్ న్యూ. అయితే పాతవన్నీ నాశనం చేయమనను. మ్యూజియంలో పెట్టమంటాను.

మహాభారత, మనుచరిత్ర– ఎలా రాయగూడదో తెలుసుకోవడానికి పాతవి చదవాలి. ఆ పునాది వుండాలి. పాతతో రాజీలేదు. దిగంబర కవుల ఆరోపణ ఆధార రహితం. నేను అంగీకరించను. కొత్త రచనలు చేస్తున్నాను– మీరు ముందే అనుకుని ఆరోపిస్తున్నారు. నేను ప్రబంధాల్లోంచి వచ్చిన వాడిని కనుక ఆ అవశేషాలు వుండవచ్చు. కాని తిరుగుబాటు తత్వాన్ని నమ్మినవాణ్ని. సాంప్రదాయక ఉపమానాల వలన పాతదనం, యముని మహిషపు, శని దేవత రథ చక్రపు టిరుసుల్లో, హరోంహర మాటల్లో సాంప్రదాయకపు వ్యామోహం వున్నది. వీటి గురించి క్రిటిసిజం వున్నది. ఆరుద్ర ఇమేజరీస్ మోడరన్‌గా వుంటాయి. పాత వాసనలు మిగిలిపోయాయి. దీని వలన శ్రీ శ్రీ ఆధ్యాత్మిక కవి అని నన్ను క్లెయిం చెయ్యడానికి వీలున్నది. అయితే నేను – కొత్తలోనికి తలుపు తెరిచాను. దాంట్లోంచి చొచ్చుకు రావలసినవాళ్ళు మీరు – మీరా పని చేయాలి.

అభ్యుదయ కవిత్వం సాంప్రదాయ స్వభావంతో రాలేదు. దాంట్లో సాంప్రదాయకపు అవశేషాలు వుండవచ్చు. దిగంబర కవులు తిరుగుబాటు చేస్తున్నారు. వాళ్ళు కనబడిన ప్రతిదాని మీద తిరగబడుతున్నారు. వాళ్లు అనార్కిస్టులనుకోవాలో, మార్క్సిస్టులనుకోవాలో తెలియదు. ఎక్కువ అనార్కిస్టులుగానే కనిపిస్తున్నారు. ఆ లెక్కన చూస్తే షెల్లీ అనార్కిస్టు. క్రొపోట్కిన్ శిష్యుణ్ణయిన నాలో కూడా కొంత అనార్కిజం వుంది. అందుకే వాళ్లవి (దిగంబర కవులని) అనువాదం చేస్తున్నాను. యాక్చువల్‌గా క్రొపోట్కిన్, డాస్టోవిస్కీలని వాళ్ళు ఒప్పుకోలేరు.

ప్ర: సాహిత్యంలో అశ్లీలం అనబడే పదజాలాన్ని ఆయుధంగా వుపయోగిస్తున్నామని దిగంబర కవులు చెప్తున్నారు. మీరు సమర్ధిస్తారా ?

శ్రీ శ్రీ: అశ్లీలం అంటే ఏమిటి? లేడీ చాటర్లీస్ లవర్ యూనివర్సిటీలలో చదువుతున్నారు. జేమ్స్ జాయిస్‌ని, ఖజురహో, సింహాచలం మొదలైన దేవాలయాల మీద నగ్న దృశ్యాలను అబ్సీనిటీగా తీసుకోవడం లేదు.

ప్ర: జనసామాన్యాన్ని కవిత్వంతో మార్చవచ్చునంటారా?

శ్రీ శ్రీ : ఇది కొంచెం గడ్డయిన ప్రశ్నే. జన సామాన్యానికి ఇది ఎంత చేరువలో వుంటుంది అన్నదానిమీద ఆధారపడి వుంటుంది. మనకి ముప్పూటలు కాదు, రెండు పూటలు కూడా తిండి దొరకడం లేదు. జనసామాన్యం కవిత్వాన్ని భోగద్రవ్యంగానే చూస్తున్నారు. మినిమమ్ అవసరాలు తీరాకనే కవిత్వం. మయకోవస్కీ కవిత్వాన్ని ఇరవైయేళ్ళ కిందటికన్నా ఇప్పుడు ప్రజలు ఎక్కువ ఆస్వాదిస్తున్నారు. ప్రజలలో కవిత్వాభిరుచిని పోషించుకుంటూరావాలి.

ప్ర: కవిత్వాన్ని సమాజపరం చేసి, కవిత్వపు విలువల్ని విమర్శిస్తే కవిత అనిపించుకుంటుందా? లేక అది కేవలం ప్రచార సాధనం అనిపించుకుంటుందా?

శ్రీ శ్రీ: కవిత్వాన్ని సమాజపరం చేయడమన్నది పెద్ద కాంట్రోవర్సీ, గవర్నమెంటు కవిత, యాంటీ గవర్నమెంటు కవిత అని వున్నవి. అభ్యుదయం అనేమాట వస్తే ప్రాపగాండా అని అరుస్తారు. "రచయిత స్వేచ్ఛని ఎందుకు సప్రెస్ చేస్తున్నారు రష్యాలో ?" అంటారు. సామాన్యమైన కారణం ఏమంటే పెట్టుబడిదారీ విధానానికి పునరుజ్జీవనం పోసే ప్రమాదం వుంది. ఉదా: ఐజెన్‌స్టీన్ తీసిన సినిమాలో, విప్లవం విజయవంతం కాగానే జార్ చక్రవర్తి శిల్పం పడిపోయి ముక్కలు ముక్కలయిపోతుంది. కెరెన్‌స్కీ ప్రభుత్వం రాగా ఆ ముక్కలన్నీ మళ్ళీ అతుక్కుని బొమ్మగా తయారవుతుంది. కన్సర్వేటివ్ పత్రికలన్నీ ప్రాపగాండా పిక్చర్‌గా తీసిపారేశారు- కళాత్మకంగా గొప్పదని మెచ్చుకుంటూనే.

ప్ర: ఈ దేశంలో తిరుగుబాటును ప్రోత్సహించి క్రమంగా సాయుధ విప్లవాన్ని పరిపుష్టం చేయాలనే భావం దిగంబర కవుల్లో మీకు కనిపిస్తుందా?

శ్రీ శ్రీ: దిగంబర కవులు నక్సలైట్లు అయ్యే అవకాశం వుందనుకుంటారా. లేదా అనికాదు. దిగంబర కవులు సాంప్రదాయకపు విలువల పరువు తీసేస్తున్నారు. వీళ్ళు సాయుధ పోరాటాన్ని ప్రోత్సహిస్తారా అన్నది నేను చెప్పలేను. మీ దిగంబర కవిత్వం శ్రీకాకుళం వెళ్ళదు. అసలు విప్లవం శ్రీకాకుళంలో వుంది. ఒరిస్సాలో రియాక్షనరీ ప్రభుత్వం ఉంది. కేరళలో రివల్యూషనరీ ప్రభుత్వం ఉంది. మధ్య ఆంధ్రప్రదేశ్‌లో.....

ప్ర: కేరళలో వున్నది రివల్యూషనరీ ప్రభుత్వం అంటారా?

శ్రీ శ్రీ: మాటవరసకి కేరళలో వున్న ప్రొగ్రెసివ్ గవర్నమెంటు పరిస్థితి ఏమిటంటే అందరు మంత్రుల మీదా నేరారోపణ వచ్చిన మంత్రివర్గం అదే. దిగంబర కవుల్లో రాజకీయ చైతన్యం కంటే కవితా చైతన్యమే ఎక్కువ.

ప్ర: ఈ దేశంలో విప్లవం వస్తే రష్యా, చైనాలలో వచ్చిన విధంగా వస్తుందంటారా?

శ్రీ శ్రీ: You are asking me to become an astrologer. ఈ దేశంలో విప్లవం వస్తుంది. ఇవాళ వస్తుందా రేపా అన్నదే సమస్య. చేగువేరా షెపోమావో షేపో. కృశ్చేవ్ వలె ట్రాన్సిషనల్ షెపో తీసుకోవచ్చు. అటువంటిది రావడం మిగిలిన ప్రపంచంతో ముడిపడి వున్నది. ఇండియా మిగిలిన ప్రపంచంతో విడివడిలేదు. ప్రపంచ యుద్ధకాలంలో వచ్చినవే రష్యా, చైనా విప్లవాలు.

తొమ్మిది నెలలు నిండకముందు కాన్పురాదు. చరిత్ర ధర్మం విప్లవం.

రివల్యూషన్‌లో రియాక్షనరీస్ మీద ప్రోగ్రెసివ్స్ గెలుస్తారు. హింస లేకుండా విప్లవం లేకుండా ప్రోగ్రెసివ్ శక్తులు గెలవవు. డయోలక్టికల్, ఆబ్జెక్టివ్ కండిషన్సు విప్లవానికి అవసరం. కాని అవే సరిపోవు. ఆయుధాలు కావాలి. చీపురు పుల్లలతో స్వరాజ్యం రాలేదు. నూరు డిగ్రీల వేడి వచ్చినప్పుడు బాయిలింగ్‌ను ఎవరూ ఆపలేరు.

ప్రశ్న: ప్రాచీన కవిత్వం మేలు కంటే కీడు ఎక్కువ చేసిందని, యువకులను కొజ్జాలుగా మార్చిందని ఒక విమర్శ. దీన్ని మీరు ఒప్పుకుంటారా?

శ్రీ శ్రీ : కవిత్వం యువకుల వీర్యశక్తిని ఎలా పెంపొందింపజేస్తుందో నేను చెప్పలేను. ప్రాచీన కావ్యాల్లో రీడొంట్ చేయాల్సింది చాలా వుంది. నన్నయ, శ్రీనాథుడు వాళ్ళ కవిత్వాన్ని అనాటి పరిస్థితుల్లో చూడాలి. కవిత్వం చదివేటప్పుడు కూడా చరిత్రాత్మక దృక్పథం వుండాలి. అంతేకాని ప్రాచీన కావ్యాల వలన ఈనాటి యువకులు కొజ్జాలుగా మారారంటే ఒప్పుకోను. పాఠ్య ప్రణాళికల్లో సమూలమైన మార్పు రావాలి. ఆ మాటకొస్తే నేటి విద్యావిధానమే మారిపోవాలి.

ప్ర: దిగంబర కవిత్వాన్ని కె.వి. రమణారెడ్డిగారు కసిత్వమని, బూతు అని అపోహపడుతున్నారు. నిజమేనంటారా?

శ్రీశ్రీ: దిగంబర కవిత్వం కసిత్వం అన్నది అపోహకాదు. అందులో నాకు పొయెట్రీ కనిపించింది. ఆయనకు కసి మాత్రమే కనిపించింది. కసిత్వం మీలో ఉంది. అది అతన్ని ఎక్కువ ఆకర్షించింది. ఆయనకు ప్రొఫెసర్ దృక్పథం వుంది. అది ఆయన స్వంత ఇబ్బంది. కసిత్వం లేదని మీరూ అనలేరు. He has written in a particular view point.

ప్రశ్న: దిగంబర కవులు పెట్టీ బూర్జువాలని అన్న ఆరుద్ర వ్యాఖ్యానంపై మీ అభిప్రాయం.?

శ్రీశ్రీ: పెట్టీ బూర్జువా అన్నమాట తిట్టుగా తీసుకోకూడదు. దిగంబర కవులు పెటీ బూర్జువాలన్నది నిజమే. మనం అరిస్టోక్రాట్స్ కాదు, వర్కర్స్‌మీ కాదు మన వర్గమంతా పెటీ బూర్జువావర్గం.

ప్ర: "సమాజం అంతగా పతనమయిందా?' అని వాపోయిన రియాక్షనరీ క్రిటిక్ రాచమల్లు రామచంద్రారెడ్డిలో ప్రెజుడిసెస్ ఉన్నాయని అంటున్నారు. మీరే మంటారు?

శ్రీశ్రీ: సమాజం నిజంగానే పతనమై పోయింది. ఆయన ఆప్టిమిస్ట్ కావడం వల్ల సమాజం ఇంకా పూర్తిగా కుళ్లిపోలేదనుకుంటున్నాడు. దిగంబర కవులు రైటు, అయితే రా.రా. రియాక్షనరీ కాదు. ఆయన మార్క్సిస్టు విమర్శకుడు. తూచగల తూకపు రాళ్లు ఆయన దగ్గర వున్నాయి.

ప్రశ్న: ఎలాంటి వ్యవస్థలో అయినా వ్యక్తికి సంపూర్ణమైన మానసిక స్వేచ్ఛ ఉండాలనే అంశాన్ని మీరు అంగీకరిస్తారా?

శ్రీశ్రీ: రచయితయినా, కళాకారుడయినా ఎవడి కాళ్ళ మీద వాడు నిలబడగలగాలి. ఆర్థిక ఇబ్బందులు లేకుండా బ్రతకగలిగి ఉండాలి. నా గ్రంథాల మీద నేను బతకడం లేదు. మొట్టమొదట రచయితలు తమ రచనలమీద బ్రతికే పరిస్థితి రావాలి.

ప్ర: మిమ్మల్నొక్కర్నీ అన్నీ సమకూర్చి ఒంటరిగా సహారా ఎడారిలో వదిలేస్తే ఏ రచయితల పుస్తకాలు చదవాలనుకుంటారు?

శ్రీశ్రీ: సహారా ఎడారిలో ఉన్నా న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్ లాంటి రెండు మూడు పత్రికల వాళ్లు రికమెండ్ చేసే పుస్తకాలు కావాలి. ఏ క్షణంలో ఏ కుర్రాడు ఏ మంచి పుస్తకం రాసిపడేస్తాడో తెలుసుకోవచ్చు. 'పిపీలికం' అని రాచకొండ విశ్వనాథశాస్త్రి బ్రహ్మాండమైన కథ రాశాడు. అచ్చయిన నాలుగైదు నెలల తర్వాత తెలిసింది. ఆ ఎడారిలో కూడా కంటిన్యూటీ కావాలి.

ప్రశ్న: మార్క్సిజానికీ మావోయిజం అతివాద బాలారిష్టం అని రష్యన్ కామ్రేడ్‌లు విమర్శిస్తున్నారు. మీరేమంటారు?

శ్రీశ్రీ: రాజకీయాల గురించి అట్టే ఆలోచించలేదు. ఇండోనేషియాలో కమ్యూనిస్టులను ఊచకోత కోయడానికి "మావోయిజమే" కారణమని చెప్పలేను. మావో చెప్పినదంతా ఆమోదయోగ్యం కాకపోవచ్చు. అట్లా అని చెప్పి లెనిన్ చెప్పిన బాలారిష్టాలన్నీ మావోకు వర్తించవు. ఘనాలో ఎన్క్రుమా, ఇండోనేషియాలో సుకర్ణో పడిపోయారు. వీటన్నింటికీ మావోయిజమే కారణమని చెప్పలేను. మొత్తం ప్రపంచంలో వున్న పరిస్థితులలో ఆ రోజుల్లో రియాక్షనరీస్‌ది పైచేయి.

ప్రశ్న: శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సాయుధ పోరాటం సరైన మార్గంలో నడుస్తుందంటారా?

శ్రీశ్రీ: శ్రీకాకుళం పోరాటం గురించి నా అభిప్రాయం ముఖ్యం కాదు. నేను చెప్పడం మంచిదికాదు. నేను పాలిటిక్స్ ద్వారా సాహిత్యంలోకి రాలేదు.

ప్రశ్న: "తుపాకి గొట్టంలోంచి రాజ్యాధికారం వస్తుంది" అనే మావో సూక్తి మనదేశంలోని పోరాటానికి వర్తిస్తుందా?

శ్రీశ్రీ: అధికారాన్ని పడగొట్టడానికి ఎక్కడైనా సరే ఫోర్సు కావాలి. ఫోర్సు, కౌంటర్ ఫోర్సు అనేవి ఎప్పుడూ తప్పనిసరి.

ప్రశ్న: ఈనాడు దేశంలో కమ్యూనిస్టుపార్టీ చీలి ముక్కలై అవకాశవాదులతో నిండి విప్లవానికి ద్రోహం చేస్తోందని విమర్శ. మీరేమంటారు?

శ్రీశ్రీ: చీలిపోయిన మాట నిజమే. కాని విప్లవానికి ద్రోహం చేస్తున్నారంటే నేనొప్పుకోను. వాళ్ళ వాళ్ళ దృక్పథాల ద్వారా దోహదమే చేస్తున్నారు.

ప్రశ్న: 'దిగంబర కవిత్వాని'కి వచన కవిత్వానికి తేడా వుందని మీరనుకుంటారా?

శ్రీశ్రీ: తేడా వుంది. 'వచన కవిత్వం' అన్నది కాంట్రాడిక్షన్ ఇన్‌టర్మ్స్ వచనమైతే కవిత్వం కాదు. కవిత్వమైతే వచనం కాదు. It is not the form that is important. దిగంబర కవులకు కన్వెన్షనల్ ఛందస్సులేదు. అయినా కవిత్వం వుంది. దిగంబర కవిత్వం ఫ్రీవర్స్ ఫారంలో వుంది.

ప్ర: "వచన కవిత్వం ఒక వుద్యమంగా మేం చేపట్టబట్టే ఈనాడు ఈ స్థితిలో వుండగలిగింది" అని ఫ్రీవర్స్‌ఫ్రంట్ నాయకులంటున్నారు. ఎప్పటికైనా ఉత్త ప్రక్రియ ఉద్యమం కాగలుగుతుందా?

శ్రీశ్రీ: ఫ్రీవర్స్ ఫ్రంట్ నాయకులు చెప్పేది కేవలం ప్రక్రియ కాదు. కుందుర్తి స్టోరీ పోయమ్స్, నాటకీయత వంటివి కావాలంటున్నాడు. అట్లా రాస్తున్న వాళ్లున్నారు. ఉదా: శీలా వీర్రాజు. As poetry it is an experiment.

ప్ర: స్వభావరీత్యా, శిల్పరీత్యా దిగంబర కవిత్వం ఒక ఉద్యమం అనీ, స్వతంత్ర అస్తిత్వంగల సాహిత్య యుగానికి నాంది పలుకుతోందనీ, సమూలమైన మార్పు కోరుతోందనీ కొందరి అభిప్రాయం. మీరేమంటారు?

శ్రీ శ్రీ: సమూలమైన మార్పును కోరుతున్న కొత్త ఉద్యమకారులుగా దిగంబర కవులను ఒప్పుకుంటాను.

ప్రశ్న: 'కమ్యూనిస్టు వ్యవస్థలో రచయితకు కావాల్సినంత స్వేచ్ఛ వుండదు' అంటారు. మీరేమంటారు?

జ: ఇది పొలిటికల్ ప్రాబ్లం. కమ్యూనిస్టు దేశాల్లో రచయితలకి స్వేచ్ఛ వుండదంటే నేనొప్పుకోను.

ప్ర: రచయిత తానున్న వ్యవస్థలో భాగంగానే అందులో జరిగే లోపాలను మూడో వ్యక్తిగా నిర్భయంగా ఎత్తి చూపెట్టినప్పుడే సమాజానికి న్యాయం చేయగల్గుతాడు. ఇది నిజమేనంటారా?

జ: రచయిత తానుండే వ్యవస్థలో భాగస్వామి. అన్యాయం సహించకూడదు. ఉదా: ఎమిలీజోలాకి అన్యాయం కనబడింది. 'ఐ ఎక్యూజ్' అని ప్రారంభించి పోరాడి జయించాడు. అందరికీ ఆ ధైర్యం వుండదు. A writer can do or undo things, There are writers who really have passionate devotion to justice, equality and other human qualities.

ప్ర: గాంధీని, లెనిన్‌ని ఒకే దృష్టితో చూస్తూ ఇద్దర్నీ విప్లవ నాయకులుగా చిత్రిస్తున్నారు. అది సరైన అవగాహనని మీరు నమ్ముతున్నారా?

జ: గాంధీ అనే ఫాక్ట్ మిత్‌గా మారిపోతోంది. గాంధీయన్ మొథాలజీ ఏర్పడుతోంది. లెనిన్ అన్న మిథ్ విచ్చిపోయి ఫాక్ట్ బయటపడుతోంది. లెనినిజం ఏర్పడుతోంది. లెనిన్ అంటే ఫ్రీడం.

గాంధీని అతని పరిస్థితుల్లో చూడాలి. షా చెప్పినట్లు మరీ అమాయకత్వం కూడా ప్రాంణాంతకమే. గాంధీని విప్లవాది అనే చెప్పాలి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిరాయుధుల్ని పోగుచేసుకుని పోరాడాడు. ఆ మేరకు గాంధీ విప్లవవాదే.

ప్ర: శ్రీకాకుళ గిరిజన పోరాటాన్ని సమర్థించే మీరు, పచ్చి సామరస్యవాది అయిన గాంధీని పొగుడుతూ కవిత రాశారు. ప్రజల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మా ఆరోపణ, ఒప్పుకుంటారా?

జ: గాంధీని సామరస్యవాది అని కొట్టేయడానికి వీల్లేదు. పులిని మేకని ఒకే చోట బ్రతకమన్న మాట నిజమే. నేను గాంధీని పొగిడేది అందుక్కాదు. రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్స్‌కి ఎందరో రిప్రజెంటేటివ్‌లు వెళ్లారు. భారతదేశంలోని దరిద్ర నారాయణులను తాను రిప్రజెంట్ చేస్తున్నాని గాంధీ ఒక్కడే అన్నాడు. గాంధీ ప్రజల మనిషి. దేశాన్ని ఏకం చేశాడు.

ప్ర: ఈనాడు సాహిత్యానికి రాజకీయాలకి వున్న దూరమెంత?

జ: ఇది వరకు మైళ్ల లెక్కన వుండేది. ఇప్పుడు సెంటీమీటర్లలో కొచ్చింది. రాజకీయ దృక్పథం సరిగ్గా లేనివాడు సాహిత్యంలో రాణించలేని స్థితి వచ్చింది.

ప్ర: 'మహాప్రస్థానా'నికి యోగ్యతాపత్రాన్నిచ్చిన చలంగారి మీదా, ఈనాటి చలంగారి మీదా మీ అభిప్రాయమేమిటి?

జ: కిర్క్‌గార్డ్ ఏం రాశాడంటే – ఐరిస్ డీన్ స్విఫ్ట్ ఒకప్పుడు మేయర్‌గా ఉన్నాట్ట. డబ్లిన్‌కు అనుకుంటా. పిచ్చివాళ్లమీద జాలికొద్దీ అతనో పిచ్చాసుపత్రి కట్టించాడు. ముసలివాడైన పిదప అందులో తానే ప్రవేశించాడట.

ప్ర: శ్రీ శ్రీ షష్టి పూర్తి. మీ అభిప్రాయం ?

జ: నాకరవై ఏళ్లొచ్చాయంటే నమ్మలేకుండా వున్నాను. నే 1930–40లలో దిగంబర కవులతో పాటే పుట్టాను. నేను అట్లాగే ఫీలవుతా. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసేనాటికి నేను ఎనిమిదేళ్ల కుర్రాణ్ణి. నాకు బాగా గుర్తు. అప్పుడు మిఠాయి పంచాను.

కొన్ని కొన్ని సంప్రదాయాలు మనకున్నాయి. షష్టిపూర్తి ఒక ఆనవాయితీ. వాళ్లు చేస్తామన్నారు. నేను సరేనన్నాను. కాని నేనెప్పుడో అన్నా యాభై ఏళ్ల తర్వాత బతకడం అనవసరమని. నూరేళ్ల ఆయుర్దాయం అవసరం లేదు. యాభై ఏళ్లు చాలనుకుంటే పదేళ్ల గ్రాట్యుటీ వచ్చింది.

ప్ర: దిగంబర కవులపైన మీకేమైనా ఆశలున్నాయా?

జ: దిగంబర కవులపైన ఆశలుండబట్టే ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేస్తున్నాను.

ప్ర: 'చరమరాత్రి', 'విదూషకుడి ఆత్మహత్య'లో, మీరు చేసిన 'ఆత్మహత్యలు' మీలో వున్న పెసిమిజంకి ఎక్స్‌ప్రెషన్‌గా వాడుకున్నారా?

జ: కాఫ్కా గురించి ఇదివరకు చెప్పాను. 'కొవ్వొత్తులారి పోయాయి' మొదలైన వాక్యాలు– 'విదూషకుడి ఆత్మహత్య'లో, ఆత్మహత్య అంటే మళ్లీ బ్రతకడం అని నా అర్థం. కొవ్వొత్తి మళ్లీ వెలిగి మరణశాసనమే కాలిపోయింది. కాఫ్కా అన్నట్టు ఔనంటే కాదు, కాదంటే ఔను. సూసైడ్ ఈజ్ నో సొల్యూషన్. సూసైడ్ చేసుకుంటే దానికి కారణం సమాజం ఆలోచించాలి. దేరార్ సోమెనీ అన్‌టు వర్డ్ యాక్షన్స్. కిర్క్‌గార్డ్, కాఫ్కా, సార్త్రే ఎగిస్టెన్షియలిజం ప్రభావం ఆ రోజుల్లో నా మీద వుంది. (విదూషకుని ఆత్మహత్య).

ప్ర: నియోకాల్పనిక వాదులుగా, అవకాశవాదులుగా, అభివృద్ధి నిరోధకులుగా బతుకుతూ కవిత్వాన్ని కాష్ చేసుకుంటున్న ఆరుద్ర, దాశరథి, నారాయణరెడ్డి, సోమసుందర్ లాంటి వాళ్ళను నిజాయితీగల కవులుగా మీరు గుర్తిస్తారా?

జ: ఆ అవకాశం వచ్చినందుకు వాళ్లను ఎన్వీచేస్తామా? మంచిది కాదనుకుంటూనే చేస్తున్నారు. ఈ ఊబిలోంచి బయటపడాలనే ఆవేదన వుంది. అట్టివాళ్ల లిస్టులో నన్ను కలుపుకోవచ్చు

ప్ర: మహాకావ్యం ఎప్పుడొస్తుంది?

జ అసాధ్యాన్ని సాధించడానికి మార్గాలు అన్వేషిస్తున్నప్పుడు కళాశీలి అనుభవించే అశాంతిలోనే మహాకావ్యం ఆవిర్భవిస్తుంది.

ప్ర:మీ షష్టిపూర్తి కానుకగా పాఠకలోకానికి విప్లవ కన్యను అందిస్తారా? లేక ఆధ్యాత్మిక కన్యను అందిస్తారా?

జ:విప్లవం, ఆధ్యాత్మికం కన్యలు కావు. మొదటిది కత్తి. రెండోది మిత్తి(మృత్యువు). కత్తినే పాఠకలోకానికి కానుకగా బహూకరించడం నా అభిమతం.

ప్ర: ఇప్పుడొస్తున్న ఈ అభ్యుదయ నూతన కవిత్వానికీ, మోడరన్ చిత్ర కళకీ దగ్గర సంబంధాలున్నాయా?

జ: ఉన్నాయి. మోటారు కారుకీ, తారు రోడ్డుకీ ఉన్నట్టే. విమానానికీ, ఏరోడ్రోంకీ ఉన్నట్టే.

ప్ర· ఒకటీ ప్లస్ ఒకటి ఒకటి ఎలా అవుతుందండీ?

జ ప్రేయసీ ప్లస్ ప్రియుడు ఇద్దరూ ఒకటే. దేవుడూ ప్లస్ మానవుడూ ఇద్దరూ ఒకటే.

ప్ర: నన్నయ్య కాలం నుండి నేటి వరకు తెలుగు కవితలో ఎంతవరకు ప్రగతి సాధించారు మన తెలుగువారు?

జ: అరసున్నాలు, బండిరాలు వదిలి పెట్టేంతవరకు.

ప్ర· మహాకవి గురజాడవారి దేశమంటే మట్టికాదోయ్ గేయంలో చైతన్యానికి ప్రథమ స్థానం పదార్థానికి ద్వితీయస్థానం లభించింది. పైగేయాన్ని భౌతికవాదులు ఆరాధిస్తున్నారు. సమంజసమా? మీ అభిప్రాయం?

జ. చైతన్యం కూడా పదార్థ వికారమే. భౌతిక పదార్థ వికారమే. భౌతిక పదార్థపు ఉన్నత రూపమే చైతన్యం.

ప్ర. ప్రతి ఒక్కరూ కవిత్వం వ్రాయగలరా?

జ: వ్రాయలేక పోవచ్చును, కాని అందరిలోనూ కవిత్వం ఉంది.

ప్ర: మీరు దేవుణ్ని నమ్ముతారా?

జ: మానవుణ్ని నమ్ముతాను.

ప్ర: కవికీ, కష్టజీవికీ గల సంబంధం ఎలాంటిది?

జ: 'కష్టజీవి'కి రెండు వైపులా నిలిచేవాడు కవి.

ప్ర: తెలుగు సాహిత్యంలో వచ్చిన పరిణామాలపై మీ అభిప్రాయమేమిటి?

జ: ఇది వివరించాలంటే ఒక గ్రంథమే వ్రాయాలి. సాహిత్య పరిణామానికి సంఘానికి పరస్పర సంబంధం వుందనేదే నా అభిప్రాయం.

ప్ర: బానిసత్వంలో మగ్గుతున్న నేటి స్త్రీని విముక్తి చేయాలంటే దేనని మార్చాలి?

జ: బానిసత్వంలో మగ్గుతున్నది ఒక్క స్త్రీలు మాత్రమేనా? స్త్రీలకైనా పురుషులకైనా సమాజంలోని ఎగుడు దిగుడుల్ని చదునుగా మార్చినప్పుడే విముక్తి.

(దిగంబర కవుల ఇంటర్వ్యూననుసరించి)

ఇంటర్వ్యూ చేసింది: 1969 నవంబరు హైదరాబాద్

ప్రచురణ: 1969 డిసెంబరు 'తెలుగు వెలుగు' వారపత్రిక

**(1970 ఫిబ్రవరి సృజన మాసపత్రిక)**

# ఆధునిక అష్టావధానం

## వేనరెడ్డి నరసింహారెడ్డి

ప్ర: మీరు నిర్దేశించిన మరో ప్రపంచం స్వరూపం ఏమిటి? వివరంగా చెప్పండి?

జ· నిర్దేశించలేదు. ఇమాజిన్ చేశాను. అప్పటికింకా నాకు రష్యా విప్లవం కూడా తెలీదు. సాహిత్యకారుల్లోంచి – ఫర్ ఇన్‌స్టెన్స్ గురజాడ గేయాలు(అని సినిమాలు లేని రోజుల్లో వచ్చాయి) · ఫ్రెంచి సింబలిస్ట్లు: సిసిల్ డెలిస్ (వీళ్లు ప్రపంచం చూశారు) : అలాగే కవిత్వం ద్వారా నేను మరో ప్రపంచం చూశాను. అదే సామ్యవాద ప్రపంచమని అప్పటికి తెలీదు. ఒక విధమైన సాంఘిక న్యాయం లభించాలనీ, అన్యాయం, అధర్మం పోవాలనీ కోరుకున్నాను ఈనాడు అదే మరింత స్పష్టంగా రష్యా, చైనా, క్యూబా దేశాల్లో కనిపిస్తోంది. నేను భావించిన మరో ప్రపంచం ఇదే.

ప్ర: రేపు ఎలా వుండాలో చాలామందిమి ఆలోచిస్తున్నాం. మార్పు కోసం ప్రయత్నిస్తున్నాం. మీ ప్లాన్స్ చెప్పండి?

జ: రేపు నాకు కావాల్సింది అట్టే ఏమీ లేదు. ప్లాన్స్ వేయడం రాజకీయ వేత్తల పని. రచయిత సమస్యని సిన్సియర్‌గా ప్రజంట్ చేస్తే చాలు. పరిష్కారం గర్భితంగా వుండొచ్చు. ఏ కళాకారుడయినా చిత్తశుద్ధితో వాస్తవికతని చూపించగలిగితే చాలు. రచయిత మాథమెటికల్ ఈక్వేషన్‌లాగా చేయలేడు. వాస్తవికతకి దర్పణం పడతాడు. సమస్యలకి పరిష్కారం రాజకీయవేత్తలు చూపాలి.

ప్ర. నేటి మనిషినీ చుట్టూ ప్రపంచాన్ని ఎన్‌లైజ్ చెయ్యండి?

జ: మానవుని కలలు నిజమవుతున్న కాలమిది. ఒకవైపు చంద్రుని కవతలకి ప్రయాణం చేయడానికి ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మన దేశంలోనే కాకుండా మొత్తం ప్రపంచంలో మరీ ముఖ్యంగా ఆఫ్రికాలో, ఆసియాలో, లాటిన్ అమెరికాలో దరిద్రం, ఆకలి, బాధ, చీకటి చుట్టూ ముట్టి వున్నాయి. సంపన్నదేశాలు ఈ వాస్తవికత మీదికి వెలుగు ప్రసరింపజేయాలి.

ప్ర: మీలోని "నేను" గురించి (కవిత్వంలో) సాధ్యమైనంత వివరంగా చెప్పండి.

జ:చాలా వరకు నా దృక్పథం నుంచే కవిత్వం రాశాను. సబ్జెక్టివ్ పోయట్రీయే ఎక్కువ. ఆబ్జెక్టివ్‌గా రాసిన 'వెర్రివాడా కుర్రవాడా', 'భిక్షువర్షీ యసి' లాంటివి తప్ప. 'నేను సైతం' కూడా సబ్జెక్టివ్‌గా రాసినదే.

'ఐ' చిన్నతనపు ప్రగల్భం. అంతకంటే ఏం లేదు? అయితే ఇవాళ అది చదువుకుని చిన్నబోవడం లేదు.

## ఉప ప్రశ్న (వరవరరావు)

ప్ర: యజ్ఞోపవీతం దేనికి సింబల్?

జ: పవిత్రతకి.

ప్ర: భూతం?

జ: స్పిరిట్.

ప్ర:కేదారగేళ?

జ:మ్యూజికల్.

ప్రతిపదార్థం తీసుకోగూడదు. ఆ total effect తీసుకోవాలి. ఒక విధమైన exultation.

ఆ రోజుల్లో ఒక కొత్త టెక్నిక్ కనిపెట్టామన్న ఉత్సాహంలో వచ్చిన series of poems. క్రియేటివ్ ఆర్టిస్టు అందరికీ ఒక కొత్త ఉత్సాహం ఏర్పడుతుంది.

యురేకా అని బట్టలిప్పుకుని పరిగెట్టాడట. కొత్త బాణీలో రాశానన్న ఉత్సాహం ఉంది. కుబుసం వదలడం వంటిది. 'నేను సైతం' ఆ శిల్పంలోకి వస్తుంది. ఆ రోజుల్లో నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ యం.చలపతిరావు త్రివేణిలో మోడర్న్‌ట్రెండ్ మీద రాసిన వ్యాసం నన్ను influence చేసింది. లండన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ మేనిఫెస్టో– అప్పటి వర్ధమాన రచయితల సంఘం అబ్బూరి రామకృష్ణారావుగారు చూపారు. అది చూసిన తర్వాత పొలాలనన్నీ హలాలదున్నీ గేయం రాశాను. ఆ మేనిఫెస్టో అలా దించేశావే అని అబ్బూరి రామకృష్ణారావుగారన్నారు. ఉదయిని లాస్టు ఇష్యూలో కొంపెల్ల జనార్ధనరావు దాని గురించి రాశాడు. ప్రగతిశీల సాహిత్య సంఘం అన్న పేరుతో హిందీలో వస్తున్న ఉద్యమ ప్రభావంతో అభ్యుదయ రచయితలుగా మారారు.

## శ్రీపతి

ప్ర: పుడమితల్లికి పురిటినొప్పులు ఇంకా వున్నాయా?

జ:పుడమితల్లికి ఇంకా ఫామిలీప్లానింగ్ ప్రారంభం కాలేదు. ఎప్పుడూ నొప్పులు పడుతూనే వుంటుంది. కొత్తసృష్టి వస్తూనే వుంటుంది. మనం యుగ సంధిలో వున్నాం.

చారిత్రాత్మకమైన దశలో ఇది జరుగుతుంది. స్పానిషిస్ యుద్ధంలో బ్రిటిష్‌వాళ్లు పదే పదే చెప్పేవాళ్లు యుగ సంధిలో మనం ఉన్నామని, గొప్ప గొప్ప మార్పులు రాబోతున్నాయని. It is in continuous flux. రష్యన్ విప్లవం తేదీ, ఫ్రెంచి విప్లవం తేదీ వంటివి పుట్టిన రోజులు. చరిత్ర ప్రవాహంలాంటివి. సూర్యోదయం అవుతుంటే భూమి మీదున్న చీకటి తొలగిపోయి చెట్లూ దృశ్యాలూ వెలుతురులోకి వస్తుంటాయే అలాగే మార్పులు జరుగుతుంటాయి.

ప్ర: తెలుగు సాహిత్యంలో విమర్శ ఎట్లా వుంది? మీ సజేషన్స్ ఏమిటి?

జ: విమర్శ మూడు పువ్వులు ఆరుకాయలుగానే వుంది. సాహిత్యం కొరకే ప్రత్యేకించబడిన పత్రికలొస్తున్నాయి. ఈ సాహిత్య పత్రికలన్నీ ఏదో దృక్పథంతో విమర్శ సాగిస్తూనే వున్నాయి. ఇది ఆరోగ్యకరమైనదే. విమర్శ గ్రంథాలు వెలువడుతున్నాయి. విమర్శ మీద విమర్శ వస్తున్నది. అయితే ఆ view point ని మనం ఒప్పుకుంటున్నామా కాదా అన్నది కాదు యువకుల్లో సాహిత్య జిజ్ఞాసని కల్గిస్తున్నది. అది సంతోషించదగ్గదే.

ప్ర:పార్లమెంటరీ డెమొక్రసీ సక్సెస్‌ఫుల్ కాదా?

జ: అన్ని పార్లమెంటరీలకీ తల్లి అనదగ్గది బ్రిటిష్ వెస్ట్‌మినిస్టర్. అమెరికన్ పార్లమెంటరీ డెమొక్రసీ వేరు. ఫ్రెంచి పార్లమెంటరీ డెమొక్రసీ వేరు. మన పార్లమెంటరీ డెమొక్రసీ సక్సెస్ అయిందని చెప్పటానికి వీల్లేదు. ఈ పార్టీలు, ఈ చీలికలు, పార్లమెంటరీ డెమొక్రసీ ఇబ్బందుల్లో పడిపోతున్నది. బ్రిటన్‌లో కన్సర్వేటివ్, లేబర్ రెండే పార్టీలున్నాయి. అమెరికాలో రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీలు రెండే వున్నాయి. మన దేశంలో కూడా రైట్ రియాక్షనరసీక అంటతా ఒక సారీగా, Left revolutionaries ఒక పార్టీగా పరిణామం రావచ్చు. ఆ పరిణామం వచ్చేలోగా సామ్యవాద విప్లవం వస్తే సంతోషిస్తాను. పార్లమెంటరీ డెమొక్రసీ fail అయినందుకు ఒక కన్నీటిబొట్టు కూడా వదలను.

ప్ర:'చరమరాత్రి' కథల్లో శిల్పాని కిచ్చిన ప్రాధాన్యత వస్తువుకు ఇవ్వలేదు. అందుచేత అవి ఫెయిలయ్యాయి. శిల్పం శిల్పంగా ఏమీ సాధించలేదు.

Comment.

జ: నిజమే. చరమరాత్రి కథలు సింగిల్ పన్నా కవిత్వం. టెక్నిక్‌కు ప్రాధాన్యత ఇచ్చిన రోజుల్లోనే రాశాను. I am essentially not a story writer. అందులో కూడా కవిత్వం ఉండొచ్చు. కథల్లోనూ నేరేషన్-Expect చేసే వాళ్ళకి డిసప్పాయింట్‌మెంట్ - చరమరాత్రికథ చాలా ambitious గా మొదలుచేసి ఆఖరాఖరున తొందరపడి ముగించేశాను. కాఫ్కా నవలలు చదివి ఈ ప్రయత్నం చేశాను. The Trail అన్న నవలుంది. అందులోకే అన్న ఒక కుర్రవాడున్నాడు. ఆకుర్రవాడిని అరెస్ట్ చేస్తారు. ఏమి తప్పు చేశాడో తెలియదు. ఎప్పుడు విచారణ చేస్తారో తెలియదు. కోర్టులో విచారణ తర్వాత వాయిదా వేస్తారు. వెళ్లిపొమ్మంటారు. ఈ నవల నరకానికి ప్రతీక.

The castle అని చెప్పి మరొక నవల రాశాడు. అది కూడా అసమగ్రమే. కే అన్నవాడికి రాజుగారి దివాణంలో ఉద్యోగం దొరుకుతుంది. అబద్ధంతో కోటలో పొగావేశాడు. కోట స్వర్గానికి సింబల్. కాఫ్కా మరణ శాసనంలో ఇవి బయటికి రావటానికి వీల్లేదని రాశాడు. ఇవి తగలేయమన్నాడు. అందులోనే వేయాలన్న భావన వుంది. Max Brod ఇవన్నీ కాఫ్కా చచ్చిపోయాక అచ్చువేశాడు. వేళాకోళంగా ఉంటూనే చాలా సీరియస్‌గా వుంటాయి. అమెరికాని భూలోకంగా symbolise చేశాడు. కే అన్న కుర్రాడు ఒక అమ్మాయికి కడుపుచేసి అమెరికా పారిపోతాడు. అక్కడ Statue of Liberty చూస్తాడు. మూడూ అసంపూర్తి నవలలు, మూడింట్లో కే అనే కుర్రాడు ఉన్నాడు. వీటిని మనస్సులో పెట్టుకుని రాసింది చరమరాత్రి.

నరకం, స్వర్గం, భూమి అను మూడు కాలాల్లో ఆలాపించిన కథ అది. అచ్చుతప్పు వేశారు నేను దగ్గరలేక. అనంతరయాత్ర, గవేషణ, గ్రామఫోన్ రికార్డుల తిరుగుబాటు వంటి రేడియో plays ఆ రోజుల్లోనే రాశాను. అవి అభ్యుదయలో వచ్చాయి.

## సి. యస్. రావు

ప్ర: ప్రస్తుత తెలుగు నాటకం స్థాయి ఏ స్థితిలో ఉందని మీ భావం?

జ: చాలా మంచి స్థాయిలో ఉందనవచ్చు. గయోపాఖ్యానం స్థాయిలోనూ ఉన్నాం. చాలా మంది experiments చేస్తున్న స్థితిలోనూ ఉన్నాం. కొంత రియాక్షనరీ ప్రతిఘటన ఉన్నదనుకోండి. కిరాయి నటులున్నారు. మొత్తం మీద మంచి అభ్యుదయ స్థాయిలోనే వుంది. నాటకం రాయటానికి పదిహేనేళ్ల నుంచి ఆలోచిస్తున్నాను. బెండయ్యగారి గది. మొదటి రెండు అంశాలు స్పష్టంగా ఉన్నాయి. Next year రాయగలననుకుంటా.

ప్ర: కవితా రంగంలో విప్లవాన్ని తీసుకొచ్చారు. అలాగే తెలుగు నాటక రంగంలో విప్లవం తీసుకురావడం గురించి మీరు ఆలోచిస్తున్నారా?

జ: నాటకరంగంలో విప్లవం తేవాలనే ఆలోచిస్తున్నాను.

ఉ. ప్ర: ఏ రకంగా ఉంటుంది?

జ: ఆ రకంగా ఉండదు. నా రకంగా ఉంటుంది. దీనికి రెండు రకాలు ఉన్నాయి. బెర్నార్డ్ షా లాగా నాటకం రాయడం. ప్రిఫేస్‌లు పెద్దగా ఉంటాయి. సమస్యను దాంట్లో చర్చించడం. బెండయ్యగారి గది రెండో పద్ధతి....ప్రయోగించడంలో కొత్త పద్ధతి. అది జన్మానికో శివరాత్రి. బెర్నార్డ్ షా హాట్‌హాట్‌గా ప్రాబ్లమ్స్ తీసుకుని రాశాడు. నాది రెండో పద్ధతి.

ప్ర: నేను కూడా జ్యోతిశ్శాస్త్రాన్ని. మీరు శాస్త్రంగా నమ్ముతారా, మూఢనమ్మకంగా భావిస్తారా?

జ: Astronomy is Science

Astrology is not a science. నమ్మకం లేదు.

ప్ర: మీకు మతం, దేవుడు, జ్యోతిషం వంటి విషయాల్లో విశ్వాసం ఉన్నదా?

జ: జవాబు కోసం ఇంకా వెతుక్కుంటున్నాను. సదసత్సంశయ రూపంలోనే వున్నది. విశ్వాసం అవిశ్వాసం వైపే మొగ్గుచూపుతున్నది. లేదు అని సైంటిఫిక్‌గా ప్రూవ్ చేయలేక పోతున్నాను.

సదసత్సంశయం ముగింపు 'సామ్యవాద మానవుడే. శాస్త్రసకల విశ్వానికి.' దానికి మధ్య ఎన్నో ఎగుడు దిగుడులు, సందేహాలు వస్తాయి. కాని పై మాట ఫైనల్.

ప్ర: అవతారం గేయంలో సాంప్రదాయబద్ధమైన సంకేతాలు ఎందుకు ఉపయోగించారు?

జ. అవతారం transitional stageలో poetic diction అలా వచ్చింది. ఉద్దేశపూర్వకంగానే వచ్చింది.

ప్ర: సి. విజయలక్ష్మి కావ్యాలు చదివారా? మీ అభిప్రాయం?

జ:సి.విజయలక్ష్మిది చాలా మంచికవిత్వం.

ప్ర: కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వ పతనం తర్వాత కూడా మీకు పార్లమెంటరీ డెమొక్రసీపై విశ్వాసం వుందా?

జ: Parliamentary Democracy does not deliver goods. Revolutions వచ్చి తీరాలి.

ప్ర: పొలాలనన్నీ హలాలదున్నీ.....

సహస్రవృత్తులు సమస్త చిహ్నాలు.....

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం....ఎక్సెట్రా.

చరణాలతో ఉత్తేజం పొంది సాహిత్య పాఠకుడు, సామాన్యుడు కూడా మార్క్స్‌ను చదువుతున్నాడు. ఇట్లా ఒక రాజకీయ ఆర్థిక సామాజిక చైతన్యాన్ని కలిగించడమే మీ కవిత ధ్యేయమా?

జ: కొన్ని గేయాల్లో ఇది కూడా ఉంది. రా.రా totalగా నా పంచపదుల్ని చేశాడు. పత్రికలకి ఎడిటోరియల్ ఎంత అవసరమో కార్టూన్ అంత అవసరం.

## ఉపప్రశ్న (చే.రా.)

ప్ర: వీణ పత్రికలలో మీరేం రాసేవారు?

జ వీణ సంపాదకీయం. కవులమీద కామెంట్స్ రాసింది నేను. దాని పోయట్రీ సెక్షన్‌కు నేను ఎడిటర్‌ను.

ప్ర: సమాజ సంబంధమైన భావాలైనా సాహిత్యం మూసలోకి వస్తే స్వీకరణ యోగ్యమవుతాయా? అలాంటి సాహిత్య ప్రభావం ఏమిటి?

జ: సాహిత్యపరులకు స్వీకరణ యోగ్యమవుతుంది. కొంతమందిని Convert కూడా చేయగల్గుతుంది. ఒకప్పటి తీవ్ర అభిప్రాయం కూడా తర్వాత Moderate అవుతుంది.

ప్ర: ఎంత తీవ్రమైన భావం చెప్పినా వస్తువును వదిలి శైలిమీద దృష్టి కేంద్రీకరించడం వల్ల సాహిత్యం సామాజిక చైతన్యం తెచ్చే ఆయుధం కాలేకపోతున్నదా?

జ: నిజమే. ఈ పద్ధతి ఒక్కసారే తొలిగిపోకపోవచ్చు. సాహిత్యం సామాజిక చైతన్యానికి ఆయుధం కావల్సిందే.

ప్ర: కన్యాశుల్కంలో వున్నదంతా శబ్దాశ్రమ హాస్యమే. ఇంగ్లీషువస్తే తప్ప హర్షించలేమన్న విమర్శతో మీరు ఏకీభవిస్తారా?

జ: శుద్ధతప్పు. ఏంచేతనంటే ఒక్క గిరీశంలో తప్ప ఇతర పాత్రల్లో ఇంగ్లీషువస్తే తప్ప హ్యూమర్ enjoy చేయలేకపోవడం లేదు. రామప్ప పంతులు హ్యూమరు, అగ్నిహోత్రావధానుల, లుబ్ధావధానుల హ్యూమర్‌లో ఇంగ్లీషు లేదుకదా.

శబ్దాశ్రమ హాస్యమన్నదాన్ని అపహాస్యం చేయాలి. అట్లా అన్నవాళ్ళ పట్ల జాలిచూపాలి. శబ్దం లేని హాస్యం ఎక్కడ్నించి వస్తుంది? మాటలేకుండా కవిత్వం ఎట్లా వస్తుంది? ఈరోజు ఆ మాత్రం ఇంగ్లీషు ప్రతి వాడికి వచ్చేస్తున్నది. ఇంగ్లీషు రావడం దేనికీ అర్హత కానక్కర్లేదు.

ప్ర: కొడవటిగంటి, రావిశాస్త్రి కమిటెడ్ మార్క్సిస్ట్‌గా వాళ్ల రచనల్లో కనిపిస్తారు. వారికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతులిచ్చింది. సాహిత్య అకాడమీకి మార్క్సిస్ట్ దృక్పథం పట్ల సానుభూతి ఉన్నట్లేనా?

జ: ఇది కూడా ప్రచ్ఛన్నమైన రాజకీయ ప్రశ్న. మీరు అకాడమీని అడగవల్సిందే. నోబుల్ బహుమతిని షా, సార్త్రే రిజెక్టు చేశారు. నేను 'సాహిత్యాచార' అనే బిరుదును స్వీకరించాను. గిరిగీసుకుని బ్రతకాల్సిన అవసరం లేదు. అని మనకు కావలసిన రూపంలో లేవనే అసంతృప్తి ఇలా వ్యక్తం చెయ్యొచ్చును. ఇతర వర్గం దగ్గర డబ్బు తీసుకొని వేరే వర్గానికి ఓటు వేయొచ్చు కదా. ఎన్నో ఖర్చులుంటాయి. తీసుకోవాల్సిన అవసరం వస్తుంది.

ప్ర: మీరు 'సామ్యవాద భారత' ఒకటి రాయబోతున్నట్లు వరంగల్‌లో చెప్పారు. ఎంతవరకు వచ్చింది?

జ: సాహిత్య-సామ్యవాదము. దాన్ని సా....సా...అన్నాను. అది నేను రాయదల్చుకున్న లేక రాయలేకపోతున్న విమర్శ గ్రంథం.

ప్ర: Regis Debrey రాసిన Revolution in the Revolution చదివారా?

జ: చదవలేదు. చదవాలనుంది.

పొలిటికల్ ఎడ్యుకేషన్ సంపాదించాలి. ఇటువంటివి కొన్ని చదివితేనే గాని ఈ తుక్కు కరిగిపోదు.

ప్ర: మీరు శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటాన్ని సమర్థిస్తున్నారా?

జ: సమర్థిస్తాను. My sympathy is always with them నేను extremist of extreme.

ప్ర: మీరు గిరిజన పోరాటంలో చేరిపోతారని జ్వాల పత్రికలో రాసింది అబద్ధమా?

జ: అబద్ధం రాశారని చెప్పను. I want to go there and observe them. I am not a politician.

ప్ర: మీకు ఈ దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీల పట్ల సానుభూతి వున్నది. ఇది సెంటిమెంట్ కాదా?

జ: Sentiment-blind unthinking sentiment deep గా థింక్ చేస్తే కొందరిని హార్ట్ చేయక తప్పదు.

## రాంభట్ల కృష్ణమూర్తి

ప్ర: తెలుగు కవితలో ఈనాడు కనిపిస్తున్న ఇజాలేమిటి? వాటి లక్షణాలను వివరించి, తారతమ్యాలను నిరూపించి ఆయా ఇజాలకు తెలుగు కవితలోంచి లక్ష్యాలను చూపిస్తారా?

తెలుగు కవితలో నవయుగం అవతరించిన నాటి నుంచీ నేటి వరకూ పుట్టిన ఇజాలలో మరుగుపడినవి ఏవైనా వున్నాయా? వుంటే అవేమిటి? తెలుగు కవిత భవిష్యత్తు ఎలా వుంటుంది.

జ: సమగ్రాంధ్ర సాహిత్యం రాస్తే ఒకవేళ...ఈ విషయం వివరంగా చర్చించటానికి వీలుంటుంది. చాలా ఇజాలు కనిపిస్తున్నాయి కదా. బాగా filter చేస్తే Rightism, Leftism. Reactionary, Revolutionery.

వివరించినపుడు లక్ష్యాలు కావలసినన్ని దొరుకుతాయి. విశ్వనాథ నవలల్లో Right extremes వుంటాయి.

(అమెరికా వాళ్లు వియత్నాంలో కూరుకుపోయినట్లుగా ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య రచనలో కూరుకుపోయాడు.)

మరుగున పడినవన్నీ మరిచిపోవలసిన ఇజాలే. పెనుమర్తి వెంకటరత్నం కవిత్వం ఇకప్పుడు నన్ను inspire చేసింది. కాళూరి వెంకట నరసింగరావు చాలా మంచి పోయట్రీ రాశాడు. కాళూరిలో Romanticism ఉంది. His poetry deserves to be preserved.

మాధవపెద్ది బుచ్చిసుందర రామశాస్త్రి. ఇవన్నీ బయటకు తీసుకురావాలి. భవిష్యత్తులో - More and More మాండలికాలు వస్తాయి. తెలుగు సాహిత్యం యొక్క భవిష్యత్తు మిగిలిన ప్రపంచ సాహిత్య ఉద్యమాలతో ముడిపెట్టుకుని ఉంటుంది. యాంగ్రీ యంగ్‌మన్ ఇన్‌ఫ్లుయన్స్‌తో దిగంబరకవులు వచ్చినట్టు.

Healthy influences అవసరమే.

Inter language translations ఎక్కువవుతాయి. కాని మాండలికాల ఉపయోగం వల్ల ట్రాన్స్‌లేషన్ కష్టమవుతుంది.

'దయచేసి ఇక దయచేయండి'. 'దయచేసి ఉన్నాను'.

'దయ చేయను' లాంటి (నుడికారాన్ని) వాటిని అనువాదం చేయడం పడదు.

## చేకూరి రామారావు

ప్ర: ఇతరేతర అనేమాట ఇతర అనే అర్థంలో వాడారా?

పరస్పర అనే అర్థంలో వాడారా?

జ: ఇతరేతర అంటే - వేరే వేరే. పరస్పర అన్నదికాదు.

ప్ర: మీరు పబ్లిష్ చేసే మీ పద్యాల translations ఇంగ్లీషు వాళ్లకి చూపించారా?

Sadly the moon light

Saddles the night

Mystic fantastic

Give me a fright.

అనేది అమెరికాలో చదివితే ఎప్రీషియేట్ చేయలేకపోయారు. ఇంగ్లీషు మాటలు ఇంగ్లీషు వాళ్ళకి ఎట్లాంటి association ఇస్తయ్యో చూడొద్దా?

జ: ఒకసారి మద్రాసు USISలో కవితా ఓ కవితా (అనువాదం) చదివాను. మెచ్చుకుని చాలా గబగబా చదువుతానని విమర్శించారు. ఇంగ్లీషు వాడుక భాషకి మనం దూరంగానే ఉంటాం.

ప్ర: 'వారం వారం', 'వీణ' మొదటి సంచిక నుంచి 'సంవేదన'లో కుటుంబరావు వ్యాసం వరకు చూస్తున్నాను. 'వ్రాస్తాను' అని రాస్తారు గాని 'రాస్తారు' అని రాయరేం? అంటే మాట్లాడే రూపం ఒకటుండగా ప్రాచీన రూపం ఎందుకు వాడతారు?

జ: 'రాస్తాను' అని ఎందుకు రాయను? చాలా దగ్గర్ల 'రాస్తాను' అని కూడా ఉంది.

ప్ర: శ్రీశ్రీ కవిత్వాన్ని మార్క్సిజంతో నిమిత్తం లేకుండా విమర్శిస్తే శ్రీశ్రీ కవిత్వంలో గొప్పదనం కనిపిస్తుందా? అంటే సాంప్రదాయక పద్ధతిలో శ్రీశ్రీని విమర్శించవచ్చా?

జ: అలాగ విమర్శించేవాళ్లు కూడా ఉన్నారుగా. My approving or disapproving అన్నది అవసరం లేదు.

ప్ర: ఒక టెక్నికల్ కొశ్చన్: ముత్యాలసరం మీద మీరు రాసిన వ్యాసంలో చెడగొట్టిన వాళ్ల ముత్యాలసరాలే బాగున్నాయన్నారు. ముత్యాలసరంలో 'లగం' గాని జగణం గాని వేస్తే నడక ఎదురు తిరగదా?

జ: కందంలో నాల్గింట జగణం. ఎదురు తిరగడం కూడా సొగసే. ఆ దొరలకు కూతుళ్లిద్దరు.

..........................................

మోదుగులు పూశాయి - అని ఉండొచ్చును. టెక్నికల్ ఇన్నోవేషన్ చమక్. I don't think it is a technical defect.

ప్ర: దిగంబర కవుల్లో మొదట రెండు సంపుటాల్లో చాలా పద్యాల్లో Syntax కనబడదు. వాటిల్లోంచి మీరు తీసుకున్నవి ట్రాన్స్‌లేషన్‌కి లొంగాయా?

జ: సింటాక్స్ లేకపోయినా ఫరవాలేదు. లొంగాయి. కవితా ఓ కవితాలో ఒకచోట సింటాక్స్ తప్పింది. దిగంబర నృత్యంలో సింటాక్స్ లేదు. ఐడియా ట్రాన్స్‌లేషన్‌లో లొంగుతుంది. కొంత లిబర్టీ తీసుకున్నాను.

## అబ్బూరి గోపాలకృష్ణ

ప్ర: సాహిత్యం ద్వారా సాయుధ విప్లవం గురించిన భావ ప్రచారం జరుగుతుంది. సాయుధ విప్లవంలో హింస అనివార్యం. అయినప్పుడు బౌద్ధికమైన (intellectual) శారీరకమైన (Physical) క్రమశిక్షణలేని ప్రజలు సాయుధులై తిరుగుబాటు జరిపినప్పుడు మంచి కంటే చెరుపే కలుగుతుంది. సైన్యంలో అనుసరించే హింసాత్మక చర్యలకు ఒక ప్రయోజనం ఉంది. మంచైనా చెడు అయినా అల్లరిమూకగా ప్రవర్తించే ప్రజలకు హింసాత్మక ధోరణులు బోధించడం ప్రమాదకరం కాదా?

జ: Revolutionలో అల్లరి మూకలు ఎక్కడుంటారు? we cannot without 'Himsa', విప్లవం అహింసతో రాదు. అల్లరిచిల్లరగా రాదు. విప్లవ ప్రతిఘాతకులకు కూడా చాలా బలం వుంది. కిరాయి మూకలు, ప్రెస్ ఇట్లాంటివి ఒకటేమిటి చాలా వున్నాయి.

So what I said is మంచి leadership provide చేసినప్పుడు హింస సార్థకమవుతుంది.

ప్ర: నేటి పరిస్థితుల దృష్ట్యా క్రమశిక్షణ ఒక ముఖ్యావసరం. క్రమశిక్షణ లేకుండా ఏ విప్లవమూ విజయవంతమైన ఉదాహరణ చరిత్రలోనే లేదు కదా? ఈ విషయంలో మీరేమంటారు?

జ: It is not headmaster's or principal's discipaline. That is not wanted. ప్రజా నాయకులు అమలు చేయగలిగిన క్రమశిక్షణ కావాలి.

ప్ర: ప్రజలలో క్రమశిక్షణ, ఉత్తమ లక్ష్యశుద్ధీ ఉన్నప్పుడు హింస అంత అవసరమైన ఆయుధంగా ఉండవలసిన అవసరం లేదు కాదా?

జ: నేను ఒప్పుకోను It is the nature of the history it self ఒకరు తయారు చేసినదికాదు. విప్లవాలు చరిత్ర పరిణామక్రమంలో వస్తాయి. ఇంత వరకు అట్లాగే వచ్చాయి. ఇక మీదట కూడా అట్లాగే వస్తాయి.

హింస అనవసరం కాదు. అవసరమే.

విప్లవం హింసాత్మకంగానే వస్తుంది.

## రంగనాథం

ప్ర: రచయితలకు ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం అవసరం లేదంటారా? లేదనటం ఒక విధంగా రచయిత తన బాధ్యత నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించటమే అనుకుంటాను....ప్రస్తుతం రాజకీయోద్యమాలలో పాల్గొనదలిస్తే మీరు ఏ మార్గాన్ని ఎన్నుకుంటారు?( స్పష్టమైన సమాధానం రావాలి).

జ: తప్పకుండా. రచయితలకు రాజకీయాలతో సంబంధం ఉండాలి. పెట్టుకోకూడదనడం escapism. ఇప్పుడిప్పుడే రచయితకు రాజకీయ చైతన్యం కలుగుతున్నది. సాంఘిక ప్రయోజనాలతో రాస్తున్న నవలలు తక్కువ. డిటెక్టివ్‌లు, సెక్స్ నవలలు చాలా వస్తున్నాయి. రచయితకు రాజకీయ చైతన్యం ఉండాలి. రాజకీయాల్లో పాల్గొనాలి. I may.... ఇంకా ఎలక్షన్లు దాటే పరిస్థితికి రాలేదు నేను. ఎన్నికల్లో నుంచుంటాను.....always with the support of the left....all kinds of left.

రాజకీయాల్లో నాది వావిలాల గోపాలకృష్ణయ్య పార్టీ.

ప్ర: 'నేనిక రాయనవసరం లేదు' అన్నంతగా యోగ్యతాపత్రం ఇచ్చిన రచయితలు అవకాశవాదులయ్యారు. వచన కవితలో భావకవిత యుగావశేషాలైన కొంతమంది కవుల్ని మీరు ఆకాశానికెత్తారు. ఇలా నానా గోత్రీకులకు యోగ్యతాపత్రాలివ్వటం వల్ల మీ దృక్పథం స్థైర్యం విషయంలో అభిమానులలో కన్ఫ్యూషన్ కలుగుతోంది. దీనికి మీ సమాధానం ఏమిటి?

జ: I really appreciate their work. వాళ్ళు జీవితరంగంలో అవకాశవాదులుగా మారిపోయారు. ఇప్పుడు వాళ్లను డౌన్‌రైట్‌గా ఖండించాలా? వాళ్ళు (తిలక్, ఆరుద్ర, సోమసుందర్, దాశరథి) anti-progressive అనుకోగూడదు. మల్లాది, బుచ్చిబాబు anti revolutionary అనుకోను.

నేనింకా రాయనక్కరలేదన్నది ఆరుద్ర గురించి.

ప్ర: బెంగాల్‌లో రచయితలు, కళాకారులు ఆయా సందర్భాలలో ఊరేగింపుల ద్వారా, పత్రికాదుల ద్వారా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేస్తుండడం చూస్తున్నాం. కాని తెలుగుదేశం ఇంత అధ్వానంగా, నిరంకుశంగా, ప్రజా వ్యతిరేక విధానాలతో పాలించబడుతున్నా రచయితలు నోరు విప్పిన పాపాన పోవడం లేదు. దానికి తెలుగు రచయితలలో చైతన్యం లేకపోవడమే కారణమా?

జ: ఒక ముఖ్య కారణమేమంటే తెలుగువాళ్లకి ఒక నగరం లేదు. బెంగాల్‌కి కలకత్తా ఉంది. So they can experiment. బెంగాలీ సినిమా ఒక్క కలకత్తాలో ఆడినా సక్సెస్ అయిపోతుంది. చక్కగా ఏభై వేలతో పిక్చర్ తీయొచ్చు. అయినా పిక్చర్ అక్కడ ఫెయిల్ కాదు. నగర జీవితం వాళ్లకుంది.

మనకు పల్లెటూరి మనస్తత్వం వుంది. విజయవాడ, విశాఖపట్నం అని గ్లోరిఫైడ్ విలేజస్. హైదరాబాద్ మనకు వున్నా ఫ్యూడల్‌తత్వం ఇంకా పోలేదు. అందువల్ల రచయితల్లో

ఒక సంఘటిత శక్తి రాలేదు. గిరీశం అంటాడు, ఇదే బెంగాల్ కుర్రాడైతే ఏం చేసేవాడో తెలుసా అని.

writers co-operative ఏర్పడాలి.

## వేన రెడ్డి

ప్ర: రాజకీయాల్లో గాంధీ religion, philosophy, ethics etc. ప్రవేశపెట్టినట్టే కవిత్వంలో మీరూ ఒట్టి కథా కమామీషూ మాత్రమేకా. రాజకీయ చైతన్యం కలిగించే రాజకీయతత్వాన్ని మొదట ప్రవేశపెట్టినారనుకుంటాను?

జ: ఇది గురజాడ ప్రవేశపెట్టాడు. నేను ఫాలో అయ్యాను. 'మీపేరేమిటి' అన్న కథలో చాలా Subtle politics వున్నాయి. విలేజ్ పాలిటిక్స్, కన్యాశుల్కం నాటకంలో కూడా పాలిటిక్స్ కనబడతాయి. రాజకీయాలని మనం తప్పించుకోలేం. గురజాడకి పొలిటికల్ కాన్షస్‌నెస్ ఎక్కువ. దేశమును ప్రేమించుమన్నా మొదలైన గేయాల్లో ఇది మనకు స్పష్టం.

ప్ర: మిమ్మల్ని ఇన్‌స్పైర్ చేసిన కవులు తెలుగులోగాని ఇతర భాషల్లోగాని ఎవరు?

జ: Earliest influence అయిన కృష్ణశాస్త్రీ, విశ్వనాథ నుంచి బయటపడాలని చాలా struggle చేశాను. ఆ తర్వాత shelly, swinburneu ప్రభావితం చేశారు.

ప్ర: వచన కవితా ఉద్యమం అభ్యుదయ కవితకు తర్వాత పరిణామం అంటారు. వచన కవిత పరిధి అభ్యుదయ కవితా పరిధి కంటే విస్తృతమైనదనుకుంటాను. మీరేమంటారు?

జ: నేను ఇదివరకొకటి చెప్పాను. కవిత్వం యొక్క ఫారం డెవలప్ అవుతూ మారుతూ వచ్చింది. పూర్వం రథం ఉపయోగించారు. నాలుగు చక్రాలు ఉండేవి. గుర్రాలు వుండేవి. తర్వాత గుర్రబ్బండి. అప్పుడు బళ్లకు అనుకూలంగా రోడ్లు ఏర్పడ్డాయి. ఇప్పుడు మోటారు ఉంది. దీనికి నాలుగు చక్రాలేకాని దీని వేగం హెచ్చు. దీనికి ఉండాల్సిన రోడ్లు వేరు. మన దేశంలో కవిత్వం మోటారు దశలో వుంది.

అమెరికాలో, రష్యాలో కవిత్వం రాకెట్ యుగంలో వుంది. వచన కవిత్వంలో re-actionaries వుండొచ్చు. మనం మనకు నచ్చింది తీసుకోవాలి.

ప్ర: వచన కవితా ఉద్యమంలో కుందుర్తికి ఉన్న ప్రత్యేక స్థానం గురించి మీ ఉద్దేశం ఏమిటి? ఆయనకు దాశరథి, సినారె వలె కాక ఒక విశిష్ట స్థానం వుందన్న భావంతో మీరేకీభవిస్తారా?

జ: కుందుర్తికి దాశరథి, సినారెల కంటే better place ఇస్తాను. వాళ్లిద్దరూ నాకు ప్రాచీన కవుల్లానే కన్పిస్తారు. కుందుర్తివి వచన గీతాలు. వాటితో ఫ్రీవర్స్ ఫ్రంట్ లీడర్స్‌లో స్థిరపడ్డాడు. He has contributed something to వచన కవితా ఉద్యమం. దాశరథి, సినారె they are more or less Classical poets.

ప్ర: వచన కవిత యొక్క next phase ఏమిటి? మళ్లీ మాత్రా ఛందస్సులోకి వెడుతుందా? వచనమో మరో రూపమో ఆ రూపాన్ని గూర్చి మీరేమైనా చెప్పగలరా?

జ: వచన కవిత వుంటుంది. జానపద బాణీల్లో ఎక్కువ కృషి చేయడం జరుగుతుంది. మాండలికపు నుడికారం వస్తుంది. Content కి సంబంధించినంత వరకు సామాజిక జీవితం ఇంకా విస్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

ప్ర: మీరు ఒక పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో ప్రజల దగ్గరగా వచ్చి ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటామన్నారు. మీరనుకుంటున్న పోరాట స్వరూపమేమిటి? మీరిప్పుడు అంతకన్నా ఎక్కువగానే ప్రజల్ని ఉత్తేజితుల్ని చేస్తున్నారనుకుంటాను. రచయిత తాను చెప్పేది ఆచరించి చూపించాలనేది మాత్రమే మీ అభిప్రాయమా? అలాంటి వారు చలం-కాళోజిలవలె ఇంకెందరున్నారు?

జ: ప్రత్యక్ష పోరాటం విల్లంబులు ధరించి కాదు. నా ఆయుధమైన కలం ఎప్పుడూ కూడా అభ్యుదయ శక్తులకు అంకితమయిందే. I am a fighter with pen చలం విచిత్రమైన reactionary. చలం, కాళోజిలతో నన్ను పోల్చటం సరికాదు. చలం, కాళోజిలది ఇద్దరిదీ కూడా రియాక్షనరిజమ్. I am not at all a reactionary. I am a marxist.

ప్ర: మన పూర్వ సాహిత్యంలో స్త్రీని శృంగార వస్తువుగానే చూశారు. మీరు స్త్రీకి సమాజంలో ఎలాంటి స్థానం ఉండాలంటారు? మీ రచనల్లో స్త్రీని గూర్చిన ప్రసక్తి లేదెందుచేత?

జ: పూర్వ సాహిత్యం స్త్రీని కేవలం శృంగార వస్తువు చేయలేదు. ఎక్కువగా భోగవస్తువుగా చూశారు. They must have Complete equality with men. ఏమన్నా నావెల్స్ రాస్తే అట్లాంటి Chatacters ను సృష్టిస్తాను. ఇంత వరకు స్త్రీ సమస్య ప్రత్యేక సమస్యగా భావించలేదు.

ప్ర: కేవలం ఖండకావ్యాలకన్న - శ్రోత మనస్సుపై కథాకావ్యం ఎక్కువ ముద్ర వేయగలుగుతుందనుకుంటాను. మీ భిక్షువర్షీయసి, బాటసారి ఖండ కావ్యాలలో కథాకావ్య లక్షణం ఉందనుకుంటాను?

జ: కుందుర్తి ఫుల్ లెన్త్ నావెల్ లాంటి కావ్యం రావాలంటాడు. అదొక దృక్పథం. Poetic short stories ఒక ఫారమ్ మాత్రమే. కొంచెం కథంటూ వుంటే శ్రోతలకు డైరెక్ట్‌గా పడుతుందని కావచ్చు.

ప్ర: సినిమా కవిత్వం రాసేటప్పుడు మీరెట్లా ఫీలవుతారు?

జ: ఈ పాట ఎంత వేగిరం పూర్తి అయిపోతుందా. వాళ్లిచ్చే డబ్బులు ఎప్పుడు చేతుల్లో పడతాయా అనుకుంటాను.

ప్ర: "సదసత్సంశయం"లో మీరు మానశక్తిని బలహీనపరిచే దేవుణ్ని తిరస్కరించారు. అంతేకాని మానవశక్తికి మరింత చైతన్యం కలిగించే దేవుణ్ని కాదు. అలాగే సామాజిక

సామూహిక సద్వర్తనమే పరమార్థమన్నారు. అలాంటి పరమార్థంలో వుంటే ఆస్తికత్వంతో మీకు వైరుధ్యం లేదనుకుంటాను?

జ: ఆస్తికత్వంలో అలాంటి పరమార్థం సాధ్యమా? అట్లాంటి ఆస్తికత్వం ఉంటుందా అన్నది సందేహమే. నాకెక్కడా కనిపించలేదు. నీ శక్తి పనికిరాదు అన్న unconditional surrendering ఆస్తికత్వం. సామాజిక సామూహిక సద్వర్తన గల ఆస్తికత్వం లేదు.

ప్ర: మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం ఇచ్చిన చలం ఇప్పుడు రమణాశ్రమంలో తన పూర్వ భావాలకు వైరుధ్యం లేకుండానే ఆధ్యాత్మిక చింతనలో గడుపుతున్నాడు. చలం నిజాయితీని ఎవరూ శంకించరనుకుంటాను. కాబట్టి సామాజిక ప్రగతికి, ఆధ్యాత్మిక చింతనకూ వైరుధ్యమేమీ లేదనుకుంటాను. ప్రస్తుత చలాన్ని గూర్చి మీ అభిప్రాయమేమిటి?

జ: గాంధీజీని మిత్‌గా చేసినట్టు. శ్రీశ్రీలో ఆధ్యాత్మిక అభినివేశాలు చూపించి శ్రీశ్రీ బాబా అని కొంతమంది ఒక కల్ట్‌గా తయారు చేసినా చేయొచ్చు. సమర్థుడు (చలం) కాబట్టి He may convert me into Baba. I feel guilty. అట్లాంటి భావాలకు కొన్ని బీజాలున్నాయని మహాప్రస్థానం గేయాలు చదివి దువ్వూరి రామిరెడ్డి అంతకుముందు నేను రాసి అచ్చువేసిన పద్యాలే తనకు బాగున్నాయని రాశారు. అట్లాగే చలం గారికి ఆధ్యాత్మిక భావాలు కనిపించాయి. అవి unavoidlable గా పడినాయి.

చలంగారు ఆధ్యాత్మిక చింతనలోకి వెళ్లిపోయారు. స్వంతమోక్షం కోసం. ప్రజల మోక్షం అనలేదు. To that extent he must be congratulated. హిడోనిస్ట్–మొదట్లో విచ్చలవిడి ఖయాం లైక్ రచనల్లో. not now. ఎవరినీ convert చేయడానికి ప్రయత్నించలేదు. No mischief is done. సామాజిక ప్రగతి వేరు. అది సమిష్టి. ఆధ్యాత్మిక చింతన వేరు. ఇది వ్యక్తిగతమైనది. అందుచేత సామాజిక ప్రగతికీ, ఆధ్యాత్మిక చింతనకూ వైరుధ్యం లేదు అన్నది నేను ఒప్పుకోలేను. సమాజమేమో అందరికీ, ఆధ్యాత్మికం ఒక్కరికీ. ఇది వైరుధ్యం.

ఆయన (చలం) మంచికిగాని, చెడ్డకిగాని ఆధ్యాత్మిక మార్గంలో పడ్డాడు. నన్నే నమ్మండి, నేనే దేవుణ్ని అనలేదు. తనలో తను వున్నాడు.

**(అష్ట గ్రహకూటమి రిఫరెన్సు వచ్చింది)**

దానికి ఆయనకి నేను వుత్తరం కూడా రాశాను. ఉప్పెన వస్తే చెన్న పట్టణంలోని 20 లక్షల ప్రజలతో నేనూ మునిగిపోవటానికి సిద్ధమే అని.

ప్ర: మిమ్మల్ని ఒక ప్రత్యేక రాజకీయవర్గానికి చెందినవానిగా మాత్రమే ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. 'మానవుడే నా సంగీతం', 'మానవుడే నా సందేశం' అన్న మీరు మానవులందరికీ కావలసినవారే కాని ప్రత్యేక వర్గానికి మాత్రమే కాదు. మీరు కాదనరనుకుంటాను.

జ: ఇది విస్తృతమైన ప్రశ్న.

ఏ ప్రత్యేక వర్గానికీ చెందిన కవిని కాదు అనటానికి వీల్లేదు. ఇది irrelevent question మానవుడే నా సందేశం అన్నది ప్రపంచం అంతా సుభిక్షంగా ఉన్నప్పుడే అది

సాధ్యమవుతుంది. ఇప్పుడు కవిని వర్గాలు ఆదరించడం తప్పదు. It must take sides. జాతీయతా భావం వుంటుంది.

మానవులందరికీ కావల్సిన కవిత్వం అన్నది ఏ రెండు వందలేళ్ళకోగాని సాధ్యం కాదు.

## గుత్తికొండ సుబ్బారావు

ప్ర: అభ్యుదయ కవిత అంతగా ఆదరణ పొందని ఆ రోజుల్లో ప్రచురించిన 'మహాప్రస్థానం' విపరీతమైన ఆదరణ పొందగా కవితకు నీరాజనం పద్తున్న ఈ దశాబ్దంలో ప్రచురించిన 'ఖడ్గసృష్టి' అంతగా ఆదరణ పొందలేదు. దీని అర్థం ఆనాటి కంటే ఈనాటి మీ కవితా రచన పటిష్టత తగ్గిందనా?

జ: కవితకి ఆనాడు ఆదరణ లేకపోలేదు. ఈనాడు ఉందనీ అనుకోగూడదు. 'ఖడ్గసృష్టి' random collection of poems. 'మహాప్రస్థానం' అలాకాదు. A particular భావం కోసం ఎడిట్ చేసింది. Reception లో ఎట్లాగూ భేదం వుంటుంది. ఆనాటికంటే ఈనాడు విస్తృతమైన ఆదరణే ఉంది. లేకపోలేదు.

ప్ర: సాయుధ పోరాటం ద్వారానే తప్ప మరో మార్గం ద్వారా ఆర్థిక సమానత్వం సమకూరదంటారా? ఆర్థిక సమానతా వ్యవస్థకు మీరు సూచించే సత్వర పరిష్కార మార్గాలేమిటి?

జ: మనం ఇంతవరకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని మాత్రమే పొందాం. ఆర్థిక స్వాతంత్ర్యం విప్లవం ద్వారా తప్పించి రిఫార్మ్ ద్వారా రాదు. సాయుధ విప్లవం మనదేశంలోనే కాకుండా ప్రపంచ పరిస్థితి కూడా పరిపక్వం అయితేనే వస్తుంది. అరమగ్గిన పండు ఎలా నేల మీద పడుతుందో అలా వస్తుంది విప్లవం. దీనికేం short cuts లేవు.

## వరవరరావు

ప్ర: రాయితో కొట్టి రాల్చవచ్చు కదా?

## జ్వాలాముఖి

ప్ర: పండు మగ్గేవరకు ఆగితే మధ్యలో చిలకలెత్తుకుపోతున్నాయి కదా?

జ: ఆయుధం అలీనం కాదు. కృష్ణుడు చెప్పిందదే.

ప్ర: అభ్యుదయ కవిత్వం అంటే ఏమిటి? కేవలం ప్రజా సమస్యల మీద కవిత్వం రాయటమా? కవిత్వపరంగా రచనా రీతిలో అభ్యుదయం కాంక్షించడమా?

జ: ఒక్క మాటలో చెప్పేయటానికి వీల్లేదు. ప్రజల యొక్క అభ్యుదయాన్ని కోరేదే అభ్యుదయ కవిత్వం. ప్రజల సమస్యలకు సంబంధించి వుండాలి. ప్రజల సమస్యల మీద రాయాలి. కొత్త పంథాలో చెప్పితే ప్రజల మనసులో ఇంకడానికి అవకాశముంది.

ప్ర: శిష్టా ఉమామహేశ్వరరావుగారు మిమ్మల్ని influence చేసినట్లుగా విన్నాను. నిజమా? ఎంతవరకు? వచన కవితలో మీరు ముందా? ఆయనా?

జ: నా మీద గురజాడ ఇన్ఫ్లుయన్స్ వుంది. చింతా దీక్షితులు, బసవరాజు వీళ్లు నన్ను గురజాడ దగ్గరకు చేర్చారు. ముద్దుకృష్ణ, నేనూ అదే దారిలో వెళ్తుండే వాళ్లం. శిష్టాని చూసినపుడు I was really inspired నాకంటే ముందు శిష్టాయే start చేశాడు. ఇద్దరమూ ఒక్కదారంట వచ్చిన వాళ్లమే.

నారాయణబాబు చాలా తర్వాతవాడు. ముద్దుకృష్ణ చాలా మంచి వచన గీతాలు రాశాడు.

కొంపెల్ల జనార్ధనరావువి పిరమిడ్లు.

## నవీన్

ప్ర: ఫ్రాయిడ్ సైకోఎనాలిసిస్ సాహిత్యాన్ని చాలా influence చేసింది. దీన్ని కొందరు undesirable influence అంటారు. మీ అభిప్రాయం ఏమిటి?

జ: It is not undesirable. Stream of consciousness develop కావటానికి ఫ్రాయిడియన్ థింకర్స్ కారణం.

ప్ర: క్రిష్టోఫర్ కాడ్‌వెల్ రాసిన Illusion and reality అన్న పుస్తకాన్ని గుర్చి మీ అభిప్రాయం?

జ: ఒక్కమారే చదివాను. అది సూత్రప్రాయమైన గ్రంథం. లిటరరీ టేస్టు ఉన్న ప్రతివాళ్లు చదవదగ్గ గ్రంథం.

## పింగళి రంగారావు

ప్ర: సినిమా ఒక బలమైన సాహిత్య ప్రచార సాధనమనే అందులో ప్రవేశించారా?

జ: నేనెప్పటికైనా మంచి సినిమా తీయగలననే తలచాను. ప్రచార సాధనమన్నది కాదనలేదు. As a weapon for the good of the people, సినిమాలను కూడా జాతీయం చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. మంచి జరుగుతుంది. అయితే అది ప్రభుత్వం చేస్తేకాదు. Progressive Government చేస్తేనే అది సాధ్యమవుతుంది. నేను తీయాలనుకున్నది - రుక్మిణీ కల్యాణం సక్సెస్ కాలేదు. అసలు పునాదే ఎగిరిపోయింది. పురిటిలోనే సంధి కొట్టుకుపోయింది.

ప్ర: సెక్స్ చిత్రాలు ప్రజాదరణ పొందుతున్నాయనే తీస్తున్నారా? సమాజాన్ని ప్రతిబింబించే చిత్రాలు తీసే సాహసం నిర్మాతలకు లేదా? కథకులు లేరా?

జ: డబ్బులొస్తాయంటే వాళ్లేపనైనా చేయగలరు. సమాజాన్ని ప్రతిబింబించే చిత్రాలు తీయాలంటే సమాజ శ్రేయస్సును కోరే ప్రభుత్వం ఉండాలి. కథకులు లేరనే సమస్యే లేదు.

ప్ర: ఇటీవల ఏర్పడ్డ సినిమా రైటర్స్ వర్క్‌షాప్ వల్ల ప్రయోజనం ఉందంటారా?

జ: నిజంగా సరైన పద్ధతిలో ఏర్పాటు చేస్తే ఈ రైటర్స్ వర్క్‌షాప్ ప్రొడ్యూసర్లని ఇన్‌ఫ్లుయన్స్ చేయగలుగుతుంది. ఆ వర్క్‌షాప్‌లోని forward looking people మీద ఆధారపడి వుంటుంది.

జ: సినిమా రంగంలో లాభదృష్టి – కమర్షియల్ దృష్టి బాగా వుంది. కుటుంబరావు కొన్ని సినిమాలకు రాశాడు.

ప్ర: సాహిత్యంలో రతికేళి వర్ణించినపుడు కనీసం సినిమాల్లో తెరపై ముద్దు ఉంటేనేం, తప్పా?

జ: ప్రజల పరిణతి ఆధారపడి వుంటుంది. సమర్థిస్తాను. అవసరమైతే నగ్నదృశ్యాలను కూడా సమర్థిస్తాను.

(శ్రీశ్రీ హైదరాబాదు వచ్చినప్పుడు లోగడ చేసుకున్న ఏర్పాటు ప్రకారం చలసాని ప్రసాదరావు శ్రీశ్రీకి, ఇరవై మంది రచయితలకూ 1969 నవంబరు 2న ఒక గోష్ఠి ఏర్పాటు చేశాడు. కనుక ఆయనను ఈ గోష్ఠి ప్రయోక్తగా చెప్పవచ్చు. శ్రీశ్రీని ఎలాంటి ప్రశ్నలు వేయాలి అన్న ప్రశ్న వచ్చినప్పుడు ఆయనకు జీవితమూ సాహిత్యమూ రాజకీయాలూ వేరు వేరు అరలు కావు కాబట్టి ఈనాటి దేశ పరిస్థితుల్లో యువకులు రచయితలుగా మాత్రమే వుండిపోవడం కాక నిర్మాణంలో భాగస్వాములుగా కూడా కావాలి కనుక విధి. నిషేధాలు ఉండకూడదనుకున్నాం. అందుకే ఇరవై మంది నుంచి ఆహ్వానించిన ప్రశ్నలకు సంపాదక బాధ్యత వహించిన రాంభట్ల కృష్ణమూర్తి, నవీన్, వరవరరావుల పనీ, సంచారక బాధ్యత వహించిన శ్రీపతి పనీ చాలా తేలికయిపోయింది. సెన్సారింగ్ అవసరం లేనిచోట సెన్సార్ బోర్డ్ అంత అలంకారప్రాయంగా వారుండిపోయారు. తమకు కావల్సింది ఏదో, కూడనిదేదో ప్రజలే నిర్ణయించుకున్నట్లుగా శ్రీశ్రీయే ప్రశ్నలు చదువుకున్నాడు. జవాబులు చెప్పాడు. శ్రీశ్రీలోని సమగ్రత్వానికీ, వైవిధ్యానికీ ఈ గోష్ఠి నిదర్శనం. ఇదంతా ఒకచోట రాసి మళ్లీ శ్రీశ్రీకి చూపాం. ఆయన ఓ.కె. అన్న గోష్ఠి రూపమే ఇప్పుడు మన ముందున్నది. ఈ గోష్ఠి ఏర్పాటు చేసినందుకేకాక తొలిసారిగా ప్రచురించుకునే అవకాశం సృజనకు ఇచ్చినందుకు చలసాని ప్రసాదరావుకూ, ఇందులో పాల్గొన్న కవులందరికీ, ఇరవై మంది ఒక పెట్టూ తానొక పెట్టూ అన్నట్టు పొద్దుటి నుంచి సాయంత్రం దాకా దాదాపు ఆరు గంటలు సాగిన గోష్ఠిలో యువతోత్సాహం ప్రదర్శించిన శ్రీశ్రీకి ధన్యవాదాలు)

('కవి వయసు ఎప్పుడూ ముప్పై ఏళ్లే' అనే శీర్షికతో ఈ ఇంటర్వ్యూ సృజన మాసపత్రిక 1970 ఫిబ్రవరి సంచికలో అచ్చయింది. దాని అనుసరణ)

# కళారూపం

నీరుకొండ మీ'మరోప్రస్థానం' కోసం ఎదురు చూసేవారికి దాన్ని ఎప్పుడు అందిస్తారు? 1980లో అందిస్తారని ఆశించవచ్చా?

శ్రీశ్రీ: అప్పుడే తేదీ గూడా నిర్ణయించుకున్నానే. 1980 జనవరి, ఫిబ్రవరి, మహా అయితే మార్చి ఫస్ట్ క్వార్టర్ లోపున.

హరీష్: మిమ్మల్ని ప్రభావితం చేసిన కవులెవరు?

శ్రీశ్రీ: ఒకరేమిటి? అనేకులు. ఒక విధంగా చేస్తే తొలిరోజుల్లో కాదు గానీ చివరి రోజుల్లో 1950 నుంచి మాయకోవస్కీ. అతను సరాసరి ఉద్యమం నుంచి వచ్చినవాడు. అంతకుముందు ఇంగ్లండ్‌లో డబ్ల్యు.హెచ్.ఆడెన్, స్టీఫెన్ స్పెండర్ మొదలైనవారు రాసిన నవ్య కవిత్వం. ఈ నూతననత్వం, ఈ పారిశ్రామిక నాగరికతకు చెందిన ప్రతీకలు. ఇమేజస్ – రైలుబండి ఒక పెద్ద స్టేట్‌మెంటుకేసి బయలుదేరింది టి.ఎస్.ఇలియట్ – 'ఆకాశం సాయం కాలం ఒక మతిపోయిన రోగిలా పడివున్నది' అంటాడు. ఇవన్నీ మోడర్న్ ఇమేజస్ నా కవిత్వాన్ని ప్రభావితం చేసిన అనేకులలో ఇటువంటి వారి కవిత్వాలు కొన్ని.

రాం: కవిగా మీ అవతరణ అభ్యుదయ కవిత్వంలో ఆక్సిడెంట్ అంటున్నాడు వేగుంట మీరేం చెబుతారు?

శ్రీశ్రీ: అది వేగుంట అభిప్రాయం ఆక్సిడెంట్ అనుకుంటే ఒక విధంగా సూర్యుడు ఉదయించడం గూడా ఆక్సిడెంటే. రేప్పొద్దున ఉదయించకపోవచ్చు.

హరీష్: మీరోసారి ధ్వని కవిత్వం కమ్యూనిజంలోనే సాధ్యం అన్నారు. ధ్వని కవిత్వం అంటే ఏమిటి?

శ్రీశ్రీ: అహ ధ్వని కమ్యూనిజాన్ని ధ్వనిస్తేనే ధ్వని కవిత్వం అన్నాను. ఆనంద వర్ధనాచార్యులేమన్నారంటే వ్యంగ్యార్థం ఓటివుంటుందనీ, కవి చెప్పిన దానికంటే గూడా అందులోంచి మనకి అవగాహన అయ్యేటటువంటిదే ధ్వని అంటారు. 'రీతి ఆత్మస్య కావ్యం' అని ఒకడన్నాడు. 'రసాత్మకం వాక్యం కావ్యం' అని ఒకడన్నాడు ఇట్లాగ– ఔచిత్యం ముఖ్యమని క్షేమేంద్రుడు –రసచర్చ చేయడంలో ఎందరో సంస్కృత అలంకారికులు చెప్పారు. వీటన్నిటిలోకి

ధ్వనిమతం గొప్పది అంటారు. ధ్వని అంటే కవిచెప్పిన దానికంటే గూడా పాఠకుడు పీల్చుకునేదే గొప్ప కవిత్వం. అది అందర్లోనూ వుండదు. ధ్వని ప్రధానమైందే కావ్యం అన్నారు. అలాగ మన రచనల్లో కమ్యూనిజం ధ్వనిస్తేనే అది ధ్వని అని నేనన్నాను.

రాం: తెలుగు కవిత్వంలో ఈ మధ్య వచ్చిన మినీకవిత మీద మీ అభిప్రాయం?

శ్రీశ్రీ: యువకవుల ఉత్సాహానికి నిదర్శనంగా తీసుకుంటాను. ఆంధ్రజ్యోతిలో చూస్తుంటాను కదా కొత్త కలాలు ఇవీ, ఇంకా సామాజిక స్పృహ లేదనే అనిపిస్తుంది. కవిత్వం రాయాలన్నంతగా సామాజిక వాస్తవ గ్రహణం రాలేదని అనిపిస్తుంది. నా 'సిరిసిరిమువ్వ' అంటే అది జర్నలిజం. జర్నలిస్టిక్ స్థాయిలోనే వుంది తప్ప సమాజానికి లీడ్ ఇవ్వగలిగే కవిత్వం ఇంకా రావడం లేదు. కానీ వారి ఉత్సాహానికి నిదర్శనంగా అవి మనకు కనబడుతూవుంటాయి. చాలా చురుకైన రచనలు కూడా వున్నాయి. వారికి సామాజిక అవగాహన వుంటే ఇంకా ఎంతబాగా రాయగలుగుదురో.

రాం: అంటే కుందుర్తి, సోమసుందర్‌ల దీర్ఘవచనాలకన్నా ఈ ప్రక్రియ మేలైందేనంటారా?

శ్రీశ్రీ: కనీసం అది చదువుతారు...దీర్ఘ రచనలకంటే అంత ఓపికలేదు. నాలుగు పేజీలుందనుకోండి. దాన్ని స్కిప్‌చేసి దీన్ని చదువుతారు. ఆ మేరకి ఇది మేలు.

రాం: కవిసేన మానిఫెస్టో మీద మీ అభిప్రాయం?

శ్రీశ్రీ: ఏదీ మన గుంటూరు శేషేంద్ర కదా ! అది ఒక విధంగా చూస్తే మోరల్ రీ ఆర్మమెంట్ లాగా, సాల్వేషన్ ఆర్మీలాగా వీళ్లంతా మిలిటరీ పద్ధతులే అవలంబిస్తారు. మేజర్‌బార్బరాలో బార్బరా తండ్రి మరణాయుధాల వ్యాపారం చేసే కోటీశ్వరుడు. బార్బరా తండ్రి దగ్గరకు సాల్వేషన్ ఆర్మీ చందా కోసం వెడుతుంది. తండ్రి అంటాడు, నేను మారణాయుధాలు అమ్మేవాణ్ణి కదా! నన్ను చందా ఇవ్వమంటావేమిటి? అని పక్కన ఒకడుంటాడు. వాడు వ్యవస్థ మార్చడానికి ఆయుధాలే అవసరం అంటాడు. బాలెట్లు కాదు బుల్లెట్లు అని కూడా అంటాడు. ఇలాగ రామదండులాగ, సాల్వేషన్ ఆర్మీలాగ ఇదీ కవిసేనే.

## చలం

హరీష్: చలం చచ్చిపోయాడా?

శ్రీశ్రీ: అంటే భౌతికంగా చచ్చిపోయినట్లేగదా!

నీరుకొండ: చలం సాహిత్యం మీద నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు విమర్శ గూర్చి మీ అభిప్రాయం?

శ్రీశ్రీ: అది కొంచెం అన్‌కైండ్. మరీ అంత కొట్టి పారెయ్యాల్సిన రచయిత కాదు గదా చలం? చలాన్ని శ్మశాన సాహిత్యం అంటే మరి సజీవ సాహిత్యం ఎక్కడుంది? ఐనా నేను చలంగారు చచ్చిపోయిం తర్వాత రాస్తూ-మార్క్సిస్టు దృక్పథం లేకపోవడం చేత (అసలు మార్క్సిస్టు దృక్పథం ఒకటుందని ఆయనకి తెలియదు) ఆయన సంఘరోగాన్ని నిధానం చెయ్యగలిగాడు గానీ రోగాన్ని తగ్గించే మందును దానికి ఇవ్వలేకపోయాడని అన్నాను.

హరీష్: తెలుగు సినిమాల్లో ఈ మధ్య వచ్చిన మార్పులు ఏమైనా వుంటే చెప్పండి. అట్లాగే మృణాల్‌సేన్ గూర్చి కూడా మీ అభిప్రాయం?

శ్రీశ్రీ: మనం ఒక పొరపాటు చేస్తున్నాం. గౌతమ్‌ఘోష్ సినిమా భాష అందరికీ అర్థమయ్యే భాష. దానికి భాష రావాల్సిన అవసరం లేదు అన్నాడు. రామూ కరియత్ ఏమో సినిమాకి కథ అవసరం లేదన్నాడు. ఉత్తమమైన సినిమాకి, ఛార్లీ చాప్లిన్‌నే తీసుకోండి. అతని సినిమాలు చూసి ప్రపంచం అంతా పెద్ద ఆర్టిస్టుగా గుర్తించింది. అవి మూకీలు. ఈనాడు భాషకు సంబంధించిన పాటలు, డైలాగులన్నీ తెలుగులోనే ఉండాలిగదా! అందుచేత మృణాల్‌సేన్ రావడం నాకు ఇష్టం లేదు. నా ఇష్టా ఇష్టాలతో ఇవన్నీ జరిగేవి కావనుకోండి. శ్యాంబెనెగల్ రావడం కూడా నాకు ఇష్టం లేదు. మొన్న రామూకరియత్‌ని తీసుకొచ్చారు. ఆయనది డాక్యుమెంటరీ దృష్టి. సినిమాకి కథ అవసరం లేదంటాడు.

హరీష్: "బైసికిల్ థీఫ్" చూస్తే మనకి భాష అవసరం అనిపిస్తుందా?

శ్రీశ్రీ: పిక్చర్ ఎలా వున్నా అందులో ఎన్ని ఇటాలియన్ చమక్కులున్నాయో అవన్నీ మనం మిస్ అయిపోయాంగదా? వుత్తవడసారం మిగిలింది. ఆ మేరకి సత్యజిత్‌రేని ఒప్పుకుంటాను. అతనిది ఒకే ఒక పిక్చర్ చూశాను. అదేమిటి....ఒక నిరుద్యోగి కుర్రవాడుంటాడు...."ప్రతిధ్వంది". అదినాకు చాలా నచ్చింది. మనం మన భాషలోనే పిక్చర్ తీసి ఇతర భాషలకి పంపాల్సి వచ్చినప్పుడు ఏవైనా మంచి డైలాగులు రిజిష్టర్ కావాల్సినవి ఇంగ్లీషులో సబ్‌టైటిల్స్ వేస్తాం, అంతేగానీ తెలుగు పిక్చర్‌ని మరో భాష డైరెక్ట్ చేయించడం వాడెంత గొప్పవాడైనా ఆ రెండూ కలియవేమో అనిపిస్తుంది.

హరీష్: సినిమాకి పాట అవసరమా?

శ్రీశ్రీ: పాశ్చాత్య దేశాల్లో మ్యూజికల్స్ అని వేరే వుంటాయి. 'మైఫేర్ లేడీ' ఒపెరా లాంటివి. మన సినిమాల్లో కత్తిసామూ దాన్లోనే వుండాలి. రేప్‌లు దాన్లోనే వుండాలి. పాటలు కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో కమర్షియల్ సినిమాలో పాటలు చాలా అవసరం.

హరీష్: ఇప్పుడున్న పరిస్థితుల్లో అంటే?

శ్రీశ్రీ: కమర్షియల్ సినిమాలో.

హరీష్: అంటే ఈ దేశంలో ఇంకో సినిమా గూడా వుందిగదా పారలల్‌గా?

శ్రీశ్రీ: ఆ, ఆ, ధనస్వామ్య విధానంలో లక్షలు పెట్టి తీసుకున్న వాడికి వేరు. ఎక్స్‌పెరిమెంట్ సినిమా, న్యూవేవ్ సినిమా అని వున్నదే వాటికున్న ధ్యేయం వేరు. వీటిల్లో పాటలు అవసరం. కానీ ఒకప్పుడు సిట్యువేషన్‌లో పాటను సహజంగా తీసుకురావచ్చు. పాటలు కేవలం అనవసరం అని అనను.

హరీష్: కళల్లో సినిమా అనేది ఉంటుందా? వుంటే ఎలా ఉండాలని మీరనుకుంటున్నారు?

శ్రీశ్రీ: సినిమా అనేది కళల యొక్క సముదాయం. ఫొటోగ్రఫీ కూడా ఒక కళే. సౌండ్ రికార్డింగ్, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ కూడా కళలే. ఐదే కళలకి సైన్సు ప్రాతిపదిక. సైంటిఫిక్ దృక్పథం పెరిగినకొద్దీ ప్రజా సినిమా అనేది వస్తుంది. మనం ఒక కెమెరా పెట్టుకుని హోం సినిమాగా 16 ఎం.ఎం.లో ప్రొజెక్టర్ ఒకటి పెట్టుకుని ఫిల్ములు తీయవచ్చు. 2 రీళ్లు తీయవచ్చు.

నీరుకొండ: ప్రజా సమస్యల్ని వివరించడంలో జానపద కళారూపానికి ప్రాధాన్యత ఇవ్వాలంటున్నారు. మన కవులు దాన్ని ఎక్కువగా చేపట్టలేకపోవడానికి కారణమేమిటి?

శ్రీశ్రీ: వచనానికీ, కవిత్వానికీ మధ్య ఛందస్సున్నదే ఆ భేదంపోయి ఇంగ్లీషులో డికెన్సు, రష్యన్‌లో టర్జినీవ్ వాళ్లంతా వచనానికి కావ్యత్వం ఇచ్చారు. జేమ్స్ జాయిస్ 'యులిసెస్'ను నవలనే అంటాం. కాని మహాకావ్యం అనాలి. వచనం కవిత్వం ఈ రెంటికీ మధ్య వుండే సన్నని తీగెని ప్రతిభావంతులైన ఈ రచయితలు తుడిచేశారు. కాబట్టి మనం ప్రజల్లోకి వచనంలోనైనా వెళ్లవచ్చు. కవిత్వంలోనైనా వెళ్లవచ్చు. కవిత్వంలో ఛందస్సు, సీసపద్యాలు, మత్తేభాలు, ఇవన్నీ సంవత్సరాలుగా వస్తున్నవి. అవి కూడా భోగవస్తువులుగా, విలాస వస్తువులుగా తయారైనవి. దాన్లో ప్రాచీన కవులు మహాగ్రంథాలు రాశారు. ఈ జానపద కవిత్వం కూడా మొదటి నుంచి వస్తూ వున్నది. పడవ నడుపుతూ ఓ పాట పాడేవాడు. పెద్దపెద్ద కొండల్లో రాళ్ళు కొడుతూ ఓ పాట పాడేవాడు. అరక దున్నుతూ ఓ పాట పాడేవాడు. ఆ విధంగా మనకి జానపద సాహిత్యం అవ్యాహితంగా వస్తున్నది. ఈ జానపద రూపాలని ఇమిటేట్ చెయ్యడమే ఈనాడు సినిమా పాటలు ఇంత పాపులర్ కావడానికి కారణమని నేను నిస్సందేహంగా చెప్పగలను.

రాం: సినిమా పాటలు ప్రచారం కావడానికి జానపద బాణీలు కారణం అన్నారుగదా విప్లవ రచయితలు. ఇంకా చాలా మంది వచన కవితలోనే ఉండడానికి కారణమేమిటి?

శ్రీశ్రీ: అది చాలా మంది లోపమేగాని గద్దర్ విషయంలో, వంగపండు ప్రసాదరావు విషయంలో అనలేం. జనసేన మంచి పాటలు రాశాడు. రెంజిం కూడా. వచన కవిత్వం రాయడం ఈజీకాదు. ఛందోబద్ధ కవిత్వం కంటే కూడా కష్టం. ఛందస్సులో దారిచూపే మార్గమైనా ఉంటుంది. వచనంలో అదేం లేదు. మంచి వచన కవిత్వం ఛందోబద్ధ గీతం కంటే గొప్పదని నేననుకుంటాను.

నీరుకొండ: వేమన కవితలాగా నేటి కవిత ప్రజల నాలుకలమీద ఆడకుండా పోవడానికి కారణమేమిటి?

శ్రీశ్రీ వేమన కవిత ఈనాడంటే ప్రజల నాలుకల మీదికి వచ్చింది గానీ ఆయన బతికున్న రోజుల్లో ఆయన్ని అనుసరించిన వారెవరు? అసలు నిన్నమొన్నటి దాకా ఆయన్ని కవిగానైనా ఎవరైనా అంగీకరించారా? వేమన బతికున్న రోజుల్లో అతనో పిచ్చివాడనీ, ఛందస్సు అదీ ఏం లేదు అని కొట్టేశారు గదా? అంటే వేమన కవిత్వం కాలాన్ని జయించి నిలిచింది. మనం గుర్తిస్తున్నామే తప్ప ఇంకా కొంత మందీ, విశ్వవిద్యాలయాలూ గుర్తించడం లేదు. వారి దృష్టిలో వేమన కవే కాదు. దానికేమంటారు?

రాం మాండలికంలో రచనలు చేయడం రచన ప్రచారానికి అవరోధం కలిగించే అవకాశం ఉందనుకుంటాను దానివల్ల ప్రయోజనం పొందగలమని కొందరంటున్నారు. మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీశ్రీ· దానికి గిడుగు రామమూర్తి పంతులుగారే ఏనాడో జవాబు చెప్పారు. అతను వ్యవహారిక భాషను ప్రవేశపెట్టినప్పుడు సరిగ్గా మీలాగే గోదావరి భాష హైదరాబాదులో తెలియదు అక్కడి భాష శ్రీకాకుళంలో తెలియదు. అది కడపలో తెలియదు దానికి రైమూ, రీజమూ వుందా? అలాగ రాస్తే అక్కడి వాడికి బోధపడ్డం ఎలాగ అని! మాండలికాలు యాసవల్ల తప్ప కర్త కర్మ, క్రియలు మారవుగా తెలుగు కారకము. గ్రామర్ అంటామే అది ఎక్కడైనా ఒక్కటే పదాల అర్థాలు భేదం కావచ్చును. బాబాయి అంటే మా సైడు (విశాఖలో) చిన్నోడు అని అర్థం ఇంకో చోట చిన్నాన్న అని అర్థం ఇందుకోసం అని చెప్పి మాండలికాన్ని తిరస్కరించాల్సిన అవసరం లేదు స్త్రీ అనే పదానికి ఎన్నో వందల వేల పర్యాయ పదాలున్నాయి హంసగమన, సారసలోచన అని వున్నాయి. మనకర్థంగాకపోతే డిక్షనరీలో చూసుకుంటాం. మాండలికాలకి యూనివర్సిటీలు డిక్షనరీలు తయారు చేస్తే తమ ఉనికిని సార్థకం చేసుకున్నట్టు అవుతుంది ఇటువంటి పనులేమో మానేస్తారు. నన్నయభట్టుగారిలో ఎంత భాష ఉన్నది అని దానికేమో అమరకోశం తయారు చెయ్యడం.

హరీష్. మీకు జాతకాల మీద విశ్వాసం ఉందా?

శ్రీశ్రీ: లేదు

హరీష్: ఒక ఐదుసంవత్సరాలు ముందుకు చూసి కాలానికి అర్థం చెప్పండి.

శ్రీశ్రీ నాకు జాతకాల్లో నమ్మకం లేదన్నాను గదా. మళ్ళీ జాతకం చెప్పమంటున్నారేమిటి?

(శ్రీశ్రీ ఇటీవల ఖమ్మం వచ్చినప్పుడు ఆయనతో నీరుకొండ హనుమంతరావు డాక్టర్ హరీష్, కె.రాంమోహన్‌రాజు కొంతసేపు ఇష్టాగోష్టి జరిపారు. ఆ సందర్భంలో వేసిన కొన్ని ప్రశ్నలూ, శ్రీశ్రీ జవాబులు)

**(సృజన, ఆగస్టు 1979)**

# కళా చైతన్యం

ప్రశ్న: మీకు కవిత్వం రాయాలనే కోర్కె ఎప్పుడు పుట్టింది? ఎందుకు పుట్టింది?

శ్రీశ్రీ: నాకు అక్షరాభ్యాసం జరుగకముందే మూడు నాలుగేళ్ల వయసులో చిత్ర కారుడుగా నా ఆర్టిస్టిక్ జీవితం ప్రారంభమైంది. ఒక కుడ్య చిత్రకారుడిగా (Mural painter) రంగు సుద్దలతో మా మేడ మీద గోడలనిండా బొమ్మలు గీసేవాణ్ని. నాలో కళపై అభిరుచి ఆ విధంగా ప్రారంభమైంది.

ప్ర: మీ ఇంట్లో చిత్రకారులెవర్రైనా ఉండేవారా?

శ్రీశ్రీ: అదేమీ లేదు. మా నాన్న గణితశాస్త్రజ్ఞుడు. ఏదైనా కళాకారుడు కావాలనే వుబలాటం నాలోనే ప్రారంభమైంది.

ప్ర: మీరు కవిత్వం రాయడం ఎప్పుడు ప్రారంభించారు?

శ్రీశ్రీ: నా అయిదవ ఏట నాకు అక్షరాభ్యాసం అయింది. ఆ తరువాత ఒకటి రెండేళ్లకే కవిని కావాలని బుద్ధి పుట్టింది. కందం రాసిన వాడే కవి అనుకునే రోజులు కాబట్టి నేనూ కందపద్యంతోనే నా కవిత్వం ప్రారంభించేను.

ప్ర: మీకు అప్పటికే ఛందోలక్షణాలు తెలుసన్నమాట.

శ్రీశ్రీ: లేదు. నేను అప్పట్లో రాసిన కంద పద్యాలకు గణ, యతి, ప్రాసాదులేవీ లేవు. ఒక పొట్టిపాదం- దాని క్రింద ఒక పొడుగుపాదం. మళ్లీ అదే కొలతలో ఒక పొట్టిపాదం, ఒక పొడుగు పాదం రాసేసి అదే కందం అన్నాను.

ప్ర: మీరు రాసిన మొదటి పద్యంలో భావమేమిటో జ్ఞాపకముంటే చెప్తారా?

శ్రీశ్రీ: జ్ఞాపకం లేదు. లాగే కందం కూడా. నా మొదటి 'కంద' పద్యం చూసేక మా నాన్న వెంకటరమణయ్యగారు నాకు సులక్షణసారం కొనిపెట్టి ఛందోమర్మాలన్నీ స్వయంగా విడమర్చి చెప్పారు. అసలు మా ఇంటి పేరు పూడిపెద్ది. శ్రీరంగం నారాయణబాబు తాతగారి అన్న శ్రీరంగం సూర్యనారాయణగారు. మా నాన్నగారిని ఆయన దత్తత చేసుకున్నారు. అందువల్ల నేను శ్రీరంగం శ్రీనివాసరావు నయ్యాను. కళాచైతన్యం నన్ను కవితామార్గంలో పెట్టింది.

ప్ర: మీలో పసిదశలోనే ఏర్పడిన ఈ కళాత్మక చైతన్యానికి Materialistic basis (భౌతిక ప్రాతిపదిక) ఏదైనా వుందా?

శ్రీశ్రీ: (దీర్ఘంగా ఆలోచించి) అందరిలాగే నడవడం కాకుండా లేని రెక్కలు తెచ్చుకుని స్వంతంగా ఎగరాలనే ఆంతరంగికమైన ఏదో ఉబలాటంనన్నలా లాక్కెళ్లింది. ఇతరులెవరూ చేయని ఏవో ప్రయోగాలకోసం తహతహ నాకు పసిప్రాయంలోనే వుంది.

ప్ర: మీ తొలి రచనలేవి?

శ్రీశ్రీ: స్వకీయం పురాణమనే గీతమాలిక, ఏవో డిటెక్టివ్ నవలలు, సావిత్రి-సత్యవంతుడనే నాటకం- ఇలాంటివెన్నో నా అయిదు-18 ఏళ్ళ మధ్య రాశాను. అవెక్కడున్నాయో ఇప్పుడు తెలీదు.

ప్ర: ఆ రోజుల్లో మీ పైనున్న సామాజిక ప్రభావం ఎటువంటిది?

శ్రీశ్రీ: ఆ రోజుల్లో సామాజికపరంగా అవగాహన కోసం నేనేం కృషి చేయలేదు. మహాప్రస్థానం గీతాలు రాసేవరకూ, ఆ రోజుల్లో నేను Out and out ను. అయితే చదవడం నేర్చుకున్నాక దొరికిన పుస్తకం అల్లా చదివే వాడిని. నాటకాలు చూసేవాడిని. తారాబాయి, కోడి రామమూర్తి సర్కస్‌లు చూసేవాడిని. ఇవన్నీ నాలో కళాత్మక చైతన్యాన్ని పెంచడానికి తోడ్పడ్డాయి.

ప్ర: 1928లో 'ప్రభవ' రాసేనాటి మీ మానసిక, కళాత్మక పరిస్థితి ఏమిటి?

శ్రీశ్రీ: నా 18వ యేట నేను 'ప్రభవ' రాశాను. ఆ రోజుల్లో నాకు నా చుట్టూ ఒక సమాజముందన్న స్పృహ కూడా లేదు. నేను, నా బూర్జువా sorrounding మాత్రమే నాకు కనిపించాయి. అయినా మానసికంగా Art for art's sake (కళ కోసమే కళ) వ్యక్తిని. అప్పటికి మాకు ఆస్తిపాస్తులుండేవి. బాధ్యతలేవీ ఉండేవికావు. అందుకే సమాజాన్ని పట్టించుకునే అవసరం లేకపోయింది.

ప్ర: 'మహాప్రస్థానం' మొదలైన అప్పటి మీ గీతాలకు నేపథ్యం గురించి, అంటే ఈ రకమైన స్పృహ మీలో కలగడానికి కారణమైన పరిస్థితుల గురించి వివరిస్తారా?

శ్రీశ్రీ: నేను 1928లో కాలేజీ చదువుల కోసం విశాఖపట్నం నుండి మద్రాసు వెళ్లాను. మా ఆర్థిక పరిస్థితులు దిగజారడం కూడా అప్పటి నుండే ప్రారంభమైంది. ప్రపంచమంతటా ఆకలిదప్పులు హాహాకారాలు వినిపిస్తున్నాయి. 1930 దశాబ్దాన్ని ఆకలి దశాబ్దం (Hungry Thirties) అంటారు. ఈ అన్నిటి ప్రభావ ఫలితంగా 'మహాప్రస్థానం' గేయాలు వచ్చాయి. అంటే కుటుంబ ఆర్థిక పరిస్థితి, హంగ్రీథర్టీస్, నాకు అప్పుడు

చదువుకోవడానికి లభ్యమైన సాహిత్యం, నిరుద్యోగ పట్టభద్రుడిగా వున్న చోట ఉండకుండా తిరిగిన తిరుగుడు నాలో సామాజిక స్పృహ కలిగించాయి.

ప్ర: సుఖమైన జీవితం నుండి కష్టాల ప్రాంగణంలోకి అడుగుపెట్టినప్పుడు మీరెలా ఫీలయ్యారు?

శ్రీశ్రీ: నేనెప్పుడూ Optimist నే (ఆశావాది). అందుకే బూర్జువా శ్రీశ్రీ నుండి రెబెల్ శ్రీశ్రీ తయారయ్యాడు.

ప్ర: ఈ దశలో మిమ్మల్ని అత్యంత ప్రభావితం చేసిన పుస్తకం. రచయిత ఎవరో చెప్పగలరా?

శ్రీశ్రీ: ప్రిన్స్ క్రొపోట్కిన్(రష్యన్ అనార్కిస్టు రచయిత) రాసిన 'An appeal to youth' (యువకులకు విజ్ఞప్తి) అనే వ్యాసం నా దృక్పథాన్ని పూర్తిగా మార్చివేసింది.

ప్ర: అప్పటికి మీపై మార్క్సిజం ప్రభావంగానీ, అక్టోబర్ విప్లవ ప్రభావంగాని ఏమైనా వుందా?

శ్రీశ్రీ: ప్రత్యక్షంగా వాటి ప్రభావం లేదుగానీ, నేను అప్పుడు చదివిన సాహిత్యం, నా కుటుంబ పరిస్థితి – (ముఖ్యంగా స్పెయిన్లలో అంతర్యుద్ధం) ఇవి నన్ను వామపక్ష దృక్పథం వైపు లాక్కుపోయాయి.

ప్ర: మీ 'ప్రతిజ్ఞ' గేయానికి ప్రేరణేమిటి?

శ్రీశ్రీ: ఇంగ్లాండులో మన భారతీయ విద్యార్థులు స్థాపించిన అభ్యుదయ రచయితల సంఘం (Progressive Writers Association). వారి అరతావు మేనిఫెస్టో ఇండియాలోకి స్మగుల్ అయ్యింది. దాని కాపీ (ప్రతి) ఒకటినాకు అబ్బూరి రామకృష్ణారావుగారు ఇచ్చారు. ఆ తరువాత ఆ గేయం చదివి అబ్బూరి రామకృష్ణారావుగారికి వినిపించాను. గేయం విని మొత్తం మేనిఫెస్టో సారంశమంతా నీ గేయంలో దించావని ఆయన నన్ను అభినందించారు. అదే రోజుల్లో ముద్దుకృష్ణ 'జ్వాల' పత్రిక వచ్చేది. 'జ్వాల' పత్రికలో ముద్దుకృష్ణ రాసిన ఒక ఎడిటోరియల్ ప్రేరణతో 'దేశ చరిత్రలు' గేయం రాశాను.

ప్ర: మీ 'మహాప్రస్థానం' రచనాకాలంలో వున్న సాహిత్యోద్యమం గురించి మీ అభిప్రాయమేమిటి?

శ్రీశ్రీ: నవ్య సాహిత్య పరిషత్తుదే ఆరోజుల్లో పైచేయి. సాహితీ సమితి సభ్యులే అందులోనూ ప్రముఖులు. అక్టోబరు విప్లవం జరిగినా, ప్రపంచంలో ఫాసిస్టు పిశాచి విలయతాండవం చేస్తున్నా పీడితజనం ప్రపంచవ్యాప్తంగా ఆకలితో అలమటిస్తున్నా,

ఆంధ్రదేశంలో మాత్రం భావకవిత్వానిదే పైచేయిగా వుండేది. ఆంధ్రదేశంలో రచయితలకు ప్రధానంగా స్వాతిశయభావం, అసమగ్రమైన జాతీయ దృక్పథమే తప్ప అంతర్జాతీయ దృక్పథం లేదు. కాంగ్రెసు ఉద్యమాలే స్వరాజ్యం తెస్తాయని రచయితలు భావించేవారు. చాలామంది రచయితలకు, ఏ ఉన్నవ లక్ష్మీనారాయణ లాంటి వారికో తప్ప అక్టోబర్ విప్లవం జరిగిందనే విషయమే తెలీదు. దీనికి ప్రధాన కారణం బ్రిటిష్ సెన్సార్‌షిప్.

ప్ర: మీ కవిత్వంలో శైలి, భాష, వస్తువులో ఒక నూతనత్వం వుంది. ఆరోజుల్లో నవ్యసాహితీ పరిషత్, సాహితీ సమితి మీ కవిత్వంపై ఎట్లా రియాక్ట్ అయ్యేవి?

శ్రీశ్రీ: వాటిల్లోనూ రైటిస్ట్స్-లెఫ్టిస్ట్స్ వుండేవారు. తల్లావఝుల శివశంకర శాస్త్రి, నోరి నరసింహశాస్త్రి లాంటివారు మితవాదులైతే చింతాదీక్షితుల వంటివారు అతివాదులు. గురజాడ అప్పారావుగారు కవిత్వం కూడా వ్యవహారిక భాషలోనే రాయాలనీ, అదే ఈనాటి సరియైన మార్గమనీ సూచించిన మలుపుని నేడు వెడల్పు చేశాను. నవ్య సాహిత్య పరిషత్తు వేదికలపైనా గేయాలు చదువుతూ వుండేవాడిని. ప్రజల నుండి మంచి స్పందన వచ్చేది. పండితులు కూడా తలలూపేవారు.

నవ్యసాహిత్య పరిషత్ వదలిపోయి అభ్యుదయ రచయితల సంఘం భారతదేశంలో ఆ రోజుల్లోనే ఏర్పడింది. నా 'మహాప్రస్థానం' గేయాలవంటి శక్తివంతమైన కవితలు భారతదేశంలో 1930-40 మధ్య మరేకవీ రాయలేదు. అభ్యుదయ రచయితల సంఘం నిర్మాణంలో తొలుత నా ప్రత్యక్ష పాత్ర లేకపోయినా అంతకుముందే నేను రాసిన గేయాల ద్వారా అభ్యుదయ సాహిత్యోద్యమానికి శ్రీకారం చుట్టింది నేనే. అదే సమయంలో వల్లథోల్‌గానీ, సుబ్రహ్మణ్య భారతిగానీ, రవీంద్రనాథ్ టాగూర్‌గానీ సోషలిస్టు విప్లవం గురించికాక జాతీయ దృక్పథంతోనే కేవలం బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్యాన్నే సృష్టించారు. దీన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది నా 'మహాప్రస్థానం' గీతాలు.

ప్ర: బ్రిటిష్ ప్రభుత్వం మీ రచనలపై, మీపై దాడి చేయలేదా?

శ్రీశ్రీ: బ్రిటిష్ ప్రభుత్వం 'మాకొద్దీ తెల్లదొరతనం" లాంటి గేయాలను నిషేధించిందిగాని మహాప్రస్థానం గేయాలపై మాత్రం అది దాడి జరపలేదు. కారణం ఆ రోజుల్లో నా మహాప్రస్థానం గీతాలు గ్రంథంగా వెలువడకపోవడం కావచ్చు. సాహిత్యం మీద దాడి చేయడంలో నేటి మన కాంగ్రెసు ప్రభుత్వం కంటే బ్రిటిష్ వాడే నయం.

(అది 1979 సెప్టెంబరు 30. విరసం ఏడవ మహాసభలు తిరుపతిలో జరుగుతున్నాయి. విరసం సభ్యుడుగా శ్రీశ్రీ పాల్గొన్నారు. నేనూ కార్యవర్గ సభ్యుడుగా పాల్గొన్నా.

ఆ సాయంత్రం ఒక హోటల్ గదిలో వున్న శ్రీశ్రీని "ఏమండీ ఒంటరిగా కూర్చున్నారు?" అని పలకరించాను. డెబ్బయ్యో వడిలో పడబోతున్న శ్రీశ్రీ పిడికిలి మధ్య సిగరెట్ బిగించి దమ్ములాగుతూ, లోపలికి రమ్మన్నారు "నిద్రకు వెలియై, నేనొంటరినై...నా గదిలోపల చీకటిలో, చీకటిలోపల నా గదిలో....చీకటిలో.." అంటూ ఆయన 1939లో రాసిన – 'కేక' గేయంలోని మొదటి పాదాలను చెప్పారు. "నాలుగేళ్లనాడు మీకు ఇస్తానన్న ఇంటర్వ్యూ ఇప్పుడు తీసుకోండి" అన్నారు శ్రీశ్రీ మరో పెద్ద దమ్ములాగుతూ. ఇంటర్వ్యూ నిర్వహణ : వై. కాశీపతి)

**సంఘర్షణ వారపత్రిక.**

**15-12-1979, అనంతపురం.**

# వికృత వ్యవస్థ

ప్ర: విరసంలో వున్న యువతరం కవులు, రచయితలు సాగిస్తున్న కృషిపట్ల మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీశ్రీ: అన్నీ చదవడం ఎలాగూ అసాధ్యం, కానీ తటస్థమైనంత వరకూ చూస్తూనే వున్నాను. విరసం కవులు ఎక్కడెక్కడో చెదురుగా ప్రచురించుకునే కంటే సృజనలోకానీ, అరుణతారలోకానీ ఎక్కువ కేంద్రీకరిస్తే బాగుంటుందని అనుకుంటున్నాను.

ప్ర: ఇప్పుడు వీళ్ళు రాస్తున్నరచనలు విరసం ఆశయాలకు అనుగుణంగా వున్నాయనుకుంటున్నారా? ఏమైనా పెడధోరణులు కన్పిస్తున్నాయా?

శ్రీశ్రీ: విరసం ఆశయాల్ని నూటికినూరుపాళ్లూ ప్రతిబింబిస్తున్న వాళ్లు గద్దరు, వంగపండు ప్రసాద్. మరి ప్రోజ్‌పోయెంతోగానీ, మినీ కవిత్వంలోగానీ ఈ విధంగారాస్తూ కొంత అవగాహనాలోపం వల్ల విరసం ఐడియాలజీకి కొంచెం తప్పిపోతున్న రచనలు కూడా వస్తూనే వున్నాయి. కానీ మొత్తం మీద చూస్తే నేటి యువకవుల్లో రచనలు చెప్పుకోదగ్గశాతం విరసం ఐడియాలజీతో ప్రభావితులై నడుస్తుండడం కనబడుతోంది.

ప్ర: చెరబండరాజుగారి సాహిత్యకృషి పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీశ్రీ: ఈ రకం రచనలకంతటికి కూడా ఆద్యుడు చెరబండరాజనే నా ఉద్దేశం. ఎన్నో విరసం సభల్లో అతను స్వయంగా పాడుతుంటే ప్రజలు ఉద్రూతలూగడం నేను స్వయంగా చూసినవాన్నే. ఫార్మ్‌ఫోక్ అనీ, కంటెంట్ రెవల్యూషనరీ అని దేన్నయితే అనుకుంటున్నామో దానిని మొట్టమొదట దారి చూపించినవాడు చెరబండరాజే అని నేననుకుంటున్నాను.

ప్ర: మీరు విరసం రచయితల నుంచి అప్పుడప్పుడూ సంస్థ ఆశయాలకి భిన్నమైన రచనలు వస్తున్నట్లు అన్నారు. అటువంటివి తారసపడినప్పుడు ఒక సభ్యునిగా మీరు వాటిని సంస్థ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం ఏమైనా చేశారా?

శ్రీశ్రీ: అవి విరసం పత్రికలో అంటే అరుణతారలోగానీ, సృజనలోగానీ ఎక్కువగా కనపడవుగానీ ఇతరత్రా ఓ మంచిపోయెం ఆంధ్రజ్యోతి...ఆంధ్రప్రభ వీక్లీలో పడిందనుకోండి. మరికొన్ని విరసం అభిప్రాయాలకి వ్యతిరేకంగా ఉంటాయనుకోండి. ఎన్నిటినని మనం ఖండించగలం ? ఈ ఉద్యమానికి సంబంధించి రాస్తున్నటువంటి వారిలో ఏమైనా కొన్ని పెడధోరణులు లాంటివి ఉన్నవీ అంటే మీరు చెప్పినట్టుగా వాటిని ఖండించొచ్చును. అంత ఖండించవలసినవి ఏమీ నాకు కనబడలేదు.

ప్ర: ఈ మధ్య తీవ్ర వివాదం రేకెత్తించిన జ్యోతి ఆత్మహత్య, వీరేంద్రనాథ్ వ్యవహారం మీద మీ అభిప్రాయం చెప్పండి.

శ్రీశ్రీ: ఈ వీరేంద్రనాథ్ వంటి రచయితలు పెట్టుబడిదారీ విధానం నుంచి వచ్చినటువంటి-వెర్రితలలు వేసినటువంటి-విషరూపాలు, ఈ వీరేంద్రనాథ్ కాకపోతే మరొకడు రాస్తాడు. జ్యోతి ఆత్మహత్య చేసుకోవడం వల్ల ఇతను బజార్నబడ్డాడు. అంతే తప్ప ఈ రచనలు- అంటే ఏమిటీ-మనం- ఒక వ్యక్తిని condemn చేయడం కంటే ఆ ధోరణుల్ని condemn చేయడం అవసరమవుతుందని నేననుకుంటున్నాను. ఆ ధోరణి ఎలాగూ తప్పదు. మన- ఈ పెట్టుబడిదారీ పత్రికలు పనిపెట్టుకుని దాన్ని పోషిస్తూనే వుంటాయి. చదివేవాళ్లు చదువుతూనే ఉంటారు. ఐనా ఇవి మాత్రం చెదల్లాగా పెరుగుతూనే ఉంటాయి. పైగా ఏదో కాస్త సైంటిఫిక్ ఫిక్షనని పేరు పెట్టి ఇంత చేస్తూండేసరికి....ఆ....ఏమిటీ...షుగర్‌కోటెడ్ పిల్స్ అంటామే అలాగా ఈ విషానికేమోను పైపూత మాత్రం...ఆ....చాలా మధురంగా వుంటుంది. ఇది సూడో సైంటిఫిక్ ఫిక్షనన్జెప్పి నేనంటాను. అది నిజమైనటువంటి సైన్సుకాదు. సైన్సు తొడుగుతో మోసం చేస్తున్నటువంటి రచనలు. వాటిని ఎన్ని విధాల ఖండించాలో అన్ని విధాల ఖండిస్తూనే ఉంటాం. కానీ అది అలా రాకూడదూ అంటే అసలు ఈ వ్యవస్థ మారితేతప్ప అలా వస్తూనే వుంటాయి. అంటే మళ్లీ మొదటికే వస్తాం. కాబట్టి ఈ వ్యవస్థని నిర్మూలం చెయ్యవలసిన అవసరం మనకుంది. అప్పుడు ఈ వ్యవస్థతోపాటు ఇటువంటి రచనలు కూడా పోతాయి.

ప్ర: ఇప్పుడు ఈ 'చేతబడి సాహిత్యం' తెలుగు సాహిత్యంలో ఒక సృష్టించిందనే అభిప్రాయానికి మీరు రాగలుగుతున్నారా?

శ్రీశ్రీ: ఏమీ లేదు. కొన్ని మాసపత్రికలుగానీ, వారపత్రికలుగానీ సీరియల్స్ వేస్తుంటే ఒక ప్రత్యేక సంవిధానం-ఇదిచేసి- ఒక సాహిత్యప్రక్రియగా దాన్ని చూడనక్కరలేదు. మనకి కొత్తగానీ పాశ్చాత్య సాహిత్యంలో సెక్సైతేనేమిటి, డిటెక్టివ్ సాహిత్యమైతేనేమిటి, మళ్లీ లేటెస్టుగా ఎక్సార్సిస్టనీ ఇటువంటివి ఎన్నో వస్తూనూ ఉన్నాయి. పైగా అవి బెస్ట్‌సెల్లర్స్-లక్షల సంఖ్యలో అమ్మకం కావడం చూస్తున్నాము. దాన్ని దిగుమతి చేయడానికి ఇప్పుడు ప్రయత్నం జరుగుతున్నది.

ప్ర: ఈ మధ్య జ్వాలాముఖి ఓ చోట ప్రసంగిస్తూ "విప్లవ సాహిత్యాన్ని గద్దర్, శ్రీశ్రీ, రావిశాస్త్రి బూతుమయం చేస్తున్నారు" అన్నాడు. దానిమీద మీ అభిప్రాయం చెప్పండి.

శ్రీశ్రీ: భాష దృష్ట్యా బూతుమయం చేశామా? సెక్సు దృష్ట్యా బూతుమయం చేశామా? రావిశాస్త్రి బూతుమయం చేసి నేనూ బూతుమయం చేసి...ఇంత చేస్తే జ్వాలాముఖి విమర్శను నేను Legitimate విమర్శగా తీసుకోను.

ప్ర: వ్యవస్థలో మార్పు కోసం మీరు 'మహాప్రస్థానం' రాశారుగదా! ఆ విప్లవం తేగలిగిన ప్రజలకి అందుబాటులో లేకుండా మన రాష్ట్రంలోనైతే ఏడున్నర రూపాయలు ఉంది దాని ధర. విదేశాల్లోనైతే ఏడొందలయాభైకి కాసెట్టూ అదీ ఇస్తున్నారు. మరి గ్రంథకర్తగా మీరు దీనికీ ఎలా అనుమతించారని సందేహం.

శ్రీశ్రీ: అంటే దాన్ని బైబిలు ప్రచార సమితి వాళ్లు ఉచితంగా పంపిణీ చేసినట్టు చేయాలని మీ ఉద్దేశమేమో నాకు తెలియదు.

ప్ర: మా ఉద్దేశం అదికాదు. విప్లవ సాహిత్య గ్రంథాన్ని బూర్జువా సమాజంలో ఒక కమాడిటీగా చేశారుగదా....

శ్రీశ్రీ: వచ్చిన చిక్కల్లా ఏమిటీ అంటే పుస్తకం అచ్చువేసి అమ్మడం వ్యవస్థేకానీ ఇది సామ్యవాద వ్యవస్థకాదు. చార్లీ చాప్లిన్ పిక్చరుకి పది రూపాయలు టిక్కెట్టెందుకు పెట్టారు అనడిగితే ప్రయోజనం లేదు. ఇవన్నీ కూడాను ఇప్పుడు నేను చెప్పినట్లు ఈ వ్యవస్థలో మామూలుగా జరిగే పనులే.

ప్ర: మీ పుస్తకాలు మీరే సొంతంగా పబ్లిష్ చేసుకోదలచారని తెలిసింది. దానికి కారణం ఏదైనావుందా?

శ్రీశ్రీ: కారణం మరేమీ లేదు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారున్నారు, విశ్వనాథ సత్యనారాయణగారున్నారు. ఒక రచయిత తన రచనలమీద బతికే అవకాశం ఇప్పుడు వచ్చింది. పాఠకులకీ, రచయితకీ మధ్య పబ్లిషర్స్-దళారీతనాన్ని పోగొట్టడానికి వీలవుతుంది. ఐతే ఒకటి. మళ్లీ నేనచ్చువేసి మళ్లీ ఎవరికో కమీషనివ్వాలి. ఇది కొంచెం నేను ఆలోచిస్తున్నాను. ఏమిటీ...ఇదొక్కటేకాదు, గ్రంథ రచన-గ్రంథకర్తకీ, పాఠకుడికీ మధ్యన దళారీ, అలాగే ఒక సినిమాగానీ తీస్తే ఎక్స్పెరిమెంట్‌గా తీసేవన్నీ మనవాళ్లు తీస్తున్నారు. తీస్తున్నా డిస్ట్రిబ్యూషన్ కొచ్చేసరికి మళ్లీ వీళ్లే. కమీషన్లు కొట్టేసేవాళ్లూవీళ్లే- ఇట్లాగాకుండా నేనొక స్కీం అనుకుంటున్నాను. ప్రతి జిల్లా కేంద్రంలోనూ, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి ఇవన్నింట్లో కూడానూ అభిమాన సంఘాలు ఉన్నట్టుగా ఫిలిం అభిమాన సంఘాలు బయల్దేరి వాళ్లేమోనూ ఈ ఎక్స్‌పెరిమెంటల్ సినిమాలు చూడగలిగివుండాలి. మరి వీటిని చూడాలీ అంటే ఎగ్జిబిషన్ కొశ్చన్ వస్తుంది పెద్ద థియేటర్లు ఎవళ్లూ ఇవ్వరు. ఇచ్చినా కూడాను వాళ్ల రెంట్ తగ్గించుకోరు. చాలా తీవ్రమైనటువంటి సమస్య. ఎట్లా దీన్ని స్మాష్ చెయ్యాలీ అంటే-దాన్ని గురించే నేను ఆలోచిస్తున్నాను. స్మాష్ చెయ్యడానికి ఈ ఆర్థిక వ్యవస్థ మీద ఎటాక్ చెయ్యాలి.

ప్ర: మన దేశంలో, ముఖ్యంగా తెలుగుదేశంలో (విప్లవ) రచయిత అన్నవాడు రచనను వృత్తిగా చేపట్టి జీవించే స్థితి వచ్చిందంటారా?

శ్రీశ్రీ: ఇప్పటికి కూడా డాక్టర్ పని చేస్తూనో, బ్యాంకు ఉద్యోగి పనిచేస్తూనో, ప్లీడర్‌గా ఉంటూనో రాయడమే తప్ప రచయితకి రచయితగా తన కాళ్లమీద తను నిలబడగలిగే పరిస్థితులు లేవు. కానీ, ఈ విధానం పరిమితుల్లోనే ఒక రచయిత రచయితగా జీవించడానికి అవకాశం వుందీ అనుకుంటున్నాను. ఇప్పుడు జర్నలిస్టు జీవించడం లేదూ? వాడూ రచయితే కదా. అందులో మళ్లీ బూర్జువా జర్నలిస్టూ ఉన్నాడు. విప్లవ పాత్రికేయుడూ వున్నాడు. ఈ విప్లవ పాత్రికేయుడేమో విధిగా బాధలు పడక తప్పదు. ఈ వ్యత్యాసం వుంది. వ్యత్యాసం లేనటువంటి సమాజం కోసం మనం పాటుపడాలి.

ప్ర: మీరీమధ్య విదేశాలకి వెళ్లినప్పుడు మన తెలుగుదేశంలో జరుగుతున్న విప్లవ సాహిత్యోద్యమాన్ని గూర్చి చెప్పడానికి అక్కడి వేదికల్ని ఏమైనా ఉపయోగించుకున్నారా?

శ్రీశ్రీ: అమెరికాలో నేనున్న ఏడువారాల్లో ముఖ్యంగా చేసిందే ఇది. అమెరికాలో కొన్ని డజన్ల విశ్వవిద్యాలయాలున్నాయి. అన్నిట్లోనూ మాట్లాడ్డం అసంభవం. నేను కనీసం ఒక అరడజను విశ్వవిద్యాలయాల్లోనైనా మాట్లాడి వుంటాను. మన సాహిత్యం ఈనాడు ఏ రూపం ధరిస్తున్నదో చెప్పాను. అవన్నీ టేప్ కూడా చేసి ఉన్నాయి. ఎప్పుడన్నా పబ్లిష్ చేస్తాను కూడాను.

ప్ర: కొ.కుగారూ, మీరూ మద్రాసులోనే వున్నారు. ఆయన సినిమా రంగంలోకి వెళ్లలేదు. కానీ మీరు ఎట్లా చిక్కుకున్నారు?

శ్రీశ్రీ: కుటుంబరావుగారు కూడా సినిమా రచనలు చేశారు. కథలూ రాశారు. డైలాగులూ రాశారు. ఐనా ఆయనకి సుస్థిరమైన చందమామ ఉద్యోగం దొరికింది. ఆ కారణంగా ఈ సినిమా 'గబ్బు'లోంచి ఆయన బయటపడిపోయాడు. నేనేమో ఒక విధమైన జీవితావసరం వల్ల అక్కడే వుండిపోయాను. సినిమా as it is దాన్ని గర్హించనక్కరలేదు. పెట్టుబడిదారీ చేతుల్లో ఉండడం వల్ల వాళ్లు దాన్ని స్వప్రయోజనాలకి ఉపయోగిస్తుండటం వల్ల ప్రజలకు చేదు సరఫరా అవుతోంది. కానీ అదే సినిమాతో ప్రజల జీవిత విధానాన్ని బాగుచేయవచ్చును. కొత్తరకం పిక్చర్లు తీయొచ్చును. ఈనాడు కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేను తొలినుంచీ గమనించాను. ఆ రోజుల్లో కొన్ని బాగా ఫేలయ్యాయి. ఈ రోజు కొన్ని సక్సెస్ అవుతున్నాయి. ఇకమీద ఇంకా మంచి పిక్చర్లొస్తాయని చెప్పి నేననుకుంటూ ఉన్నాను.

ప్ర: అటువంటి చిత్రాల పేర్లేమైనా చెప్పగలరా?

శ్రీశ్రీ: 'మాభూమి' ఒకటుంది. ఊరుమ్మడి బతుకులు, తర్వాత చలిచీమలు. కొన్ని సక్సెస్ అయ్యాయి. కొన్ని కాలేదు కానీ trend ఒకటి వచ్చింది కదా!

ప్ర: మీరు గట్టిగా ప్రయత్నిస్తే స్థిరమైన ఉద్యోగం ఏదైనా దొరికి వుండేదిగదా. అలాంటప్పుడు ఆ ప్రయత్నం చేయకుండా సినిమాల్లోనే ఎందుకున్నారు అని కొందరడుగుతున్నారు. మీరేం చెబుతారు.?

శ్రీశ్రీ: నాకప్పుడు ఉక్కిరి బిక్కిరియేంత పని వుండేది. ముఖ్యంగా డబ్బింగ్ చిత్రాలు. అది ఇంకోళ్లకి సాధ్యం కాదు. ఇంత పని వస్తూ ఉండగా నాకు ఉద్యోగం కోసం చూసుకోవలసిన అవసరం ఏమిటి? ఏం లేదు....ఇప్పుడు నేను బిజినెస్సే పెట్టుకున్నాను. బంగాళాదుంపల వృత్తి పెట్టుకున్నాను. దానిమీద వేలకొద్దీ ఆదాయం వస్తుంది. నువ్వేమో ఎందుకీ బంగాళాదుంపల వ్యాపారం పెట్టుకున్నావు? నువ్వు గనక తల్చుకుంటే ఆంధ్రపత్రిక్కో ప్రభకో ఎడిటర్ అయ్యేవాడివిగాదా? అవన్నీ Might have beens ఈ సినిమా నేను కోరుకున్నది కాదు. అదే విధంగా నేను కోరుకోకుండా బంగాళాదుంపల వ్యాపారం చేసేవాన్ననుకోండి. ఈనాడు మీరు నన్ను ఆ ప్రశ్న అడగడానికి వీల్లేదు. నీ అంతవాడు బంగాళాదుంపల వ్యాపారం చేయకుండా ఇంకోటేదో చేయవచ్చునుగదా అన్నది ఇర్రెలవెంట్ ప్రశ్న.

ప్ర. ఇప్పుడు సినిమాల్లో విప్లవం ఫ్యాషన్‌గా కూడా కొన్ని వస్తూ వున్నాయి. వాటిమీద మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీశ్రీ: ఇప్పుడు సినిమాయే కాదు....మన ప్రభుత్వం కూడా అంతే. పీల్చి పిప్పిచేసే ఎక్స్‌ప్లాయిటింగ్ ఏజెన్సీ మన ప్రభుత్వం. అటువంటి ప్రభుత్వం పడగకింద వుంటూ మనమేమో విప్లవ చిత్రాలు తీస్తాం అంటే మొదటి సంగతి ఎవడూ డబ్బు పెట్టడానికి ముందుకురాడు. డబ్బు పెట్టినా కూడా ఆ డబ్బు తిరిగి వస్తుందనే నమ్మకమూ లేదు. అందు కోసం కొంచెం ఈ ఫోక్‌లోర్‌ట్రెండ్ మొదలు పెట్టాలి. విప్లవం ఫ్యాషనైందని మీరిందాకా అన్నారే దానికో చిన్న ఉదాహరణ చెప్తాను. అప్పట్లో తమిళనాడులో అన్నాదురై, కరుణానిధి, ఎం.జి.ఆర్‌లు చాలా సటిల్ మెథడ్స్‌లో సినిమాని ఆధారంగా చేసుకుని డి.ఎం.కె. ఐడియాలజీని ప్రచారం చేశారు కేవలం సినిమా వల్లనే ఒక 10 సంవత్సరాల్లో కాంగ్రెసుని నిర్మూలన చెయ్యగలిగారు. ఈనాడు తమిళనాడులో కాంగ్రెసు అధికారంలోకి వస్తుందని మీరు అనుకోగలరా? అది అట్లా కావడానికి కారణమేమిటి? డి.ఎం.కె. ఐడియాలజీ వల్ల వచ్చిందా? ఏమీ లేదు. సినిమా గ్లామర్- ఎం.జి.ఆర్ ఇమేజ్. సూడో సోషలిజం భావాలు-సోషలిజంగా కనబడతాయి. కానీ అది సోషలిజం కాదు వాళ్లన్నీ ఫోక్‌లోర్ చిత్రాలే తీశారు ఒక రాజుగారు, ఆ రాజుగారి దగ్గర పురోహితుడు. పురోహితుడు అంటే ఈనాటి బ్రాహ్మణునే వాళ్లు దృష్టిలో పెట్టుకున్నారు. ఆ పురోహితుణ్ని తిడతారు సెన్సార్ వాళ్లేమీ చేయలేదు ఈ విధంగా వాళ్లు తమ ఐడియాలజీని ప్రచారం చేశారు. సెన్సార్‌షిప్ లిమిటేషన్స్‌ని అధిగమించి వాళ్లు చేయగలిగారు. నేనేదన్నా పాటలో విప్లవం అన్న మాటవాడితే నిర్మాత భయపడే వాడు. ఇప్పుడు అంజయ్యగారూ విప్లవం అంటారు. సస్యవిప్లవం అంటారు. ఏదో అంటారు విప్లవం అనేది అర్థంలేని మాటగా తయారైంది.

ప్ర: ఆకలి రాజ్యం సినిమాలో శ్రీశ్రీ కవిత్వాన్ని భ్రష్టుపట్టించారనీ, సందర్భం నుంచి వేరుచేసి వాడారనీ విమర్శ. దీంతో మీరెంతవరకు ఏకీభవిస్తారు?

శ్రీశ్రీ· ఆ పిక్చరు నేను చూడలేదనుకోండి. చూడకపోయినప్పటికీ బాగా హిట్టయిందని విన్నాను- అది హిట్టయిందంటే అర్థం ఏమన్నమాట? దానికి ఒక విధమైన అనుకూలమైన రిసెప్షన్ వచ్చింది. people have recevied it favourably. ఐతే ఐడియాలాజికల్‌గా ఎందుకని తీయలేదు అంటే మన ఐడియాలజీ ఉన్నవాళ్ళు దేశం మొత్తంమీద 10శాతం కంటే ఎక్కువ ఉండరు ఈ ఐడియాలజీని ప్రచారం చేసుకోవడానికి ఇతర సాధనాలు వాడుకోవాలి సినిమా ఎవరి చేతుల్లో వుండకూడదో వారి చేతుల్లో వున్నది. కాబట్టి ఈ నాటికి వాళ్లు దేవతా కల్యాణమనీ, అయ్యప్ప మహిమనీ తీస్తూనే వున్నారు. చూస్తూనే వున్నారు. వీటిని మనం అడ్డలేం. కాబట్టి మనకి కావాల్సిందేమిటంటే ఈ వ్యవస్థని మార్చడం. కేరళలో Co-operative పుస్తక సంస్థలున్నాయి. అలాగే అందరూ చందాలు వేసుకుని సినిమాలు తీయడం-ఇవన్నీ జరిగే పనులు కావు. అన్నిటికంటే చాలా గుదిబండలాగ ఈ వ్యవస్థ మననెత్తిమీద కూచుని వుంది. ఎప్పటికప్పుడు కాంప్రమైజ్ చేసుకోకతప్పదు ఈ ఎర్రమల్లెలు, ఇవన్నీ ఫోక్‌లోర్ సినిమా. రేపొద్దుట మహాప్రస్థానం అని ఓ సినిమా తీస్తానన్నారు.నేను

అంగీకరించాను. అందులో రిక్షావాడేమో పెద్దింటి అమ్మాయిని....పాతాళభైరవి సినిమాలో తోట రాముడు రాజుగారమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. ఇది ఫోక్‌లోర్ ఐడియా. అక్కడ తోటరాముడేమో ఇక్కడ రిక్షావాడయ్యాడు. అంతకంటే ఏం లేదు.

ప్ర: పోతన 500వ జయంతిని ప్రభుత్వం చాలా అట్టహాసంగా జరుపుతోంది. ఆయన ఆశయాలకు విరుద్ధంగా ప్రభుత్వం జరిపే ఈ ఉత్సవాన్ని మీరు ఎలా భావిస్తున్నారు?

శ్రీశ్రీ: ఇది కూడా ఒక విధమైన ప్రపంచ తెలుగు మహాసభల్లాంటిదే. వాళ్ళ పబ్బం గడుపుకోవడానికి మేం పేదవాళ్లకి ప్రాతినిధ్యం వహిస్తున్నాం అంటూ ఏదో పాతకవిని తీసుకొచ్చి glorify చేయడం వల్ల వాళ్ల పబ్బం గడుస్తుందే తప్ప అసలు పేదవాళ్ళకి ఒరిగేదేమీ లేదు. ఏదో పెద్దవాళ్లింట్లో పెళ్లి జరుగుతోది. వాళ్ల ఇష్టం వచ్చినంత ఖర్చు పెడతారు. ఎంచేత? వాళ్ల దగ్గర డబ్బు వుంది కాబట్టి ఖర్చు పెడుతున్నారు. దాన్ని మనం condemn చేస్తాం. ఇదిగో ఇది పద్ధతికాదు-రేపు వాళ్లు వేమన గురించి ఏదైనా ఆర్భాటం చేస్తారు-వద్దని అనలేం కదా.

ప్ర: చెయ్యొద్దని అనడం కాదుగానీ పోతన ఆశయాలు వేరుగా ఉన్నాయి. తాను రాసిన కావ్యాల్ని వారికి అంకితం ఇవ్వనన్నాడు. వీళ్లు మదాంధులు అన్నాడు. అటువంటి పోతన 500వ జయంతిని ఇవాళ్ల ఇన్ని లక్షల ఖర్చుతో జరుపుతూ వుంటే ఒక రచయితగా మీరు దానిపట్ల ఏవిధంగా రియాక్టవుతున్నారు?

శ్రీశ్రీ: దానికేదైనా Press statement ఇచ్చి condemn చేశాననుకోండి. నాకు ఇష్టంలేదు నిజంగా. ఇష్టం లేదని చెప్పానునేను. నేను చెప్పినంత మాత్రాన వాళ్లు మానేస్తారా?

ప్ర: మీరీ మధ్య కామన్‌వెల్త్‌లో ఉండటం భారతదేశానికి గర్వకారణం అన్నట్లు పత్రికా ప్రకటన వచ్చింది. ఇది వరకోసారి కామన్‌వెల్త్‌లో ఉండటమే భారతదేశానికి స్వాతంత్ర్యం రాలేదనడానికి నిదర్శనం అన్నారు. దీన్ని బట్టి మొహమాటానికి మీరామాట అన్నట్టా లేక....

శ్రీశ్రీ: ఏదో కామన్‌వెల్త్ సభ జరిగినప్పుడు ఇందులో మేం కూడా సభ్యులమేను అన్నానుగానీ, అక్కడ ఈ కామన్‌వెల్త్ నాశనం కావాలి. విప్లవం వర్ధిల్లాలి అని నన్ను అనమన్నారా? కామన్‌వెల్త్ సభకి నన్ను పిలిచారండీ! అసలు వెళ్లకూడదు న్యాయంగా. కాని వెళ్లింతర్వాత వాళ్లనెందుకు అక్కడ condemn చేయడం?

ప్ర: అఖిలభారత స్థాయిలో విప్లవ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయడానికి మీలాంటివారు కృషిచేయవచ్చుగదా? మీరెందుకు ఆ చొరవతీసుకోరు ?

శ్రీశ్రీ: శారీరకంగా కదిలే స్థితిలో లేను- స్థిరంగా కూచుని చెయ్యవలసిందే నేను. ఆల్ ఇండియా స్కేల్లో విప్లవ రచయితల సంఘం ఏర్పడ్డం అభిలషణీయం.

ప్ర: విప్లవ సాహిత్యం ఏ భాషలో ఎక్కువగా వస్తోందని మీరు భావిస్తున్నారు?

శ్రీశ్రీ: ఈ విషయంలో అగ్రేసరంగా ఉన్నది తెలుగు సాహిత్యమే. మిగతా భాషల్లో కూడా ఇది మొదలవుతున్నది. ఇతర భాషల్లోంచి సూటిగా తెలుగులోకి తర్జుమాలు రావాలి.

ఇందాక మీరు చెప్పినట్టుగా మరాఠీలోనైతేనేమి, బెంగాలీలోనైతేనేమి, పంజాబిలోనైతేనేమి విప్లవ కవిత్వం వస్తోంది- వీటన్నింటినీ ఒక వేదికమీదికి తెచ్చే ప్రయత్నం జరిగితే బాగుంటుంది.

ప్ర: ఒక డీలాన్ థామస్, ఒక మెర్లిన్‌మన్రో ఆత్మహత్య చేసుకునే స్వేచ్ఛ అమెరికన్ ప్రజాస్వామ్యంలో వుందని మీరు అన్నారు. ఇప్పుడు మీరు వెళ్లి వచ్చారుగదా. ఇంకా అలాంటి స్వేచ్ఛ ఉందా?

శ్రీశ్రీ: డీలాన్‌థామస్ ఆత్మహత్య చేసుకోలేదే- అలా నేను అని వుండనే. ఇప్పటికీ అమెరికాలో తండ్రి కొడుకునీ, కొడుకు తండ్రిని చంపే స్వేచ్ఛ వుంది. ఆయుధాలేమోను పకోడీల పొట్లం కొనుక్కున్నట్టు కొనుక్కోవచ్చు.

ప్ర. దాన్ని స్వేచ్ఛ అంటారా?

శ్రీశ్రీ: స్వేచ్ఛను వాళ్లు అలా నిర్వచించారు. అలా వాళ్లు తయారయ్యారు. అమెరికా ప్రజల్లో కూడా అసంతృప్తి వుంది. డబ్బుతో పులిసిపోయిన సమాజం కాబట్టి వాళ్ల చేతుల్లోంచి సామాన్య ప్రజలు బయటపడలేకపోతున్నారుగానీ విప్లవం అనేది అమెరికాలో కూడా వస్తుందని నా నమ్మకం.

ప్ర: మలేషియా తెలుగు సభలకి వెళ్లడానికి నిరాకరించిన మీరు చికాగో తెలుగు సభలకి ఎలా వెళ్లారు.?

శ్రీశ్రీ. మన ప్రభుత్వం పంపలేదే. వాళ్లు ఇన్‌వైట్ చేశారు. మన ప్రభుత్వానికీ దానికీ ఏం సంబంధం లేదు.

ప్ర. తెలుగుదేశంలో ఎన్నో పోరాటాలు జరుగుతున్నాయి. కవిగా మీరు వీటికి ఎందుకు స్పందించడం లేదు?

శ్రీశ్రీ: ఒకటి - తెలుగుదేశానికి కొంచెం దూరంగా వుండటం వల్ల. అందుకోసమే వీలైనంత త్వరలో నేను పుట్టిన స్వస్థలానికి-విశాఖపట్నానికి వచ్చి settle down ఐపోవాలనుకుంటున్నాను. ఇంకా కొన్ని practical difficulties ఉన్నాయి. ఇప్పుడు మద్రాసులో వుండి తెలుగు పేపరు చూద్దం కూడా కుదరడం లేదు. విశాలాంధ్ర మాత్రం Freeగా వస్తుంది. అందువల్ల ఇప్పుడు ఏమిటి జరుగుతున్నదో కూడా నాకు తెలీదు. ఒక విధంగా నేను sealed off. కాబట్టి రియాక్ట్ కావల్సినంతగా నేను రియాక్ట్ కాలేకపోతున్నాను. slowly I am retiring. వీలైనంత వరకు ప్రశాంతమైన జీవితం కోసమన్జెప్పి మొట్టమొదటి సంగతి I must be careful about my health. ఇదివరకు 10 మైళ్లు నడిచేవాణ్ని. ఇప్పుడు మెట్లు దిగితేనే ఆయాసం వస్తోంది. ఆ భేదం వుంటున్నదిగదా ఒక్కొక్క దశాబ్దం గడుస్తున్న కొద్దీ.

ఏవో కొన్ని సాహిత్యపరమైన రచనలు చెయ్యాలని నా మనసులో వున్నది. దానికి కొన్ని పరిస్థితులు కూడా నేను క్లియర్ చేసుకోవాలిగదా. ఇదివరకు పరిగెత్తుతూనో, గెంతుతూనో ఏదో రాశాను. ఇప్పుడలాంటి స్థితిలో లేను. ఒక స్థిమితం ఏర్పడాలి. అదేర్పడితే సాహిత్యానికే ఎక్కువ నా జీవితాన్ని వినియోగించాలని వుంది. I will be an active creative writer. అది వదలి పెట్టను.

ప్ర: మద్రాసులో ఈ మధ్య జన నాట్యమండలి కార్యక్రమాలు జరిగాయి. వాటిమీద మీ అభిప్రాయం ఏమిటి? జనం రియాక్షన్ ఎలా వుంది?

శ్రీ శ్రీ: జనంలో వాళ్లు మంచి సంచలనం కల్గించారు. కల్గించారుగానీ మద్రాసువంటి మహానగరాల్లో ముందుగా కావాల్సిందేమిటంటే పబ్లిసిటీ. అది లేకపోవడం వల్ల అక్కడికి వచ్చినవాళ్లు మన ఐడియాలజీకి దగ్గరివాళ్లే. వాళ్ళే తప్ప చాలా తక్కువ మంది వచ్చారు. దానికి మన పద్ధతులు ఏమన్నా మార్చాల్సి వుంటుందో ఏమిటో. ఎక్కువ మందిని ఆకర్షించి టిక్కెట్లు కూడా పెట్టాలి లేకపోతే ఫ్రీఫెర్ఫార్మెన్స్ ఇస్తే వచ్చేవాళ్లందరూ వీళ్లేవస్తారు. కమర్షియలైజ్ చెయ్యడమన్నా అనండి నాకేం అభ్యంతరం లేదు. మొన్న నాతో అన్నారు. తమిళనాడు ఇంటీరియర్‌కి కూడా వెళ్తాం అని. కానీ కనీసం ఖర్చులన్నా గిట్టుబాటు కావాలికదా. దానికేమో మనం కమర్షియల్ పద్ధతులు అవలంభించాలిగదా! ఈ పబ్లిసిటీ విధానాల్ని అనుసరించి టిక్కెట్లు పెడితే...ఒక కుర్రాడంటాడు. ...ఏమిటిరా ఇదీ ఈ జన నాట్యమండలి కూడాను కమర్షియలైజ్ అయిపోయిందని చెప్పేసి ఈనాడు మనం ఏ వ్యవస్థలో వున్నాం? ఆ వ్యవస్థలో వుండి దాన్ని డిస్‌క్రెడిట్ చెయ్యాలి.

ప్ర: మనం కమర్షియలైజ్ చేసిం తర్వాత ఈ వ్యవస్థలో వున్న చెడుని ఎలా డిస్‌క్రెడిట్ చేస్తాం?

శ్రీ శ్రీ: ఈ వ్యవస్థలో వున్న చెడుని అంతా తూర్పారపడతాం...ఆ తూర్పార పట్టిందాన్నేమో మళ్లీ వాళ్లకే అమ్ముతాం. అయ్యయ్యో ఇది పాపపు సొమ్ము దీన్ని తీసుకోకూడదు అనుకోకూడదంటాను.

ప్ర: ఇటీవల మీరు గ్వాటిమాలా విప్లవకవి ఒతో-రెని-కస్తియ్యో కవితను అనువదించారు. అది రాజకీయాలకు దూరంగా మడిగట్టుక్కూచున్న మేధావులకి హెచ్చరిక. మరి దీన్ని అనువదించిన మీకు ఆ కవిత ఆత్మవిమర్శకు అవకాశం కల్పించలేదా?

శ్రీ శ్రీ: అటువంటి మేధావివర్గానికి చెందినవాడుగా నన్ను నేను భావించడం లేదు. ఎందుకంటే అలా భావిస్తే మహాప్రస్థానం, మరో ప్రస్థానం లాంటివి రాయవల్సిన పన్లేదుగదా

ప్ర: 30 ఏళ్లుగా మీ కవిత్వంలో మీరు చెప్తున్న విషయాలు తెలుగు ప్రజలు సీరియస్‌గా పట్టించుకుంటున్నారు. మరి మీరు వాటినెప్పుడు పట్టించుకుంటారు?

శ్రీ శ్రీ: నేను చెప్పినవాటికి నేనెప్పుడూ కట్టుబడే వుంటానుగదా? సాహిత్యానికి సంబంధించినంతవరకు నన్నెవరైనా రియాక్షనరీ అంటారా? అంటే ఏమిటి? నేను చెప్పేదొకటీ, చేసేదొకటీ కావాలి.

ప్ర: ఇతరుల మీలో విభిన్న వ్యక్తిత్వాలు చూస్తున్నారు. మహాప్రస్థానం శ్రీశ్రీ పేరు అనీ, గుంటూరు శేషేంద్రశర్మకి కితాబులిచ్చే శ్రీశ్రీ వేరనీ, వ్యక్తి గతంగా శ్రీరంగం శ్రీనివాసరావు వేరనీ అంటున్నారు. ఇటీవల ఒక పత్రికలో ఇలాంటి ఇంటర్వ్యూ కూడా వచ్చింది. దీనికి మీరేమంటారు?

శ్రీ శ్రీ అది కూడా ఒకవిధమైన జర్నలిస్టిక్ స్టంటే. సర్క్యులేషన్ పెంచుకోవడానికి. ఇది కూడా ఫోక్‌లోర్ ఐడియా– కన్యాశుల్కంలో బైరాగి గూర్చి ప్రచారం జరుగుతుంది. ఈయనేన్రా ఉప్పాడలోనూ, సింహాచలంలోనూ ఒకే రోజు కన్పించాడని–అదెలా సాధ్యం అనేం లేదు. అతని భక్తులు అలా ప్రచారం చేస్తారు.

ప్ర: మీ గూర్చి అలా అంటున్న వాళ్ళు ఎవరి భక్తులంటారు?

శ్రీ శ్రీ: నాభక్తులే.

ప్ర: శ్రీ శ్రీ తాగగాలేనిది నేను తాగితే తప్పేమిటి అనే యువ కవికి మీరు ఇచ్చే సంజాయిషీ ఏమిటి?

శ్రీ శ్రీ: శ్రీశ్రీ రాయగాలేనిది నేను రాస్తే తప్పేమిటి అని కూడా ప్రశ్నించుకోమంటాను.

ప్ర: ప్రశ్నకి ప్రశ్న జవాబుకాదు దానికేమంటారు?

శ్రీ శ్రీ: రచనలమీద శ్రద్ధచూపించమంటాను. నేనిప్పుడు స్మోకింగూ, డ్రింకింగూ మానేశాను మీకు తెల్సా? అమెరికా వెళ్లివచ్చిందగ్గర్నించీ ఇక్కడి(గొంతులో) ఏదో నొప్పిగా వుండేది. సరే నెగ్లెక్ట్‌చేశాను. కిందటిసారి 'దిస్ టెన్స్ టైమ్స్' పుస్తకం ఆవిష్కరణకు ఇక్కడికి వచ్చి వెళ్లిం తర్వాత డాక్టర్‌కి చూపించాను. ఆయన పెద్ద ఎక్స్‌పర్ట్. ఆయన ఒక్కరోజు ఆలస్యంగా వస్తే కృష్ణశాస్త్రిగారి లాగా అయిపోయివుండేవాడివి అన్నారు. ఐతే ట్రీట్‌మెంట్‌కి ముందు ఆ రెండూ మానేస్తేనే ట్రీట్‌మెంట్ ఇస్తానన్నాడు. అప్పణ్నించీ మానేశాను.

ప్ర: వేగుంట మోహనప్రసాద్ 'దిస్ టెన్స్ టైమ్స్' ప్రచురించడంలో ఆయన ఎన్నుకున్న కాలం, అదంతా సబబేనంటారా?

శ్రీ శ్రీ: మనం మన ప్రమాణాలతో అతన్నెలా కొలుస్తాం? మొత్తం మీద ఏమున్నాలేకున్నా అందర్నీ ఒకచోటికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. అన్నీ tolerable translations. బాగులేవని అనడానికి వీల్లేదు. ఇంకా బాగుండే అవకాశముండొచ్చు. అది వేరే సంగతి. ఒక Anthology గా Compose చేయడం చాలా గొప్ప సంగతి కదా : To that extent let us congratulate him. అదీ నేననేది.

ప్ర: అంజయ్యగారిదే అసలైన తెలుగు అని ఆస్థాన కవి దాశరథి అన్నాడు– దానిమీద మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీ శ్రీ: అంజయ్యగారి తెలుగు నేనెప్పుడూ వినలేదు. దాశరథిగారి తెలుగు విన్నాను. అంజయ్యగారిది అసలు తెలుగైతే దాశరథిగారిది కాదేమో అని అనుమానించవలసి వస్తుంది.

ప్ర: అంజయ్యగారు భువన విజయం లాంటివి ఏర్పాటు చేసి దిగ్గజాల్ని పెడుతున్నాడు. దాన్లో మీకేమైనా ఆఫరొస్తే ఏం చేస్తారు?

శ్రీ శ్రీ: ఫ్లాట్‌గా రిఫ్యూజ్ చేస్తాను.

ప్ర: ఇటీవలి కాలంలో మీరు చదివిన ఒక మంచి రచన, దానిమీద మీ అభిప్రాయం చెప్పండి.

శ్రీశ్రీ: ఈ మధ్య ఏం చదవడం లేదు. ఎంచేతంటే ఐసైట్ కూడా తగ్గిపోతోంది. ఇంకో పనిచేయాలి. ఐసైట్‌కి కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవాలి. తర్వాత గ్లాసెస్ వాడాలి. మీ మొహాలు కూడా నాకు సరిగ్గా కనపడడం లేదు.

ప్ర: మీ జీవితంలో ఏ సంవత్సరాన్ని గొప్ప సంవత్సరంగా భావిస్తారు? అలాంటి సంవత్సరం ఏదన్నా వుందా?

శ్రీ శ్రీ: నా షష్టిపూర్తి సంవత్సరం 1970- ఆ సంవత్సరం విరసం పుట్టింది. ఆ సంవత్సరాన్ని నా జీవితం అంతట్లోకీ ముఖ్యమైన సంవత్సరంగా భావిస్తాను.

ప్ర: తుంగతుర్తి లాంటి గ్రామాల్లో మీరు మైళ్లకు మైళ్లు నడిచి పౌరహక్కుల సంఘం వారి సభల్లో పాల్గొన్నారు. ఆ సంఘటన అక్కడి ప్రజలు ఇప్పటికీ చాలా గొప్పగా చెప్పుకుంటారు. దాన్ని మీరెలా ఫీలవుతున్నారు?

శ్రీశ్రీ: అందువల్లనే నా కొకవిధమైన ఇన్స్పిరేషన్ వచ్చిందికదా? నేను వెనుకబడి పోతున్నాననే ఫీలింగ్ పోయి Keeping pace with the times అనే ధైర్యం కలిగించింది ఆ పర్యటన.

ప్ర: Keeping pace with the times అన్నారు గదా మీ షష్టిపూర్తి సంవత్సరంలో పుట్టిన విరసంతో అంత ఆక్టీవ్‌గా మీరు వస్తున్నారా?

శ్రీశ్రీ: Active గా రావడానికి one single drawback is my age. మానసికంగా చలించటమనేది ఉండదు. శారీరకంగా రాగలనాలేదా అనేది నా ప్రస్తుత ఆరోగ్యానికి సంబంధించినది.

ప్ర: ఇంతసేపూ మిమ్మల్ని మేం ప్రశ్నలడిగాం- చివరగా మీరు మమ్మల్నేమయినా ఒక ప్రశ్న అడగండి?

శ్రీ శ్రీ: ప్రశ్నగా అడగను గానీ సలహా చెప్పేదేమిటంటే మీరు ఏ walk of life లో ఉన్నా గూడా విరసం ఉద్యమానికి తోడ్పడే విధంగా మాత్రం సంచరిస్తూ ఉండండి.

(విరసం సాహిత్య పాఠశాలలో పాల్గొనడానికి అక్టోబరు 11న శ్రీశ్రీ గుడివాడ వచ్చారు. 'సృజన' కోసం 'సాహితీ మిత్రులు' బెజవాడలో చేసిన ఇంటర్వ్యూ)

**(సృజన. నవంబరు 1981)**

# విప్లవ యుగం

ప్రశ్న: శ్రీశ్రీ మహాకవి అయితే కావచ్చు కానీ ప్రజాకవి కాదని కొందరు విప్లవకారుల అభిప్రాయం. మీ వ్యాఖ్య?

శ్రీశ్రీ ఏకీభవిస్తున్నాను. నేను అక్షరాస్యుల కవిని. చదువురాని వారి కవిని కాను. ప్రజాకవి కానివాడు మహాకవి కూడా కాలేదు. కవిత్వం వల్ల విప్లవం వస్తుందని నేననుకోను. రాజకీయ విప్లవానికి ముందు ఆలోచనా విప్లవం రావాలి. దానికి నా కవిత కొంత మెట్లువేసిందని అనుకొంటున్నాను. విప్లవానికి ఆహ్వానమిచ్చే కవిత నాది.

ప్ర· విరసం గత దశాబ్ద కాలంలో సాధించిన ప్రయోజనాలేమిటి?

శ్రీశ్రీ· 1970 నా షష్టిపూర్తి, విరసం ఆవిర్భావం జరిగాయి. ఇది కల్లోలిత దశాబ్దం. అందుకే నేను Burning decade (దందహ్యమాన దశాబ్దం) అంటున్నాను. విప్లవం అనుకున్నప్పుడల్లారాదు. వస్తే ఎవరూ ఆపలేరు. విరసం ఏర్పడటమే ఒక సాధింపు. సాధించవలసింది చాలా వుంది. విరసం నిర్మాణంలో సాహిత్య స్వరూపమే మారింది. సంస్కృతులు రెండు. బూర్జువా సంస్కృతి, శవ సంస్కృతి. కష్టజీవుల సంస్కృతి–సజీవ సంస్కృతి ఇది ఈనాటిది కాదు. పెద్దన, శ్రీనాథుడు వాళ్ల కాలంలో వారి కవిత్వం వారు రాసుకొంటున్నా పొలంలో కర్షకులు, పనిచేసే స్త్రీలు వారి పాటలు వాళ్లు పాడుకొంటూనే ఉన్నారు. అదే జానపద సాహిత్యం. బూర్జువా సంస్కృతిని నిరాకరించిన సజీవ సంస్కృతికి పట్టాభిషేకం చేయడమే ఒక ఘనవిజయం.

ప్ర: అభ్యుదయ కవిత్వానికి, విప్లవ కవిత్వానికి తేడా ఏమిటి?

శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం భారత కమ్యూనిస్టుపార్టీ కవిత్వం. విప్లవ కవిత్వం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) కవిత్వం. ప్రజల్లో భావ విప్లవం రావాలి. విప్లవకవులు దానికి గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు.

ప్ర· సమాజంలోని అట్టడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకుని వచ్చిన విప్లవ సాహిత్యం వారి దగ్గరకు వెళ్తుందా?

శ్రీశ్రీ. నేను ప్రజాకవిని కాను. నా కవిత్వం 70 శాతం ప్రజల దగ్గరకు వెళ్లడం లేదు. విప్లవ కవిత్వం వారి దగ్గరకు వెళ్లిందా అంటే అనుమానమే. వారి దగ్గరకు వెళ్లాలంటే జానపద కళారూపాలలో గద్దర్, వంగపండు ప్రసాదరావు లాగా రాయాలి. శ్రామిక సంస్కృతే సజీవ సంస్కృతి.

ప్ర: నిబద్ధత, నిమగ్నతల గురించి చెప్పండి?

శ్రీశ్రీ: నిమగ్నత చాలా గొప్పది. అందుకే సుబ్బారావు పాణిగ్రాహి మాకు ఆద్యుడు. నక్సల్‌బరీ పోరాటం ఇరవై సంవత్సరాల క్రితం వచ్చివుంటే నేను నిమగ్నుడినై వుండే వాడినేమో. కాని ఇప్పుడు ముసలివాడినై పోవడం వల్ల తుపాకీ పట్టుకోలేక కలంతోనే పోరాడుతున్నాను.

ప్ర: సినిమాల ద్వారా ఈ సమాజాన్ని బాగుచేసే అవకాశమేమయినా వుందా?

శ్రీశ్రీ: ప్రజల్ని నమ్ముకోవాలన్నాడు మావో. సినిమాల ద్వారా కూడా ప్రజల్లో మంచి మార్పు తీసుకురావచ్చు. కానీ ఈ సెన్సార్‌షిప్ పోవాలి. లాభాల కోసం హింస, సెక్స్ చూపిస్తే పాలకవర్గాలకు అభ్యంతరం లేదు. పాలకవర్గాలను కూలద్రోయాలంటే మాత్రం వూరుకోవు. సినిమా కొన్ని లక్షల ఖర్చుతో తయారయ్యేది. లక్షలు ఖర్చు పెట్టినవాడు మరిన్ని లక్షలు సంపాదించాలనుకొంటాడు. ఇదొక vicious circle. ఈ సర్కిల్‌లో విప్లవ చిత్రాలు రావాలంటే ఫిలిం సొసైటీలు పూనుకోవాలి.

ప్ర: ప్రేమ, నేటి వివాహ వ్యవస్థలపై మీ అభిప్రాయం?

శ్రీశ్రీ: ప్రేమ first casualty. పెళ్లి గురించి ఒక జోక్ జ్ఞాపకం వస్తుంది punch weekly కొత్తగా పెళ్లాడదల్చుకొన్న వారికి 'Don t అని సలహా ఇచ్చింది. నేనలా చెప్పదలచుకోలేదు. నేటి మన ప్రేమ, వివాహం ధనస్వామ్య వ్యవస్థ మీద ఆధారపడి వున్నాయి. ప్రేమ నిజమైనదైతే మృత్యువు కూడా దడుస్తుంది.

ప్ర: ఎంతోమంది కవులుండగా తిక్కన, వేమన, గురజాడలే కవిత్రయమని మీరు చెప్పడానికి కారణమేమిటి?

శ్రీశ్రీ: నా దృష్టిలో తిక్కన, వేమన, గురజాడలే కవిత్రయం. ఎందుకంటే వీళ్లు ప్రజల్ని ఉద్దేశించి ప్రజల కోసం కవిత్వం వ్రాసినవాళ్లు. వీరుకాక నాలో భావ చైతన్యాన్ని ఉద్దేశింపచేసినవాళ్లు మార్క్స్, లెనిన్, మావో. భారత ప్రజలు ఇంకా 16, 17 శతాబ్దాలలోనే వుంటున్నారు. 1930 దాకా వచ్చిన కవిత్వం చతుష్పాదం. కానీ 1930 నుండి వాడుక భాషలో రాయడం మొదలైంది. కాని ఇప్పుడు రాయవలసింది పాటకజనం యొక్క భాషలో, రచయితలు పాటకజనం యొక్క భాషను స్వీకరించాలి.

"విప్లవం యాడుందిరా
ఆడనే కూడుందిరా"

ప్రశ్న: చలానికీ మీకూ భావైక్యత ఉన్నదా?

శ్రీశ్రీ: విప్లవవాదిగా ఆ కాలంలో చలం రచనల వల్ల ప్రభావితుడనైనాను. నాకు ఉపకరించాయి. పూర్తిగా భావైక్యత లేకపోయినా ఆయన రచనలు, సాహిత్యంలో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడ్డాయి. అదే మా భావైక్యత.

ప్ర: చలం సాహిత్యం ఏ మాత్రమూ పనికిరాదని కొందరు మార్క్సిస్టుల వాదం-సరైనదా?

శ్రీశ్రీ: ఏ మాత్రమూ పనికిరాదన్న మాట మార్క్సిస్టులు అన్నా అది తప్పే అవుతుంది. చలం మార్క్సిజం చదువుకోలేదు. గురజాడ కూడా మార్క్సిజం చదువుకోలేదు. "కన్యాశుల్కం" సమాజ రుగ్మతలకు మందు. ఏ మాత్రమూ ఉపయోగపడలేదని అనలేము. అలాగే చలం ఆలోచనలు మార్పు తెచ్చాయి.

ప్ర· ఆలోచనల రీత్యా చలం, ప్రవర్తన రీత్యా శ్రీశ్రీ వివాదాస్పదమైన వ్యక్తులని ఒక అభిప్రాయం. మీ సమాధానం?

శ్రీశ్రీ: ఏకీభవించడానికి అభ్యంతరం లేదు. నేను అందరికీ నచ్చకపోవచ్చు.

ప్ర· శేషేంద్రశర్మ "కవిసేన" అభ్యుదయ శక్తులకు ఉపయోగపడేదేనా?

శ్రీశ్రీ· విశాఖపట్టణంలో కవిసేన శాఖ poster కవితలు, శేషేంద్రశర్మ కవిసేన కవితలు చూశాను. భావకవిత్వం మళ్లీ మొలకెత్తుతుందేమో అనిపిస్తుంది. ఎందుకనో వారిలో భావకవితాచ్ఛాయలు ఇంకా పోలేదు. సమాజాన్ని వెనక్కి నడుపుతుంది-కవిసేన. అభివృద్ధి నిరోధకమైనదే

ప్ర: ప్రయోగవాదం పేర నగ్నముని సాగిస్తున్న "విలోమ" రచనల మీద మీ అభిప్రాయం.?

శ్రీశ్రీ: ఆ రచనలేవీ నేను చదవలేదు. కనుక సమాధానం దాటవేస్తున్నాను.

ప్ర· మీరు రష్యా, చైనా దేశాల రెండిటా పర్యటించారు కదా! రెండు వ్యవస్థ పని తీరులో మీకు తేడా తోచిందా? ఆ తేడా ఏమిటి?

శ్రీశ్రీ: కడుపు నిండిన బేరం రష్యా-కడుపు మండిన బేరం చైనా. 1954లో ఒకసారి, 1967లో ఒకసారి రష్యా వెళ్లాను. 1954లో వెళ్లినప్పుడు లెనిన్ సమాధి పక్కనే స్టాలిన్ సమాధి వుంది. మిలటరీ దుస్తుల్లో నిద్రపోతున్నట్లే వుండటం నేను చూశాను. రివిజనిస్టు కృశ్చేవ్ ఆ తరువాత దానిని అక్కడ నుండి తీసేశాడు. రెండు శతాబ్దాలలో అమెరికా సాధించింది రష్యా 50 ఏళ్లలో సాధించింది. రోదసీ విజయం, మాస్కో అండర్‌గ్రౌండ్ ప్లానింగ్ ఇదంతా అభివృద్ధే ఇవాళ రష్యా తన పొరుగున ఉన్న దేశాలన్నింటినీ తనకు సామంత రాజ్యాలుగా చేసుకుంటూంది అందుకే మావో దాన్ని సోషల్ ఇంపీరియలిజం అన్నాడు. నేను చైనాలో

21 రోజులున్నాను. డెలిగేటుగా వెళ్లడం వల్ల వాళ్లు చూపించింది చూశాను. చైనాలో మంచి డిసిప్లిన్ కనిపించింది. ఒక విద్యార్థిని నీ జీవితం ఎందుకు అని అడిగితే "నా పొరుగువాడికి తోడ్పడడం కోసం, నా దేశాన్ని రక్షించడం కోసం, కమ్యూనిజాన్ని ప్రపంచవ్యాప్తం చేయడం కోసం అని చెప్పాడు."నేను విశాఖపట్టణంలో పుట్టాను." అనగానే మ్యాప్‌లో విశాఖపట్టణాన్ని గుర్తుపట్టాడు. అది విశాల దృక్పథం. చిన్నప్పటి నుంచీ అలవర్చాలి. అగ్గిపుల్ల దగ్గర నుంచి అణుబాంబుల దాకా ఏ దేశం మీద ఆధారపడకుండా వాళ్లు చేసుకొంటున్నారు. పరస్పర ఆరోపణలజోలికి పోదల్చుకోలేదు.

ప్ర: ఈ యుగకవిగా మీరు యువతరం రచయితలకు ఇచ్చే సందేశం?

శ్రీశ్రీ: సందేశాలిచ్చే అలవాటు లేదు. మీ నుండి నేర్చుకోవడమే నా సందేశం. యువతరాల విప్లవాల వేడి చల్లారకుండా జాగ్రత్తపడమని ప్రార్థిస్తున్నాను.

**(1979, నవంబర్ 25న 'సృజన' కోసం చేసిన ఇంటర్వ్యూ)**

# సాహిత్య సమస్యలు

ప్ర కళ కళకోసమా, కాసుకోసమా? ఏది మెరుగు?

శ్రీశ్రీ: గుడ్డిలో మెల్లగా మొదటిదే మేలు. అయినా ఇది మళ్లీ ముసుగు కప్పుకుని రంగప్రవేశం చేస్తోంది. దానిని రానివ్వకూడదు.

ప్ర కళ ప్రజల కోసమా? విప్లవం కోసమా?

శ్రీశ్రీ ఈ రెంటికీ వైరుధ్యం లేదు. విప్లవ సాధనకు కళ ఒక ఆయుధంగా ఉపయోగపడాలి. అప్పుడే అది ప్రజాకళ అవుతుంది. కళాకారుడు విప్లవ సాధన కోసం జరిగే మహోద్యమానికి తన కళను అంకితం చెయ్యాలి. అందుకోసమే దానిని వినియోగించాలి. అప్పుడే అది నిజమైన కళ అవుతుంది.

ప్ర: ఈ విషయాన్ని మీరు ఒక సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తిగా చెబుతున్నారా? మహాకవిగా ముచ్చటిస్తున్నారా?

శ్రీశ్రీ· కళాకారుడు, విప్లవకారుడు వేరువేరు కాదు ఇద్దరూ ఒక్కటే కల్లోలం పెరిగిన కొద్దీ దూరం తరిగిపోతోంది. ఇది ఈనాటి వాస్తవికత.

ప్ర· విప్లవం గురించి రాసినంత మాత్రాన అది కవిత్వం అవుతుంది?

శ్రీశ్రీ: నేను మహాప్రస్థానం రాస్తున్న రోజుల్లో "ఇది కవిత్వం కాదు, నినాదాలు మాత్రమే" అన్నారు ఇరవై సంవత్సరాల తర్వాత దానిని కవిత్వంగా అంగీకరించారు. ఇప్పుడు విప్లవ రచయితలు రాస్తున్నది కవిత్వమేనని పది సంవత్సరాల తరువాతయినా అంగీకరించక తప్పదు

ప్ర: రాజకీయ విప్లవం జోలికి పోకుండా కవితారంగంలో విప్లవం సాధించవచ్చా? గుంటూరు శేషేంద్రశర్మగారి కవిసేన మాటేమిటి?

శ్రీశ్రీ: అది అసంభవం. రాజకీయ విప్లవంతో సంబంధం లేకుండా కవితా విప్లవం ఉండదు. కళ కళకోసమే అన్న సనాతనవాది శేషేంద్రశర్మ. ఎంత నిప్పులు కురుస్తున్నట్టు రాసినా ఈ ఛాందస ధోరణి కనబడకుండా పోదు.

ప్ర: మంచి కవిత్వం రాయాలంటే మార్క్సిజం చదవాలా?

శ్రీశ్రీ: గురజాడ అప్పారావుగారు మార్క్సిజం చదువుకోలేదు. కాని ఆయన 'కన్యాశుల్కం'లో కనబడే సామాజిక పరిశీలన చాలా గొప్పది. మార్క్సిజం చదివినవాడికే అది సాధ్యమవుతుంది. గురజాడ శిక్షణద్వారా, అధ్యయనం ద్వారా మార్క్సిస్టు కాకపోవచ్చు. కాని ఆయనలో అలాంటి భావాలు వ్యక్తమయినాయి.

అలాగే నేను "మహాప్రస్థానం" రాసేనాటికి మార్క్సిజం చదవలేదు. అయితే మాయకోవస్కీలాంటి మార్క్సిస్టు రచయితల రచనలు, కవిత్వం చదివాను. అప్పుడు వీస్తున్న గాలి ప్రభావం ఉంది. మార్క్సిజం ప్రేరణ ఉంది.

ఏ వేదంబు పఠించె లూత ? భుజంగంబే శాస్త్రము ల్చూచె ? తా
నే విద్యాభ్యసనం బొనర్చెకరి ? చెంచే మంత్రమూహించె ? బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా ? కావు నీ పాదసం
సేవాసక్తియెకాక జంతుతతికిన్ శ్రీకాళమస్తీశ్వరా !

(ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో రాసిన పద్యమిది పాలీడు వేదం చదవలా. పాము శాస్త్రాలు చూడలా ఏనుగుకు ఏ విద్యా రాదు. చెంచుకు ఓనమాలు రావు. వీళ్లెవరూ ఏమీ చదువుకోకపోయినా కాళహస్తీశ్వరుడి పాదసేవ చేయడం వలన భక్తితత్వం ఏర్పడింది అని ఈ పద్యం తాత్పర్యం)

అలాగే ఏ వేదాలు చదవకపోయినా, ఏ జ్ఞానసంపద అంటకపోయినా భక్తితత్వం ఏర్పడింది. మార్క్సిస్టు సిద్ధాంతగ్రంథాలు చదవకపోయినా మార్క్సిజం ప్రభావం ఆనాడు ప్రపంచవ్యాప్తంగా పలురచయితల మీద ప్రబలంగా పనిచేసింది

ప్ర: మీరు విరసంలో సభ్యులా ? దాని ఆశయాలు, కృషి ఏమిటి ?

శ్రీశ్రీ: నేను విరసంలో సాధారణ సభ్యుడిని. ఎవరి బలవంతం కారణంగా కాకుండా స్వచ్ఛందంగానే నేనందులో కొనసాగుతున్నా.

సాహిత్యం సాంస్కృతిక సామాజిక ప్రయోజనాలకు దోహదం చేయగల్గిన సాహిత్య సంస్థ ఏదయినా ఉంటే అది విరసం ఒక్కటే.

బూర్జువా సంస్కృతికి వ్యతిరేకంగా శ్రామిక సంస్కృతిని నిలబెట్టడమే ఏ సాహిత్య సంస్థయినా చేయగల సత్కార్యం. విరసం దీనికి దోహదం చేస్తోంది.

ప్ర: పాటల రూపంలో వచ్చే కవిత్వమే ప్రజలకు త్వరగా అందుతుందంటున్నారు నిజమేనా ?

శ్రీశ్రీ· అవును కరెక్టు.

ప్ర: అయితే వచన కవిత్వం ఒదిలేసి మీరు పాటలు రాస్తారా ?

శ్రీశ్రీ: నేను పల్లె వాతావరణం తెలిసినవాణ్ణి కాను. పట్టణాల్లో పెరిగినవాణ్ణి. అందువల్ల జానపద పద్ధతిలో కవిత్వం రాయలేను. వంగపండు, గద్దర్ ఉత్తమ కవిత్వం రాస్తున్నారు.

ప్ర: మరి కవిగా మీ స్థానం ఏమిటి?

శ్రీశ్రీ: నేను కవిగా కంటే కవితా విమర్శకుడిగా ఎక్కువ పనిచేస్తాను.

ప్ర: భారతదేశంలో విప్లవం ఎలా వస్తుంది ?

శ్రీశ్రీ: చీపురుపుల్లలతో విప్లవం రాదు. ముందు పీపుల్సు రెడార్మీ ఏర్పడాల. "విప్లవానికి రక్తపాతం అక్కరలేదు. ఓట్ల ద్వారానే విప్లవం వస్తుంది" అన్న పార్టీ ఏదీ రివల్యూషనరీ పార్టీ కాబోదు. అయితే విప్లవశ్రేణుల ఐక్యత అవసరం. పరిస్థితులు పరిపక్వమైనపుడే మంచి నాయకత్వం వస్తుంది.

ప్ర: 2001 సంవత్సరానికి ముందే విప్లవం వస్తుందా?

శ్రీశ్రీ : నేను ఆశావాదిని. ఇంకా ముందే వస్తుందని అనుకొంటున్నాను. నా జీవితకాలంలో విప్లవాన్ని చూడాలని నా కోరిక.

ప్ర: చైనాలో ఏం చూశారో చెబుతారా?

శ్రీశ్రీ: చైనాలో మొత్తం గ్రామాలన్నిటికి విద్యుదీకరణ జరిగింది. గ్రామీణ అభివృద్ధికి అక్కడ జరుగుతున్న కృషి నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతయినా ఉంది. దున్నేవాడికి భూమి లభించినపుడే ఎక్కడయినా నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

(భారత-చైనా మిత్రమండలి వారి మహాసభలో పాల్గొందామని విజయవాడ వచ్చారు శ్రీశ్రీ. అది 1978 డిసెంబరు 30. పొద్దుకుంకుతోంది. ఒంట్లో బాగోక, చలికి వణుకుతూ దుప్పటి కప్పుకుని గదిలో పడుకున్నారు. సంధ్యాసమస్యల్లా సాహిత్య సమస్యలు. సమాధానాలు రాబడదామని వెళ్ళాం.)

**ఈనాడు**

**4-1-1979**

**(ఇంటర్వ్యూ ననుసరించి)**

# విప్లవతత్వం

ఈనాడేకారు, ఏనాడూ ఆయా కాలాలలో యథాతథస్థితిని మార్చి ముందుకు 'మార్చ్' అవడానికి బహుభంగుల ప్రయత్నాలు జరిగాయి. తెలుగు సాహిత్యంలోనేకాదు. అన్ని సాహిత్యాలలోను ఈ సంప్రదాయం, విప్లవ సంప్రదాయం అనూచానంగా వస్తున్న అక్షయకోశం అంటాడు మహాకవి శ్రీశ్రీ.

ఇందుకు ఆయన ఉదాహరణగా జానుతెనుగు రచన బసవపురాణం పేర్కొన్నారు. నేటికీ దానిని కాపాడుకొంటూనే ఉన్నామని, అలాగే తిక్కన రచనా విధానంలో తెచ్చిన మార్పున్నూ అని ఆయన అన్నారు.

ఈరోజు సాహితీ రంగంలో సాగుతున్న పోరాటం కూడా ప్రతిని నిరోధించే తప్పు ధోరణులకు వ్యతిరేకంగా చరిత్రలో ప్రారంభమైన పోరాటానికి కొనసాగింపు మాత్రమే. కొంచెం వెనుకకు తిరిగి చూస్తే ఈ సంప్రదాయానికి ఆది కాలములో తిక్కన, మధ్యకాలంలో వేమన ఆధునిక యుగంలో గురజాడలో నాయకత్వం వహించారని, వీరందరిని ఈసడించుకోవడానికి ఆయా కాలాలలో ప్రయత్నాలు జరిగాయని శ్రీశ్రీ అన్నారు.

ప్రస్తుతాన్ని ప్రస్తావించుతూ ఆయన ఇలా అన్నారు.

నేనిప్పుడు నక్సలైట్ కవిని. "నక్సలిజం" అనేది నూతన జీవన మార్గం. దీనినే జర్మన్ల పరిభాషలో కొత్త ప్రాపంచిక దృక్పథం అంటారు.

ఈ నా దేశంలో యథాతథస్థితికి కంచుకోటలుగా ఇంకా నిలబడిపోవాలని మాజీ రాజులు, పాత కాంగ్రెసు, జనసంఘ్ తదితర అభివృద్ధి నిరోధక శక్తులు శతథా ప్రయత్నిస్తున్నారు. వీళ్ళు భూతకాలం కోసం పోరాడుతున్నారు. నేను భవిష్యత్తు కోసం పోరాడుతున్నాను. నిజానికి సమాజంలో సమూలమైన మార్పులు ఎప్పుడు వస్తాయో చెప్పడానికి, "మేజర్ బార్బరా (నాటకం)లో అందర్‌షాఫ్ట్ పాత్ర ద్వారా బెర్నార్డ్‌షా చెప్పిన మాటలు చూడండి:-

"When you vote, you only change the names of the cabinet. When you shoot, you pull down governments inaugurate new epochs, aboish old orders and set up new."

ఓట్లు ద్వారా మీరు సాధించేది మంత్రి వర్గంలో మనుషుల పేర్ల మార్పిడి మాత్రమే, కాని తుపాకి పట్టుకున్నానంటే ప్రభుత్వాలనే దించివేసి, నూతన శకాలనే ఆవిష్కరింప చేయొచ్చు. పాత వ్యవస్థల్ని రద్దు చేయవచ్చు. నూతన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇది చారిత్రక సత్యం. ముందుకు సాగుతున్న చరిత్ర గతిని మార్చడం ఎవడితరమూ కాదు. అలా అడ్డుకోవాలని ప్రయత్నించిన చర్చిల్ దెబ్బతినిపోయాడు. అలాగే హిట్లరూ దెబ్బతిన్నాడు. కాని మార్పుకోసం కంకణం కట్టుకొన్న లెనిన్ జయం పొందాడు. నిజానికి రవి అస్తమించని సామ్రాజ్యం అనుకొన్న బ్రిటిష్ సామ్రాజ్యం అస్తమించిందికదా!

## రాజాజీ రాజనీతి

రాజాజీని గురించి మాట్లాడుతూ శ్రీశ్రీ ఇలా అన్నాడు:

భారతదేశ విభజనను కోరినవాడు రాజాజీ. కానీ అదే రాజాజీ మద్రాసు రాష్ట్ర విభజనను ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకిస్తూ రహస్య లేఖలు వ్రాశాడు. కుట్రపన్నాడు. అయినా ఇలాంటివాళ్లకు 'స్వేచ్ఛ' ఎప్పుడూ వుంటూనే వుంది. కాని నాదొక్క సూచన: ఏదో ఒక కారణం, ఏదో ఒక మిషచూపి(అనేక మంది ఇతరులను చేస్తున్నట్టు) ఎన్నో రోజులు అక్కర్లేదు. ఒక్క ఆరుగంటలపాటు రాజాజీని అరెస్టు చేయమనండి చూద్దాం: దేశ విషయాలు చాలా చక్కబడతాయి. కాని ఇది నేడు సాధ్యమా? కాదు."

'నక్సలిజం ఒక జీవన మార్గమా" అన్న ప్రశ్నకు శ్రీశ్రీ ఇలా సమాధానం చెప్పారు.

"అవును. ఎందుచేతనంటే అది యువరక్తంతో వున్న సజీవశక్తి. దానికి భవిష్యత్తులో నమ్మకం వుంది. ఈనాటి రొడ్డుకొట్టుడు విద్యాపద్ధతులలో దానికి విశ్వాసం లేదు."

## విఫలమైన విప్లవాలు

శ్రీకాకుళం పోరాటం గురించి ప్రస్తావించి, "ఆ పోరాటం విఫలమైందిగా మీరు భావించడం లేదా" అంటే శ్రీశ్రీ సమాధానం.

'విప్లవాలు విఫలం కావటం, జయం పొందడం ఎప్పుడూ వుంటుంది. కాని యథాతథ స్థితిని కాపాడే ప్రభుత్వ వ్యవస్థ దారుణ దమనకాండను ఎప్పుడూ వినియోగిస్తూనే వుంటుంది. అన్ని సాధనాలూ ప్రభుత్వం చేతులలో వుంటాయి. కాని ప్రజలకు సాధారణ ఆయుధాలే శ్రీరామరక్ష. ఒక్కో సందర్భంలో, ఇండోనేషియాలో లాగా తాత్కాలికంగా ప్రభుత్వాలు జయం పొందినట్టు, లక్షలాది మందిని హత్య చేసినట్టు కనిపించవచ్చు. కాని భవిష్యత్తుపై విశ్వాసం, నిషా వున్న యువతరానిదే. జనతదే అంతిమ విజయం.

ఇదే రేయి గడిచి పగలు రావడం లాంటిది. ఇందుకు ఎక్కడో ఒకచోట ప్రారంభం జరగాలికదా. రవ్వతోనే దావానలం వ్యాపించేది. చీకటి తొలిగేది.

కమ్యూనిజం రాక తప్పదు. అది మానవాళికి సుప్రభాతం.

అయితే ఆ "సుప్రభాతం" దర్శించడానికి ఎంత మూల్యం చెల్లించాల్సి వుంటుంది అని ప్రశ్నించగా శ్రీశ్రీ ఇలా సమాధానం ఇచ్చారు. ఎంత మూల్యం చెల్లించకుండా మనం స్వాతంత్ర్యం సాధించాం? ఎంత మూల్యం చెల్లించకుండా చైనా, తదితర ఆసియా దేశాలు, అల్జీరియా, క్యూబాలు స్వాతంత్ర్యం, స్వేచ్ఛ పొందాయి? మనప్రజలు రక్తం చిందించకుండానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా? రక్త తర్పణ లేకుండా స్వేచ్ఛ రాదు. నిలవదు. ఇందుకు మార్గం లేదు.

బహుశా ఇందుకు సరైన పద్ధతి–బూజుపట్టిన వృద్ధ రాజకీయ నాయకులనే త్యాగం చేయడం మంచిదేమో! 70 ఏండ్ల పైబడ్డ వాళ్లను అరెస్టు చేసి, నోళ్లుమూసుకోమని చెప్పాలి. యథాస్థితికి కంచుకోటలుగా, ప్రజల పాలిట మత్తుమందుగా నిలబడి వున్న గుళ్లను, మసీదులను, చర్చిలను కట్టిపెట్టాలి. వాటి వ్యాపారాలు నిలచిపోవాలి.

సమాజాభివృద్ధికి అవసరమైన ఉత్పత్తి పెరగాలి. సృజనాత్మక శక్తులను ఉద్దీపింపచేసి కళాశాలలూ, కర్మాగారాలు, క్షేత్రాలు సమాజపరం కావాలి.

విప్లవాలకు, తిరుగుబాట్లకు ఇది అననుకూలం, అనుకూలం అంటూ గిరిగీసిన కాలం వుండదు. ఒక పాత్రను తీసుకుపోయి సెగపైన వుంచండి. అందులో నీరు బాగా మరిగి మరిగి బాయిలింగ్ పాయింట్‌కు చేరుకునే ముందు బుడగలు మూతను తోసుకుని, నెట్టుకుంటూ పైకి రావడానికి ప్రయత్నిస్తాయి.

అలాగే చరిత్ర కూడా. చరిత్ర సలసల మరిగే భాండం– "సిమ్మరింగ్ పాట్" విప్లవం చారిత్రక సూత్రం. ఒక్కొక్కప్పుడు ఒక్కో సంప్రదాయం మంచిదిగా కనిపించవచ్చు. కాని అదే పవిత్రం మాత్రం కాజాలదు. దాన్ని అవసరం వచ్చినపుడు తగు విధంగా మార్చివేయవలసి వుంటుంది. శాశ్వత సూత్రాలంటూ లేవు. ఎంతో ఉత్తమమైనదని అనుకొనే రాజ్యాంగ చట్టాన్ని కూడా మెరుగుపరుచుకోవచ్చు.

గాంధీకి దైవమే సత్యం. కాని నా దృష్టిలో సత్యమే దైవం. దైవాన్ని అడ్డుపెట్టుకొని అసత్యాన్ని సత్యంగా చూపకూడదు.

నాకు బూర్జువా సంస్కృతి గిట్టదు. అలాగే షా చెప్పిన మధ్య తరగతి మొరాల్టీ నాకు నచ్చదు. తేనె పూత నాలుకల కాపట్యమూ కిట్టదు. దేశంలో జానపద సంస్కృతి ఎంతో వుంది. అమాయకపు జనాల అనుభవాల నుంచి ఉట్టిపడిన సంస్కృతి అది. దానిలో వున్న అపార శక్తిని త్రవ్వితలకెత్తుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. అందుకే అంటాను – "జాతికి జీవన నాళిక, జానపద గీతిక" అని. నిజమైన సంస్కృతి అది.

భవిష్యత్తు కష్టజీవులది. ఈ భూమికి వారసులూ, అధినేతలూ వారే. వాళ్లే రేపటి శాస్త్రవేత్తలూ, కవులుగా అవతరిస్తారు.

విశ్వరహస్యాలను మరింత ఛేదించి విప్పిచెప్పడంలో వీరికి ఈ నేల తల్లే ప్రయోగ కేంద్రం. శ్రమజీవులంతా ఏకం కావాలి. మానవుడే తన భూమికి నిర్దేత.

మన మహర్షులు కూడా అన్నారు కదా! "గడిచిన దానికి వగవకు" చిందిన పాలకోసం ఏడవకు అని.

సమానత్వం, మనుషులు సమానమైనపుడు వస్తుంది. మనుషులకు ప్రధాన సాధనం భాష, అందులో అనేక రకాల మాటలు వాడుతా. హరిజనులను ఎలా చూస్తున్నారో అలాగే నేడు భాష విషయంలో కూడా "అస్పృశ్యత" పాటించేవాళ్లు తయారైనారు.

"సరసిజాననముద్ది సైకతంబగున్" అని వెనకటి కవి అంటే ఆనందించగల వాళ్లే ఈ సరికొత్త "అస్పృశ్యతా" వాదులు. ఆ మాటకొస్తే 'చెవి'ని కూడా రచనలో వాడొద్దన్నాడు అప్పటి కవి.

ఆధునిక కవులు వాడే అన్ని మాటలను నేను ఆమోదించాను. ముఖ్యంగా దిగంబర కవుల భాషను నిజానికి రచన నుంచి మాటలను వేరు చేసి చూస్తే అవి నీర్జవమైనవి. సృజన శక్తిగల రచయిత మాత్రమే మాటలకు తగిన ప్రయోగస్థానాన్ని, సంగతి సందర్భాన్ని చూసుకుంటాడు. "సరైన పద్ధతిలో అమర్చిన సరైన మాటలే కవిత్వం" అన్నాడు కోల్రిడ్జ్ ("poetry is best words in the best order")

కొన్ని మాటలు మంచి, కొన్ని చెడు అని విభజించుకుంటూ పోతే చివరకు నీకు మంచి మాట అనేది దొరక్కుండా పోతుంది. ఏది మంచి? ఒక్క సృజనశక్తి గలవాడే అది నిర్ణయించుకోగల్గుతాడు. కవి అన్నవాడు రాజకీయ వేత్తమీద "స్కోర్" చేసేది కూడా ఇక్కడే. కవులు ప్రపంచానికి పేరు పెట్టని శాసనకర్తలు అన్నందుకే.

చివరికి కాళిదాసుని కూడా అశ్లీలతల పేరుతో ఆ కాలంలో విమర్శించిన వాళ్లున్నారు. నేడా విమర్శను మనం అంగీకరించగలమా?

నవరసాలలో జుగుప్స కూడా ఒకటి. ఇతర వాటికి మాదిరే దీనికి ఒక స్థాయీ భావం వుంది. దోపిడీ వ్యవస్థలపై ఏహ్యతను, భయానక దృశ్యాన్ని కల్పించి, చూపించడం నేటి కవికి అవసరం.

దిగంబరులు చేసిన పని కూడా ఇదే. నిష్పాక్షిక విమర్శ అంటూ ఏదీ ప్రత్యేకించి వుండదు. నీకు తెలియకుండా కూడా నీవు ఎటో ఒక పక్షంవైపు మాట్లాడుతూనే వుంటావన్న సంగతి మరచిపోకూడదు.

నేటి యువతరాన్ని, రచయితలను ప్రయోజనాత్మక సాహిత్య సృష్టికి మళ్లించాలి. కాల్పనికత, కట్టుకథలపై మోజు తగ్గిపోవాలి. హేతువాదం, వాస్తవికత కవిత్వంలో, కథలలో చోటుచేసుకోవాలి. నిర్దిష్ట లక్ష్యం, అది సమాజాన్ని ముందుకు నడిపించగల, సమూలమైన మార్పులు తీసుకురాగల ధోరణి, భావం, తత్వం రచయితకు అవసరం. అందుకే నేడు మనకు "కమిటెడ్ రైటర్స్" కావాలి. Involvement should be the order of the day. అలాంటివారికి అండగా నేనెల్లప్పుడూ వుంటాను.

కొందరు నన్ను "నక్సలైట్" అంటున్నారు. నేను ఆ పేరుకు తగను. అయితే నేను నక్సలైట్ కవిని. నక్సలైట్ అనేవాడు, తాను గాఢంగా విశ్వసించిన ఒక లక్ష్యానికి సాయుధుడై తన జీవితాన్నే అర్పించగల మహోవ్యక్తి. కాగా నక్సలైట్ కవి తాను విశ్వసించిన వాటిని ఎలుగెత్తిచాటి, గానం చేయగలవాడు. కవి కూడా అన్యాయంపైన, అమాయకత్వంపైన, అసమానతలపైన పోరాడేవాడే.

**(జ్వాల, 23-7-1971)**

# విప్లవ సాధన

"శ్రీశ్రీ ఖాళీగా ఉన్నారు. వచ్చి మాట్లాడతారా?" అని సోమవారం నాడు శ్రీశ్రీ మిత్రుడొకాయన ఫోన్ చేశారు. మహాకవితో పిచ్చాపాటి మాట్లాడే అవకాశం వస్తే ఎవరు వదులుకుంటారు? "ఈనాడు" నుంచి ఇద్దరు జర్నలిస్టులు శ్రీశ్రీ దగ్గర కెళ్లారు...గదిలో శ్రీశ్రీ తప్ప ఎవరూ లేరు. గదినిండా నిశ్శబ్దం.

మధ్యాహ్నం ఒకటిన్నర.

లోపలికెళ్లాం, కూర్చోగానే "వూ...యేవిటీ...అని కళ్లజోడులోంచి మా కళ్లలోకి చూస్తూ ప్రశ్నల వర్షానికి సిద్ధమయ్యారాయన. వినోబా గురించి మొదలెడుదామని ఆయనే అని "వినోబా భావే పొట్టి శ్రీరాములంత కీర్తిశేషుడు కావాలని ఆశిస్తున్నా"దని నిర్దాక్షిణ్యంగా అన్నారు.

మార్క్సిస్టు కమిట్‌మెంట్ వుండడం వల్ల కొంతమంది ప్రముఖ రచయితలు రచనలు సాగించలేకపోతున్నారని ఒక "ఫిర్యాదు" వచ్చింది. దాని గురించి ఏమంటారు? అనడిగితే "యేదో ఒకరకమైన కమిట్‌మెంట్ లేకపోతే రచయిత ఎలా రాస్తాడు? తెలిసిగానీ, తెలియకుండాగానీ ప్రతి రచయితకీ యెప్పుడూ కమిట్‌మెంట్ వుంటుంది. మార్క్సిస్టు కమిట్‌మెంట్ వున్న రచయితకీ దానికి తాము కట్టుబడి వున్నామని తెలుసు" అని శ్రీశ్రీ చెప్పారు. ఇప్పుడున్న సాహిత్య సంఘాల గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని ప్రశ్నించినపుడు, మంచం మీద పడుకుని మాట్లాడుతున్న ఆయన కాస్త పక్కకు ఒత్తిగిలి, "సినిమా తారల అభిమాన సంఘాల లాంటివి" అన్నారు. మరి విప్లవ రచయితల సంఘం మాటేమిటి? అనడిగితే, అది నేటి సాహిత్యానికి మార్గదర్శి అని సిగరెట్ పొగలోకి చూస్తూ చెప్పారు.

"విరసం పుట్టి దాదాపు పదేళ్లవుతోంది గదా, సాధించిందేమిటి?"

శవ సంస్కృతిని నిరాకరించి, సజీవ సంస్కృతిని ప్రవేశపెట్టింది. ఈ సజీవ సంస్కృతికి వంగపండు ప్రసాదరావు, చెరబండ రాజు ప్రతినిధులని ఆయన చెప్పారు. "ఇప్పుడు విరసం చురుగ్గా పనిచేయడం లేదేం?" అంటే "ఆటుపోటులుంటాయి గదా" అని సరిపుచ్చారు.

విరసం వల్ల ప్రయోజనం అలా వుంచి విరసంలో అంతరంగిక విభేదాలూ మొదలైన వాటి వల్ల హాని జరిగింది కదా అని అడిగినపుడు ఆయన కొంత ఇబ్బంది పడ్డారు. "కొంతమంది సాహిత్యవేత్తలకు హాని కలిగింది" అంటూ సగం ఒప్పుకున్నారు. విరసం సాధించిన ప్రయోజనాలతో పోలిస్తే హాని లెక్కలో రాదన్నారు. నాస్తికత్వాన్ని సమాజాల ద్వారా ప్రచారం చేయడం ఒకరకంగా సంస్కరణ వాదమే కదా, కమ్యూనిస్టు అయిన మీకు ఆ సమాజంలో శాశ్వత సభ్యత్వం ఏమిటి? అనడిగినపుడు "నాస్తికత్వమూ విప్లవమే కదా. రాజకీయాలు కనబడకుండా వుండడానికి కొందరు నాస్తికత్వాన్ని ప్రచారం చేస్తారు. కమ్యూనిజం వస్తేనే నాస్తికత్వం వస్తుంది." అని చెప్పారు. కాసేపు మౌనం. "అంతరాళ....భయంకర ప్రాంతాలనా నీ విహారం"....మంచినీళ్లు తాగి ఇటు చూశారు.

ప్రశ్న: కారల్ మార్క్సుగానీ, లెనిన్‌గానీ నాస్తికత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎక్కడన్నా చెప్పారా? "కెరలించకు శాంతి తరంగాలను" అన్నట్లు చుట్టూ అల్మరాల్లో మౌనంగా వున్న పుస్తకాలవంక చూస్తూ "మార్క్సు, లెనిన్‌లు మానవత్వాన్ని ప్రచారం చేశారు. అంటే దైవత్వాన్ని నిరసించారనేగా" శ్రీశ్రీ జవాబు.

మనదేశంలో కమ్యూనిజం వస్తుందంటారా? అన్నప్పుడు, ఆయన 'ప్రవక్తలా నవ్వేరు.' పెదవులమీద ఆ సన్నని చిరునవ్వు చటుక్కు మాయమైంది. సిగరెట్టు వెలిగించి గట్టిగా దమ్ములాగారు. ఏదో "నక్షత్రాంతర్నిబిడ నిఖిలగానాన్ని" అన్నట్లు ఆలోచనల్లోంచి తేరుకుని, 'కమ్యూనిజం ప్రపంచమంతటా వస్తుంది' అని ప్రకటించారు. 'అయితే మనకి కొంచెం ఆలస్యంగా రావచ్చు. దీనికి ఆస్తికులూ, ఆస్తిగలవాళ్లూ యెన్నో ఆటంకాలు కల్పిస్తారు. అయినా నేను ఆశావాదిని. నా జీవిత కాలంలోనే కమ్యూనిజాన్ని చూస్తానని అనుకుంటున్నా' అన్నారు. యెవడు బతికాడు మూడు యాభయిలు అంటే, 'నేను రెండు యాభయిలు బతికినా చాలు' అని గుండె నిండిన విశ్వాసంతో చెప్పాడు. అంతలో నక్సలైట్లు 'రంగప్రవేశం' చేశారు. 'నక్సలైట్లు నిద్రపోలేదు. వాళ్లు అండర్ గ్రౌండ్‌లో రెడార్మీ (ఎర్ర సేన)ని తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మనకి ప్రజాఎర్రసేన వుండాలి. వాళ్లే తెలుగుదేశానికి నిజమైన స్వాతంత్ర్యాన్ని సంపాదిస్తారు" అంటూ 'శ్రామిక సంస్కృతి'ని నెలకొల్పాలని అన్నారు. బ్యాలెట్‌తో క్యాబినెట్ మంత్రులపేర్లూ, చిరునామాలూ మాత్రమే మారుతాయని బెర్నార్డ్ షా చెప్పినదాన్ని శ్రీశ్రీ గుర్తు చేశారు. దేశంలోని వివిధ నక్సలైట్ గ్రూపులు కలిసే అవకాశం వుందా. అంటే "దేశంలో అంతర్యుద్ధం కావాలి, అప్పుడే ఈ గ్రూపులు కలుస్తాయి. పోరాటమే వీళ్లని కలుపుతుంది." అన్నారు. "బెంగాల్ ఈ రోజు ఏం ఆలోచిస్తుందో ఇండియా రేపు అదే ఆలోచిస్తుంది అనేవారు ఒకప్పుడు. అలాగే నేడు చైనా యేం ఆలోచిస్తుందో రేపు ప్రపంచం అదే ఆలోచిస్తుంది" అని శ్రీశ్రీ ధృఢంగా చెప్పారు. మావో భావాలకు కట్టుబడి వున్నంతకాలం చైనా తప్పుచేయనేరదు అన్నారు. చైనా మావో భావాలకు తిలోదకాలిచ్చి పెడమార్గం పట్టినప్పుడు మీరు వ్యతిరేకిస్తారా? కొన్ని సెకన్లు ఎటో చూస్తూ వుండిపోయారు. ఆయనకు ఏయే ఘోషలు, భాషలు, దృశ్యాలు తోచాయో...ఏయే చిత్ర విచిత్ర శ్యమంత రోచిర్నివహం చూశారో...."వ్యతిరేకిస్తాను" అని

నిక్కచ్చిగా చెప్పారు. యెప్పుడూ "చైనా"లు వుంటూనే వుంటాయి. రేపు ఆఫ్రికాలోనో మరో చోటనో చైనాలు వుద్భవించవచ్చు అన్నారు. "జాతీయత" వల్లే వియత్నాం చైనాల మధ్య యుద్ధం జరిగింది. ఆ రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీలకు విభేదాలు లేవు. అసలు కమ్యూనిస్టు దేశాల మధ్య సరిహద్దులు వుండకూడదు. అది 22వ దశాబ్దంలో సాధ్యమౌతుందేమో...అంటూ కళ్లజోడు సవరించుకుని అలా చూస్తూ ఉండిపోయారు. స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం సౌహార్ధం పునాదులై ఇళ్లు లేని జనావళికి శుభం పూచే రోజు ఆ చూపుల్లో ఘనీభవించి పోయింది.

పాతపదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు కవిత్వంలోవీ, జీవితంలోవీ ఇంకా మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టి ధ్వంసం చేసి రోడ్డు వేసి పదండి ముందుకు అన్న శ్రీశ్రీ – నేడు వ్యావహారిక వ్యావహారికాన్ని' మరింత ముందుకు తీసుకెళ్లడానికి చిన్నప్పటినుంచి మాతృభాషలోనే చదువు చెప్పాలి. పిల్లలకి వ్యావహారికమే సులభంగా బోధపడుతుంది. అనేక ప్రయోజనాలున్నందువల్ల మన లిపిని సంస్కరించాలి. ఇది తక్షణం చేయాల్సిన పని. ప్రతి వ్యక్తీ మాతృభాష కాక ఇంగ్లీషు నేర్చుకోవాలని చెప్పారు. "సోవియట్, చైనాల మధ్య విభేదాలువున్నంతకాలం రెండు కమ్యూనిస్టు పార్టీలూ సమైక్యం కాలేవు. మార్క్సిస్టు పార్టీ ఎర్రరంగు పూసుకున్న కమ్యూనిస్టు పార్టీ. భారత కమ్యూనిస్టు పార్టీ తెల్ల కమ్యూనిస్టు పార్టీ. వ్యాపారదక్షత గల పార్టీ కూడా అని శ్రీశ్రీ అన్నారు. రెండు కమ్యూనిస్టు పార్టీలూ సమైక్యంగా పోరాటాలు జరిపితే హర్షిస్తారా అని అడిగితే "తప్పకుండా"అన్నారు.

కొత్తగా ఏర్పడనున్న విజయనగరం జిల్లాకి 'గురజాడ జిల్లా' అని పేరు పెట్టాలని చాలామంది అంటున్నారు. మీరేంటారు? అనడిగితే 'యస్' అంటాను. అని ఠక్కున చెప్పారు. 'నిజమైన విజయనగరం హంపీ విజయనగరం-కర్నాటకలో మరో విజయనగరం వుంది. అందువల్ల కొత్త జిల్లాకి 'గురజాడ జిల్లా' అని పేరు పెట్టడమే బాగుంటుంది అని శ్రీశ్రీ అన్నారు.

గురజాడ అత్యంత తేలికైన మాటలతో సాధారణమైన పదాలతో రాస్తే, శ్రీశ్రీ క్లిష్టసమాస భూయిష్టమైన కవిత్వం రాశారు. అందువల్ల శ్రీశ్రీ గురజాడకు నిజమైన వారసుడు కాదంటున్నారు. మీరేం చెబుతారు అనడిగితే "నిజంగా జానపద సాహిత్యం ఇచ్చిన ఉత్తేజంతో గురజాడ రచనలు చేశారు. నాది ఎక్కువగా పట్టణపు జీవితం అవడం మూలాన ఆ బాటలో సూటిగా నడవలేకపోయాను" అని చెప్పారు.

గుంటూరు శేషేంద్రశర్మ క్లాసికల్ ట్రైనింగ్ ఎక్కువ వున్నవాడు. విశ్వనాథకంటే ఆయనే సంస్కృతం ఎక్కువ చదువుకున్నాడని నేననుకుంటాను. శేషెన్ "మండేసూర్యుడు" విప్లవ భావాలకి సుముకంగా వుంది. ఈ వ్యవస్థ మారాలనీ, కమ్యూనిజం దిశగా పయనించాలనీ, కోరే వ్యక్తి శేషేన్. అయితే ఆయన నిజమైన విప్లవకారుడు కాదు అన్నారు

శ్రీశ్రీ. శేషేన్ గురించి మీరేమనుకుంటున్నారో కచ్చితంగా చెప్పండని అడిగితే "గోడమీద కోకిల" అన్నారు.

"ఇంకా ఏమిటి?" "హంసతో ఆర్నెల్లు" అనే నవల రాద్దామనుకుంటున్నాను. దానికి ఇతివృత్తం ఏమిటి?" "ఆ టైటిల్ ఆధారంగా రాస్తాను ఏమిటి రాస్తానో నాకే తెలీదు..." అన్నారాయన. మళ్లీ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఇక లేద్దాం నాకు ట్రెయినుకీ టైమైంది అన్నారు. మొయిల్దారిన బయల్దేరిన జగన్నాథుని రథచక్రాల్ ఆయన్ని పిలిచాయి.

సెలవంటూ మమ్మల్ని వదలి
తలవంచుకు వెళ్లిపోయారు శ్రీశ్రీ
చిరునవ్వులనే పరిషేచన చేస్తూ...

**(ఈనాడు 1-5-1979)**

# నాస్తికత్వం

సూర్యనారాయణ : భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభించి 60 ఏళ్ళు కావస్తున్నాయి. మార్క్సు చెప్పినదాని ప్రకారం ఏ దేశంలోనైనా వర్గ పోరాటం విజయానికి 50 ఏళ్లు గడిస్తేచాలు. కాని మన దేశంలో ఇంతకాలం గడిచినా ఉద్యమం ఇంకా బలహీన పడిపోయినదెందుకు?

శ్రీశ్రీ : మన దేశంలో విప్లవం కొంచెం ఆలస్యంగా రావచ్చు. ఎందువల్లనంటే మనం ఇండియానంతా ఒక దేశం అంటున్నాం. కాని నిజానికది 56 దేశాలు (చప్పన్నారు దేశాలు) గల ఉపఖండం. అలా అనటమే మంచిది. చిన్న చిన్న దేశాల్లో విప్లవం వచ్చినట్లుగా ఈ ఉపఖండంలో రాకపోవచ్చు. ఇండియాలో విప్లవం ఎట్లా వస్తుందనేది ఆయా ప్రాంతాల వేడిని బట్టి వుంటుంది. అంతేగాని మొత్తం దేశమతాల విప్లవం వస్తుందంటే ఎట్లా? బంగ్లాదేశ్ ఎలా వేరై పోయిందో అలాగే మన దేశం కూడా ముక్కచెక్కలవుతుంది. చక్కగా ఏ భాష వాళ్లు ఆ భాషా రాష్ట్రాన్ని స్థాపించుకొన్నప్పుడు విప్లవం వస్తుంది. ఆ రాష్ట్రాలే దేశాలవుతాయి.

సూర్య: ఐక్యం కాకపోవడానికి కారణమేమంటారు?

శ్రీశ్రీ: ఐక్యమని మనమనుకుంటాం తప్ప ఎలా ఐక్యమవుతుంది? ఎవరైనా బలవంతంగా ఐక్యాన్ని రుద్దలేరు గదా ?

సూర్య: ఏ పార్టీ అయినా అందుకు పాటుపడుతోందా మీ దృష్టిలో ?

శ్రీశ్రీ: ప్రపంచమంతటా సామ్యవాదం వచ్చినపుడు ప్రపంచమే ఐక్యమవుతుంది. ఈ లోగా మనం ఏ ప్రాంతం వాళ్ళు ఆ ప్రాంతంలో పోరాటం సాగిస్తూ వుండాలి.

సూర్య : భావ విప్లవం రాకుండా వర్గపోరాటాలు విజయవంతమవుతాయా?

శ్రీశ్రీ : ఎంత మాత్రమూ కావు. సామాజిక విప్లవం రావటానికి ముందు సమాజం తాలూకా మనసు మారాలి. ఆ మనసులో ఇపుడు బూజుపట్టిన భావాలెన్నో వున్నాయి. పోరాడుతూ, ఆ బూజుని తొలగించి నూతన భావాలు ప్రవేశపెట్టాలి. అది భావ విప్లవం.

సూర్య : గత వెయ్యేళ్లలో అటువంటి ఉద్యమాలు రాకపోవడానికి కారణమేమిటి?

శ్రీశ్రీ : ఎందుకు రావటం లేదు. వస్తున్నాయి. వెయ్యేళ్ల క్రిందట శంకరాచార్యులుగాని మరొకరుగాని కొద్దిగా మార్పులు తెచ్చిన వారున్నారు.

సూర్య : మనం వెనుకబడి ఉంటానికి కారణం ఏమిటి?

శ్రీశ్రీ : ఎందరో శాస్త్రజ్ఞుల కృషివల్ల కొంతగానైనా నాగరికత అలవడి కొన్ని పాత భావాలు నశించాయి. ఈ శాస్త్ర వైజ్ఞానికాభివృద్ధిని ఏవో కొన్ని పట్టణాలలో, నగరాలలోనూ ఉపయోగిస్తున్నారు తప్ప జన సామాన్యానికి అందటం లేదు. ఎన్నో గ్రామాలకు విద్యుచ్ఛక్తి లేదు. నీటి పారుదల, రోడ్డు సౌకర్యాలు లేవు. ఇవన్నీ లేకపోవటం వల్ల కూడా మనం కొంత వెనకబడిపోయాం.

సూర్య : కులం కార్మిక కర్షక వర్గాల్ని చీలుస్తుందన్నది నగ్న సత్యం. మరి కుల నిర్మూలనోద్యమాల్ని సంఘసంస్కరణ అంటూ అంత తేలికగా కొట్టి పారేస్తున్నారు గదా కొందరు కమ్యూనిస్టులు ?

శ్రీశ్రీ : ఎందుకు కొట్టి పారవేయాలి? కులాంతర వివాహాలు జరగాలి. కుల నిర్మూలన జరగాలి అని కమ్యూనిస్టులు ఒప్పుకొంటున్నారు గదా?

సూర్య: ఒప్పుకొంటున్నారు. కాని కుల నిర్మూలనోద్యమం ఉత్త సంస్కరణోద్యమని తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు గదా ?

శ్రీశ్రీ : కందుకూరి వీరేశలింగం విప్లవం తీసుకురాలేదు. ఆయన తెచ్చినది సంఘ సంస్కరణే. దాని వలన సమాజం బాగుపడిందని ఒప్పుకోవాలి కదా! కుల నిర్మూలన అనేది ఒక సంస్కరణే అనుకోవచ్చు. కాని అది అత్యంతావశ్యకమైనదీ దేశంలో.

సూర్య : కుల నిర్మూలనకు మీ సలహా ఏమిటి?

శ్రీశ్రీ : కులాంతర వివాహాలు జరగాలి. పేర్ల చివర రెడ్డి, చౌదరి, నాయుడు, పంతులు వంటి కుల సూచకాలు తీసివేయాలి.

సూర్య : నాస్తికత్వం గురించి మీ అభిప్రాయం – నిర్వచనం ఏమిటి?

శ్రీశ్రీ : నాస్తికత్వమన్నది బానిస మనస్తత్వాన్ని నిర్మూలించేది. ఏ విధంగానైనా సరే బానిసలుగా వుండటం బానిస మనస్తత్వం అవుతుంది. నాస్తికత్వమంటే మనిషిలో స్వతంత్ర్య భావాల్ని పెంపొందించటం. తర్వాత అదే ఇతరుల మీద ఆధారపడటమన్నది. పోయి స్వశక్తి మీద ఆధారపడే విధంగా తోడ్పడుతుంది.

సూర్య : నాస్తికోద్యమం ఎలా సాగాలని మీ అభిప్రాయం ?

శ్రీశ్రీ : నాస్తికత్వం కూడా సాహిత్యంతో, ప్రచారం ద్వారా, ఉపన్యాసాల ద్వారా మిగతా అన్ని ఉద్యమాలలాగానే సాగాలి.

సూర్య : మార్క్సిస్టులకు నాస్తికత్వమన్నా నాస్తికోద్యమం అన్నా చిన్న చూపు ఉండటం తప్పుకాదంటారా ?

శ్రీశ్రీ : యజ్ఞాల వల్ల కమ్యూనిజం వస్తుందని వీరనుకుంటున్నారా ? వాళ్లు నాస్తికులో, ఆస్తికులో అడగండి. మీకు నాస్తికత్వం అక్కర లేదంటే, ఏ బాబానో, ఏసుక్రీస్తునో, మహమ్మదునో, వెంకటేశ్వర స్వామినో ఆరాధిస్తుంటే మీరు మార్క్సిస్టులు ఎలా అయ్యారు ? అని ప్రశ్నించండి. నాస్తికోద్యమమంటే చిన్న చూపు చూస్తున్నారు. నిజమే. మీరు ఎలా మార్క్సిస్టులు అయ్యారు ? అని అడగండి.

సూర్య : ఈ దోపిడీ పోతే మతం పోతుందంటారు కమ్యూనిస్టులు ? దోపిడీ పోతే మతం పోతుందా?

శ్రీశ్రీ : నాస్తికులు మతంపోతే దోపిడీ పోతుందంటారు. ఏది ముందు ఏది తర్వాత అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

సూర్య : మన అనుభవం వుంది కదా ! రష్యా, పోలెండు, చైనా లాంటి దేశాల్లో కూడా మతం రాను రాను బలపడుతోంది. కార్మికులు సమ్మెచేస్తే పోప్ జోక్యం లేకుండా ఆ సమ్మె విరమణ జరగలేదు కదా పోలెండ్‌లో ?

శ్రీశ్రీ : కాబట్టి మొదట మతాన్ని నిర్మూలించాలి. నాస్తికుల దృక్పథము కూడా రైటే. మతవిభేదాల వల్లనే బాధలెన్నో వస్తున్నాయి. మతం లేకుంటే దోపిడీ కూడా వుండదు.

సూర్య : మీరు వీలునామా ఏదో వ్రాసారని తెలిసింది.

శ్రీశ్రీ : విశాఖపట్నంలో నా శరీరాన్ని దహనం చేయగూడదు. విశాఖపట్నం మెడికల్ కాలేజి వారికే నా శరీరంపై హక్కు వుంది. ఏ కర్మకాండ జరుపరాదని నా ఉద్దేశం.

(భారత నాస్తిక సమాజం విశాఖ జిల్లా కార్యదర్శి శ్రీ టి. సూర్యనారాయణ గారు శ్రీశ్రీని మద్రాసులో ఇంటర్వ్యూ చేశారు.)

**(నాస్తిక యుగం మాసపత్రిక, డిసెంబరు, 1982)**

# మన వ్యవస్థ

* 20వ శతాబ్దం నాది. 1920వ సంవత్సరం వరకూ తెలుగు కవిత్వం నన్ను నడిపింది. 1930వ సంవత్సరం తర్వాత నుంచి నేను తెలుగు కవిత్వాన్ని నడిపిస్తున్నాను.

* ప్రాచీన కాలంలో సంస్కృత సాహిత్యం, మధ్య యుగంలో పెర్షియన్ సాహిత్యం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వృద్ధి చెందగా - ఆధునిక వర్తమాన యుగంలో స్పానిష్ సాహిత్యం అన్ని భాషణ సాహిత్యానికీ తలమానికంగా వుంది.

* లండన్ నుంచి ప్రచురించబడుతున్న 'న్యూ స్టేట్స్‌మెన్', మరో పత్రిక

* గిలెన్, సిజార్ వయాయో, పాబ్లో నెరూడా, ఫైడెల్ కాస్ట్రో - వీరిలో కొందరు.

* 'మృచ్ఛకటికం' తర్వాత మన సాహిత్యంలో గొప్ప నాటకం - మహాకవి గురజాడ రాసిన 'కన్యాశుల్కమే'. కన్యాశుల్కం ఫార్సుకాదు - విషాదాంతం.

* సాహిత్యంలో పద్య, గేయరచన పరిశ్రమలాంటిదయితే, వచన రచన వ్యవసాయం వంటిది.

* వచన రచనగా గానీ, గేయ పద్య రచనగా గానీ విభజించలేని రచన జేమ్స్ జాయిస్ రచించిన 'యులిసెస్'.

* కన్యాశుల్కంలో బైరాగిపాత్ర నాకెంతో ఇష్టమైనది.

* రోమన్, గ్రీక్, ఈజిప్టు, ఫ్రెంచి, బ్రిటిషు సామ్రాజ్యాలు అంతరించి పోయినా - ఈ సామ్రాజ్యాల సంస్కృతి, ఆచార, వ్యవహారాలు అంతరించి కనుమరుగైపోతూ వున్నప్పటికీ భారత-చైనాల పరిమిత సామ్రాజ్యాలు, ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలు, కట్టుబాట్లూ, సంస్కృతికళలు, సాహిత్యం చెక్కుచెదరలేదు. కొత్త పుంతలు తొక్కుతున్నయ్.

* మాస్కో కూడా అమెరికా వలెనే ఒక విధమైన సామ్రాజ్యవాద తత్వాన్ని అనుసరిస్తున్న ఈనాడు అత్యంత శక్తివంతమైన భారత-చైనా దేశాలు కలిసి మెలసి మనుగడ సాగించినట్టయితే ఈ మహాశక్తిని ప్రపంచదేశాలన్నీ కలిసినప్పటికీ కూడా ఎదిరించలేవు.

* మంచిది కొంచమయినా మనం తీసుకోవాలి. ఇదే చైనావాడి నుండి నేను నేర్చుకున్నాను.

* చైనాలో సహజ సంపదను సద్వినియోగం చేసుకుంటున్నారు. అటవీ సంపదను, మూలికలను, నీటి వనరులను, పర్వతాలను, ఒకటేమిటి అన్నిటినీ ప్రజోపయోగానికి వినియోగించుకుంటున్నారు.

* నా చిన్నతనంలో నాకో స్నేహితుడు వుండేవాడు. వాడు ఆశువుగా వచనంలోను, పద్యంలోనూ కవిత చెప్పేవాడు. వాడు ఒకసారి నన్ను ప్రశ్న అడిగి, తానే సమాధానం చెప్పాడు. 'ఒరేయ్ పోలీసోళ్లంటే ఏట్రా అని' సమాధానం చెబుతూ పోలీసోళ్లు ఒకటికెళ్తే పట్టుకుంటారు. రెంటికెళ్తే రాసుకుంటారు' అని. ఇది 60 ఏళ్ల క్రిందటి మాట. నిజానికి అప్పటికీ ఇప్పటికీ కూడా ఇది పోలీసు విధుల్లో ఒకటికదా. ఇదే విషయాన్ని నేను ఎంతోమంది పెద్దపెద్ద పోలీసు అధికారులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతున్నప్పుడు చెప్పాను. వాళ్లు నిజమని ఒప్పుకుంటూ నిండుగా నవ్వుకున్నారు.

* పెట్టుబడిదారీ విధానపు వికృత రూపం గురించి చెబుతూ శ్రీశ్రీ ఓ చిన్న పిట్టకథ చెప్పారు. పెద్ద డాక్టరుగా పేరు తెచ్చుకున్న ఒకరు - ఒక రోగికి 20 ఏళ్లుగా చికిత్స చేస్తున్నారట - ఐతే ఆ రోగి వ్యాధి నయం కాలేదట. పేరు పొందిన ఈ డాక్టరుగారు తమ పుత్రరత్నాన్ని కూడా విదేశాలు పంపి అతిపెద్ద డాక్టరే చదివించాడు. విదేశపట్టాలు పుచ్చుకున్న చిన్న డాక్టరు తన తండ్రి గత 20 సంవత్సరాలుగా నయం చేయలేని రోగిని పరీక్షించి వ్యాధి తెలుసుకుని సరైన మందు వాడి వారం రోజుల్లో నయం చేశాడట. ఆ రోగి పరమానంద భరితుడై అనుభవజ్ఞుడయిన తండ్రి నయం చేయలేని భయంకర వ్యాధిని కేవలం ఒక్క వారం రోజుల్లో బాగుచేసినందుకు అతి ఘనమైన డాక్టరుగా శ్లాఘించి, ఓ పాతికవేల రూపాయల చెక్కును ఆ పుత్రరత్నం డాక్టరుకు కృతజ్ఞతతో సమర్పించుకున్నాడట తాను సాధించిన ఈ ఘనవిజయాన్ని తండ్రికి చెబుతూ పాతికవేల చెక్కును తండ్రికి ఇచ్చాడా పుత్రరత్నం.

తండ్రి డాక్టరు ఆ చెక్కును ఎగాదిగా చూచి కొడుకు డాక్టరు ముఖం చూసి పెదవి విరిచాడు తండ్రి ధోరణి అర్థంకాని కొడుకు ఏమిటి నీ భావం అన్నాడట.

తండ్రి చెప్పిన మాటలివి :

"అబ్బాయీ - ఎంత తెలివితక్కువ పని చేశావురా! ఇరవై సంవత్సరాలుగా మన ఖర్చులకూ, నీ చదువుకూ పరోక్షంగా సాయపడుతూ ఎన్నోవేల రూపాయలను ఫీజుగా ఇస్తున్న ఒక శాశ్వత ఖాతాదారుడి నుంచి ఇకపై ఒక్క పైసా కూడా రాకుండా చేశావ్. ఆ వ్యాధి నేను నయం చేయలేననుకున్నావా ? ఈ కిటికే నీకు తెలియలేదు. పోతేపోనీ-పొరబడ్డావు. ఇప్పుడు ఈ మొత్తం మీద ఆదాయపు పన్ను నువ్వే కట్టాలి కదా?

కొడుకు తండ్రిని సమర్థించాడో, వ్యతిరేకించాడో గానీ ఇదే పెట్టుబడిదారీ విధానపు కథ అన్నారు శ్రీశ్రీ

* ప్రజలకూ, కవికీ వున్న సంబంధం గురించి చెబుతూ శ్రీశ్రీ ఇలా అన్నారు.

ఒక కవిగారికి ఓసారి ఏమీ తోచక తన మానాన తాను ఏదోపాడుకుంటున్నారట ఈ పాట విన్న ప్రజలు అక్కడికి వచ్చి "బావుంది బావుంది" అన్నారట.

దాంతో ఆయన ప్రజలను తప్పించుకుందామని - ఓ మూలనున్న కంచు గంగాళంలో కూచుని పాట పాడుకున్నాడట. ఒకడు వచ్చి దాని మూత వేశాడట. కవిగారు పాడుతూనే వున్నారట. ప్రజలు "చాలా బావుంది చాలా బావుంది" అన్నారట. ప్రజా సమూహంలో మరింత తెలివయినవాడు మరొకడు వచ్చి. గంగాళం అడుగున ఇంత గడ్డివేసి మంట పెట్టేడట. ఈ వేడికీ, ఉక్కకూ కవిగారు ఆక్రందనలు చేస్తూ పెడబొబ్బలు పెడుతూ అరుస్తూంటే

ఆ ఏడుపు ప్రజలకు మధురాతి మధురమైన కవిత్వంగా వినిపించి "శభాష్ - ఎంత బావుంది" అన్నారట.

ప్ర: అత్యవసర పరిస్థితి సమయంలో విప్లవ రచయితల సంఘం కార్యకలాపాలు స్థంభించిన తర్వాత ఇటీవల తెలుగు సాహిత్య ధోరణుల్లో చెప్పుకోదగిన సాహిత్య సృష్టి జరిగిందా?

శ్రీశ్రీ: శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ మంచి కవిత్వం రాస్తున్నారు. శర్మ కవిత్వంలో కొత్త దృక్పథం వెలువడింది. ఆయన రాస్తున్న కవిత్వాన్నంతా నాకు పంపుతున్నారు. ఆయన కవితా రీతులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

ప్ర: ఇదివరలో మీరు రాసిన మాటలు గుర్తుచేస్తున్నాను. 'ఎముకలు కుళ్లిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి' అని రాశారు.

ప్రస్తుతం - మీ, ఈ 28 సంవత్సరాల వయసులో -

మీరు రాసిన పంక్తులకే కవితాపరమైన అభిప్రాయం చెబుతారా ? మీ ఇప్పటి వయసుకు కూడా ఈ మీ మాటలు వర్తిస్తాయా?

శ్రీశ్రీ : ఒక ఆంగ్ల రచయిత జోనాతన్ స్విఫ్ట్ డబ్లిన్ మేయర్‌గా ఎన్నికయినపుడు యువకుడు. తన జీవితకాలంలో ఒక గొప్ప పని చేయాలనుకున్నాడు. పిచ్చివాళ్లకు ఒక ఆస్పత్రి కట్టించాలనుకున్నాడు. కట్టించాడు. అతడు ముసలివాడైనపుడు తానే ఆ ఆస్పత్రిలో ప్రవేశించాడు.

ప్ర: 'యముని మహిషపు లోహఘంటలు', 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను' అన్న పాత, సంప్రదాయ సిద్ధమైన పదజాలాన్ని మీ కవిత్వంలో ఎన్నో ఉపయోగించారు. కన్నడ సాహిత్య పరిషత్తు సమ్మేళనంలో మాట్లాడుతూ 'చతుర్ముఖ బ్రహ్మ' అన్న పదాన్ని వాడారు. ఇటువంటి ప్రతీకలను ఉపయోగించినందువల్ల - ఆధునిక కవితా ప్రయోజనం సిద్ధిస్తుందని భావిస్తున్నారా ?

శ్రీశ్రీ : మంచి గతమున్న కొంచెమేనోయ్ అని మహాకవి గురజాడ అప్పారావు అన్నారు. మంచిది కొంచెమైనా తీసుకోవడంలో తప్పేముంది. ఇదే చైనా వాడి నుంచి నేను నేర్చుకున్నాను.

ప్ర: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు మీ 'మహాప్రస్థానాన్ని' సంస్కృతంలో అనువదింపచేస్తున్నట్లు విన్నాను.

శ్రీశ్రీ : అవును- సంస్కృత పండితులతో అనువాదం చేయిస్తున్నారు. వద్దన్నాన్నేను - నా మహాప్రస్థానాన్ని సంస్కృతంలోకి చక్కగా అనువదించగల వారు ఒక్కరే - శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ - ఆయన సంస్కృతంలో కూడా పండితుడు. ఆయన పేరును సూచించాను.

సినిమాల గురించి ప్రస్తావన వచ్చినపుడు శ్రీశ్రీ ఇలా అన్నారు. 'రుక్మిణీ కల్యాణం' సినిమా తీద్దామనుకున్నాను. కొంతపని జరిగినా చిత్రం మొదటిలోనే ఆగిపోయింది. పౌరాణికమని ఈ అంశం తీసుకోలేదు. 'రుక్మిణీ కల్యాణం'లో నన్ను ఆకర్షించింది ఒక రాజు కూతురు గొల్లవాడిని పెళ్లి చేసుకోవడం. ద్వాపరయుగంలో ఏనాడో ధనవంతుల పిల్ల బీదవాడినీ పర కులంవాడైన యాదవుణ్ణి చేసుకోవడం నాకు నచ్చింది. ఈనాడు కూడా కులాంతర

వివాహాలకూ, ధనవంతులకూ, బీదవారికీ మధ్య జరిగే వివాహాలకూ ఎందరి అండదండలుంటున్నయ్ ?

ముగింపు :

ఒక విప్లవ వీరుడిని ఉరితీసిన ఘట్టాన్ని వర్ణిస్తూ -
'తుది పయనం
తొలి విజయం' అంటూ
ఊగరా ఊగరా
ఉయ్యాలలాగ బాగ ఊగరా
ఉరికొయ్యనందుకొని ఊగరా
సోదరా సోదరా
చావన్నది నీకు లేదురా ధీరుడా
విప్లవం యాడుందిరా
నీ గుండెలోనే కూకుందిరా
నీ కళ్లలోనే దాగుందిరా'
అని రాసిన శ్రీశ్రీ
'ఎముకలు కుళ్లిన. వయస్సు మళ్లిన సోమరులారా చావండి' అని గర్జించిన శ్రీశ్రీ
శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం పాడి - దేవుళ్లను అపహాస్యం చేసిన శ్రీశ్రీ -

అఖిల భారత కన్నడ సాహిత్య పరిషత్తు వారు నగదుతోపాటు ప్రదానం చేసిన బహుమతి పొట్లం విప్పమని నన్ను అడిగి -

పొట్లం విప్పిన తర్వాత - అందులో వున్న చందనపు మురళీకృష్ణుడి బొమ్మను కళ్లనద్దుకున్న శ్రీశ్రీ -

ఇప్పటికీ నాకు ఒక ప్రశ్నగానే మిగిలిపోయారు.

(మహాకవి శ్రీశ్రీని ఢిల్లీలో జరిగిన కన్నడ సాహిత్య పరిషత్తువారి 50వ సమ్మేళనంలో సన్మానించారు. ఆ సందర్భంగా ఆయనతో నాలుగు గంటలు గడిపి, అడిగి తెలుసుకున్న విషయాలనూ, ప్రశ్నలకు సమాధానాలనూ, వ్యక్తపరచిన అభిప్రాయాలనూ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రగతి సాహితి సమావేశంలో చెప్పిన విషయాలనూ పొందుపరుస్తున్నాను.)

**ఏడిద గోపాలరావు**

**ఏప్రిల్ 1979 జ్యోతి మాసపత్రిక**

# ఎన్నికలు

"మేము పెళ్లి చేసుకుంటాం. మీ సలహా ఏమిటి?" అని కాబోయే దంపతులు అడిగిన ప్రశ్నకి లండన్ "పంచ్" పత్రిక ఇచ్చిన జవాబు "వద్దు" అని. ఓట్లు వేయదల్చుకున్న వారికి కూడా నా సలహా "వద్దు" అనే.

పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చిన ప్రబుద్ధులు దేశాన్ని పాలించవలసిన పార్లమెంటు సభ్యుల కోసం ఎన్నికలు పెడ్తున్నారు. నీతి నిజాయితీ అనే సద్గుణాలు వీరెవరిలోనూ యే కోశానా లేవన్న సంగతి కళ్లు లేనివారికి కూడా స్పష్టంగా కనపడుతూనే ఉంటుంది. వాగ్దానాలయితే చేస్తూనే ఉన్నారు కాని అవి నెరవేరేవి కావని వాళ్ళకి తెలుసు మనకీ తెలుసు. మన అరణ్య రాజ్యంలో సింహాలకి, పెద్ద పులులకే కాక గుంట నక్కలకు కూడా వార్ధక్యం వచ్చేసింది. ఇటువంటి పరిస్థితుల్లో 50 ఏళ్లలోపు వ్యక్తి (పార్టీకి చెందినాసరే) మాత్రమే ఎన్నికలకు అర్హుడని నా ఉద్దేశం. వయస్సుకు వచ్చే వార్ధక్యం కన్నా బూజు పట్టిన పాతధనమే ఎంతో ప్రమాదకరమని అందువలన అభ్యర్థుల దృక్పథాన్ని సరిగ్గా అంచనావేసుకుని ఒక నిర్ణయానికి రావడం మంచిది.

మన దేశం పురోగమించాలంటే అందుకు సామ్యవాదమార్గ మొక్కటే శరణ్యం. 75 శాతం నిరక్షరాస్యులుగా ఉన్న మన దేశంలో బలవంతులదీ ధనవంతులదీ ఆడిందే ఆట, పాడిందే పాట. అందువల్ల ఈ దేశంలో సోషలిజం బదులు ఫాసిజం వచ్చే ప్రమాదాన్ని గుర్తించాలనీ, ఎదిరించాలనీ మాత్రమే నేను హెచ్చరించగలను.

**(ఈనాడు 19-12-1972)**

# ప్రాంతీయ పార్టీ

"ప్రాంతీయ పార్టీ జాతీయ సమైక్యతకు ద్రోహం చేస్తుందనే" ధోరణిలో అధికార పక్షం చేస్తున్న ప్రచారం పసలేనిదని, గుత్తాధిపత్యం చేజారి పోతుందేమోనని భయపడే వారి కువిమర్శ అని మహాకవి శ్రీశ్రీ జనత ప్రత్యేక ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

ఢిల్లీ కోటలో తిష్ట వేసుకూర్చున్న వాళ్ళు ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కారణం అవుతున్నారని, తెలుగు నాయకులకు ఢిల్లీలో చప్రాసీకున్న గౌరవం విలువ కూడా లేదని, తెలుగువారి ఆత్మ గౌరవ పరిరక్షణకు ప్రాంతీయ పార్టీ అవసరం వచ్చిందనీ శ్రీశ్రీ వివరించారు.

సందర్భంలో ఇప్పుడు దేశమంతటా సుబ్రహ్మణ్య భారతి శతవార్షికోత్సవాలు అన్ని ప్రాంతాల్లో జరగడానిక్కారణం తమిళనాడులో ప్రాంతీయ పార్టీ అధికారంలో ఉంది కనువిప్పు కలిగించడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

"ఇంట గెలిచి రచ్చ గెలుపు" అనే రీతిగా ప్రాంతీయ పార్టీ ద్వారా ప్రాంతాన్ని సమగ్రంగా, అభివృద్ధి చేసుకుంటే జాతీయ సమగ్రతకూ, అభివృద్ధికి ప్రోద్బలమే గాని హానికరం కాజాలదని శ్రీశ్రీ ఉద్ఘాటించారు.

మహాకవి శ్రీశ్రీ జాతీయవేశాన్నీ, వ్యంగ్య హాస్య స్ఫూర్తినీ, తమదైన ప్రత్యేకతనూ త్రివేణి సంగమంలా చేసి ముచ్చటిస్తూ, దేశమంతటా రవీంద్రనాథ్ టాగూర్ మందిరాలు నెలకొల్పారేగాని మన గురజాడ పేర ఏం చేశారని ప్రశ్నించారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కోడి రామ్మూర్తిగారి పేర ఒక స్టేడియం కట్టించలేదని మనం లాల్‌బహదూర్ పేర నెహ్రూ పేర గాంధీల పేర్ల మీద అనేకం నిర్మించడం తెలుగువాడి అస్తిత్వాన్ని గట్టిగా చాటి చెప్పకపోవడమేనని శ్రీశ్రీ అన్నారు.

తాను అంతర్జాతీయంగా కమ్యూనిస్టు, జాతీయంగా సమైక్యతావాది. ప్రాంతీయంగా అల్లూరి సీతారామరాజు పంథావాదినని, మౌలికంగా రక్తపాత రహితంగా విప్లవం సాధ్యం కాదని విశ్వసిస్తానని శ్రీశ్రీ అన్నారు.

తమకిష్టం లేని ప్రభుత్వాన్ని, నష్టాన్ని కలిగించే పాలకుల్ని మార్చడం ప్రజల ప్రాథమిక హక్కులనీ, దాన్ని ఎవరూ కాదనజాలరని శ్రీశ్రీ అన్నారు. ఓటు ద్వారా విప్లవం రాదని నమ్ముతున్నా ప్రస్తుతానికి గుడ్డికన్ను కంటే మెల్లకన్ను మేలన్నట్టుగా ఎన్నికలు జరగనివ్వండని ఆయన నవ్వేరు !

తెలుగువారి ఆత్మగౌరవ కృషిని ద్వేషించే వాళ్లు జాతీయ ద్రోహులేనని శ్రీశ్రీ ఆవేశంగా అంటూ – ఆయన అవతార పురుషుడనే ప్రచారానికి దూరంగా వుంటూ శ్రీ ఎన్.టి.రామారావు స్థాపించిన "తెలుగుదేశం" పార్టీ మౌలిక లక్ష్యాన్ని సమర్థిస్తున్నామన్నారు. అందుకే ఎన్నికల ప్రచారం కోసం వారికి ఓ పాట కూడా వ్రాసి ఇచ్చామన్నారు.

పాలకపక్షమూ, ఇతర జాతీయ పక్షాలనేవి కూడా తెలుగువారి పాడిని తీసుకెళ్లి ఢిల్లీకి సమర్పించుకుంటున్నాయి. ఢిల్లీ పాలకులు మనకో జున్ను ముక్క విసిరేసి "కోతుల తగవులో పిల్లి మధ్యవర్తిత్వం" లాగా కథలు నడుపుతున్నారని శ్రీశ్రీ అభివర్ణించారు. తెలుగుదేశం కృషిని భంగపరచేవాడు తెలిసో తెలియకో తెలుగువారికే గాక జాతికి కూడా ద్రోహం చేస్తున్నట్లేనని శ్రీశ్రీ వక్కాణించారు.

జాతీయంగా టాగూర్ కంటే సుబ్రహ్మణ్య భారతిని గౌరవిస్తామని, గురజాడ వలె "దేశమును ప్రేమించుమన్నా" అనే ధ్యేయంతో వ్యవహరిస్తామని శ్రీశ్రీ పునరుద్ఘాటించారు.

రాజకీయంగా గాంధీ కంటే భగత్‌సింగ్‌కు, అల్లూరికి గౌరవం ఇస్తానని శ్రీశ్రీ అన్నారు.

మహాకవి తమ ఇంటర్వ్యూను ముగిస్తూ అధికార గుత్తాధిపత్యం గల కాంగ్రెసుకు తమిళనాడు డిపాజిట్లు కూడా దక్కకుండా చేసినట్లే తెలుగునాడు కూడా ఈ ఎన్నికల్లోగుణపాఠం జరపాలని తెలుగువారికి సందేశం ఇచ్చారు.

**('జనత' దినపత్రిక, విజయవాడ, 17-12-1982)**

# అగ్ని పర్వతంతో అరగంట

..."ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం. ఆ సమాజానికో చరిత్ర. ఆ చరిత్రకో పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామగమనంలోనే కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశీలి అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు" – శ్రీశ్రీ

1930 తరువాత తెలుగు కవిత్వాన్ని శాసించిన యుగ కవి శ్రీశ్రీ. మహా ప్రస్థాన గీతాలతో పాత ప్రపంచానికి భారత వాక్యం మరో ప్రపంచానికి నాందివాక్యం పలికి కవిత్వరంగంలో, సామాజిక రంగంలో అనితర సాధ్యమైన మార్గాన్ని ద్రష్టవ్యం చేసిన మహాకవి శ్రీశ్రీ. అభ్యుదయ సాహిత్యయుగానంతరం దిగంబర కవితోద్యమం పుట్టిన తరువాత అది విప్లవ రచయితల సంఘంగా మార్పు చెందిన పిమ్మట తెలుగు కవుల్లో అభిప్రాయ భేదాలు పొడచూపాయి. అభిప్రాయ భేదం ఉండటంలో దోషం లేదు. కాని అదిపరస్పర దూషణస్థాయికి దిగజారటంతోనే కవుల బలహీనతలు వెల్లడవుతాయి.

ఈ అభిప్రాయ భేదాల దృష్ట్యాను, ఈనాడు సాహిత్య విషయకంగా చెలరేగిన అనేక సంఘర్షనల దృష్ట్యాను శ్రీశ్రీ గారిని కొన్ని ప్రశ్నలు నేనడగటం జరిగింది. వాటికి శ్రీశ్రీగారిచ్చిన సమాధానాలు యథాతథంగా ఇక్కడ పొందుపరచటం జరిగింది.

ప్ర: 1930 దాకా తెలుగు కవిత్వం నన్ను నడిపింది. 1930 తరువాత తెలుగు కవిత్వాన్ని నేను నడుపుతున్నాను అన్నారు మీరు. దీన్ని గురించి ఈ తరానికి వివరణ ఏమైనా ఇస్తారా?

జ: 1930 నాటికి నా వయస్సు 20 ఏళ్లు. అప్పటికే కొంత సాహిత్య వ్యాసంగం ప్రారంభించాను. అనేకమైన దారుల్లో ఎటువైపు వెళ్లటం, నాది అంటే ఏదైనా ఒక దారి ఉంటుందా ? అని ఇలా వెతుక్కుంటున్న కాలం అది. అంటే 1930 వరకూ, కాబట్టి 1930 దాకా తెలుగు కవిత్వం నన్ను నడిపింది అన్నాను. ఆ తరువాత సరిగ్గా 1930 కాదనుకోండి 20వ శతాబ్దపు 4వ దశాబ్దంలో నాది అంటూ ఒక దారి నాకు కనబడింది. అంతకుముందు పది సంవత్సరాలుగా నేను విశ్వనాథ, కృష్ణశాస్త్రిల ప్రభావంలో ఉండి, ఇంకా అనేక మంది ప్రాబల్యంలో ఉండి ఎంతో మందిని ట్రాన్సులేట్ చేస్తూ, అనేక విధమైనటువంటి ప్రయోగాలు

చేస్తూ సాగించిన కృషి ఒక దారికి వచ్చింది. దానికి అనేకమైన కారణాలు. నేను ముఖ్యంగా చెప్పేదేమిటంటే అది హంగ్రీ థర్టీస్ కావటం. ఆ శతాబ్దంలోనే స్పానిష్ అంతర్యుద్ధం రావటం మొత్తం మీద అనేక కారణాల వల్ల తెలుగు కవిత్వాన్ని ఒక పెద్ద మలుపు తిప్పటం సాధ్యమైంది. ఈ తరం వారికి ఆనాటి చారిత్రక పరిస్థితులు అర్థం కాకపోవచ్చును కాని ఈనాడు కూడాను ఆ మార్గం అనేటువంటిది అగ్రగాములైన యువకవులకు చాలా అవసరమని నేను భావిస్తున్నాను. అందువల్ల ఆనాటి ప్రభావం ఇంకా ప్రసరిస్తూనే ఉందని చెప్పి నేను అనుకుంటున్నాను.

## శ్రీశ్రీ : నారాయణబాబు

ఇటీవల కాలంలో నారాయణబాబు శ్రీశ్రీల కవిత్వ పద్ధతులమీద చర్చ కొంత సాగింది. సోమసుందర్‌గారు రుధిర జ్యోతిర్దర్శనం పుస్తకం అచ్చువేశారు. దానికి ఆరుద్రగారు విపులమైన అంతర్యంతో పీఠిక రాశారు. దానిలో శ్రీశ్రీ ప్రస్తావన చాలానే ఉంది. ఈ విషయాలపై శ్రీశ్రీ ముఖత ః కొన్ని సందేహాలు తీర్చుకుంటే అవి నాకూ ఇతర సాహితీ ప్రియులకు కూడా ఉపకరిస్తాయనే ఉద్దేశంతో కొన్ని సందేహాలు వెల్లడించటం జరిగింది.

ప్ర: శ్రీశ్రీ కవిత్వం వాచ్య ప్రధానమైనది. నారాయణబాబు కవిత్వం ధ్వని ప్రధానమైనది అనే విమర్శపై మీ అభిప్రాయం ఏమిటి?

జ: అసలు ఈ విమర్శకు పునాది ఎంత వరకూ ఉన్నది అన్నది ఆలోచించాలి. శ్రీశ్రీ ప్రక్కను నారాయణబాబును చేర్చి మా ఇద్దరినీ కంపేర్ చేస్తూ అందులో ఏదో ధ్వని ఉన్నదని అనటం అర్థం లేని విమర్శ. ఎంచేతనంటే అసలీ ధ్వని స్కూల్....నారాయణబాబు కవిత్వం చాలా హ్రస్వలిపిలో ఉంటుందనీ...అసలీ హ్రస్వలిపిని దీర్ఘలిపి చేసిన వారెవ్వరూ లేరు. ఈ హ్రస్వలిపిని ధ్వని ప్రధానం అనుకోవటం ఏమిటంటే అమావాస్య చీకట్లో అక్కడ లేని నల్ల పిల్లిని ఉందనుకోవటం. ఇటువంటివి కన్‌ఫ్యూజ్ చేయడానికి పనికివస్తాయనే తప్ప ఏ కవిత్వం కేవలం ధ్వని కవిత్వం కాదు. కేవలం వాచ్య కవిత్వం కాదు. యాబ్సల్యూట్ పోయట్రీ లేనట్లుగానే- టి.ఎస్.ఇలియట్ అన్నాడు యాన్ యాబ్సల్యూట్లీ ఒరిజినల్ పోయెమ్ ఈజ్ యాన్ యాబ్సల్యూట్లీ యూస్‌లెస్ పోయెమ్ అని. అలాగ కొంత మంది భక్తులు...ఒక్క సోమసుందర్‌ను గురించేకాదు, ఆరుద్రను గురించి కూడా చిత్రమైనటువంటిది. మధురవాణి ఏమోను ఒక చోట రామప్పంతులతో అంటుంది. కొన్నాళ్లు నన్ను ఉంచుకున్నారు గిరీశంగారు, ఆయన తప్పులు నాకు కనబడవు అని. అలాగే నారాయణబాబు తప్పులు నారాయణబాబు భక్తులకు కనబడవు. అది సహజమే. ఇహను ఆరుద్ర గురించి చెప్పాలంటే ఎందువల్లనో ఆరుద్రకు నారాయణబాబు మీద భక్తి కుదిరింది. 'కుక్కకు మనిషే దేవుడు' ఎందువల్లనంటే మనమేం చెప్పలేం. అందువల్ల నన్నూ నారాయణబాబుని కలిపి అదేదో పెద్ద విమర్శచేస్తున్నాం అనుకోవడం...ఇంకా ఆ కాలంలో నారాయణబాబు ఒక మైనర్ పోయట్, కవికొండల వెంకటరావు, బసవరాజు అప్పారావు ఇలా ఎందరో ఉన్నారు. వాళ్లు నాకంటే ముందుతరం

వాళ్లు. మరి నా సమకాలీనులైన శిష్ట్లా ఉమామహేశ్వరరావు ఉన్నారు. ముద్దు కృష్ణ వున్నాడు. ముద్దుకృష్ణ ఎంతమంచి కవిత్వం రాశాడో ఎవరికీ తెలియదు.

కాయండి యువకులు

కాయండి భుజనములు

ముద్దు కృష్ణ తన పొయిట్రీని త్రింశతి అని ముప్ఫై పోయెమ్స్ పుస్తకంగా వేస్తానని అంటూ వుండేవారు. అది కాని దొరికితే వీళ్ల బండారం బయటపడేది. నిజంగా నేను శిష్ట్లా, ఉమామహేశ్వరరావు పోయెమ్సు కన్నా, ఆ మాట కొస్తే ముద్దు కృష్ణ పోయెమ్స్ కన్నా కూడా. ముద్దు కృష్ణ జ్వాల ఎడిటోరియల్ వల్ల ఇన్‌స్పైర్ అయి 'దేశ చరిత్రలు' గేయం రాశాను. ఈ సంగతి ఎక్కడో నేను చెప్పాను కూడా. అప్పటికి నాకు బ్రెక్ అనే కవి వున్నాడని కూడా తెలియదు. ఇవేవి పట్టించుకోకుండా కొంత దురుద్దేశంతోనూ, కొంత అజ్ఞానంతోనూ చేసే విమర్శ ఇది.

ప్ర: నారాయణబాబుపై ఏనాడో రావలసిన విమర్శ 1970 తరువాత మాత్రమే రావడం మరువకూడని విషయం. నారాయణబాబు గొప్ప కవి. శ్రీశ్రీ అంత గొప్ప కవి కాదన్నది కూడా వాస్తవం. అయితే తద్విరుద్ధంగా వ్యక్తిగత రాగద్వేషాలతో కూడిన విమర్శ ఈ మధ్య రావటం ఆధునిక కవితాభిమానులకు తెలియని విషయం కాదు. అందుగురించి మరో రెండు ప్రశ్నలు శ్రీశ్రీని అడగటం ఆయన వాటికి గల చారిత్రక కారణాలు వివరించటం జరిగింది.

నారాయణబాబు బ్రతికుండగా లేని ప్రేమ, వి.ర.సం. ఏర్పడక పూర్వం లేని ప్రేమ ఇప్పుడే ఏర్పడడానికి మీమీద ద్వేషమా ? ఆరుద్రకయినా మరెవరికయినా కానీయండి!

జ: ఎంచేతంటే ఇన్ ది ఫైనల్ ఎనాలసిస్ నారాయణబాబు రిమెయిన్స్ యాన్ ఆర్.ఎస్.ఎస్ పొయెట్. నారాయణబాబు గాని పౌరాణిక సింబల్స్ వేస్తే అది జాతీయత. నేను యముని మహిషపు లోహఘంటలు అంటే...ఇటువంటిది కువిమర్శ. మీరు చెప్పినట్లుగా నారాయణబాబు బతికుండగా గుర్తించిన వాళ్ళు ఎవరూ లేరు. ఆరుద్రతో సహా. ఆరుద్ర ఆ రోజుల్లో ....24 గంటలూ నా చుట్టూ తిరుగుతుండేవాడు. ఎప్పుడైనా వెళితే నారాయణబాబు దగ్గరకు వెళ్లేవాడు. ఇంకా తన మీద నారాయణబాబు కంటే పఠాభి ప్రభావం ఉందని ఆరుద్ర ఒప్పుకుంటాడు. ఆ రోజుల్లో అంత పొడుచుకొచ్చిన ప్రేమేం లేదు. రుధిర జ్యోతిర్దర్శనంలో చాలా విచారంగానూ, నారాయణబాబు పుస్తకం కంటే ముందే తన త్వమేవాహం అచ్చయిందని కొంచెం మకరాస్యం...అందులో మొసలి కన్నీరులా అనిపిస్తుంది. నిజంగా త్వమేవాహం అచ్చవుతున్న ఆ రోజుల్లో నారాయణబాబు పుస్తకం అచ్చుకాలేదన్న దుఃఖం కాని ఆవేదన కాని ఆరుద్రకు ఉండి ఉన్నట్లయితే...ఆ రోజుల్లో రాజకపూర్ పిక్చరు కోసం ఏరోప్లేన్ మీద బొంబాయి వెళుతూ వుండేవాడు. చాలా డబ్బు ఉంటూ ఉండేది. ఆ డబ్బు ఏం చేశాడో నాకు తెలియదు. అందులోనూ ఆ రోజుల్లో పుస్తకం అచ్చు వెయ్యడం చాలా చవక. ఈనాటికంటే పదిరెట్లయినా తక్కువ. అటువంటప్పుడు అంత అభిమానం

ఉన్నపుడు...తను అవన్నీ (నారాయణబాబు పోయెమ్సు) కలెక్టు చేస్తానని అంటూ ఉండేవాడు. ఏమీ లేదు. నిజంగా నారాయణబాబు పోయెమ్సు అన్నీ ప్రిజర్వ్ చేసింది నేను. ఆంధ్రప్రభలో సబ్ఎడిటర్గా ఉంటూ న్యూస్ ప్రింటు కాగితాలు తెచ్చిచ్చాను. అవి పసుపుపచ్చని కాగితాలని నాకు బాగా జ్ఞాపకం. నారాయణబాబు ఎప్పుడూ తన కవిత్వం మీద శ్రద్ధ ఉండేది కాదు. అవన్నీ కూడా కలెక్టు చేసి రుధిరజ్యోతి కలెక్షన్ అని ఇచ్చాను. అది పట్టుకుని నారాయణ బాబు పాపం దేశం అంతటా తిరిగాడు. మహాప్రస్థానానికో పబ్లిషరును, రుధిరజ్యోతికో పబ్లిషరును ప్రయత్నించాడు. ఒకప్పుడు కిళాంబి రంగాచార్యులుగారు ఈ రెండు పుస్తకాలూ వేస్తానని కూడా అన్నారు. ఈ లోపం తన పుస్తకమేమో తను పారేశాడు ఇవన్నీ కూడాను ఆరుద్రకు తెలిసిన సంగతులే. అయినా కూడాను నారాయణబాబుని పట్టించుకున్న వాళ్లెవరూ లేరు. ఇప్పుడంటే మీరు చెప్పినట్లుగా విరసాన్ని వెన్నుపోటు...వి.ర.సం. ఎప్పుడూ కూడా ఆరుద్రని ఒక ప్రబల శక్తిగా గుర్తించలేదు.

## వివాద గ్రస్తం

ప్ర: నారాయణబాబు అనువాదం చేసిన 'సంపెగతోట'ను మీరు తస్కరించారనే వాదం కూడా రుధిర జ్యోతిర్దర్శనం పీఠికలో వచ్చింది. దానికి క్లారిఫికేషన్ ఏమైనా ఇస్తారా?

జ: ఇది కాంట్రోవర్సీ-అబ్బూరి రామకృష్ణారావుగారు బతికుండగానే జరిగింది. దీన్ని శ్రీశ్రీ సంపుటాల్లో కె.వి. రమణారెడ్డి గారు వేశారు. 'సంపెంగతోట'ను తస్కరించడం అన్న ప్రశ్నే లేదు. అసలు రాసినవాడు ఒకడుకాదు. ఎవరికీ పుట్టావురా కొడకా అని అడివిలో ఏడ్చినట్టే అబ్బూరి రామకృష్ణారావుగారు నారాయణ బాబును, నన్ను పిలిపించి నారాయణబాబుకు చెకోవ్ చెర్రీ ఆర్చర్డు, నాకు మరో పుస్తకం (పేరు మరిచిపోయాట్ట) ఇచ్చి రామంటే నేను నా పుస్తకాన్ని రాయలేకపోయాను. నారాయణబాబు రాశాడట. ఇది నారాయణబాబుగారి వర్షన్.

గురజాడ అప్పారావుగారు 'మీ పేరేమిటి' అన్న కథలో "ఒకనాడు తెల్ల వారగట్ల కలెక్టరుగారు గుర్రమెక్కి వస్తూండగా గ్రామ పొలిమేరను మనవాళ్లయ్య యెదురై, ఫెళఫెళమని శ్లోకం ఎత్తుబడి చేసేసరికి, ఇతని స్థూలకాయం, బర్రె నామాలు, రాగిధ్వజం, కోలాహలమూ చూసి గుర్రం బెదిరింది. కోపం వచ్చి కలెక్టరు ఐదు రూపాయలు జుల్మానా వేశారట. ఈ కథ శుద్ధాబద్ధం అనీ, తన చేత శ్లోకాలు చదివించి దొరగారు ఐదు రూపాయలు ప్రెజెంటిచ్చారని, అవి పెట్టి వ్యాపార పాత్ర కొన్నానని" మనవాళ్లయ్య అన్నట్లుగా ఉంది ఈ వ్యవహారం.

అసలు సంగతేమిటంటే కొంతకాలం జరిగిన తరువాత నేను నటాలీలో ప్రవేశించాను. నేను ప్రవేశించేసరికే నారాయణబాబు ఒక వర్షన్ తయారు చేశాడు. అది శ్రాద్ధయోగ్యంగా ఉందని చెప్పి శ్రీరంగం నారాయణబాబుకి అబ్బూరి రామకృష్ణారావు గారు ఇచ్చేశారు. అది మళ్లీ ఏదో పత్రికలో అచ్చు వేయించి...తెనాలి పత్రిక ఏదో...మళ్లీ పి.వి.రాజమన్నారు గారికి

అంకితమిచ్చి ఓ రెండువందల రూపాయలు....ఈ విధంగా పాపం నారాయణ బాబు ఉద్యోగం సద్యోగం లేకుండా ఎలా బతికాడు అంటే ఏదో విధంగా బతకాలి గదా ? ఆ విధంగా కొంతకాలం ఇది పట్టుకుని ఊరేగాడు. ఏదో అయిపోయింది. ఈ లోపున ఈ నాటకం వెయ్యవలసిన అవసరం వచ్చి...చాలా వరకూ నాటకాన్ని వరదరాజేశ్వరరావే ట్రాన్సులేట్ చేశాడు. అంతే కాకుండా ఇంతకు ముందు వాళ్లందరూ కూడబలుక్కుని కొన్ని కొన్ని పేర్లు కూడాను బహుశా వివరించి అని మరేదో అని ఆ పేర్లు కూడాను కావు. కొన్ని పేర్లు వరదరాజేశ్వరావు మార్చాడు. నేను చేసిన సహాయం చాలా తక్కువ. కాని నటాలీలో నేను కూడా ఉండడం వల్ల ఏదో నా పేరు కూడా వేశారు తప్ప నిజంగా నా ట్రాన్సులేషన్ సెకండ్ ట్రాన్సులేషన్. అది వరదదే అని చెప్పాలి. అందులో నా పేరుతో పాటు నారాయణబాబు పేరు కూడా వేస్తే నారాయణబాబు ఈ గొడవ చేసేవాడు కాదు. కాని తన్ను తొలగించడం వల్ల కోపం వచ్చి ఏదో తనకు అన్యాయం జరిగిపోయినట్లు, గ్రంథ చౌర్యం చేసినట్లు నన్ను జైలుకి పంపాలని....ఇన్ని భ్రమలు కల్పించుకొన్నారు. ఈ భ్రమలన్నీ కూడా నిజమనుకొని ఆనాడు ఆరుద్ర నమ్మాడు. ఈనాడూ ప్రచారం చేస్తున్నాడు - ఇది అబద్ధం అని తెలిపి ఉండి కూడాను.

ఆరుద్రగారు రుధిర జ్యోతిర్దర్శనం పీఠికలో శ్రీశ్రీగారి వ్యక్తిగతమైన విషయము ఒకటి ప్రస్థావనకు తెచ్చారు. ఆ విషయమై నాకు కొన్ని అనుమానాలు ఉండటం వల్ల ఈ ప్రశ్నలు వేయవలసి వచ్చింది. శ్రీశ్రీ చిత్తచాంచల్యాన్ని గురించి కవిత్వ విషయంగా శ్రీశ్రీ యుగాని గురించి ప్రశ్నలు వేయటం జరిగింది.

ప్ర: ఆరుద్రగారు సంస్కృతంలో పంచరాత్రం నాటకం ఒకటుందని, తన జీవితంలో శ్రీశ్రీతో గడిపిన ఐదు రాత్రులు భయంకరమైన పంచరాత్రులని రుధిరజ్యోతిర్దర్శనం పీఠికలో చెప్పారు. దాంట్లో మీరేదో ఉన్మాదస్థితిలో ఏవో కాగితాలు పాడుచేశారనీ, అవి గనుక ఈనాడు ఉన్నట్లయితే శ్రీశ్రీ అసలు రూపం ఏమిటో తెలిసేదని, అవి లిటరరీ డాక్యుమెంట్సుగా ఉండేవని అన్నారు. ఇందులో యథార్థం ఏమైనా ఉందా ?

జ: పంచరాత్రం సంగతి ఏమిటో నాకు తెలియదుగాని చిత్తచాంచల్యం అన్నది నాకు ఏర్పడింది. ఏర్పడినపుడు ఇదే విజయవాడలో నాకు బాగా జ్ఞాపకం. కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో నాకు ఓ విధమైనటువంటి అపస్మారక స్థితి రావటం-మళ్లీ నేనే మేల్కొనేసరికి ఒక లారీలో ఉన్నాను. మద్రాసు తీసుకు వెళ్ళారన్నమాట. ఆ లారీలోనే అనిసెట్టి, ఆరుద్ర ఇద్దరూ ఉన్నారు. అనిసెట్టి సంగతి ఆరుద్ర చెప్పలేదు. పాపం ఆ మొదటి ఐదు రోజులు కూడాను ఆరుద్ర ఎంత తాపత్రయపడ్డారో అనిసెట్టి కూడాను అంత తాపత్రయపడ్డాడు. అప్పుడు చాలా చర్చలు జరిగాయి. నాకు అవేవీ తెలియవు. అయితే అనిసెట్టి కీర్తిని అపహరించాడు. అనిసెట్టి ఎప్పుడూ కూడా నేను అంతచేశాను, ఇంతచేశాను అని చెప్పుకోలేదు. కాని ఆరుద్ర మాత్రం నన్ను బతికించినవాడే తానన్నట్లు ఒక విధమైన ఫోజు ఇవ్వడం ఆ ఐదు రాత్రులు తానెంతో బాధపడినట్లు...నేను ఏవేవో రాసేవాడిని, ఏవేవో అరుపులు కూడా అరుస్తూ

ఉండేవాడిని. అప్పటి నాలుగేళ్ల మా అమ్మాయి ఇప్పటికీ ఉంటుంది - నేను నెహ్రూని చంపేస్తానన్నానని, ఆ రోజుల్లో ఎన్నికల స్లోగన్లు అవి అన్నీ. వీటిని బట్టి నా సాహిత్య చరిత్ర, నా తాతముత్తాల చరిత్ర, సైకాలజీ ఇవన్నీ కూడా ఎనలైజు చేసి తనవంటి ఫ్రాయిడియన్ శిష్యులు ఏమైనా చెయ్యడానికి ఆ కాగితాలు ఇప్పుడు లేవని ఆరుద్ర వాపోవటం అర్థం లేని ఏడుపు.

## యుగాల సమస్య

ప్ర: శ్రీశ్రీ యుగం అని ఒక యాంథాలజీ వచ్చింది. 1962లో అని నాకు గుర్తు. అందులో ఆరుద్రగారే ఇది శ్రీశ్రీ యుగమని స్వయంగా చెప్పారు. ఈనాడు నాకొక అనుమానం కలుగుతోంది. ఎవరైతే ఆనాడు శ్రీశ్రీ యుగం అని నామకరణం చేశారో వారే ఈనాడు నారాయణబాబును మీ ముందుకు నెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, దీని మీద మీరేదైనా స్పష్టం చేస్తే బాగుంటుంది.

జ: ఇది శేషేంద్ర యుగమని కుందుర్తి యుగమని ఎవరికి కావలసిన విధంగా వారు అంటున్నారు. అయినప్పటికీ కూడాను అల్లసాని పెద్దనగారి రోజుల్లో ప్రబంధాలు రాసిన వాళ్లెవరూ లేరా? మరి ఆ ప్రబంధముగానికి ఆదిపురుషుడుగా అల్లసాని పెద్దనగారే ఎందుకు కావాలి? ఒక విధంగా చూసుకుంటే మనుచరిత్ర కంటే కూడా వసుచరిత్ర గొప్ప కావ్యం అనేవాళ్లున్నారు. పెద్దన అనంతరం ఎన్నో పిల్ల వసుచరిత్రలు పుట్టాయి. కాని పిల్ల వసుచరిత్రలు పుట్టలేదు. అయినా కూడానూ ఆంధ్ర కవితా పితామహుడెవరంటే అల్లసాని పెద్దన అనీను, దానికి కొన్ని విధాలైనటువంటి విమర్శక ప్రామాణ్యాలు వాటినిబట్టి ఆలోచిస్తే - ఈ 20వ శతాబ్దం ఆనాడు శ్రీశ్రీ యుగమై ఈనాడు కాకపోయిందా ? అదేమీ లేదు. ఓపీనియన్సు అప్పుడప్పుడూ మారకపోతే పొలిటీషియన్ కాదని గిరీశం చెప్పినట్లుగా ఆనాడు నేను అట్లా అనుకున్నాను, ఈనాడు అభిప్రాయాన్ని మార్చుకున్నాను అని ఆరుద్ర అనొచ్చు. తన యొక్క దుర్వాదాన్ని సమర్థించుకోవడానికి నారాయణబాబుని అడ్డుపెట్టుకుని నారాయణబాబుని ఉపయోగించున్నాడే తప్ప ఆయన మీద అభిమానం ఉండికాదు ఆరుద్రకి.

## గురజాడ అప్పారావు

ప్ర: ఆధునిక కవిత్వానికి పితామహుడుగాని ప్రపితామహుడు మీ దృష్టిలో ఎవరు?

ఈ ప్రశ్న శ్రీశ్రీ గారిని అడగటంలో ఒక చారిత్రక అవసరం ఉంది. ఒకానొక తెలుగు కవుల ఆంగ్లకవితా సంకలనంలో సంకలనకర్త శ్రీశ్రీని ఫాదర్ ఆఫ్ ది మోడరన్ పోయెట్రీ అని అంటే దానికి ఆచార్య రోణంకి అప్పలస్వామి గారు చెప్పిన అభ్యంతరం అన్ని పత్రికల్లోనూ రావడం, ఆ పిమ్మట ఆంధ్రజ్యోతి వారపత్రికలో శ్రీశ్రీ సమాధానాల్లో ఈ చర్చ సాగటం జరిగింది. దానికి విపులమైన సమాధానాన్ని ఆశించి ఈ ప్రశ్న అడిగాను.

జ: ఆధునిక కవిత్వానికి పితామహుడని ఒక విధంగా చెప్పాలంటే గురజాడ అప్పారావుగారినే చెప్పాలి. కాని గురజాడ అప్పారావుగారు 1915లో చచ్చిపోవడంతో ఆయన చూపించిన ఎన్నో మార్గాల్ని ఆయన డెవలప్ చెయ్యడానికి బదులు ఇతరులు డెవలప్ చెయ్యడం జరిగినది. కాబట్టి పితామహుడన్నా ప్రపితామహుడన్నా ఆ తరువాత వాళ్లనే ఎవరినో అనాలి. ఎంచేతంటేను ఇప్పుడే అల్లసాని పెద్దనగారిని గురించి చెప్పాను. అల్లసాని పెద్దనను కవితా పితామహుడన్నారు గాని నిజంగా చూసుకుంటే నన్నయగారే కదా! నన్నయభట్టుగారిని పితామహుడనకుండా అల్లసాని పెద్దనను అన్నట్లుగానే అది న్యాయంగా, క్రోనలాజికగల్‌గా, చారిత్రకంగా గురజాడవారిని అనవలసి వచ్చినప్పటికీ ఈనాటి పరిస్థితులను బట్టి ఈనాటి సాహిత్య చరిత్రను బట్టి, గురజాడ వారిని – 1915లోనే ఆయన శకం, జీవితమే ముగిసిపోబట్టి ఇతరులను పేర్కొనవలసి వచ్చింది.

ఈ మధ్య శ్రీశ్రీ కవిత్వానికి వింత విమర్శలు, వింత వ్యాఖ్యానాలు వచ్చాయి. విమర్శకుడుగాని, వ్యాఖ్యాతగాని కవిత్వతత్వాన్ని విస్మరించి సొంత అభిప్రాయాలు చొప్పిస్తే ఆ విమర్శ, ఆ వ్యాఖ్యానం ఎట్లా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. ప్రజా కవిత్వాన్ని గురించి చెబుతూ ఆరుద్రగారు ఒక పర్యాయం శ్రీశ్రీ ప్రజాకవి కాదు అని తీర్మానం చేశారు. కవిత్వం మీద ఎప్పుడూ వ్యతిరేకాభిప్రాయాలుంటాయి. సమంజసమైనవా కావా అనే చోట పేచీ, అంచేత కవిత్వ వ్యాఖ్యానాన్ని గురించి, కవిత్వాన్ని గురించి, ఉత్తమ కవిత్వ లక్షణాన్ని గురించి శ్రీశ్రీని మరికొన్ని ప్రశ్నలు వేయవలసి వచ్చింది. నేను వ్యక్తిగతంగా ఫీల్ అయిన ప్రశ్నను ఆఖరి ప్రశ్నగా నిర్ణయించుకున్నాను. చలం గారు యోగ్యతాపత్రంలో చెప్పుకోదగ్గ ఒక్క కవి కృష్ణశాస్త్రి అని మొదలుపెట్టి ఎవరి నుంచి దొంగిలించామో వాళ్లని క్షమించటం కష్టం అంటాడు. నేను విదేశాంధ్ర ప్రచురణల మహాప్రస్థానాన్ని ఆంధ్రపత్రికలో రివ్యూ చేస్తూ చలం కృష్ణశాస్త్రిగారిని గురించి అన్నట్లే శ్రీశ్రీ చలం యోగ్యతాపత్రాన్ని విస్మరించినందుకు మనం కూడా అనవచ్చునా అని రాశాను. సాహితీ మిత్రులు కొంతమంది నా అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఒక వేళ్ల అట్లా ఆలోచించటం నాదే దోషమేమో అని ఆ ప్రశ్న అడిగి అనుమాన నివృత్తి చేసుకొన్నాను.

ప్ర : “5, 3, 2, ఆముక్తమాల్యద ఆటవెలది ద్విపదకత్తిగారు,” అన్న దానికి ఆముక్తమాల్యద దాకా వచ్చేసరికి తెలుగు కవిత్వం పాషాణ పాకమైందని ఆ పతనాన్ని 5, 3, 2, అనే అంకెల్లో శ్రీశ్రీ సూచించాడనే వ్యాఖ్య ఒకటి వచ్చింది. ఇది సరైన వ్యాఖ్యా ? దీంతో మీరు ఏకీభవిస్తారా?

జ : దీన్ని క్యూబిస్టు పొయిట్రీ అని చెప్పి అనాలి. అది మాటల జక్స్‌టా పొజిషన్. రెండు మాటలు కలిపితే ఒక అర్థం వస్తుంది. కొంత మందికి మనసులోని అవగాహనను బట్టి ఒక్కొక్క అర్థం వస్తూ ఉంటుంది. నేను ఏ అర్థాన్ని ఉద్దేశించి ఈ పదాలు రాయలేదు. కేవలం అది ఛందస్సు. ఆటవెలది, ఛందస్సు కోసం, క్యూబిస్టు జెక్స్‌టా పొజిషన్ కోసం

రాశాను. కాని ఆముక్త మాల్యద కాకుండా మరో మాట ఏదైనా అని ఉంటే దానిలో మరో అర్థం తీసి ఉందురు. అక్కడ ఆముక్త మాల్యద రెండు భాగాలు.

ప్ర : నారాయణరెడ్డిగారు ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు ప్రయోగములలో 'పులికి పిలకలేదనడం, చలికి తెలుగు రాదనడం, శ్రీనివాసరావు రాస్తున్నది మా నిషాదగీతంలో వున్నది'. అన్నప్పుడు దానికి వ్యాఖ్యానిస్తూ పులికి పిలక చలికి తెలుగు శబ్దసామ్యంతప్ప మరొక అర్థం లేదు. అట్లానే చివరి రెండు పాదాలకూ అర్థం వెతకటం అనవసరం అన్నారు. నేననుకున్న దేమంటే చివరి రెండు పాదాల వల్ల "కరుణ రసం" శ్రీశ్రీ కవిత్వ లక్ష్యం అని ధ్వనించారేమోనని మీ ఉద్దేశం ?

జ : మొదట రెండు పాదాల వరకూ అర్థం లేదనుకోవచ్చును. కాని మా నిషాద గీతంలో ఉన్నదేమో కరుణరసమేకాదు. వాల్మీకి ఎలాగైతే కవిత్వానికి ఆది పురుషుడో అలాగే ఈ ఆధునిక కవిత్వానికి జనరేటింగ్ ఫోర్సుగా శ్రీనివాసరావు రాస్తున్నది అనే ఉద్దేశంతో అదొక బీజప్రాయమైనటువంటిది. జెనరేటింగ్ ఫోర్సు అన్నామే అని ఆ విధంగా ఉంటుందన్న ఉద్దేశంతో అన్నాను.

ప్ర : ఆరుద్రగారు ప్రజా కవిత్వాన్ని గురించి రాస్తూ శ్రీశ్రీ ప్రజా కవికాదు. ప్రజా కవి అయితే కోగంటి గోపాలకృష్ణయ్య కావాలి. అకాడమీలు అతనికి బహుమతులివ్వాలని అన్నాను. అసలు ప్రజాకవిత్వమంటే ఏమిటి ? దాని లక్షణాలెట్లా ఉంటాయి?

జ : ఇదికూడా ఏమిటంటే ఒకప్పుడు తమ కవిత్వాన్ని మోసుకుని తిరిగే ట్రుబిడోర్సు కవులు ఫ్రాన్సులో ఉండేవారు. ఫ్రాన్స్ ఆఫ్ చియాన్ అతనేమో తన పాటల్ని ప్రచారం చేసుకుంటూ తిరిగేవాడు. వేమన ఉన్నాడు. వేమన నిజంగాను తాటాకు గంటం పట్టుకుని రాసినట్లు దాఖలాల్లేవు. అతను కూడా ఏదో తిరుగుతూ చెప్తుంటే అతని శిష్యులేమోను వాటిని ప్రచారం చేసేవారు. ఈ దృష్టితో ప్రతి కవీ తన యొక్క రచనల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్వయంగా పాడి వినిపించాలి అన్నదొక దుర్భ్రమ. ఆ రోజుల్లో ఇంకో దారిలేక వాళ్లలా తిరిగేరు. ఈ నాడు ఒక కేసెట్టుతో ప్రపంచం అంతా ప్రచారం చెయ్యొచ్చును. లేకపోతే ఒక రేడియో టాక్‌తో చెయ్యొచ్చును. ప్రజా కవి అంటే ప్రజల్లోకి వెళ్లి వాళ్లకి చెప్పినవాడే అని ఆరుద్ర దుర్భ్రమ. ఆనాడు కోగంటి గోపాలకృష్ణయ్య కమ్యూనిజాన్ని ప్రచారం చెయ్యడానికని చెప్పి అప్పటికప్పుడు కవిత్వం రాసి వాటిని ప్రచారం చేస్తుండేవారు. అదే ప్రజా కవిత్వం కాని మరొకటికాదనుకోవటం చాలా తెలివితక్కువతనం. ప్రజలది కానిదేదీ కవిత్వం కాదు...అదే దాని నిర్వచనం.

ప్ర : ఉత్తమ సాహిత్యం అంటే ఏమిటి? ఇది అందరికీ అర్థం అయ్యేటట్లు చెప్పడం సాధ్యమా?

జ : ఐన్‌స్టీన్ రెలిటివిటీ సిద్ధాంతం ఉన్నది. అది ప్రపంచంలోని ఏ ఐదుగురికో బోధపడుతుంది. అన్నదొకవాదం ఉంది. అదేవిధంగా ఫ్రాయిడియన్ థియరీ ఉన్నది. ఫ్రాయిడ్

తన ధియరీ ఆఫ్‌సైకో ఎనాలసిస్ మీద ఉపన్యాసాలు చేస్తుండేటప్పుడు ఆ సభలకి 10, 15 మంది కంటే ఎక్కువ రాలేదు. కాబట్టి ఇటీజ్ ఎవేవ్. ఎడ్వెంచర్ ఆఫ్ డిస్కవరీ. కవిత్వం కూడా ఒక ధారావాహికం. జేమ్సుజాయిస్ రచనలను, అతను రాస్తున్నప్పుడు అబ్బే ఇదేమీ మా తలకెక్కడం లేదు, తల పగలగొట్టుకున్నా తెలియడం లేదు అని అన్నవాళ్లున్నారు. కాని ఆనాడు అతని ప్రభావం రచనావ్యాసంగం చేస్తున్న ప్రతివాడిమీద కూడా తెలిసినా, తెలియకపోయినా ఉన్నది కొంతకాలం అయిన తరువాతగాని మనకు బోధపడదు. ఆ రచన వెలువడిన కాలంలో ప్రజలయొక్క స్థాయినిబట్టి, వాళ్ల యొక్క కల్చర్‌ని బట్టి కొలవడం తప్పు. అందువల్ల ఉత్తమ కవిత్వం అన్నది ఈ రోజు మనకు కొంచెం దుర్గ్రాహ్యంగా ఉండొచ్చు. లేదా ప్రజలకి అందుబాటులోకి వెళ్లకపోవచ్చు. ఇవాళ వెళ్లకపోతే కొంతకాలం అయిన తర్వాత అది వాళ్ల దగ్గరకు వెళుతుంది. ఉత్తమ కవిత్వం అయితే ఉత్తమ కవిత్వానికి ఉత్తమ లక్షణం కూడా అదే. అది సర్వైవ్ అవుతుంది.

ప్ర మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం రాస్తూ చలం "చెప్పుకోతగిన ఒక్క కవీ కృష్ణశాస్త్రి ఉన్నత హిమాలయ శిఖరాల్లో కురిసిన కవితావర్షం పాయలై, దేశాల వెంట ప్రవహించి, చివరకు సైదు కాలువల్లో పలుకుతున్న సమయాన, తన భీషణాతాప జ్వాలలో ఆవిరిపొగలు లేపి ఆకాశ మార్గాన విహరింపజేసి, రక్షించాడు శ్రీశ్రీ. ఎవరి నుంచి దొంగిలించామో వాళ్లని క్షమించడం కష్టం" అని అన్నాడు ఈ చివరిమాట ఎవరిని ఉద్దేశించి అన్నట్లు?

జ : బహుశా నేను అనుకోవడం కృష్ణశాస్త్రి మీద కొంత విసురేమో ? ఎంచేతనంటే కృష్ణశాస్త్రి కూడా తన పద్ధతి మానేసి ఆకలి కవిత్వం రాశాడు. ఆకలి కవిత్వం రాస్తూ అది తన సొంతంగానే చెలామణి చేశాడు. ఒక్క కృష్ణశాస్త్రిని గురించే అన్నాడని అనటం కష్టం. కాని నిజంగా ఎవరి నుంచి దొంగిలించామో వారిని క్షమించడం కష్టం అన్నది ఒక నిత్యసత్యంగా ఉండిపోతుంది. ఎంచేతనంటే అది సహజం. ఎవరినైనా క్షమిస్తాం గాని మనం ఋణపడి ఉన్నవాళ్లను క్షమించటం కష్టం.

ప్ర . పైన మీ పేరు పేర్కొని వెంటనే ఈ మాట అన్నాడు.

జ : డైరెక్టుగా తీసుకున్నామంటే అది కృష్ణశాస్త్రి గురించే అనుకోవలసి ఉంటుంది.

ప్ర : అట్లా అనుకోవడంలో దోషం లేదుకదా ?

జ: లేదు. ఎంచేతంటే ఆ రోజుల్లో కృష్ణశాస్త్రి గారు ఎప్పుడూ రాయంది ఆ కవి కవిత్వం రాశారు

(మహాకవి శ్రీశ్రీ తో శ్రీ టి.యల్ కాంతారావు ప్రత్యేక సంభాషణం ఆంధ్రపత్రిక దినపత్రిక 1983 ఫిబ్రవరి 6. 13, 20, 27 తేదీల సంచికలు)

# జరుగుబాటు - తిరుగుబాటు

ప్రశ్న : శ్రీశ్రీ గారూ ! నేడు సమాజంలో రచయితకు గల గుర్తింపు ఏమిటి?

జ : రచయిత తన కాళ్ళ మీద తాను నిలబడే ఆస్కారం ఈనాటి వరకు లేదు. అలాగే రచయిత తన రచనల మీద జీవించే అవకాశం ఈనాటికి లేదు. రచయితకి గుర్తింపు వద్దన్నా వస్తున్నది, సామర్థ్యాన్ని, శక్తినిబట్టి, వైద్యునికి వచ్చినట్లు రచయితకు గుర్తింపు వస్తుంది అయితే వైద్యుడు బ్రతకగలుగుతున్నాడు. రచయితకు ఇంకా తన రచనల మీద తాను బ్రతకగలిగే అవకాశం లేదు.

ఇప్పుడున్న ప్రభుత్వం మార్వాడీ ప్రభుత్వం. ప్రతిదాని మీద పన్నులు, అభివృద్ధి పేరుతో పన్నులు వేసి ప్రజలను దోస్తున్నదీ ప్రభుత్వం. ఈ ప్రభుత్వం గొడుగు రచయితలకు అక్కరలేదు. మన (రచయితలకు) వేరే వ్యవస్థ కావాలి. ఆ వ్యవస్థ ఏర్పడేదాకా ఈ అవస్థలు తప్పవు.

ప్ర : వ్యసనాలకు అలవాటుపడి శ్రీశ్రీ శీలం కోల్పోయారని మీ మీద విమర్శ ఉంది. దాని గురించి మీ వ్యాఖ్య ఏమిటి?

జ : ప్రతి మనిషికీ ఒక దౌర్బల్యం ఉంటుంది ప్రపంచంలో ఏ వ్యక్తి కూడా పరిపూర్ణుడు (శీలవంతుడు) కాదు. ప్రపంచంలోని ప్రవక్తలందరూ ఇదే విషయం చెప్పారు. ఆఖరికి జీసస్ క్రీస్తు కూడా ఒక పాపిమీద రాళ్లు విసిరేటప్పుడు మీలో ఏ లోపం లేనివాడు మొదటిరాయి విసరండి అని అన్నాడు. అలాగే ప్రతి దానికి ఏదో ఒక లోపం ఉంటుంది.

ప్ర : గొప్పకవి అయిన మీరు పరిస్థితులకు రాజీపడుతున్నారని మీ మీద విమర్శ ఉంది. రామారావు ప్రభుత్వాన్ని సమర్థించడంలోను, ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీని సమర్థించారనీ విమర్శ ఉంది. దీనికి మీ సమాధానం ?

జ: రామారావు గారు గెలుస్తాన్నాడని నేను ఆయనను వెనకేసుకుని రాలేదు. ఎన్.టి.ఆర్.మీద అభిమానంతో కాదు నేను మద్దతు ఇచ్చింది. ప్రజలలో ఈ వ్యవస్థ మీద ద్వేషం ఉంది. ఈ ద్వేషాన్ని వెళ్లగ్రక్కుకోవడానికి ప్రస్తుతం ఎన్నికలు ఒక్కటే మార్గం. ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వంపై ద్వేషాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు ఎన్.టి.ఆర్. పార్టీని గెలిపించి కసి తీర్చుకున్నారు. ఎన్.టి.ఆర్. అధికారంలోకి వస్తాడని ఊహించి నేను అతనికి మద్దతు ఇవ్వలేదు.

ఇందిరాగాంధీ అంటే నాడూ నేడూ ద్వేషమే. ఎమర్జెన్సీ సమయంలో ఆలిండియా రేడియోవారు నన్ను ఇందిరాగాంధీ 20 సూత్రాల పథకంపై ఒక పాట వ్రాసి ఇమ్మన్నారు. నేను వ్రాసి ఇచ్చానే తప్ప ఎమర్జెన్సీ గాని, ఇందిరాగాంధీనిగాని సమర్థించలేదు. ఈ పాట రాయడం ఆసరాగా తీసుకుని కొంత మంది నన్ను ఇందిరాగాంధీకి అత్యవసర పరిస్థితి కాలంలో మద్దతు ఇచ్చానని అభాండాలు వేశారు.

ప్రశ్న: సమాజంలో మీకున్న అనుభవంతో రానున్నకాలంలో అధికారం కోసం ఎటువంటి మార్పులు జరుగుతాయో చెప్పండి.

జ: దీని గురించి చెప్పడానికి జ్యోతిష్కుడిని కాను.

పీడింపబడే వర్గం యథార్థస్థితిని తెలుసుకుని సంఘటితమై తిరుగుబాటు జరిపితే అప్పుడు ఈ సమాజానికి విముక్తి లభిస్తుంది. పెట్టుబడిదారీ విధానం చాలా చోట్ల పడిపోతున్నది. పెట్టుబడీదారీ విధానం గాయపడ్డదే కాని చచ్చిపోలేదు. అందువల్ల అది క్రూరంగా ప్రవర్తిస్తుంది.

ప్ర: మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

జ : నేను గతంలో వ్రాసిన పుస్తకాలను నేనే అచ్చువేసుకునే ప్రయత్నంలో ఉంటాను.

ప్రశ్న: ప్రజా పోరాటం పత్రికకు మీ సందేశం?

జ: ప్రజా పోరాటాన్ని ఉన్నతస్థాయిలో సాగించాలని, హేతుబద్ధంగా, హేతువునే ఆయుధంగా ధరించి పోరాటం సాగించాలని ఆశిస్తున్నాను.

(నల్గొండ జిల్లా రచయితల మహాసభ (ఏప్రిల్ 8,9,10) సందర్భంగా శ్రీశ్రీ గారితో ఇంటర్వ్యూ)

**(ప్రచురణ : "ప్రజా పోరాటం" వారపత్రిక, 23-4-83)**

# సామ్యవాదం నా గమ్యం

మహాకవి శ్రీశ్రీని "ఆంధ్రజ్యోతి" ప్రతినిధి శ్రీ భగీరథ గడచిన మార్చిలో ఇంటర్వ్యూ చేయగోరగా "మీరు ప్రశ్నలు వ్రాసి ఇవ్వండి. సమాధానాలు పంపిస్తాను" అని శ్రీశ్రీ చెప్పాడు. శ్రీ భగీరథ వేసిన ప్రశ్నలకు ఇటీవల శ్రీశ్రీ ఇచ్చిన లిఖిత సమాధానాలు ఈ దిగువ పొందుపరుస్తున్నాము.

ప్ర: తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీశ్రీ ఎంతకాలం నిలుస్తాడని మీ అంచనా?

జ: తెలుగు భాష నిలిచినంతకాలం.

ప్ర : మార్క్సిజం అంటే హింసను ప్రోత్సహించేదని నమ్మేవారి మీద మీ అభిప్రాయం?

జ: మార్క్సిజం హింసను ప్రోత్సహించదు. కొన్ని పరిస్థితులలో అది తప్పనిసరి అవుతుంది. చరిత్రకు విప్లవం శస్త్రవైద్యుడు.

ప్ర : ప్రతి వారు మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచించాలి అంటారు. అలా అనేవారు నిజంగా మార్క్సిజాన్ని పూర్తిగా అధ్యయనం చేసే వుంటారా? మీ వరకు మీరు మార్క్సిజాన్ని ఎంతవరకు అర్థం చేసుకున్నారు.?

జ : మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచిస్తే మనల్ని తికమకపెట్టే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నేను నమ్ముతున్నాను. అయితే మార్క్సిజం సకలరోగ నివారణి కాదు. రెడీమేడ్ సొల్యూషన్లు ఇవ్వదు. అదో శాస్త్రీయ జిజ్ఞాస. సమాజంలో వర్గ సంబంధాలకు ఆర్థికమైన పునాది వున్నదని మార్క్సిజం ద్వారా నేను తెలుసుకున్న వాస్తవం. మార్క్సిజాన్ని లెనినిజం విస్తరింపచేస్తుంది.

మార్క్స్ సూత్రాలను ఆచరణలో పెట్టి లెనిన్ కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించారు. ఈ దారిలో మరింత ముందుకు పోయినవాడు మావో. అందుకే ఈనాటి జిజ్ఞాసువులు మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా ధోరణులను శిఖరాగ్ర స్థాయినిస్తారు.

ప్ర : మార్క్స్ ప్రభావం మీపై ఎలా, ఎప్పుడు, ఎందుకు పడిందో వివరిస్తారా?

జ: సాహిత్యం ద్వారా నేను మార్క్స్ ప్రభావంలో పడ్డాను. తేదీలు సరిగ్గా జ్ఞాపకం లేదు కాని 1930–40 మధ్య లండన్ అభ్యుదయ రచయితల మానిఫెస్టో, ఆడెన్, స్పెన్డర్ మొదలగు కవుల రచనలు, స్పెయిన్ అంతర్యుద్ధం నన్ను చాలా ప్రభావితం చేశాయి.

ప్ర: కృష్ణశాస్త్రి ప్రభావం నుంచి శ్రీశ్రీ బయటపడడానికి ఎంతకాలం పట్టింది? వ్యక్తిగా, కవిగా కృష్ణశాస్త్రి పట్ల మీ అభిప్రాయం?

జ: నా కవితా ప్రారంభం విశ్వనాథ, కృష్ణశాస్త్రి తదితర భావకవుల ప్రభావంతో సుమారు పది సంవత్సరాలు సాగింది. (1925 నుండి 35 వరకు) వ్యక్తిగా కృష్ణశాస్త్రిగారికి నేనెప్పుడూ సన్నిహితుణ్నే. కవిగా వారిని నేనెప్పుడూ గౌరవిస్తాను.

ప్ర : మనిషికి అరవై దాటాక శరీర దారుఢ్యంతో పాటు భావాల్లో, ఆలోచనా విధానంలో చాలా మార్పు వస్తుందని అంటారు. మీపై కాల ప్రభావం వుందా? కవిత్వం ప్రభావంతో కాలాన్ని జయిస్తుందా ?

జ: అరవై అని డెబ్బై అని వయస్సుకు పరిమితులు పెట్టడం అనవసరం. కొందరు ముప్పై ఏళ్లకే ముసలివాళ్లయి పోతారు. బెర్ట్రాండ్ రస్సెల్ 90 ఏళ్లు దాటిన తర్వాత కూడా చైతన్య స్ఫూర్తిని కోల్పోలేదు. ఇక కాలం ప్రభావం అందామా అది అందరిపైనా వుంటుంది. అలాగే నాపై కూడా. కాలాన్ని ఎవరూ జయించలేరు. నేను సంకల్పబలంతో కాలాన్ని నా అదుపులో వుంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

ప్ర : తెలుగు సినిమా రంగంలో మార్పు తప్పదు అనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?

జ: మార్పు దేనికైనా తప్పదు. తెలుగు సినిమా ఇందుకు మినహాయింపు కాదు.

ప్ర : సంప్రదాయపు కౌగిలి నుంచి తెలుగు సినిమా బయటపడే కాలం వస్తుందని మీరు భావిస్తున్నారా?

జ: సంప్రదాయాలన్నీ చెడ్డవికావు. వాటిలో వున్న మంచిని వదులోకోకుండానే కొత్త కొత్త ప్రయోగాలు చేయవచ్చు.

ప్ర : మన దర్శకుల కళాసృష్టి గురించి మీ అభిప్రాయం ఏమిటి?

జ : వ్యాపారపు ఊబిలో కూరుకుపోయి వుండకపోతే, ప్రతి దర్శకుడూ కళాత్మక సృష్టికే ప్రయత్నిస్తాడు. మనకు లభిస్తున్న కళాత్మక చిత్రాలు మాత్రం అంతంత మాత్రమే. ఇందుకు కేవలం దర్శకులదే బాధ్యత అనలేము.

ప్ర : భారతదేశంలో విప్లవం వస్తుందని మీరు ఇంకా భావిస్తున్నారా? ఫ్యూడల్ వ్యవస్థ వేళ్ళు ఇంకా పాతుకుపోతున్న ఈ రోజుల్లో మీరు విప్లవం, విప్లవం అంటే ఆ వ్యవస్థ దరిదాపునైనా విప్లవం అన్న పదం చేరుతుందని మీరు భావిస్తున్నారా?

జ : విప్లవం ఒకరి అనుమతితో వచ్చేదికాదు. ఒకరు వద్దంటే మానేదికాదు. ఇప్పుడున్న ఫ్యూడల్ వ్యవస్థ అనే చీకటి ఎప్పుడూ ఇలాగే వుండదు. చరిత్ర గమనంలో భారతదేశానికి కూడా విప్లవాత్మక పరిణామాలు తప్పవు.

ప్ర : మూడు గంటల సినిమా ప్రభావం ఎక్కువా? మూడు నిమిషాల పాట ప్రభావం ఎక్కువుంటుందా?

జ : దేని ప్రభావం దానిదే. ఏ సినిమా, ఏ పాట అని ఆలోచించాలి. కొన్ని పాటలు మరచిపోతాం. కొన్ని మనస్సులో హత్తుకుపోతాయి. అలాగే సినిమాలు కూడా.

ప్ర : నక్సలైట్లు అంటే నాకు గౌరవం అని ముఖ్యమంత్రి శ్రీ రామారావు గారు ప్రకటించారు. మీకు ఆస్థాన కవి పదవి ఆఫర్ చేస్తే-అంగీకరిస్తారా?

జ : అంగీకరించను. పైగా ఆ పదవిని రద్దుచేయవలసిందిగా సలహాయిస్తాను

ప్ర: సామాన్యుల దగ్గరకు కవిత్వం వెళ్లాలని మీరు అంటారు కదా? మీ కవిత్వం పండితులకే అర్థంకాదనే విమర్శ ఉంది దీనికి మీ సమాధానం ఏమిటి?

జ: సామాన్యునికి కవిత్వం కూడా ఒక అనుభోగ్య వస్తువు కావాలి. ఇతర జీవితావసరాల లాగానే కవిత్వం కూడా ఒక అవసర వస్తువు కావాలి కవిత్వం దిశగా సామాన్యుడు పెరగాలి.

ప్ర : భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం తర్వాత ఏ రకమైన కవిత్వం వస్తుందని మీ ఊహ?

జ : ఎటువంటి కవిత్వం వస్తుందో చెప్పలేను కాని ఇంతటితో ఆగిపోదని మాత్రం చెప్పగలను.

ప్ర : ఇంతవరకు ఏమి సాధించానని మీరు అనుకుంటున్నారు? ఇంకా ఏమి సాధించాలని మీ జీవితాశయం ?

జ : వాడుక భాష కావ్యభాష కావడానికి నేను చేసిన కృషి ఫలించిందని అనుకుంటాను. అయితే నేను సాధించింది తక్కువ. సాధించవలసింది ఎక్కువ రచనా వ్యాసంగాన్ని ఆపకుండా సాగించడమే నా జీవితాశయం.

ప్ర : శ్రీశ్రీ కి కూడా కొన్ని బలహీనతలున్నాయి అనే మాటలు విన్నప్పుడు మీరెలా ఫీలవుతారు ?

జ : బలహీనతలు లేనివారెవరె? నా బలహీనతలను అధిగమించడానికి, బలాన్ని పెంపొందించుకోవడానికి నేనెప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాను.

ప్ర : జీవితానికి మీరు చెప్పే నిర్వచనం ఏమిటి ? మరణానంతర జీవితం వుందని మీరు భావిస్తున్నారా?

జ . జీవితం అన్ని నిర్వచనాలకు అతీతమైనది. మరణానంతర జీవితంలో నాకు నమ్మకం లేదు. ఒక వ్యక్తికొక జీవితం చాలు. దానిని సార్థకం చేసుకుంటే అదే గొప్ప సంగతి.

ప్ర : మహాప్రస్థానం నాటి శ్రీశ్రీ గమ్యం ఏమిటి?

జ: సామ్యవాదం నా గమ్యం - కవిత్వంలోను, జీవితంలోను.

ప్ర : యువకులకు మీరు ఇచ్చే సందేశం ?

జ : ఎవరి సందేశాలకూ ఎదురు చూడవద్దని.

(ఆంధ్రజ్యోతి దినపత్రిక 18-6-83)

118255

మహాకవి శ్రీశ్రీ సాహిత్య దృక్పథం ఏమిటి? సాహిత్య చరిత్రను ఆయన ఎలా చూశాడు? అసలు తన స్వీయ సాహిత్యానుభవాలు ఎలా వున్నాయి? అనితర సాధ్యమైనంత ప్రజాదరణ పొందిన ఆయన రాజకీయ, సామాజిక భావాలేమిటి? వివిధ దశల్లో అవి ఎలాంటి మార్పులు పొందాయి? ఆయన మాటల్లోనే తెలియజేసే సంకలనం. ఆయన వ్యాసాలు ఉపన్యాసాలు ఇంటర్వ్యూల మేలిమి కూర్పు.

శ్రీశ్రీ సాహిత్యం-సమాకాలీనత, శ్రీశ్రీ జయభేరి పుస్తకాల తర్వాత ప్రజాశక్తి సంస్థ సమర్పిస్తున్న మరో విలక్షణ ప్రచురణ ఇది.

ISBN 978-93-84162-04-7

ప్రజాశక్తి బుక్‌హౌస్